





ఆంధ్రప్రదేశ్ మోటారు రవాణా ఆపరేటర్లు, 1963 ఫిబ్రవరి 16 వ తేదీన అనంతపురంలో 13 వ సమావేశం జరుపుకున్నారు. ముఖ్యమంత్రి యీ సమావేశానికి ప్రారంభోత్సవం చేశారు.



కొత్తగూడెంవద్ద ఉన్న సింగరేణి ప్రాజెక్టు స్థలం.

సంపుటి 7 సంచిక 6

ఆంధ్రప్రదేశ్

(సచిత్ర మాస పత్రిక)

ఏప్రిల్ 1963

చైత్ర-వైశాఖ - శకం 1885

మా పాఠకులకు

ఈ సంచిక నుంచి నూతనాకర్షణలు!

★ మనచరిత్ర-సంస్కృతి

★ బాలానందం

సంవత్సరచందా : 3 రూపాయలు

విడి ప్రతి వెల : 25 నయాపైసలు

విషయసూచిక

ముఖ్యమంత్రి లేఖ		3
బంగారపు గాజులు	(మూలం) దీపక్ గంగోపాధ్యాయ (అనువాదం) డి మంజులత	5
అమరుడైన అహింసామూర్తి, డాక్టర్ రాజేంద్రప్రసాద్	ఆవుల సాంబశివరావు, ఆత్మారామ్, అమరేంద్ర	6 7 9
విశేషాలు – వ్యాఖ్యలు	వి. వి. నరసింహారావు	10
గృహనిర్మాణ పథకాలు	ఆలపాటి వెంకట్రామయ్య	14
వెలుగు బాటలు	కె. వి. భాస్కరరావు	17
వీరభారతము	యామిజాల పద్మనాభస్వామి	19
చిన్న నవలి	కొడవటిగంటి కుటుంబరావు	21
హిమాలయ యోధులు		24
పారిశ్రామిక విశేషాలు		25
తెలుపు నలుపు		27
మారిన మనిషి [కథానిక]	బలివాడ కాంతారావు	30
ఇండియాపై చైనా దుష్ప్రచారం		35
నమామ్యహమ్	సోమసుందర్	36
ఏరిన ముత్యాలు		37
పబ్లిక్ వర్క్సుశాఖ కార్యకలాపాలు		40
ప్రశ్నలు – సమాధానాలు		41
ప్రబోధము	పాతకోట రాధాకృష్ణమూర్తి	42
ప్రభుత్వనిర్ణయాలు		43
ప్రజాస్వామ్యానికే సవాల్ !	సి. సుబ్రహ్మణ్యం	44
దేశం మేల్కొంది [అనువాదభారతి]	(మూలం) ఇకాబ్రింజావిద్ (తెలుగుసేత) దాశరథి	48
పంచాయతీరాజ్య పురోగమనం		50
చైత్ర చైతన్యం	జూలూరి హనుమంతరావు	51
సరిహద్దుల పరిరక్షణలో మనసైనికుల సమధికోత్సాహం		52
శ్రీనాథయుగము – అన్యదేశ్యములు	పూమాటి దొణప్ప	54
ప్రగతి పథంలో		62
చైనాచేసే అక్రమం, అన్యాయమైన వాదన		64
మనం ఇప్పుడేంచేయాలి ? [లలనావనం]	కె. లక్ష్మీరఘురామ్	69
స్త్రీలు – సంఘి స్త్రవిద్య [,,]	ఆవుల జయప్రదాదేవి	71
ఆంధ్రప్రజల కథ (మన చరిత్ర-సంస్కృతి)	మారేమండ రామారావు	73
సంగ్రహప్రకటనలు		77
బాగా చదువుకుంటే [బాలానందం]	వానిరాజు ప్రకాశం	80
విద్యార్థుల అపూర్వ దేశభక్తి [,,]		83
అత్యవసర బడ్జెటు		85
ముఖ్యవార్తలు		89
గ్రంథసమీక్ష		90

ముఖచిత్రం హైదరాబాదు ఖైరతాబాదులో ఉన్న ప్రభుత్వ నిర్మల్ పరిశ్రమకు చెందిన గోడకు తగిలించేఅద్భుతమైన అశ్వచిత్ర ఫలకం

వెనుక అట్ట గోదావరి కాలువలోని నిశ్చలమైన నీటిలో పడవ ప్రయాణం

ముఖ్యమంత్రి లేఖ

ప్రియమైన చదువరీ!

బంగారం కంట్రోలు ఉత్తరువులు మన ఒక్క రాష్ట్రానికి మాత్రమే సంబంధించిన సమస్య కాకపోయినా దీని ఫలితాలను ఎదుర్కొనే ఇక్కడి అనేకమంది స్వర్ణకారులను గురించి మన శాసనసభలో సుదీర్ఘ చర్చ జరిగింది. యీ ఉత్తరువుల మంచిచెడ్డలను గురించి కాక దీనివల్ల కలిగే పరిణామాలనుగూర్చి మాత్రమే యీ చర్చ జరిగింది. ఇతర క్రొత్త విధానాలమీదా చర్యలమీదా జరిగినట్లుగానే యీ సమస్యమీదకూడా ప్రారంభంలో అతిశయోక్తితో కూడిన విమర్శ తప్పకుండా ఉంటుంది. యీ ఉత్తరువులవల్ల కలిగే ఆర్థిక పరిణామాల సరైన పరిస్థితులను అవగాహన చేసుకోవడానికీ, అవసరమైన నివారణోపాయాలను సమర్థవంతంగా అమలు చేయడానికీ ఓర్పుగా, నిదానంగా ఆలోచించడం ఎంతో అవసరం. బంగారం దొంగ రవాణాద్వారా విదేశీ మారక ద్రవ్యానికి ఏర్పడుతున్న కొరతను నివారించడానికే ఇటువంటి విప్లవాత్మకమైన చర్యను తీసుకోవాల్సి వచ్చిందనే వాస్తవాన్ని ఎవ్వరూ విస్మరించకూడదు. దొంగరవాణాదార్ల కార్యకలాపాలు కారణంగా దేశానికి ప్రతి సంవత్సరమూ 50 నుంచి 60 కోట్ల రూపాయిలు విలువచేసే విదేశమారకద్రవ్యం నష్టం వాటిల్లుతున్నదని అంచనా వేశారు. గత సంవత్సరం దొంగచాటుగా బంగారం రవాణాచేసే ఒక వ్యక్తి రెండుకోట్ల విలువగల బంగారం పోగొట్టుకోగలిగాడంటే, ఈ సమస్య ఎంత తీవ్రమైనదో తెలుస్తుంది. మనసంఘం తన ఆచార వ్యవహారాలనూ, సాంఘిక అలవాట్లనూ, విలువలను గూర్చిన అభిప్రాయాలనూ మార్చుకోవలసి వున్నది. మన స్వాతంత్ర్యానికి ఏర్పడిన ప్రమాదాన్ని తొలిగించడానికై జాతిని మేల్కొల్పడానికీ, బంగారంపై గల వ్యామోహాన్ని అంతమొందింపజేయడానికీ, యీ ఉత్తరువు దోహదం చేస్తుంది. సంఘంలోని ప్రతి వర్గంమీదకూడా యిటువంటి పెద్దమార్పుల ప్రభావం పడుతుంది. క్రొత్తపన్నుల ప్రభావం బీదవాడిపై కూడా పడుతుందని కేంద్ర ఆర్థికమంత్రి అంగీకరించిన విషయం మీకు తెలిసిఉంటుంది. రక్షణ అవసరాలను తీర్చడానికై ప్రతివారూ తమ ఆదాయాలపై పడే భారాన్ని సహించడం ఎంతో అవసరం. ఇటువంటి ఉన్నత విషయాలను దృష్టిలో ఉంచుకుంటే స్వర్ణకారులు ఎదుర్కొనే పరిస్థితులను వాస్తవిక దృష్టితో అవగాహన చేసుకొనే వీలుకలుగుతుంది. అవసరమైనచోట్ల ఇతర ఉపాధులను కల్పిస్తూ యీ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలే కాని, ఆవేశాన్ని వెల్లడించడంతోను నిరసనలతోను దీనిని పరిష్కరించలేము.

స్వర్ణకారులకు సహాయ పడడానికై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయి. యీ విషయంలో అఖిల భారత స్థాయిలో తీసుకోవాల్సిన కొన్ని చర్యలనుగూర్చి బంగారం కంట్రోలుబోర్డు అధ్యక్షులు కొన్ని సూచనలు చేశారు. మన రాష్ట్రంలో స్వర్ణకారులు ఏర్పాటు చేసుకునే సహకార సంఘాలకు తగిన సహాయం చేయడానికి మనం సంసిద్ధులమేనని నేను వ్యక్తం చేశాను. ఆభరణాలను తయారు చేయడం పూర్తిగా రూపుమాసిపోలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఉదాహరణకు—వెండి ఆభరణాలను తయారు చేయడం ఎప్పటిమాదిరిగానే కొనసాగుతున్నది. బంగారం విషయంలో కూడా వాటిని తయారుచేయడంలో ప్రత్యక్షంగా ఎన్ని సమస్యలు ఉన్నా అధిగమించి 14 వ వన్నె బంగారంతో ఆభరణాలను తయారు చేయవచ్చు. ఢిల్లీ ఇతర ప్రాంతాలలోని అనేకమంది స్వర్ణకారులు ఇటువంటి ఆభరణాలను తయారు చేయడంలోని కష్టాలను అధిగమించారు కూడా. అయితే అన్నిచోట్లాకూడా వెంటనే ఇది సాధ్యం కాకపోవచ్చు. ప్రత్యేకంగా చిన్నతరహా స్వర్ణకారులకు సాంఘిక ఇతర కారణాలదృష్ట్యా ఇది సాధ్యంకాదు. స్వర్ణకారుల సహకార సంఘాలకు మనం అందజేసే ఆర్థిక సహాయాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలి. ఇమిటేషన్ ఆభరణాలు, బహుమతిగా ఇచ్చే వస్తువులు, వెండి నగిషీ పనులు, గడియారాలను అమర్చడం, అలంకరణ, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్, శస్త్రచికిత్సా పరికరాలు, సింపుల్ సర్వేడ్రాయింగ్ ఉపకరణాలు, యంత్రం సహాయంతో తయారయ్యే ఆటబొమ్మలు, అల్యూమినియం వస్తువులు, కంచు, ఇతర లోహాల విగ్రహాలు మొదలైనవాటికి సంబంధించిన అనేక చిన్న తరహా పరిశ్రమల స్థాపనకై స్వర్ణకారులు నెలకొల్పు

కునే సహకార సంఘాలకు పరిశ్రమలశాఖ సహాయ పడుతుంది. రాజమండ్రి తదితర ప్రాంతాలలోని స్వర్ణకారులు ఇటువంటి సహకార సంఘాలను నెలకొల్పుకోడానికి ముందుకు వచ్చారు. నిరసనచేసే స్వభావాన్ని ప్రోత్సహించే బదులు, అవసరమైన చోట్ల సహకార సంఘాలను నెలకొల్పడంలో సహాయ పడాలని పలుకుబడిగల నాయకులందరికీ నేను మనవి చేస్తున్నాను.


ఈ తరగతికి చెందిన ప్రజలకు సహాయ పడడమేగాక క్రొత్తగా పెద్ద, చిన్న పరిశ్రమలను స్థాపించదల్చిన వారెవరికైనా సాధ్యమైనన్ని విధాలా సహాయ పడాలనే విధానానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. సాధ్యమైనన్ని విధాల మన రాష్ట్రాన్ని పారిశ్రామికీకరణం చేయాలనే మనం ఆతురత పడుతున్నాము. రెండుమార్గాలద్వారా యీ పని సాధ్యమవుతుంది : కేంద్ర ప్రభుత్వం, ఇతర ప్రదేశాలకు చెందిన పరిశ్రమదారులు ఇక్కడ భారీ పరిశ్రమలను నెలకొల్పడం; మన పరిశ్రమదారులే యీ పరిశ్రమలను ప్రారంభించడం. పరిశ్రమల విషయంలో ప్రాంతీయ అసమానత ఉన్నదని ఎల్లరూ గుర్తించి నప్పటికీ కేంద్ర రంగంలోని పరిశ్రమలను ఇక్కడ స్థాపించే విషయంలో కేంద్రం మనకు సంతృప్తి కలిగించలేక పోయింది. జాతీయాభివృద్ధి మండలి ప్రతి సమావేశంలోనూ, కేంద్ర మంత్రులతో జరిగే చర్చల సందర్భంలోనూ నేను ఈ విషయాన్ని నొక్కిచెప్పాను. కేంద్ర రంగంలోని సింథెటిక్ డ్రగ్స్, భారీ విద్యుత్పరికరాలు, భారీ యంత్ర పరికరాలు, భారీ ప్లేట్స్ వెసెల్స్, టూల్స్ ఫ్యాక్టరీ యూనిట్, భారీ మేరిన్ డీజల్ ఇంజన్లు, చిన్నకార్లు మొదలైన 9 పరిశ్రమలను ఆంధ్ర ప్రదేశ్‌లో స్థాపించాలని మనం గట్టిగా కోరగా అందులో మొదటి రెండు పరిశ్రమలను మాత్రమే ఇక్కడ నెలకొల్పుతున్నారు. అన్ని విధాలయిన సౌకర్యాలను కల్పించడానికి మనం సిద్ధపడినా ఇతర ప్రదేశాలకు చెందిన ప్రైవేటు పెట్టుబడులు ఆశించినంతగా రాలేదు. ఇక స్థానికులే యీ పరిశ్రమలను ప్రారంభించాలి. భారీ పరిశ్రమలను స్థాపించే స్తోమతకల కోటీశ్వరులు చాలామంది మన రాష్ట్రంలో ఉన్నారని మనం చెప్పుకోలేము. అయితే చిన్న తరహా పరిశ్రమలనూ, మధ్య రకం పరిశ్రమలను నెలకొల్పడానికి అవసరమైన వనరులు గల ప్రజలు ఉన్నారు. అటువంటివారికి భూములు సేకరించడంలోనూ, విద్యుచ్ఛక్తి, నీరు లభింపచేయడంలోనూ, అనేక ఇతర మార్గాలద్వారా ప్రభుత్వం వారికి సహాయ పడుతున్నది. క్రొత్త పరిశ్రమలకు రాయితీ రేట్లపై విద్యుచ్ఛక్తి లభింపచేస్తున్నారు. నీటిపన్ను ఎక్కువగా ఉన్నచోట్ల క్రొత్తపరిశ్రమలకు రాయతీ రేట్లపై నీరు సరఫరా చేయాలని ప్రభుత్వం కొన్ని మునిసిపాలిటీలను ఆదేశించింది.

విద్యుచ్ఛక్తి విషయంలో మన ప్రాజెక్టులలో కొన్నిటిని పూర్తిచేసుకొని మన పరిస్థితిని అభివృద్ధి చేసుకోవాల్సిఉంది. మన విద్యుచ్ఛక్తి వనరులను అభివృద్ధి చేయడానికై దశలవారి కార్యక్రమం ఉంది. యీ కార్యక్రమం క్రింద మూడవ ప్రణాళికా కాలంలో 500 యం. డబ్ల్యుల విద్యుచ్ఛక్తినీ, నాల్గవ ప్రణాళిక కాలంలో దీనికి రెండింతల ఉత్పత్తిని సాధించాల్సి ఉంది.

నదీ జలాల వివాదంపై భారత ప్రభుత్వం ఇచ్చిన అవార్డు మన కోర్కెలను తగినంతగా ఆదుకుంటుందని యీ సందర్భంలో తెల్పడానికి నేను సంతోషిస్తున్నాను. శ్రీశైలం, పోచంపాడు ప్రాజెక్టుల నిర్మాణానికి ఇక ఎట్టి అవరోధం లేదు. వాటి నిర్మాణం పనులను చేపట్టుతున్నాము. వీటికి అనుమతి లభించినందువల్ల యీ విషయంలో మన సమస్య పరిష్కరింప బడినట్టే. యీ వనరులను సద్వినియోగం చేసుకోవాల్సిన విషయం మనకు సంబంధించినది. ఇటువంటి సమస్యలను ఎల్లప్పుడు ఊతగా తీసుకునే కొందరు ప్రతిపక్ష సభ్యులకు ఇక ఆందోళనలు లేవదీసే అవకాశాలు లేకుండా పోయాయి. వ్యతిరేకించడమే వారిపని కాబట్టి కొన్ని దొసగులను వెతకడానికి వారు ప్రయత్నిస్తున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు రెండవ దశనుగూర్చి మనం విచార పడాల్సిన అవసరంలేదు. ఎందువల్లనంటే యీ సమస్య కొన్ని సంవత్సరాల తర్వాతగానీ తలఎత్తదు. ఇతర ప్రాజెక్టుల మాదిరిగానే ఇదికూడా సుళువుగానే నిర్మించ బడుతుందనే నా విశ్వాసం. ఇటీవలి కాలంలో ముఖ్యంగా భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీ, నదీజలాల వంటి కొన్ని సమస్యల పరిష్కారం, నిర్మాణాత్మకంగా ఏ విధంగా పనులను చేయవచ్చునో ద్యోతకం చేస్తాయి.

రెండు సంవత్సరాలలో మన విద్యుచ్ఛక్తి పరిస్థితి తప్పకుండా అభివృద్ధి చెందుతుందనీ, తెలంగాణాలో కూడా యీ విధంగానే జరుగుతుందనీ నాకు నమ్మకం ఉంది. యీ విషయంలో పరిశ్రమ దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పరిశ్రమలను స్థాపించే వారి పథకాలను అమలు చేయడంలో ముందుకు పోవచ్చు. వారు ఫ్యాక్టరీలను కానీ, వర్కుషాపులను కానీ నిర్మించే దశకు వచ్చేటప్పటికి వారికి అవసరమైన విద్యుచ్ఛక్తి లభిస్తుంది. జైహింద్ !

భవదీయుడు



బంగారపు గాజులు

మూలం :
దీపక్ గంగోపాధ్యాయ

అనువాదం :
డి. మంజులత

[శ్రీ దీపక్ గంగోపాధ్యాయ భారత సైన్యంలో పనిచేస్తున్నారు. చైనీయులు బొమ్డిలాను ఆక్రమించుకొనడానికి జరిపిన దాడిని తీవ్రంగా ప్రతిఘటించి, అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శించిన భారతీయ సైనిక బృందంలో శ్రీ దీపక్ గంగోపాధ్యాయ ఒకరు. ఈ కవితను శ్రీ గంగోపాధ్యాయ నేఫా రణరంగంనుంచి బెంగాలీలో వ్రాసి 'దేశ్' అనే వంగ వారపత్రికకు పంపించారు. గత నవంబరు 22 వ తేదీన ఈ కవిత మొదటిసారిగా 'దేశ్'లో ముద్రితమయింది.]

ఒక రోజున ఎంతో ప్రేమతో కొని యిచ్చాను
నీవు కోరిన బంగారపు గాజుల జత ఒకటి!
ఆ తరువాత మళ్ళీ నేను నేటివరకూ
నీ కేమీ యివ్వలేకనే పోయాను!

నిజం చెప్పు చెల్లీ!
నీ సోదరు డిచ్చిన
ఆ బంగారపు గాజులు నేడు
నీ చేతులకు శోభను కలిగిస్తాయంటావా?

నా ముద్దుల చెల్లీ!
నా మాట వినుతల్లీ!
ఆ గాజులను వెంటనే అమ్మివేసి
కొన్ని పౌనుల ఉన్ని కొని తీసుకరా!

మంచుకొండల భీకర శీతల వాయువుల్లో
నీ సోదరుల శరీర రక్తం
మంచువలె గడ్డకట్టుకు పోతున్న
ఈ విపత్కర తరుణంలో —

నిజం చెప్పు చెల్లీ!
నీ సోదరుడిచ్చిన
ఆ బంగారపు గాజులు నేడు
నీ చేతులకు శోభను కలిగిస్తాయంటావా?

అందుకే నా చిట్టి చెల్లీ!
ఆ గాజులను అమ్మివేయ మంటున్నాను
అల్లడానికి వున్ని, సూదులు కొన మంటున్నాను!

నీవు కాలేజీకి ఈ రోజున
వెళ్ళక పోయినా మించి పోయిందేమీ లేదు
తక్షణం నీవు చేయవలసింది —
స్వెట్టర్లూ, మఫ్లర్లూ అల్లడమే!

పిచ్చాపాటి కబుర్లతో
కాలాన్ని వృథా చేయక
విలాసాలను విడనాడి
కాలపు విలువను గ్రహించు చెల్లీ!

నీ సోదరులు భయంకర శీతలంలో
పిస్తోలు, తుపాకిని చేబూని
పహ్యుడు, నీచుడు, రక్త పిపాసి అయిన
పశువులాంటి శత్రువుతో పోరాడు తున్నారు!

ఈ వీరుల కోసం —
నాచిట్టి చెల్లీ
ఈరోజు రాత్రి నువ్వు విశ్రమించక పోయినా
మించిపోయిన దేమీ లేదు
నీవు మాత్రం స్వెట్టర్లూ, మఫ్లర్లూ
అల్లి పంపించు తక్షణం!

గడగడ వణకించే చలిలో
నీ ప్రేమలోని వెచ్చదనాన్ని
దేశంకోసం పోరాడుతున్న
నీ సోదరులు కొంచెమైనా అనుభవించక పోతే
నిజం చెప్పు నా చిట్టి చెల్లీ!
నీ సోదరుడిచ్చిన
ఆ బంగారపు గాజులు నేడు
నీ చేతులకు శోభను కలిగిస్తాయంటావా?

అమరుడైన అహింసామూర్తి

భారత సంస్కృతికి ప్రతిబింబం

రాజేంద్రబాబు, భారత సంస్కృతికి ఒక చక్కని ప్రతినిధి. ఆ సంస్కృతిలోని ఉదాత్తమైన లక్షణాలకు, ఆయన జీవితం ఒక ప్రతిబింబం. భారతీయత మూర్తీభవించగా, రాజేంద్రబాబు అయినాడు.

భారత నాయకులలో కొంతమందివలె, ఆయన ప్రపంచ విఖ్యాత పురుషుడు కాని మాట వాస్తవమే. ఏ ఒక ప్రత్యేక రంగంలోనూ, ఒక విశిష్టమైన స్థానాన్ని, ఆయన సంపాదించి ఉండి ఉండకపోవచ్చు. కాని ఏ విదేశీయుడైన ఆయన్ని కలుసుకున్నప్పుడు, ఆయన సన్నిధానంలోకి వెళ్ళినప్పుడు, యుగ యుగాలనాటి భారతీయ నాగరికతను, భారతీయ విజ్ఞానాన్ని, భారతీయ సంస్కారాన్ని సందర్శించినట్లుగా ఉండేది. మూర్తీభవించిన భారత సంస్కృతినే సందర్శిస్తున్నట్లు ఉండేది.

రాజేంద్రబాబు జీవితం ఒక సరళ గంగా ప్రవాహం. గంగ, తన పరిసరాల నన్నిటినీ ఫలవంతం చేసినట్లు, అడుగడుగునా ఆయన జీవితగమనం, ప్రయోజనాత్మకమైనది. పరిసరాలకు, తోటి మానవులకు వికాసాన్ని, విజ్ఞానాన్ని, పంచిపెట్టినది.

విద్యార్థిదశనుండి రాజేంద్రబాబులోని ప్రత్యేక లక్షణాలు విశదమవుతూనే వచ్చినవి. చూడగానే గ్రహించగలిగిన చురుకుతనం, ఏ సమస్యనైనా వివరంగా విడదీసి అర్థం చెప్పుకోగల విమర్శ, విచక్షణాశక్తి, రాజేంద్రబాబులో మొదటినుండి ప్రస్ఫుటంగా కనిపిస్తూనే వచ్చినవి. అందుచేతనే ఆయన చదువులో ఎప్పుడూ మొదటివాడుగానే ఉండేవాడు.

ఆనాటినుండీ, వికసించినదే ఆయనలోని మానవత. కరుణాభావం, అన్యాయాన్ని సహించలేనితనం, పరోపకారబుద్ధి, దేశభక్తి, స్వాతంత్ర్యాభిలాష, రాజేంద్రబాబులో మొదటినుండీ ఉన్న లక్షణాలు. తన తోటి వారికి ఆప్తుడుగా, ఏడుగడగా ఉండగలిగిన ఉదాత్త లక్షణం, ఆయనలో ఆనాటినుండీ వెలుగుతూనే వున్నది.

ఆ పిమ్మట ఆయన న్యాయవాదిగా పని చేశాడు. కొద్దిరోజులలోనే ప్రముఖ న్యాయవాది అయినాడు. ఆయన ప్రజ్ఞా విశేషాలు అటువంటివి. ఆయన ఎందులో ప్రవేశించినప్పటికీ, అందులో ప్రావీణ్యతను పొందేవాడు. ముఖ్య స్థానాన్ని అలంకరించేవాడు. అయితే, ఆ ముఖ్యస్థానానికి రాజేంద్రబాబు

ఆవుల సాంబశివరావు

మార్గం, ఇతరులను త్రోసిరాజనికాదు. ఇతరుల అవకాశాలను అరికట్టికాదు. ఇతరులను నష్టపరిచికాదు.

రాజేంద్రబాబు రాజకీయ జీవితం కూడా అలాగే నడచినది. ఆయన ఎన్నడూ ఎవరితోను పోటీపడినట్లు మనము వినలేదు. ఇతరులను క్రిందకు త్రొక్కి ఆయన పైకి వచ్చినవాడు కాదు. ఆయన ప్రజ్ఞా విశేషాలను గుర్తించి, ఆయన శాంతి, సమన్వయ దృక్పథాన్ని గౌరవించి, ఆయన వ్యక్తిత్వపు విశిష్టతను అభిలషించి, తోటివారు ఆయనకు ప్రాధాన్యతను ఇచ్చారే కాని, ఆ ప్రాధాన్యతను, ఆయన, తనకు తానుగా కైవసం చేసుకోలేదు.

న్యాయవాదిగా రాజేంద్రబాబు చాలా ధనాన్ని గడించాడు. ఔదార్యం, ఆయనలో ఆజన్మాంతమైనది కనుక సంపాదించిన ధనాన్నంతటినీ ధర్మకార్యాలకు పంచిపెట్టేవాడు. స్వాతంత్ర్య సమరాంగణంలో ప్రవేశించే నాటికి రాజేంద్రబాబు ధనహీనుడుగానే మిగిలాడు. గాంధీ ధీరకర్తృత్వ సిద్ధాంతానికి రాజేంద్రబాబు చక్కని నిదర్శనం.

గాంధీ ప్రభావం రాజేంద్రబాబును నూతన మానవునిగా రూపొందించినదని భావించడం పొరబాటు. ఆ ప్రభావం రాజేంద్రబాబులో, అదివరకే నిబిడీకృతమైఉండి, పని చేస్తున్న ఆదర్శాల నన్నిటినీ, ప్రకోపింప జేసినది. ప్రజ్వలింప జేసినది. వస్తుతః, రాజేంద్రబాబుది గాంధీ తత్వమే. అందువల్లనే అంతిమ క్షణమువరకు, ఆయన జీవితం గాంధీ విధానంలో తూ, చా తప్పకుండా నడచినది. అందుచేతనే రాజేంద్రబాబు జీవితం, గాంధీ తత్వానికి, అకలంకమైన నిదర్శన మైనది.

స్వాతంత్ర్య సమరంలోకూడా రాజేంద్రబాబు ప్రత్యేకత కనిపిస్తూనే వుంటుంది. తన యావచ్ఛక్తినీ, ఆయన రైతాంగంమీద, గ్రామీణులమీద కేంద్రీకరించాడు. సంఘంలో అడుగున అణిగిమణిగి ఉన్న రైతు జనమే, గ్రామీణ ప్రజలే, భావి పురోగమనానికి ప్రాతిపదికలని ఆయనలోని మానవత, దూరదృష్టి గుర్తించినవి. ఆయనలోని రైతు రక్తం, రైతు సంప్రదాయం అందుకు ఆయన్ని అర్హుణ్ణి చేసినది.

గాంధీ నిర్మాణ కార్యక్రమంలో రాజేంద్రబాబుకు అరమరలులేని విశ్వాసం. అకుంఠిత

(మిగతా 9 వ పేజీలో)

డాక్టర్ రాజేంద్రప్రసాద్

అపర జనకుడు

గత ఫిబ్రవరి 28 వ తేదీన భారతీయ జ్యోతిర్మండలము నుండి దేదీప్యమానముగా వెలిగిన చుక్క ఒకటి అకస్మాత్తుగా అదృశ్యమైనది. దానితో భారతీయుల హృదయములంధకార పూరితములైనవి. పదునైదు సంవత్సరముల క్రిందట 'బాపు' నిర్యాణవార్త దేశమునెంతకదల్చినదో, నేడు రాజేంద్రబాబు నిర్యాణ వార్త దేశము నంత దుఃఖాక్రాంత మొనర్చినది. ఇదిసహజమే. ఏలయన గాంధీజీవలెనే రాజేంద్రబాబుకూడ భారతీయ సంస్కృతికొక ప్రతీకము. ఆయన బ్రహ్మర్షియైన ఈయన రాజర్షి. ఆయన యాజ్ఞవల్క్యుడైన ఈయన జనకుడు. పురాణములలోను, కావ్యములలోను రాజర్షులనుగూర్చి చదువుచుందుము. ఆ వర్ణనముల చదివినప్పుడది అతిశయోక్తి యేమో అనిపించును. కాని రాజేంద్రబాబు జీవితమును పరిశీలించినవారికవి అతిశయోక్తులు కావనియు, భారతపృధివిలో ఇంకను అట్టి శక్తి సమృద్ధముగా నున్నదనియు గోచరింపక మానదు. మహాకవి కాళిదాసు జగత్ప్రసిద్ధమైన తన శాకుంతల నాటకములో మునికుమారులచే దుష్యంతుని వర్ణింపజేయుచు, ఆతడు రాజ్యమను ఆశ్రమములో, లోకరక్షణ యను తపస్సుచేయుచున్న, రాజు అను పేరుగల ముని, అని ప్రశంసించెను. అట్టి ఆదర్శము కొన్ని వేల సంవత్సరములకు పిమ్మట మరల మనము మన రాజేంద్రప్రసాదునందు దర్శింప గలిగితిమి.

ప్రపంచములో భారతదేశమునకు అనాది నుండియు కర్మభూమి యను పేరుగలది. అనగా ఫలాపేక్ష లేకుండ భగవత్ప్రీతికై స్వధర్మము నాచరించుటయే కర్తవ్యమని భారతీయుల విశ్వాసము. ఈ విశ్వాసమే స్వరాజ్యానంతరముకూడ మహాత్మునిచే నౌకాలీయాత్ర చేయించినది. రాజేంద్రబాబుచే రాష్ట్రపతిపదవిని స్వీకరింపజేసినది. స్వాతంత్ర్యోద్యమములో తాను వసించిన కారాగారమునకును, స్వాతంత్ర్యము సిద్ధించిన తరువాత తాను నివసించిన రాష్ట్రపతి భవనమునకు ఆయనదృష్టిలో భేదములేదు. రెండును ఆయన దేశసేవా సాధనలో ఉపకరణములే. ఈ విధముగా ఆయన తన

"ఆత్మారామ్"

జీవితములో కర్మయోగా ధర్మమును ప్రదర్శించెను.

మహాత్ముడు భారతదేశమునకు స్వాతంత్ర్యము సంపాదించుటకు అవలంబించిన పద్ధతి అపూర్వమైనది. ఈ అణుయుగములో అహింసయే ప్రపంచమును రక్షింపగలదుగాని, హింసా మార్గము శ్రేయస్కరముకాదని, ఆ అహింసా మార్గముననే దేశీయులనెల్లరనునడిపి స్వాతంత్ర్యము సంపాదింపగల్గెను. ఈ సందర్భములో గాంధీజీని చా,తూ తప్పకుండ అనుసరించిన వారిలో అగ్రగణ్యుడు రాజేంద్రబాబు. గాంధీజీ అనంతరము రాజకీయములలో నుండియు గాంధీజీ ఆదర్శములను తూ, చా, తప్పకుండ ఆచరణలో పెట్టగలిగిన వారిలో కూడ ఆయనయే అగ్రగణ్యుడు.

అత్యున్నతమైనపదవిని అధిష్ఠించియుండియు, అతినిరాడంబరమైన జీవితము గడుపుట, మిక్కిలి అట్టడుగున పడియున్న వారిని గురించి ఎక్కువ శ్రద్ధగైకొనుట, రాజేంద్రబాబులోగల విశిష్టగుణములు. 'మహాసత్త్వోతిగంభీరః కృపావానవికత్థనః' అనిధీరోదాత్తుని వర్ణింతురు. ఈ లక్షణములన్నియు రాజేంద్రబాబు నందుగలవు. అందును 'కృపావాన్' అను విశేషణము ఆయనకు విశేషముగా అన్వయించును. గాంధీజీతో పరిచయమునకు ముందే ఆయన బీహారులోని చంపాదన్ జిల్లాలోని రైతుల కష్టములనుగూర్చి కృషిచేయ నారంభించిరి. ఆ పిమ్మట బీహారులోకలిగిన దారుణమైన భూకంపముచే పీడితులైన ప్రజలకు ఆయన చేసిన అవిశ్రాంత సేవ జగద్విఖ్యాతమైనది. అట్లే రాష్ట్రపతి పదవిని స్వీకరించుటతో పాటు, భారతీయ ఆదిమజాతిసేవక సంఘాధ్యక్షతనుగూడ స్వీకరించుటయు ఆయన దీనజనవత్సలత్వమును చెప్పకయే చెప్పుచున్నది. గాంధీజీ ప్రవచించిన 'సర్వోదయ లక్ష్యమును జీవితాంతమువరకు ఆయన ఆచరణలో పెట్టగలిగిరి. "సర్వోదయము" అనగా "అంత్యోదయము": దేశసేవలో అందరికంటె అట్టడుగున పడియున్న వారి సంగతి ముందుచూడవలెనని సర్వోదయసిద్ధాంతము. సమాజములో అందరికంటె అట్టడుగునపడి

యున్నవారు గిరిజనులు వారికి విద్యలేదు వృత్తిలేదు, తిండిలేదు. వారుకూడ తక్కిన వారిస్థాయికి వచ్చినప్పుడే స్వరాజ్యమునకు సార్థకత. ప్రభుత్వముయొక్క కార్యక్రమములో గిరిజన సముద్ధరణప్రాముఖ్యము వహింపవలెను అని చెప్పుటకేయనునట్లు ఆయన రెండు పదవులను సమానముగా వహించెను. చివరకు రాష్ట్రపతి పదవిని ఆరోగ్య కారణములచే విసర్జించెను గాని, ఆదిమజాతిసేవక సంఘాధ్యక్షతనుమాత్రము జీవితాంతము వహించెను. సేవకొరకే పదవి గాని పదవికొరకు సేవకాదు, అను ఆయన విశిష్టదృష్టికిదియొక మచ్చుతునక. అనారోగ్యముగానుండియు మార్చి 18 వ తేదీని జరిగిన ఆదిమజాతి సేవక సంఘ సమావేశమునకు హాజరుకాగలనని చెప్పినట్లుకూడ తెలియుచున్నది. ఈ లోపుగనే భగవంతుని పిలుపువచ్చినది. ఇట్టి కర్తవ్యనిష్ఠ చాల అరుదుగదా!

ఇన్ని విధములైన నాయకత్వలక్షణము లున్నను సౌమ్యత, నిరాడంబరత, శాంతము అనుగుణములు ఆయనయెడ భయమునకు బదులుభక్తినే ఎక్కువగా ప్రజలకు కల్గింపగల్గినవి. రాజేంద్రబాబు అను పేరులోనే ప్రజలకు ఆయన ఎంత ఆత్మీయుడైనది వ్యక్తముకాగలదు. ఎంతసామాన్యప్రచారకుడైనను ఆయన యొద్దకు మిక్కిలి చనువుతో వెళ్ళి మాట్లాడగలుగునంతటి ప్రసాదమూర్తి ఆయనది. అట్లని గాంభీర్యమున కేమియు కొదవలేదు. అధృష్యశ్చాభిగమ్యశ్చ అని కాళిదాసుచెప్పిన లక్షణమీ రాజేంద్రుని యందు పూర్తిగా అన్వయించును. అజాతశత్రువను బిరుదముకూడ ఆయన యందు సార్థకము. నలుబదిఅయిదుసంవత్సరముల రాజకీయజీవితములో ఆయన సర్వులచేతను గౌరవింపబడుటయే కాక, అత్యున్నతమైన స్థానములకన్నిటికి ఏకగ్రీవముగాఎన్నుకొనబడుట దీనికి దృష్టాంతము. పదవులు ఆయననువరించినవిగాని, ఆయన పదవుల నెన్నడు వరింపలేదు. ఇది ఆయన గాంభీర్యమునకు గుర్తు.

కాంగ్రెసు మహాసభలో హాలాహలము బయలుదేరినప్పుడు దానినిమ్రింగగల మహాసత్త్వుడు రాజేంద్రబాబు ఒక్కడే. శ్రీసుభాసు చంద్రబోసుతోగలిగిన అభిప్రాయ భేదమును పురస్కరించుకొని కలకత్తాలో జరిగిన కాంగ్రెసుమహాసభకు రాజేంద్రబాబు కాక ఇంకెవ్వరధ్యక్షులుగా నున్నను అది రసాభాసమయ్యెడిదే.ఎవరెంత గందరగోళము చేసినను, మేరుపర్వతమువలె నిశ్చలముగా నిలబడి చివరకు సభను శాంతముగా జరిపించినప్రశస్తి ఆయనకే దక్కినది.

గాంధీజీ అనంతరము, ఆయనకు ముఖ్య శిష్యుడైన ఆచార్యవినోబా ప్రారంభించిన భూదాన యజ్ఞమునకుగూడ రాజేంద్రబాబు ఇచ్చిన ప్రోత్సాహము అమూల్యము.ఆయన ప్రోత్సాహము చేతనే భూదానగ్రామ దానోద్యమములో బీహారు అగ్రస్థానము వహించినదని చెప్పుటలో అతిశయోక్తిలేదు. పాట్నాలో 'సదాకత్'ఆశ్రమమును స్థాపించి సర్వోదయ సందేశమును బీహారు అంతట ఆయన వ్యాపకమొనర్చిరి. చిన్న పిల్లలచే పిడికెడుబియ్యము నిత్యమువేయించుట అను నియయముగల సర్వోదయ పాత్రను రాష్ట్రపతి భవనములోనెలకొల్పి దానికొక విశిష్టప్రతిపత్తిచేకూర్చిరి. రెండేండ్ల క్రిందట ఉంగుటూరులోజరిగిన అఖిల భారత సర్వోదయ సమ్మేళనమునకు, అనారోగ్యముతో నుండియు హాజరై కార్యకర్తలకెంతో ప్రోత్సాహమొసంగిరి.

అట్లే సాహిత్యరంగమునగూడ సంస్కృత భాషావ్యాప్తికి ఆయన ఇచ్చిన ప్రోత్సాహము అమోఘము. సంస్కృత విశ్వపరిషత్తునకు ప్రథమాధ్యక్షులై అనేక వార్షిక సభలలో సంస్కృత భాషనుగూర్చి ఉదాత్తమైన సందేశముల నొసంగిరి. ఇన్ని వేల సంవత్సరములనుండి భారతదేశముయొక్క అఖండతను నిల్పగల్గినది సంస్కృతభాషయే యనియు ఇకముందుకూడ దానివలననే ఆపని జరుగవలెననియు, భారతీయ సంస్కృతి నిత్యనూతనముగా వర్ధిల్లవలెనన్న అది సంస్కృతముద్వారానే జరుగవలెననియు ఆయన విశ్వాసము.

ఈ విధముగా అయన గుణ గణములు వర్ణించుటకెన్నియో గలవు. అన్నిటికంటె ముఖ్యమైన గొప్ప గుణము ఆయనకు ప్రజాస్వామ్యములోగల దృఢవిశ్వాసము. మహాత్ముడు తఱచుగా రామరాజ్యముకావలెనని చెప్పుచుండెడివారు. రామరాజ్య మనగా దైవరాజ్యమని ఆయనయే నిర్వచించెను. ఇంకొక నిర్వచనముప్రకారము రామరాజ్య మనగా నిజమైన ప్రజాస్వామ్యము. ప్రజలు చెప్పినట్లు రాజునడుచుట. సీతనిష్కళంకురాలని తెలిసియు, ప్రజాభిప్రాయమునకు రాముడు తలయొగ్గెను. అట్లే రాజేంద్రబాబు కూడ రాష్ట్రపతి పదవియందుండియు, తన వ్యక్తిగతాభిప్రాయములకు భిన్నముగా నున్నను లోకసభ తీర్మానములను శిరసావహించెను. అట్లని తన అభిప్రాయమును ప్రకటించుటకెప్పుడును వెనుదీయలేదు. పరిపక్వమైన అనుభవము, జ్ఞానముగల ఆయన అభిప్రాయములు మన ప్రధాన మంత్రికి, తక్కిన నాయకులకు ఎంతో ఉపయోగకరములుగ నుండెడివని వారే అనేక పర్యాయములు ప్రకటించిరి.

ఇట్లు ఒక విధంగా కాక, సర్వతోముఖముగా దేశసేవయొనర్చి, భారతీయుల కెల్లరకు ప్రాతస్మరణీయులైన రాజేంద్రబాబు దివ్యస్మృతి మనలను నిత్యము కర్తవ్యపరాయణులను గావించుచు, అయనవలెనే నిష్కామ కర్మకభిముఖులను జేయుగాక ! పరమేశ్వరుడాయన ఆత్మకు పరమ శాంతిని జేకూర్చుగాక!

★

(6 వ పేజీ తరువాయి)

దీక్షతో ఆ కార్యక్రమ సాఫల్యానికి ఆయన కృషి చేశాడు. గ్రామీణ జీవిత సంస్కారం, ఆ సంప్రదాయం రాజేంద్రబాబు ప్రతి అణువు లోను జీర్ణించుకు పోయినది. అందుచేతనే, గ్రామ జీవిత వికాసానికి ఆయన అహరహము ఆతురత చెందేవాడు. నిర్మాణ కార్యక్రమం గ్రామ జీవితాన్ని బాగు పరుస్తుందని, మెరుగుపరుస్తుందని రాజేంద్రబాబు దృఢ విశ్వాసం. అందుకనే అందులో ఆయన కంత శ్రద్ధ.

రాజేంద్రబాబు హిందీ భాషాకోవిదుడు. ప్రజాసముదాయముతో ఆయన పెట్టుకున్న సన్నిహిత సంబంధం మూలాన, ఆ భాషలో ఆయనకు చక్కని ప్రవేశమేర్పడ్డది. హిందీ భాషా ప్రచారానికి, దాని విస్తరణకు, అభివృద్ధికి రాజేంద్రబాబు చాలా సహకరించాడు. చనిపోయేవరకు ఆయన దక్షిణ భారత హిందీప్రచార సభకు అధ్యక్షుడుగా ఉండేవాడు.

స్వాతంత్ర్య సిద్ధి అయిన పిమ్మట ఏర్పడిన భారత రాజ్యాంగ పరిషత్తుకు రాజేంద్రబాబు అధ్యక్షులు. భారత రాజ్యాంగం ఆయన ఆధ్వర్యాన నిర్మాణమైనది. రాజ్యాంగ చట్టం, రాజ్యానికి ప్రాతిపదిక. జాతి జీవిత గమనానికి దిక్సూచి. భిన్న ప్రాంతాలు, భిన్నతరగతులు, విభిన్న శక్తులు సమాలోచించి, రాజ్యాంగాన్ని నిర్ణయించవలసిన పరిషత్తు అది. రాజ్యాంగ పరిషత్తు దిగ్విజయంగా తన కృషిని నెరవేర్చినదంటే, అది రాజేంద్రబాబు రాజనీతిజ్ఞతకు సమన్వయ శక్తికి ప్రబల నిదర్శనం.

స్వతంత్ర భారితావనికి ప్రప్రథమ అధ్యక్షుడుగా రాజేంద్రబాబు కావడం చాలా సముచితం. భారత రాష్ట్రపతిగా ఆయన పాత్ర ప్రశంసనీయమైనది. రాష్ట్రపతి పదవికి అంతకుముందు సంప్రదాయాలు లేవు. అనుభవాలు లేవు. అన్నిటినీ ఆయన సృష్టించవలసి వచ్చినది. నిర్మించవలసి వచ్చినది. తన ఆధ్వర్యం క్రింద నిర్మాణమైన రాజ్యాంగ చట్టాన్ని ఆయన అమలు జరుపవలసి వచ్చినది. అందుపొందుపరచబడిన, ప్రజాస్వామిక సూత్రాలకు రూపకల్పన చేయవలసి వచ్చినది.

భారతదేశం చుట్టూఉన్న ప్రపంచంలో ప్రజాస్వామిక సంస్థలు తల్లక్రిందులవుతూ వుండగా, భారత భూమిలో ప్రజాస్వామికం అమలు జరగడానికి ప్రజాస్వామిక విధానం విజయవంతం కావడానికి, ప్రధాన కారణాలలో రాజేంద్రబాబు నిర్వహించిన రాష్ట్రపతి పాత్ర ఒకటి.

రాజేంద్రబాబు, పార్లమెంటు చేసిన ప్రతి నిర్ణయాన్ని ఆమోదించాడు. అక్షరాలా అమలు జరిపాడు. తద్వారా, భారత పార్లమెంటరీ ప్రజాస్వామికాన్ని పదిలపరిచాడు.

రాజేంద్రబాబు రాష్ట్రపతిగా చక్కని సంప్రదాయాలను భావితరాలకు అందించి వెళ్ళాడు. గాంభీర్యం, ఔదార్యం, ఉదాత్తత, రాష్ట్రపతి పాత్రకు ప్రధాన లక్షణాలని ఆయన నిరూపించాడు. అవసరమైనప్పుడే మాట్లాడ్డం ఉచితమని, అవుసరమైనప్పుడు మాత్రం గట్టిగా, నిర్మొగమాటంగా తన అభిప్రాయాలను అందజేయడం కూడా రాష్ట్రపతి విధ్యుక్తధర్మమని, ఆయన నిరూపించాడు. రాష్ట్రపతి, ప్రాంతీయ, మత, వర్గ, పార్టీవిభేదాలకు అతీతుడై, అందరకు కావలసినవాడై, ప్రజలందరివాడై ఉండాలని ఆయన నిరూపించాడు. రాష్ట్రపతి, విభిన్న దృక్పథాలకు సమన్వయ కారకుడుగా మెలగగలగాలి అని ఆయన నిరూపించి వెళ్ళాడు. రాష్ట్రపతి అనగా భారత రాజ్యాంగంలో మొదటి పౌరుడే కాకుండా, భారత ప్రజలకు ప్రతినిధి అనీ, భారతీయ వ్యవస్థకు ధృవ నక్షత్రమనీ ఆయన నిరూపించి వెళ్ళాడు. రాజర్షిగా తన రాష్ట్రపతి పాత్రను నిర్వహించాడు.

రాజేంద్రబాబు న్యాయశాస్త్ర కోవిదుడు. భాషావేత్త. రాజనీతిజ్ఞుడు. స్వాతంత్ర్య సమరవీరుడు. ప్రజాస్వామిక వాది. అన్నిటినీ మించి, ఆయన ఉత్తమ మానవుడు. కరుణా సముద్రుడు, సమన్వయమూర్తి, పెద్దమనిషి. ఆయన మహా నాయకులలో ఒకడు. అంతకంటె కూడా, ఆయనను భారత ప్రజలు, తమ చిరకాల మిత్రునిగా, ప్రియబాంధవుడుగా, తమ ఏడుగడగా స్మరించుకుంటారు. కృతజ్ఞతాంజలి ఘటిస్తారు. ★

ప్రియదర్శీ!

జోహారు జోహారు
బీహారు గాంధీ!
నీహారగిరి శిఖర
నిర్మల మహోమూర్తి
మకుట రహిత రాజేంద్రా!
మధుర శాంతిపూర్ణ చంద్ర!
శాంతి సమర సేనానీ
సాత్విక గుణ రాజధానీ!
సౌమ్య సరళ దరహాసం
సౌజన్యమే నీ రూపం
నేల తల్లి అనుగు సుతుల
జాలిచూపు నీదు కనుల
చల్లని నీ పరిపాలన
మల్లెపూల పందిరిగా
భారతికే హారతిగా
శారదేందు చంద్రికగా!
గర్వ రహిత ఘనకీర్తి
సర్వోదయ స్ఫూర్తి!
అనదలకే ఆదరువై
నినదించెను నీదువాణి
రాజనీతితో నీతిని
పెనవేసెను నీదుపాణి
నేటి జనక రాజర్షి
సాటిలేని ప్రియదర్శీ!

—అమరేంద్ర

విశేషాలు - వ్యాఖ్యలు

పి.వి. నరసింహారావు

ప్రాజెక్టులకు మంజూరు

భారత ప్రభుత్వం గుల్హాతీ కమీషన్ నివేదికపై నిర్ణయం తీసుకొని లోక సభలో మార్చి 23 వ తేదీన చేసిన ప్రకటనలో శ్రీశైలం, పోచంపాడు ప్రాజెక్టులను వెంటనే మంజూరు చేయువలసిందని రాష్ట్రం చేసిన డిమాండును అంగీకరించింది.

కేంద్ర ప్రభుత్వ నీటి పారుదల విద్యుచ్ఛక్తి శాఖల మంత్రి ప్రతిపాదించిన కొన్ని మూల సూత్రాలపై దీర్ఘకాలంగా కొనసాగుతూ వచ్చిన కృష్ణాగోదావరి జలాల వివాదం పరిష్కారమైంది. "ఆయా రాష్ట్రాల సమంజసమైన ప్రయోజనాలను కాపాడే విధంగా అవసరమైన సర్దుబాట్లతో పాటు ఇదివరకే ఆరంభించిన ప్రాజెక్టులనూ, వెంటనే ఆరంభించడానికి తలపెట్టిన ప్రాజెక్టులనూ నిర్మించాలి'' అనేది ఈ సూత్రాలలో ఒకటి. తదనుగుణంగా మంజూరైన నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు అవసరమైన జలాలను (264 టి. యం. సి.) ఆధారంగా తీసుకొని, గోదావరి జలాలను ఇచ్చంపల్లి పోలవరంల నుంచి మళ్ళించే సాధ్యాసాధ్యాలను పరిశీలించి, శ్రీశైలం నాగార్జునసాగర్ ప్రాంతాల మధ్య ప్రవహించే నీటిని దృష్టిలో పెట్టుకొని, సవరించబడిన శ్రీశైలం జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు నిర్మాణానికి మనం ఇక ఉపక్రమించవచ్చు.

ఇదే విధంగా గోదావరిపైన పోచంపాడు ప్రాజెక్టును మనం నిర్మించుకోవచ్చు. 66 టి. యం. సి. నీటిని వినియోగించుకొని దీనిని స్టోరేజి-ప్రాజెక్టుగా నిర్మించే విధంగా ఇది మార్పు చేయబడింది. ముందు ముందు, అవసరమైతే, ఈ స్టోరేజిని పెంచేందుకు అవకాశం వుంది.

అంతే గాకుండా మనం పరిశీలన పూర్తి చేసిన మధ్య తరహా, చిన్నతరహా ప్రాజెక్టులను లేక, త్వరలో పరిశీలన జరుగవలసి వున్న ఇతర మధ్య తరహా, చిన్న తరహా ప్రాజెక్టులను నిర్మించుకొనడానికి అనుమతి లభించింది.

మూడవ, నాల్గవ, ఐదవ ప్రణాళికల కాలంలో కృష్ణానది నుంచి మన ప్రాజెక్టులన్నింటికీ కలిసి 800 టి.యం.సి. జలాలను వినియోగించుకో వచ్చునని కోటా నిర్ణయించబడింది.

నాగార్జునసాగర్ రెండవదశ కొంత అనిశ్చితంగా వుంది. గోదావరి జలాల మళ్ళింపు విషయమై పరిశీలన పూర్తి చేసి, ఈ మళ్ళింపు జలాలు, నీటి మట్టాల వివరాలు తెలుసుకొన్న తరువాత ఈ రెండవ దశకు అనుమతి లభిస్తుందని చెప్పబడుతున్నది.

అనేక సంవత్సరాల పాటు సమగ్రమైన నదీ భోగట్టాను సేకరించి దీని పరిశీలనను కొనసాగిస్తూ వుండడానికి ఒక వ్యవస్థ ఏర్పాటు చేయబడుతున్నదని కూడా కేంద్ర మంత్రి ప్రకటించారు.

ఆ యా రాష్ట్రాలను సంప్రదించి, వాటి సహకారంతో (1) గుల్హాతీ కమీషన్ సూచించిన విధంగా కీలక స్థలాలలో లభ్యమగు నీటిని శాస్త్రీయపద్ధతులలో పరిశీలించడానికీ (2) గోదావరి నీటి మళ్ళింపు విషయాలను పరిశీలించడానికీ, (3) కృష్ణా - గోదావరి బేసిన్‌కొరకు మాస్టర్ ప్లానులను తయారుచేయడానికీ నదీ బోర్డు వంటిది ఒక కేంద్ర సంస్థ నెలకొల్పబడుతుంది. గోదావరి నుంచి కృష్ణలోకి మళ్ళించడానికి వీలుగల జలాలపై ఒక ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయబడుతుంది.

చైనా - పాకిస్తాన్ సరిహద్దు ఒప్పందం

భారతదేశం అనేక పర్యాయాలు తెలిపిన నిరసనను లెక్కపెట్టకుండా చైనా - పాకిస్థాన్ కారకోరం కనుమనుంచి పాక్ - ఆఫ్ఘన్‌వరకు గల 300 మైళ్ళ పొడవుగల సరిహద్దును గూర్చిన ఒప్పందంపై గత మాసం సంతకాలు చేశాయి.

ప్రధానమంత్రి లోకసభలో దీన్ని గూర్చి ప్రస్తావిస్తూ, కాశ్మీర్‌పై కలకత్తాలో జరుగవలసిన చర్చల సందర్భంలో, చైనా పాకిస్తాన్‌లు, ఈ సమయాన్ని ఉపయోగించుకోవడం ఉద్దేశపూర్వకమైనదని చెప్పారు.

భారతదేశంతో ఒక ఒప్పందానికి రావడానికి పాకిస్తాన్ ప్రభుత్వానికి దృఢమైన కోరిక లేదనికూడా దీనివల్ల ద్యోతకమవుతుంది. అయినప్పటికీ, పాకిస్తాన్‌తో చర్చలు కొనసాగించడమే మంచిదని భారతదేశం భావించిందని ఆయన అన్నారు. న్యాయరీత్యా, భారతదేశానికి కాశ్మీర్ అంతటిపైనా సార్వభౌమాధికారం

వుండడంవల్ల, కాశ్మీర్ సరిహద్దులను గూర్చి పాకిస్తాన్‌తో ఒప్పందం చేసుకోవడంపట్ల చైనాకు భారతదేశం ఆక్షేపణ తెలిపింది.

రాజ్యాంగ పరిస్థితి దృష్ట్యానే కాకుండా, ఒప్పందం ఫలితాల ప్రభావాన్నీ గూర్చి పాకిస్తాన్ చేసిన వాదనలు కూడా చెల్లనేరవు. పెకింగ్‌లో ఒప్పందంపై సంతకం చేసిన పాక్ విదేశాంగమంత్రి కలకత్తాలో మాట్లాడుతూ పాకిస్తాన్‌కు 750 నుంచి 800 చ. మైళ్ల ప్రాంతం లాభం కల్గిందనిచెప్పారు. ఇది నిజమని అనుకొన్నా, లోకసభలో మన ప్రధానమంత్రి చెప్పినట్లు, ఈ లాభానికి బదులు పాకిస్తాన్ చైనాకు 13 వేల చదరపు మైళ్ళ ప్రాంతాన్ని ధారాదత్తం చేసింది. 1962 లో పాకిస్తాన్ ప్రచురించిన సర్వే మ్యాపు ప్రకారం పరిస్థితి ఇది. 1961 లో కరాచీలో భారత హైకమీషనరుకు అందజేయబడిన ఒక పాకిస్తాన్ మ్యాపులో కూడా ఈ విషయమే వెల్లడి అవుతున్నది.

"లఢక్ వైశాల్యం సుమారు 12 వేల చదరపు మైళ్ళు మాత్రమే వుంటే, 13 వేల చ. మై. ప్రాంతాన్ని ధారాదత్తం చేయడం ఎలా సాధ్యమవుతుంది?" అని పాకిస్తాన్ విదేశాంగమంత్రి ఎత్తిపొడుపుగా మాట్లాడారు.

లఢక్‌లోని 13 వేల చ. మైళ్ళ ప్రాంతాన్ని పాకిస్తాన్ చైనాకు ఇచ్చివేసిందని యెవరూ చెప్పలేదు. వాస్తవంగా లఢక్ వైశాల్యం 45 వేల చ. మైళ్ళకు మించే వుంది. ఇందులో చాలాభాగం పాకిస్తాన్ దురాక్రమణ క్రింద వుంది. అయితే ఈ ఒప్పందం ప్రకారం చైనాకు యిచ్చివేసిన ప్రాంతంలో లఢక్‌లో కొంత భాగం, ఇది తనదేనని పేర్కొంటూ పాకిస్తాన్ ప్రచురించిన మ్యాపులో చూపబడిన ఇతర ప్రాంతం ఇందులో చేరివుంది, ఈ మ్యాపులు. 1962లో ప్రచురింపబడినవి కూడా. సింకియాంగ్ ప్రాంతంలోని 11 వేల చ. మై. స్థలం కాశ్మీరులో ఒక భాగంగా వున్నట్లు తెలుపుతాయి. ఈ మ్యాపులను పరిశీలించినట్లయితే, పాకిస్తాన్ చైనాకు 13 వేల చ. మై. ప్రాంతాన్ని ధారాదత్తం చేసినట్లు ఎవరికైనా తెలుస్తుంది. ఎందుకంటే, ఈ ఒప్పందం ఫలితంగా చైనాకు 2050 చ. మై. ప్రాంతం ఇచ్చివేయబడిందనీ, చైనా అధీనంలో వున్న 700 చ. మై. ప్రాంతం కలుపుకొని పాకిస్తాన్‌కు 1350 చ. మై. ప్రాంతం లభించిందనీ కరాచీలో పాక్-ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

పాకిస్తాన్ ఒప్పందం చేసుకోవడంపట్ల రష్యా చైనాకు తన ఆగ్రహం తెలిపిందని భారత ప్రధానమంత్రి, ఆ తరువాత వెల్లడించారు.

గిల్లికజ్జమాడినా కూడా, పాకిస్తాన్‌తో మనం కలకత్తా చర్చలను విరమించలేదు. కలకత్తాలో క్రొత్త విషయమేదీ బయటికి రాకపోయి నప్పటికీ, చర్చలు మళ్ళీ కొనసాగుతాయనేది ప్రస్తుతానికి లాభసాటియైనవిషయం.

కాశ్మీరు ప్రాంతాన్ని గూర్చిన చైనా-పాక్ ఒప్పందం, ఇద్దరు దురాక్రమణదారులు పొరుగునవున్న మిత్రదేశంపై దురాక్రమణ జరిపి, అన్యాయంగా, భూభాగాన్ని పంచుకోవడం తప్ప మరేమీకాదు. ఈ విషయాన్నే, యు. యన్. కు ఇటీవల అందజేసిన ఆక్షేపణ పత్రంలో తెలియచేశాము. యు. యన్. లోని రెండుకూటాల రాజ్యాలు చైనా-పాక్ ఒప్పందంపట్ల కచ్చితంగా తమ అసంతృప్తిని వెల్లడించడంతో, కనీవినీ యెరుగని ద్వేషం, దురాశ, అవకాశ తత్వంతో చేసిన ఈ పనిని క్షుణ్ణంగా పరిశీలించడం యు. యన్. కర్తవ్యం. పెద్ద, చిన్న రాజ్యాలు కలిసి ఈ విధంగా ఏకాభిప్రాయం వ్యక్తపరచిన సందర్భాలు అంతర్జాతీయ చరిత్రలో చాలాఅరుదు. ఈ ఏకాభిప్రాయమనేది ఏదైనా కార్యరూపం ధరిస్తుందో లేక పేలవంగా వుండిపోతుందో అనేదే ఇప్పుడున్న ప్రశ్న. అంతేగాకుండ ఆసియాకు సంబంధించిన సమస్యల పరిష్కారంపట్ల రెండుకూటాలకు చెందిన పశ్చిమ రాజ్యాలు యెంతవరకు తమ ఆసక్తిని చూపుతాయి? అంతర్జాతీయ బలాబలాల నిర్ణయంలో ఆసియా ఖండాన్ని అవి తమ స్వప్రయోజనాలకు వుపయోగించుకోవాలని ఇదివరకు వున్న భావాన్ని ఇప్పుడు యెంతవరకు విడిచిపెడ్తాయి? అనే విషయం ఈ సమస్యవల్ల తేలిపోతుంది.

దేశీయ వ్యవహారాలమంత్రి నేపాల్ సందర్శన

కేంద్ర దేశీయ వ్యవహారాల మంత్రి శ్రీలాల్ బహదూర్ శాస్త్రి నేపాల్‌లో సుహృద్భావ పర్యటన జరిపి నేపాల్ రాజు మహేంద్రతోను, నేపాల్ ప్రభుత్వ మంత్రులతోను ఉభయ దేశాలకు సంబంధించిన సమస్యలను గూర్చి చర్చలు జరిపారు. సందర్శన పూర్తి అయిన తరువాత ఒక సంయుక్త ప్రకటన విడుదల చేయబడింది. అందులో "పరస్పర భద్రతా విషయంలో నేపాల్ భారత దేశాలకు అత్యంత ఆసక్తి వున్నది" అని పేర్కొన బడింది.

తన పర్యటనను గూర్చి ప్రసంగిస్తూ ఉభయదేశాల మధ్య ఉన్న స్వల్ప అభిప్రాయ భేదాలను సంతృప్తికరంగా పరిష్కరించుకోవడానికి వీలుగా వాతావరణాన్ని సృష్టించడం జరిగిందని శ్రీ శాస్త్రి అన్నారు. ఉభయదేశాల మధ్య సన్నిహిత ఆర్థిక సంబంధాల అవకాశాన్ని గూర్చి కూడా ఆయన నొక్కిచెప్పారు. ఉభయదేశాల

ప్రజల మధ్య సత్సంబంధాలను నెలకొల్ప డంలో సహకరించాలని ఇరు దేశాలలోని పత్రికలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆయన పర్యటన సందర్భంలో భారత దేశ సహాయంతో నేపాల్‌లో నిర్మించబడు తున్న త్రిశూల్ ప్రాజెక్టును హోంమంత్రి సందర్శించారు.

నూనెపై రాయల్టీలు

దీర్ఘకాలంగా వివాదగ్రస్తమై ఉన్న మరో సమస్యను గత మాసంలో సంతృప్తికరంగా పరిష్కరించడం జరిగింది. అస్సాంలోని నూనె బావులనుంచి తీసిన నూనెపై అస్సాం ప్రభుత్వానికి ఇవ్వాల్సిన రాయిల్టీకి సంబం ధించినదే యీ సమస్య. నూనెపై టన్నుకు రు. 7.50 చొప్పున అస్సాం ప్రభుత్వానికి రాయిల్టీగా చెల్లించాలని ప్రధానమంత్రి తమ అవార్డులో తెల్పారు. రిఫైనరీలకు విక్ర యించే క్రూడ్ ఆయిల్ నికర అమ్మకం ధర ప్రాతిపదికపై రాయిల్టీ రేటును నిర్ణ యించాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఇది మెట్రిక్ టన్నుకు దాదాపు రు. 75/–ల చొప్పున పడుతుంది. యీ ధరలో పదవ వంతు రాష్ట్రానికి రాయల్టీగా ఇవ్వాలని తీర్పునిచ్చారు. యీ అవార్డుపై అస్సాం ముఖ్యమంత్రి తమ సంతృప్తిని వెల్ల డించారు.

అస్సాంలో ఉత్పత్తి అయ్యే క్రూడ్ ఆయిల్ ధరను నిర్ణయించడంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని ముందుగా సంప్రదించడం జరగలేదు. దీని ఫలితంగా రాష్ట్రానికి టన్నుకు రు. 7/–ల చొప్పున రావల్సిన రాయిల్టీ రు. 4–50 కు దిగింది. అస్సాం ఆయిల్ కంపెనీ, ఆయిల్ ఇండియా లిమిటెడ్‌తో ఉన్న కౌలును మార్చకుండా ఉండే పక్షంలో అస్సాంనుంచి తీసిన క్రూడ్ ఆయిల్‌పై నికర రేటులో రాయిల్టీ అంగీకరించడానికి సాధ్యమవుతుందని అస్సాం ప్రభుత్వం భారతప్రభుత్వానికి తెలియజేసింది. డిస్టిల్ క్రూడ్‌పై టన్నుకు రు. 10/–ల చొప్పున చెల్లించడానికి భారతప్రభుత్వం తాత్కాలి కంగా అంగీకరించింది. ఇప్పుడు రు. 7.50 ల సాధారణ రేటును స్థిరంచేశారు.

భారతదేశం గూర్చి ఇకేఫ్ ప్రశంస

ఇకేఫ్ (ఆసియా, దూర ప్రాచ్యదేశాల ఆర్థిక కమీషన్) సెక్రెటరియేటువారు తమ 1962వ సం॥పు ఆశియా, దూర ప్రాచ్య ఆర్థిక సర్వేలో యీ కాలంలో జరిగిన భారతదేశ పురోభివృద్ధిని గూర్చి ప్రశం సించారు. అభివృద్ధిదశలో ఉన్న ఇతర దేశాలతో పోల్చినప్పుడు పారిశ్రామిక, వ్యవసాయ రంగాలల్లో భారతదేశం విశేష కృషి జరిపిందని ఆ సర్వేలో వెల్లడించారు.

1956 వ సం॥ నుంచి భారతదేశం తన ఆహారోత్పత్తిని 25 శాతం అధికం చేసింది. జనాభా పెరుగుదలనుబట్టి భారతదేశం తలసరి ఆహారోత్పత్తి 9 శాతం పెరిగింది. ఇదే కాలంలో జపానులో 8 శాతం, పాకిస్తాన్, ఆగ్నేయ ఆశియా దేశాలలో 6 శాతం పెరుగుదల ఉంది.

1961 వ సం॥ లో ఏర్పడిన క్లిష్ట పరిస్థి తులను అధిగమించడానికి వీలుగా తీసుకున్న చర్యల ఫలితంగా రైల్వేలపై సరుకుల రవాణాలో భారతదేశం "ఆశ్చర్యకరమైన అభివృద్ధి'' ని సాధించిందని ఆ సర్వేలో వెల్లడించారు.

అణ్వస్త్ర పరీక్షల నిషేధం ఒప్పందం

జెనీవాలో జరిగిన 17 దేశాల నిరాయుధీ కరణ సంఘం సమావేశంలో అణ్వస్త్ర పరీక్షల అజమాయిషీకై ఏ దేశంలోనైనా ఎన్నిసార్లు స్థలపరిశీలన జరపవచ్చుననే సమస్యపై అంగీకారం కుదరలేదు. ఐదు సార్లు స్థలపరిశీలన జరపడానికి తాము అంగీకరిస్తామని అమెరికావారు సమా వేశంలో అన్నారు. అయితే మూడుసార్ల కన్నా ఎక్కువగా స్థలపరిశీలన జరపడానికి తాము ఒప్పుకోమని రష్యావారు అన్నారు. ఈ సమస్యపై ఉచిత పరిష్కార మార్గాన్ని అన్వేషించడానికి భారతదేశంతో సహా ఇతర తటస్థ రాజ్యాలు కృషిచేస్తున్నాయి.

వాతావరణంలోనూ, భూమిపైనా, భూగర్భంలోనూ అణ్వస్త్ర పరీక్షలను నిర్వ హించవచ్చు. మొదటి రెండు రకాలైన పరీక్షలను కనిపెట్టడంలో కష్టమేమీ లేదు. అయితే మూడవ రకంలో అది భూకంప మైనదీ వేరైనదీ తెలుసుకోవడం చాలా కష్టం. అందుకే స్థలపరిశీలన అవసరమవు తుంది. నిరాయుధీకరణ మొత్తం యీ సమస్యా పరిష్కారంపై ఆధారపడి ఉంది.

ఈ సమస్యపై అంగీకారం కుదరని పక్షంలో మానవుడు ఊహించలేని పరమ భయంకరమైన ఆయుధమని చెప్పబడే న్యూట్రన్ బాంబును తాము తయారు చేస్తామని అమెరికా ప్రకటించింది.

సహారాలోని భూగర్భంలో ఫ్రాన్సు ఇటీవల జరిపిన అణ్వస్త్ర పరీక్షకు ప్రపంచం యావత్తు నిరసన తెల్పడం యీ సందర్భంలో పేర్కొనదగిన విషయం.

సిరియాలో విప్లవం

ఇరాక్‌లో విప్లవం జరిగిన నెలరోజులకు మరో విప్లవం ఇప్పుడు రక్తపాత రహితంగా సిరియాలో జరిగింది. సిరియా సైనికాధి కారులు మార్చి 8 వ తేదీన ప్రధాన మంత్రి ఖలీద్–ఇల్–అజం నుంచి ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకున్నారు. ఆయన టర్కీ రాయబారి కార్యాలయంలో శరణు జొచ్చి టర్కీలో రాజకీయ ఆశ్రయం పొందాడు.

అరబ్ ఐక్యత, తటస్థ విధానం తమ విధానాలని సైన్యం ప్రకటించింది. శ్రీ సలాహ్‌బితర్ ప్రధాన మంత్రిగా నియమింప బడ్డారు.

1959 వ సం॥ లో మొదట సిరియా, ఈజిప్టుతో కలిసి సంయుక్త అరబ్ రిపబ్లిక్‌ను ఏర్పాటు చేసింది. కాని 1961 వ సం॥ లో ఏక పక్షంగా యీ యూనియన్ నుంచి అది తెగతెంపులు చేసుకుంది.

మొత్తం అరబ్ దేశాలలో కచ్చితంగా నాసర్ అనుకూలత ఉన్నదని ఇటీవలి యీ సంఘటన సూచిస్తుంది. సిరియా, యు. ఎ. ఆర్. అల్జీరియా, ఎమెన్ దేశాలతో–ఐదు రాజ్యాల సంయుక్త అరబ్ కమాండ్‌ను ఏర్పాటు చేయాలని ఈ ఇరాక్ ప్రతిపాదించింది. ఏదో విధమైన అరబ్ దేశాల ఫెడరేషన్ ఏర్పడాలనే విషయం ఈజిప్టు, ఇరాక్, సిరియా నాయకుల మధ్య ఇటీవల జరిగిన చర్చలవల్ల ద్యోతక మయింది.

త్యాగాలతో కూడిన బడ్జెటు

ప్రస్తుతం మన లోకసభ పరిశీలనలో ఉన్న కేంద్ర బడ్జెటు, ప్రజలలోని దాదాపు అన్ని వర్గాలలో తీవ్రసంచలనాన్ని కలిగిస్తుందనడంలో ఆశ్చర్య మేమీ లేదు. అనేక విషయాలలో యీ బడ్జెట్ చాలా అపూర్వమైనదనడంలో సందేహం లేదు. ప్రస్తుత బడ్జెటులో భారత పన్నుల చెల్లింపుదారులపై వేసిన బరువు బాధ్యతలు స్వాతంత్ర్యం అనంతరం వచ్చిన బడ్జెట్లు సమానం కావు. రాష్ట్రస్థాయిలో వేసిన పన్నులను భరించాల్సిన భారంతో కలుపుకుని భారత పన్నుల చెల్లింపుదారుల జేబులపై పడిన మొత్తం భారం నిజంగానే ఎక్కువగా ఉంది.

అయితే యీ చర్యతీసుకోవడానికి కారణభూతమైన పరిస్థితికూడా తక్కువ అపూర్వమైనదేమీ కాదు. స్వతంత్ర భారత చరిత్రలో ఎప్పుడూ ఇంతటి ప్రత్యక్ష విదేశీయ దురాక్రమణను మనం ఎదుర్కొనలేదు. శతాబ్దాల తరబడి దేనికొరకు మనం కట్టుబడి ఉన్నామో దానికి ప్రమాదం ఏర్పడింది. ఈ నాడు అవసరమైనంత దేశభక్తి, త్యాగం, సవాల్‌ను ఎదుర్కోవాల్సిన ధైర్యం, గత 15 సంవత్సరాలలో ఎప్పుడూ అవసరం కాలేదు.

అందరి ఆదాయాలలో చెప్పుకో దగిన మొత్తాలను వదులుకోవలసి వస్తుందనే భయం మొట్టమొదటగా కలగడం సహజం. దేశరక్షణకై తప్పనిసరిగా వహించాల్సిన యీ భారాన్ని గుర్తించి ప్రజలు మానసికంగానూ, ఇతరత్రానూ సరిపుచ్చుకోవడానికి కొంత సమయం పడుతుంది. భారత–చైనా సరిహద్దు వివాదం ఇటీవలి పరిస్థితి చాలా అశుభసూచకంగా ఉంది. వాస్తవంగా చైనా పరిపాలకులు కొలంబో ప్రతిపాదనలను ఆమోదించడానికి నిరాకరించారు. అంతేగాక బహుశా వసంత ఋతువులో తిరిగి దాడి జరపే తలంపుతో భారీ ఎత్తున సరిహద్దులపై సైన్యాలను కేంద్రీకరిస్తున్నారు. ఈ విషయాలన్నీ తెలిసి కూడా వారికి మరో వీలు కల్పించడం మనకు సాధ్యం కాదు. అప్రమత్తతతో ఉన్న జాతిని ఎట్టి పరిస్థితులలోనూ ఎవరూ మోసగించలేరు. చైనాతో వివాదం, ఆదర్శాలు, విలువలపై వివాదమే. దీనికి ఎన్నో త్యాగాలు అవసరం. త్యాగాలు చేయడం వినా భారత ప్రజలకు వేరుమార్గం లేదు. వారు త్యాగం చేయాల్సిందే. అయితే వారు ఎంతటి ఉత్సాహంతో యీ త్యాగం చేస్తున్నారన్నదే అతి ముఖ్యమైన విషయం. ఈ ఉత్సాహమే జాతి నైతిక శక్తిని నిర్మిస్తుంది. ఈ ఉత్సాహమే మనకు తుది విజయాన్ని చేకూర్చుతుంది.

పన్నులకు వ్యతిరేకంగా ప్రజలు కొంత కాలం నిరసనలు రేకెత్తించడం సుళువే. కాని పన్నులకు మారుగా ఇతర మార్గాలను అన్వేషించడం వేరే విషయం. అయితే తుదకు స్వాతంత్ర్యం, త్యాగం ఒకవైపు, బానిసత్వం, భాగ్యం మరోవైపు ఉండి రెండింటిలో దేన్ని వరించాలన్న సమస్య ఎదురైనప్పుడు భారత ప్రజల కోరిక ఎప్పుడూ సందేహాస్పదంగా ఉండదు.

సమాజాభివృద్ధి కార్యక్రమ సంపూర్తి

ఇప్పుడు మొత్తం దేశానికి సమాజాభివృద్ధి కార్యక్రమాన్ని వర్తింపచేయడం జరిగింది. 1952 వ సం॥ లో సమాజాభివృద్ధి కార్యక్రమం మొదటిదశను ప్రారంభించి నప్పటినుంచి యీ 'శాంతియుత విప్లవం' ఎన్నో కష్టాలను ఎదుర్కొని, ఎన్నో రూపాలనూ, మార్గాలను అవలంబించింది. అయితే ప్రజలలో స్వయం సహాయం, ఆత్మవిశ్వాసం కలిగింపచేయడమే దీని ప్రధానోద్దేశంగా ఉంటూ వచ్చింది. 1959 వ సం॥ నుంచి అనేక రాష్ట్రాలలో పంచాయితీరాజ్‌ను ప్రవేశపెట్టడం జాతీయ జీవనాన్ని ప్రజాస్వామ్యంగా మార్చే మార్గంలో మైలురాయిగా నిలుస్తుంది. భారతదేశం ఇప్పుడు పంచాయతీ నుంచి పార్లమెంటువరకూ ఆపాదమస్తకం ప్రజాస్వామ్యమయం.

అయితే సమాజాభివృద్ధి ఎప్పటికీ పూర్తి అయ్యే పనికాదు. యీ కార్యక్రమం వరుసగా కొనసాగేది. ఇప్పుడు పూర్తిఅయిన సమాజాభివృద్ధి కార్యక్రమం కేవలం నిర్మాణపు విస్తరణ మాత్రమే. ఒక విధంగా ఇది సమాజాభివృద్ధికి ప్రారంభం మాత్రమే. సామాన్య మానవ సౌకర్యాలయిన మంచి నీటి బావులు, పాఠశాలలు, రోడ్లు మొదలైనవి మాత్రమే. ఇంతవరకు యీ కార్యక్రమంలో ముఖ్యంగా చేర్చబడ్డాయి. పరిమిత దశగల యీ కార్యక్రమంకూడా ఇంకా పూర్తికావల్సి ఉంది. సౌకర్యాలను కల్పించే కార్యక్రమం పూర్తిఅయిన తర్వాతనే ప్రజల పురోభివృద్ధి ప్రారంభమవుతుంది. భారతదేశంలోని ప్రతి గృహం స్వాతంత్ర్యానికి, ప్రజాస్వామ్యానికీ దుర్గం అయినప్పుడూ, జాతి అభీష్టజ్యోతిని ప్రతి పౌరుడూ తన హృదయంలో వెలిగించినప్పుడూ మాత్రమే భారతజాతి 'అభివృద్ధి' చెందిందిగా భావించబడుతుంది. ★

మన గృహనిర్మాణ పథకాలు

ఆలపాటి వెంకట్రామయ్య

అఖిలభారత స్థాయిలో

తినడానికి తిండి, కట్టుకోడానికి గుడ్డ, తరువాత మానవునికి అవసరమయింది ఇల్లు. ఇంటినిచూసి ఇంటి యజమాని స్థితిగతులను అంచనా వేయవచ్చునన్నది మన సామెత. దీన్నిబట్టిచూస్తే, ప్రణాళికాబద్ధంగా మనం చేయవలసిన కృషి ఎంత ఉన్నదో సుమారుగా మనం అవగాహన చేసుకొనవచ్చు.

భారతదేశంలోని ప్రజానీకం ఎక్కువ భాగం గ్రామసీమలలో నివసిస్తున్నారు. ఈ గ్రామాలను, మొన్నమొన్నటిదాకా మూచూసినవారేలేరు. స్వాతంత్ర్యం పొందిన తరువాత, అభివృద్ధి కార్యక్రమాల అమలు కోసం, పంచవర్ష ప్రణాళికలు ప్రారంభించు కొన్న తరువాత, గ్రామసీమల రూపురేఖలు మారిపోవడం ఆరంభమయింది.

భారతదేశం మొత్తంమీదగల అన్ని గ్రామాలలోనూ, 5,40,00,000 ఇండ్లు ఉన్నాయి. ఐతే ఇవన్నీ సరైన స్థితిలోలేవు. ఇందులో 5,00,00,000 ఇండ్లు పునర్నిర్మించడంగానీ, లేదా పూర్తిగా మరమ్మతులు చేసుకోవలసిగానీ ఉంటుంది.

ఇప్పటి గ్రామసీమలలోని ఇండ్లకు ఆధునిక సౌకర్యాలేమీ లేవు. కనీస సదుపాయాలు కూడా అన్నిచోట్లా లేవు. 85 శాతం ఇండ్లు గచ్చుముఖం ఎరగకుండా దుమ్ము, దూగరతో నిండి ఉన్నాయి. 83 శాతం ఇండ్ల గోడలు, మట్టితో నిర్మితమయ్యాయి. 70 శాతం ఇండ్లమీద, గడ్డి, రెల్లు, పొనుగు, తాటాకు, మొదలయిన కప్పు ఉన్నాయి. గచ్చు చేయబడిన నేలలు, ఇటుక గోడలు వుండి పెంకులతోగానీ, రేకులతోగానీ వేసిన కప్పులున్న ఇండ్లు ఏడు శాతానికి మించిలేవు.

ప్రథమ పంచవర్ష ప్రణాళికాకాలంలోనే గ్రామసీమలలోని గృహ నిర్మాణ సమస్యలను గురించి, ప్రణాళికారచనాసంఘం వారూ, కేంద్ర ప్రభుత్వమూ ఆలోచించడం జరిగింది. కానీ తగినంత పెట్టుబడి లేక పోవడంవల్ల, అప్పట్లో గ్రామీణ గృహ నిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించడానికి అవకాశం లేకపోయింది.

రోడ్లు, మురుగునీటి పారుదల, మంచి నీటి సరఫరా, మరుగుదొడ్లు, ఆటస్థలాలు, పాఠశాలలు, వైద్యాలయాలు, విద్యుత్ సరఫరా మొదలయిన అంశాలను మినహాయించి, కేవలమూ, గృహనిర్మాణ పథకాలు మాత్రమే అమలుచేయాలనుకొన్నప్పటికీ, 25,000 కోట్ల రూపాయలను మనం వెచ్చించవలసి ఉంటుంది. ఇంత పెట్టుబడిని మనం ఒకేసారి సమకూర్చుకోగలమా ? ప్రస్తుతం అది సాధ్యపడదు. అందువల్లనే గ్రామీణ గృహనిర్మాణ కార్యక్రమం, ఒక్క ఉదుటున కాకుండా అంచెలవారీగా అమలు పరచడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

1957 వ సంవత్సరం ఆగస్టు మాసంలో మొట్టమొదటిసారిగా "గ్రామీణ గృహ నిర్మాణ పథకం" ప్రారంభించబడింది. ఇందులో ప్రధానమైన అంశాలు నాల్గున్నాయి.

1. ఒక గృహం, ఆధునిక పద్ధతులమీద నిర్మించుకోవడానికి కావలసిన మొత్తం డబ్బును యీ పథకంక్రింద కేటాయించడం జరగదు. నిధులు తక్కువగా ఉండటంవల్ల, యీ పథకంక్రింద లభించే ఆర్థిక సహాయం, కనిష్ఠ స్థాయిలో ఉంటుంది.

2. సహాయం పొందిన గ్రామస్తులు, తాము తీసుకున్న అప్పులను, వాయిదాల రూపంలో తిరిగి చెల్లించాలి. ఈ చెల్లింపులు వారికి ఇబ్బందిగా ఉండకూడదు.

3. గృహ నిర్మాణం, గ్రామ పునర్నిర్మాణం, దశవర్ష ప్రణాళికా కార్యక్రమంగా పరిగణించి అమలుపరచడం. ఇలా చేయడంవల్ల, ఇతర అభివృద్ధి పథకాలతో బాటుగా, గృహనిర్మాణ కార్యక్రమం కూడా, క్రమానుగతంగా ఆచరణలోకి వస్తుంది.

4. స్థానికంగా దొరికే గృహ నిర్మాణ సామగ్రులనే వాడుతూ, గ్రామీణుల రాబడులకు అందుబాటులో ఉండేలాగా ఇండ్లను కట్టడం.

ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం కోసం ఒక్కొక్క పంచాయతీ సమితి ప్రాంతంనుండి నాలుగు నుండి ఆరు గ్రామా

లను ఎన్నుకోవడమవుతుంది. ఇలా ఎన్నుకోబడిన 5,000 గ్రామాలలో ప్రప్రథమంగా యీ కార్యక్రమాన్ని అమలుపరచేందుకు నిశ్చయించింది ప్రభుత్వం.

ఈ గృహనిర్మాణం ఏయే పద్ధతులమీద జరగాలో, ఇందులో వాడుక చేయవలసిన వస్తువు లెలాంటివో, యీ కార్యక్రమాన్ని అమలుపరచే సిబ్బందికి ఎటువంటి శిక్షణ అవసరమో, ప్రభుత్వం రూపొందించింది. వివిధ విషయాలకు సంబంధించిన పరిశోధనలు జరపడానికీ, సిబ్బందికి అనుపైన శిక్షణ ఇవ్వడానికిగాను, ఢిల్లీ, రూర్కీ, హౌరా, చండీఘర్, ఆనంద్, బెంగుళూరులలో పరిశోధనా శిక్షణా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటిని ప్రారంభించేందుకూ, నిర్వహించేందుకూ ఫోర్డు ఫౌండేషన్ సంస్థవారు 98,500 డాలర్ల గ్రాంటును మంజూరు చేశారు. ఇదికాక, ఆ మధ్య, మరో 2,00,000 డాలర్లను పరిశోధన ప్రదర్శన గృహాలు ఏర్పాటు చేయడానికని యీ సంస్థవారే గ్రాంటును మంజూరు చేశారు.

ఈ పథకంక్రింద వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు క్రొత్తగా ఇండ్లు కట్టుకోవడం కోసమైతేనేం, ఉన్న ఇండ్లను బాగుచేసుకోడానికైతేనేం, 353.71 లక్షల రూపాయలను కేటాయించడం అయింది. 31,600, పైచిలుకు గృహాలకు మంజూరు లభించింది. 2,500 గ్రామాలలో సర్వే కార్యక్రమం పూర్తయింది. 2,200 గ్రామాలలో, ఎలా, ఇండ్లు కట్టవలసిందీ ప్లానులు తయారయ్యాయి.

1962 జూలై మాసంలో, మైసూరులో కేంద్ర వర్క్సు, గృహనిర్మాణం, సరఫరా మంత్రిత్వశాఖవారి ఆధ్వర్యాన, ఒక గోష్ఠి జరిగింది. ఇందులో క్షేత్ర సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామ ప్రాంతాలలో గృహనిర్మాణ కార్యక్రమాలను అమలు జరుపుతున్నప్పుడు, ఎదుర్కొనవలసివస్తున్న ఇబ్బందులను గురించీ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలతో బాటుగా, గృహనిర్మాణ కార్యక్రమాన్ని కూడా సమన్వయం చేయవలసిన ఆవశ్యకతను గురించీ, యీ సమావేశంలో క్షుణ్ణంగా పరిశీలించడమయింది.

వ్యవసాయ కార్మిక కుటుంబాల కోసం ఇండ్లు కట్టుకోవడానికి అవసరమయ్యే స్థలాలను సంపాదించడం, వాటిని బాగుచేయడం మొదలయిన పనుల కోసం, మూడవ ప్రణాళికాకాలంలో 5,00,00,000 రూపాయలను గ్రాంటుగా ఇచ్చేందుకుగాను భారత ప్రభుత్వం ఆలోచిస్తున్నదని, శ్రీ మెహర్ చంద్ ఖన్నా ఆ సమావేశంలో వెల్లడించారు.

రాష్ట్ర స్థాయిలో

గ్రామీణ గృహ నిర్మాణ పథకం స్వయం సహాయకమయిన సహాయ పథకమని చెప్పుకోవచ్చు. రాష్ట్రమంతటాగల పంచాయతీ సమితులనుండి కొన్ని గ్రామాలను ఎన్నిక చేసుకొని, ఆయాచోట్ల యీ కార్యక్రమాలను అమలు జరుపుతారు.

ఇందుకు కావలసిన మొత్తాలను కేంద్రం, రాష్ట్రప్రభుత్వాలకు అప్పు రూపంలో మంజూరు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం, వివిధ పంచాయతీ సమితుల అవసరాలను మదింపుచేసి, వారికి ఋణాల రూపంలో కేటాయిస్తుంది. పంచాయతీ సమితి పాలకవర్గం, తమ ప్రాంతంలోని వివిధ గ్రామాల అవసరాలను పరిశీలించి, యోగ్యులైనవారికి, అవసరమున్న వారికి అప్పు లిస్తుంది. ఒక్కొక్క వ్యక్తికి 2,000 రూపాయలు మించకుండా అప్పులు ఇవ్వబడతాయి.

మూడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో కేంద్రం, మన రాష్ట్రానికి 91.00 లక్షల రూపాయలను కేటాయించింది. నిజానికీ మొత్తం మనకు ఎంతమాత్రం చాలదు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ డైరెక్టరు, అదనంగా 200.00 ల లక్షల రూపాయలు కావలసి ఉంటుంది అని తెలియజేశారు. ఐతే ప్రస్తుత పరిస్థితులలో అంత మొత్తాన్ని మంజూరు చేయడం సాధ్యపడదు. రాష్ట్ర మూడవ ప్రణాళికా వ్యయమే 305 కోట్ల రూపాయల మేరకు సవరించవలసి వచ్చింది. కేంద్రం, ఇటీవల మన రాష్ట్ర ప్రభుత్వానికి యీ విషయమై వ్రాస్తూ, తక్కువరాబడి వర్గాలవారి గృహ నిర్మాణ పథకాలు, గ్రామీణ గృహనిర్మాణ పథకాలను అమలు చేయడం కోసం, జీవితభీమా సంస్థ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులను మంజూరు చేసేందుకు అంగీకరించినట్లు తెలియజేసింది.

అన్ని రాష్ట్రాలకు కలిపి, తక్కువ రాబడి వర్గాలవారి గృహ నిర్మాణం కోసం 6,00,00,000 రూపాయలు, గ్రామీణ గృహ నిర్మాణ పథకాల కోసం 2,00,00,000 రూపాయలు ఇవ్వడానికి జీవితభీమా సంస్థ నిర్ణయించింది.

"గ్రామాలు నశిస్తే భారతదేశం నశించినట్లే" నన్నారు మన బాపూజీ. స్వచ్ఛమైన భారతీయ జీవన విధానానికీ, సంస్కృతికీ, గ్రామాలు ఆయువుపట్టుల్లాంటివి. అనేక వందల సంవత్సరాలపాటు, గ్రామ సీమలను గురించి శ్రద్ధతీసుకున్న వారు లేకపోయారు. ఇది కారణంగానే, ఇప్పుడు మనకు — గ్రామాభివృద్ధి, గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమాలు, క్లిష్ట సమస్యలుగా తయారయ్యాయి. అడుగడుగునా ఎన్నో ఇబ్బందులను మనం ఎదుర్కోవలసి వస్తోంది. ఈ కార్యక్రమం అనుకున్నంత సులభం కాని మాటలు నిజమే. కానీ, మనం విజయం సాధించగలం. సుదీర్ఘమయిన యీ ప్రయాణంలో మన మిప్పుడే నడక ప్రారంభించాం. గమ్యం చాలా దూరాన ఉన్నది. దాన్ని చేరుకోవడానికి, ఎన్నో అడ్డంకులు అడుగడుగునా ఎదురవుతున్నాయి. వాటిని ఓర్మితో అధిగమించ గలిగినప్పుడే, మనం పూర్తి ఫలితాన్ని పొందగలం.

పారిశ్రామిక కార్మికుల గృహ నిర్మాణ పథకాలు

ఏ దేశపు సిరిసంపదలైనా, అక్కడి వ్యవసాయ విధానాలమీదా, పారిశ్రామిక రంగం మీదా ఆధారపడి ఉంటాయి. వ్యవసాయ క్షేత్రాలు, ఫ్యాక్టరీలు పనులు మానివేస్తే వారి జీవితం స్తంభించిపోతుంది. దేశసంపదను అనుక్షణం పెంపొందచేస్తున్న రంగాలు-ముఖ్యంగా ఇవి రెండే ననడంలో సందేహం లేదు. అంటే మిగతావేవీ, ఇందులో భాగం పంచుకోవడం లేదని నా భావం, కాదు. ఈ రెండు రంగాలూ ప్రాతిపదిక రంగాలని మాత్రమే నా అభిప్రాయం.

అనేక కారణాలవల్ల అటు వ్యవసాయదారులు, ఇటు పారిశ్రామిక కార్మికులు, ఇతర వర్గాలచేత అమానుషంగా దోచుకోబడ్డారు. ఏళ్లెల్లకాలమూ మట్టిలోబడి కొట్టుకునే వ్యవసాయదారుడు దుర్భరమైన లేమితో సతమతమవుతున్నాడు. యంత్రభూతాల కోరలతో చెలగాటాలాడే కార్మికుడు, చాలీచాలని జీతంతో కుంగిపోతున్నాడు. లక్షలాదిమంది పనివారు, నిలువడానికి నీడ లేక అల్లాడిపోతున్నారు. వీరికి తగిన గృహవసతి చూపించవలసిన బాధ్యత దేశం మీద ఉంది. దేశం వీరినుండి లాభం పొందుతోంది. మరి వీరి కేమిస్తున్నట్లు? ప్రతివారూ ఆలోచించి, సమాధానం చెప్పుకోవలసిన ప్రశ్న ఇది.

ఈ ఉద్దేశంతోనే రాష్ట్రప్రభుత్వం పారిశ్రామిక కార్మికులకు, ఇండ్లను నిర్మించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. కేంద్ర సహాయంతో నిర్వహింపబడుతున్న యీ పథకంద్వారా కార్మికుల కోసం, చౌకగా ఇండ్లు కట్టడం జరుగుతోంది. ఫ్యాక్టరీ చట్టాలు అన్వయించే అన్ని సంస్థలలోని సిబ్బందీ, ఈ పథకం క్రిందికివస్తారు. ఐతే వీరిలోనుండి అభ్రకం పరిశ్రమలోనూ, బొగ్గు పరిశ్రమలోనూ పనిచేసే కార్మికులను మినహాయించవలసి ఉంటుంది.

ఈ కార్యక్రమం అమలు జరపడం నిమిత్తం, కేంద్ర ప్రభుత్వంవారు, అప్పుల రూపంలోనూ, గ్రాంటురూపంలోనూ రాష్ట్రాలకు సహాయపడుతున్నారు. రాష్ట్రప్రభుత్వం, ఆయా పరిశ్రమల యజమానులకు, కార్మిక సహకార సంఘాలకు, గృహనిర్మాణాల నిమిత్తం, డబ్బును కేటాయిస్తోంది.

మూడవ ప్రణాళికా కాలంలో, యీ కార్యక్రమాలకుగాను, 81,00,000 ల రూపాయలు కేటాయించబడ్డాయి. ఈ మొత్తం నుండి 1961-62 వ సంవత్సరంలో 14.67 లక్షల రూపాయలతో ఇండ్లు కట్టడమైంది. 1962-63 వ సం॥ లో 12.15 లక్షల రూపాయలు ప్రత్యేకించ బడ్డాయి.

కార్మికులకుగాను ఇండ్లు నిర్మించేటప్పుడు, ప్రధానమైన రెండు విషయాలు దృష్టిలో ఉంచుకో బడ్డాయి.

మొదటిది : ఇంటి నిమిత్తం కార్మికుడు చెల్లించవలసిన డబ్బు అతన్ని ఇబ్బంది పెట్టేదిగా ఉండకూడదు. రెండవది: కనీస సదుపాయాలకు లోపంకూడా వుండకూడదు.

అందువల్లనే, ఒంటి గదులనీ, రెండు గదులనీ ఇండ్లు కట్టేందుకు నిర్ణయించడమైంది. ఇవి ఒకే అంతస్థువి. 1957 జూలై 17 వ తేదీనుండీ, ఈ ఇండ్ల ఖరీదులను ఈ క్రింది విధంగా నిర్ణయించారు.

1. ఒంటిగది ఇండ్లు ఒకే అంతస్థువి ఒక్కొక్కటి...రు. 3,300 లూ,

2. రెండు గదుల ఇండ్లు ఒకే అంతస్థువి...రు. 3,800 లూను.

ఆ దరిమిలా ఈ ఖరీదులను తప్పని సరిగా మార్చవలసి వచ్చింది. గృహనిర్మాణ వస్తువుల ధరవరలు పెరిగిపోవడం, స్థలాల ఖరీదు హెచ్చడం, నిర్మాణ వ్యయం పెరగడం వగైరా కారణాలవల్ల, 1961 వ సంవత్సరం, ఏప్రెల్ మాసంనుండీ, ఒంటిగది ఇంటి ఖరీదు రు. 3,300 ల నుండి, రు. 3,650 ల దాకానూ, రెండు గదుల ఇంటి వెల రు. 3,800 ల నుండి రు. 4,250 ల దాకానూ పెంచడమయింది.

పారిశ్రామిక గృహనిర్మాణ పథకం, రాష్ట్ర ప్రభుత్వంద్వారానూ, హౌసింగ్‌బోర్డు ద్వారాను, ప్రైవేటు యజమానులద్వారాను, కార్మిక సహకార సంఘాల ద్వారాను కేంద్రం అమలు జరుపుతూ ఉంది. ఆయాదశల్లో, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అప్పులు, సబ్సిడీలు ఇలా ఉంటాయి.

1. రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుపుతున్నట్లయితే, 50 శాతం అప్పురూపంలోనూ, 50 శాతం సబ్సిడీ రూపంలోనూ కేంద్రం డబ్బును మంజూరు చేస్తుంది.

2. ప్రైవేటు యజమానులు నిర్వహించే పథకాలకు 50 శాతం అప్పు రూపంలోనూ, 25 శాతం సబ్సిడీ రూపంలోనూ నిధులను ప్రత్యేకిస్తుంది.

3. కార్మిక సహకార సంఘాలు, ఈ కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు. 65 శాంత

మూడవ ప్రణాళికలో కేటాయించిన డబ్బు 91 లక్షలు

	1961-62	1962-63	1963-64	1964-65	1965-66	మొత్తం
ఒక్కొక్క సంవత్సరానికి కేటాయించిన డబ్బు —లక్షలలో—	11.03	15.60	18.20	20.80	25.37	91.00
సమగ్ర ప్రణాళికలు తయారు చేసుకున్న గ్రామాలు	45	50	50	50	50	245

(మిగతా 86 వ పేజీలో)

వెలుగు బాటలు

కె. వి. భాస్కరరావు

ఆవేశంతోనో, అనాలోచనతోనో, ఎంతటి మానవుడైనా ఒక్కొక్కసారి తప్పు చేస్తూనే ఉంటాడు. పరిస్థితుల ప్రభావంకూడా యిందుకు తోడ్పడుతుంది. ఐతే ఆ కాస్త పొరపాటు జరిగాక అతని మనసు ఎంతో క్షోభిస్తుంది. జరిగినదానికి అతడు ఎంతో విలపిస్తాడు. అలాంటపుడు ఏం చెయ్యాలి? వ్యక్తి చేసిన తప్పిదానికి పరిహారమేమిటి? నేరస్థుల విషయాన్నే తీసికొందాం. ఈ విషయంలో చాలాకాలంనుండి రెండువాదాలు వినవస్తున్నాయి. ఆవేశంలోచేసినా, అజ్ఞానం వల్ల చేసినా నేరం నేరమే. దానికి తగిన శిక్ష విధించడమే సరైన పద్ధతి. అంటే దెబ్బకు దెబ్బ తియ్యాలన్నదే మొదటివాదం. ఇక రెండవది సంస్కరణకు సంబంధించినది. నేరస్థుని మానసిక పరివర్తనకు తావిచ్చి అతనిలో మార్పు తేవడం దీని లక్ష్యం. మంచి, చెడ్డలనేవి ప్రతి మానవునిలోను వివిధపాళ్లలో వుంటూనే వుంటాయి. అలాంటపుడు అతనిలోని మంచిని ప్రోత్సహించినట్లైతే అటు వ్యక్తికి ఇటు సంఘానికికూడ ప్రయోజనం కల్గుతుంది. అందువల్లే నేరస్థుని శిక్షను నిర్ణయించేటపుడు నేరంలో అతని అంతరార్థానికి అధికంగా ప్రాముఖ్యమీయబడుతుంది. ఆత్మరక్షణకో, క్షణికావేశంలోనో ఒక నేరం జరగవచ్చు. బుద్ధి పూర్వకంగాను, ప్రయోజనంకోసం మరొక నేరం జరుగవచ్చు. ఈ రెండు సందర్భాల్లోనూ ఒకే దృష్టితో న్యాయ నిర్ణయం చేయలేంగదా?

నాగరికత ముందడుగు వేస్తున్నకొద్దీ సంస్కరణ వాదానికి బలం చేకూరుతోంది. అనేక దేశాలలో నేరస్థులను సత్పౌరులుగా రూపొందించేటందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కృషి మన దేశంలోకూడ ప్రారంభమైంది. నేరస్థులకు ప్రత్యేక వాతావరణాన్ని కల్పించి వారి అభిరుచుల కనుగుణమైన వృత్తులు నేర్పబడుతున్నాయి. అందువల్ల మానసికంగా వారిలో మార్పురావడమేగాక తామువిడుదలయ్యాక స్వశక్తిపై జీవించడానికి అవకాశంకల్గుతుంది. నేరాలను, నేరస్థులను తగ్గించడానికి యిది ఉత్తమ మార్గం.

ఇటీవల మనరాష్ట్రంలోని ఖైదీలు ఆదర్శమైనప్రవర్తన చూపారు. జాతీయ అత్యవసర పరిస్థితిలో తమ ధర్మాన్ని గుర్తించారు. దేశరక్షణలో తామూ భాగస్వాములు కాగలమని నిరూపించారు. రక్షణనిధికి తోడ్పడేటందుకుగాను తమ ఆహార పదార్థాలలో కొన్నింటిని స్వచ్ఛందంగా తగ్గించు కొంటామని జైలు అధికార్లకు తెలియజేశారు. ప్రభుత్వం వీరి విజ్ఞాపన పరిశీలించిన మీదట అందుకు సమ్మతించింది. కరీంనగర్ జిల్లా జైలులోని ఖైదీలు నాల్గువారాలపాటు ప్రతి ఆదివారం తమకిచ్చే మాంసంలో తలకు రెండున్నర చటాకులు వదలుకోడానికి నిర్ణయించుకొన్నారు.

మెదక్ జిల్లా సంగారెడ్డి జైలులోగల ఖైదీలు నాల్గువారాలపాటు ప్రతి ఆదివారం ఒక్కొక్కరికి లభించే రెండున్నర చటాకుల మాంసానికి బదులు ఒకటిన్నర చటాకుల పప్పుపదార్థాలను తీసికోడానికి తీర్మానించారు. హైదరాబాదు సెంట్రల్ జైలులోని ఖైదీలు మూడువారాలపాటు ప్రతి శనివారం ఒకపూట భోజనాన్ని వదులుకోడానికి ముందుకు వచ్చారు. వరంగల్లు సెంట్రల్ జైలులోని ఖైదీలు శనివారంనాడు ఒకపూట భోజనం మానుకోడానికి సిద్ధపడ్డారు. ఎవరెంత మానుకున్నారన్నది కాదు మనకు కావలసింది. నేరస్థులుగా పరిగణింపబడినవారు యిలా ముందుకు రావడమే విశేషం. అందులోను తమంతట తామే ఈ త్యాగాలకు సిద్ధపడడం నిజంగా గర్వింపదగ్గ విషయం.

ఖైదీల సంస్కరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలలో మౌలాలీ ఆరుబయలుజైలు చాలముఖ్యమైనది. జైళ్ళ నిర్వహణచరిత్రలోనే యిలాంటిది ప్రప్రథమంగా పేర్కొనవచ్చు. ఖైదీలను ఆరుబయలు వాతావరణంలో స్వేచ్ఛగాతిరుగనిస్తూ, వ్యవసాయ కార్యక్రమాల్లో పాల్గొనేటట్లు చేయడం దీని ప్రధానోద్దేశం. ఖైదీలు సత్ప్రవర్తనద్వారా మామూలు పౌర జీవితాన్ని పొందడానికి యిదొక ప్రయోగాత్మక పద్ధతి. హైదరాబాదుకు 14 మైళ్ళ దూరంలోగల మౌలాలీ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో ఈ ఆరుబయలు జైలు ఏర్పాటు చేయబడింది. 1954 లో ఈ కార్యక్రమానికి సుమారు 99 ఎకరాల భూమి సేకరింప బడింది. ఆ భూమి ఆనాడు బంజరుగా వుండేది. మొదట్లో హైదరాబాదులోని సెంట్రల్‌జైలునుండి ప్రతి ఉదయం 25 మంది ఖైదీలను మౌలాలీ ఆరుబయలు జైలుకు వాన్‌లో తీసికొనిపోయేవారు. అచట వారు భూమిని చదును చేయడం, అడవిని నరకడం, బావులు త్రవ్వడం మొదలైన పనులు చేశాక సాయంత్రానికి సెంట్రల్ జైలుకు తీసికొని రాబడేవారు. భూమిని బాగు చేయడం పూర్తయ్యాక తాముండేటందుకు ఖైదీలు అడవిలోని కలప

సామగ్రితో గృహాలను నిర్మించారు ఇందుకోసం ప్రత్యేకంగా ప్రభుత్వానికేమీ ఖర్చు కాలేదు. ఖైదీలు ఐదు బావులను త్రవ్వడమే గాక, ఒక చిన్న చెరువునుకూడ అచట నిర్మించారు. ఇప్పటికి దాదాపు 30 ఎకరాల భూమిని సేద్యయోగ్యంగా చేశారు. ఇందులో 10 ఎకరాలలో వరి పండిస్తున్నారు. మిగిలిన భూమిలో కూరగాయలు, పశుగ్రాసము పెంచుతున్నారు.

1957-58 సంవత్సరంనుండి ఆ క్షేత్రంలో ఖైదీలు ఫలసాయాన్ని రాబట్టడం ప్రారంభించారు. 1957-58 లో రు. 8,354-00 విలువగల ఫలసాయం రాగా, 1958-59 లో రు. 9,507-00 లు, 1959-60 లో రు. 10,354-00 లు, 1960-61 లో రు. 13,272-00 లు, 1961-62 లో రు. 22,885-00 ల ఆదాయం లభించింది. ఒకప్పుడు నిర్మానుష్యంగా వుండి, బీడుగా వున్న ఆ ప్రాంతంలో ఈనాడు ఖైదీలు నివసించడమేగాక తమ కృషిద్వారా ఆయేటి కాయేడు ఎక్కువ ఆదాయాన్ని చేకూర్చుతున్నారు.

కొద్దికాలం శిక్ష విధింపబడి ప్రవర్తన బాగున్న ఖైదీలను ఇచటికి పంపుతారు యావజ్జీవం, దీర్ఘకాలపు శిక్ష విధింపబడిన కొద్ది మంది ఖైదీలనుకూడ ఇచట వుంచేటందుకు ఎన్నికచేశారు. వీరికి కాపలాగావుండే సిబ్బందికూడ బహుస్వల్పమే. ప్రతి ఖైదీకి నెలకు రు. 1.50 స్వల్ప ఖర్చుల నిమిత్తం యిస్తారు. జైలు క్యాంటిన్‌నుండి బీడీలు, సబ్బులు, టీ మొదలైన వస్తువులను వీరు కొనుక్కోవచ్చు.

ఈ సంస్థలో వ్యవసాయం, చేపల పెంపకం మున్నగు రంగాలలో ఆధునిక విధానాలను ఖైదీలకు నేర్పుతారు. వీరు విడుదలయ్యాక ఈ వృత్తులపై స్వయంగా జీవించడానికి వీలుకల్గుతుంది. 1961-62 లో వ్యవసాయానికి కావలసిన పనిముట్లన్నీ ఖైదీలే స్వయంగా తయారుచేశారు. నీటిపారుదల, పశుపోషణ తదితర వృత్తులలో శిక్షణ నిచ్చేటందుకుకూడ కృషి జరుగుతోంది. వీరి మానసిక వికాసానికి ఆటలు, పాటలు, నాటకాలు, సినిమా ప్రదర్శనలు ఏర్పాటు చేయబడతాయి.

గత 8 సంవత్సరాలుగా ఈ సంస్థ పనిచేస్తున్న పద్ధతి ఎంతో ప్రోత్సాహకరంగా వుంది ఖైదీల ప్రవర్తనకూడ క్రమక్రమంగా అభివృద్ధి చెందుతోంది. ఈ కార్యక్రమాలను విస్తృతం చేయడంవల్ల మరింత ప్రయోజనం చేకూరుతుంది. ఆంధ్ర ప్రాంతంనుండి దీర్ఘకాలపు శిక్ష విధింపబడిన ఖైదీలలో ఎక్కువమంది వ్యవసాయ వృత్తికి చెందిన వారుగా తెలుస్తోంది. మౌలాలీలాంటి ఆరుబయలు క్షేత్రాలలో వ్యవసాయం, పశువులు, కోళ్ళ పెంపకం, చేపలు, తోట పరిశ్రమ మొదలైన వృత్తులను పెంపొందిస్తే ఖైదీల శక్తి సామర్థ్యాలను వినియోగించేటందుకు వీలవుతుంది.

సంస్కరణ దృష్టితో ప్రారంభించిన ఈ పథకాలను మన రాష్ట్రంలోని ఖైదీలు సద్వినియోగ పరచుకోడం శుభసూచకం. పరిస్థితుల ప్రభావంవల్ల ఒక్క తృటిలో జరిగిన అపచారానికి జీవితం బలికానవసరం లేదని, మానసిక పరివర్తనతో మరల మనిషిగా జీవించవచ్చునని ఈ ప్రయోగాలు ఋజువు చేస్తున్నాయి. ఏమైనా ఒక్కసారి పొరపాటు చేయడం మానవత్వం; తప్పు తెలిశాక ఆ పని మళ్ళీ చేయకపోవడం దైవత్వం. ★

వీర భారతము

యామిజాల పద్మనాభస్వామి

మంచుం గొండయటంచు నెంచితొ హిమ
క్ష్మాధ్రంబు నీ గుండెలన్
దించున్ ప్రాక్తన యోగి పుంగవ తపో
గ్ని జ్వాలలన్ గాల్చి భ
క్షించున్ నాటికపర్ది జేత చటులా
గ్ని స్ఫార రోషచ్ఛటల్
నించున్ నీపయి నిష్ఠురాశుగములన్
జేకొట్టి చైనీయుడా !

మింటికి మంట కేకమయి
మీర హరోంహర సింహగర్జనల్
కంట మిణుంగురుల్ చెదర
గా నదె భారత వీర సైన్యమున్
దంటతనాన ముందడుగునన్
బడనున్నది దారుణాస్త్రముల్
గెంటగ నిన్ను ; నీ గురునికిన్
వినిపింపుము నీదు దుస్స్థితిన్

దురహంకార విముగ్ధవర్తనము సై
దోడై నినున్ లేప ని
ష్ఠుర మాయా కవచంబు తొడ్గి కరుణా
శుంభద్గజేంద్రంబుపై
నురుకం జూచిన శ్వానమైతి విది ఓ
హో ఎంత కైలాటమో !
భరమౌ సుమ్ము గజేంద్ర ముగ్రమయినన్
ప్రాణావనమ్మాపయిన్

నరసుల్ సత్య పరాక్రమక్రము లహిం
సాధర్మ సద్వర్తనుల్
కరుణామూర్తులు భారతీయులని లో
కంబేకమై సంస్తుతుల్
నెరపన్ మెత్తని వారలంచును మదిన్
నీ వెంచి యీ వంచనన్
కరమున్ జూచుట కారుచిచ్చుపయి త్రొ
క్కం జూచుటే యౌనులే !

పండిట్జీ. జవహర్ ప్రధాని కరుణా
బంధుండు క్రుద్ధుండునై
గాండీవమ్ము ధరించినాడు జలధుల్
గర్జించు నుద్రిక్తతన్
కొండల్ బెండులుగాగ, దిగ్గజశిరః
కూటంబు మాటాడ నీ
గుండెల్ వ్రీలగ ; ఆత్మరక్షణము నీ
కున్ సాధ్యమే యీ పయిన్.

భారత ధర్మబోద్ధలు కృపారస
ముగ్గొగ నీదు జాతికిన్
నేరుపు మీర నేర్పిరి వినిర్మల
శాంతగుణమ్ము దానికిన్
వేరుగ నీవు చూపినది
నిష్ఠురతాయుత వక్రబుద్ధి
వౌర ! ప్రజా వినాశకుడ
వైతివి నీ తెలివారిపోయెనే ?

భారత వీరగాథ రిపువర్గ హృ
దంకుశమై చెలంగె నె
వ్వారును నెత్తిపై కరము
వైచిన వారలు కానరారు నీ
తీరున నూరకే యెగసి
దిగ్గున నేలకు డిగ్గజూచితే
మూరకు భారమై వగను
మోమెటు చెల్లెర నీకు దుష్టుడా

నెత్తురు త్రావువాడవయి
నెత్తికి కుంపటి నెత్త జూచితే
పొత్తును జూపుచున్ భరత
భూమికి ద్రోహము చేయ జూచినన్
మిత్తికి భృత్యువౌట సుమ
మీదు నెరుంగక కత్తి దూసితే
జిత్తులు సాగవింక నిను
ఛీయని రావలి తెల్లవారలున్

రంతుల్ మానర భారతాక్రమణ
మారంభించి యీపాటికిన్
గంతుల్ మానర భారతాధిపతితో
కయ్యానకున్ రేగుటల్
సంతాపంబున కేయటం చెరుగరా !
సయ్యాటలాదంతితో
క్రంతల్ దూరు విధంబు మానర
జగత్కల్యాణ మాసింపరా !

రక్షోనైజ గుణమ్ముతో రుధిర
సామ్రాజ్యాభిషేకమ్ముతో
అక్షుల్ మోడ్చి చరింపజూచితివే
సింహాకారుడౌ జహ్వారున్
వీక్షింపన్ దరమౌనె నీకిక ;
ఎవో నీకున్న ఆ ఆయుధాల్
రక్షింపంగలవంచు త్రుళ్ళకుము
వీరమ్మన్య ! చౌఎన్‌లయీ !

మారణకాండమే సలుప మా జవహర్ప్రభు డెంచెనేని యీ
ధారుణి దిర్దిరం దిరుగు తప్పను వార్ధులు పాదులెల్ల, హా
హా రవ ముప్పతిల్లును దిశాల గణమందు మహీధ్ర వర్గముల్
ఘోరన వ్రీలు నీ వలయమున్ గన నెంచితె చౌఎనూలయీ!

మీ ప్రేమోత్సుకత

దుర్గమమైన హిమాలయ ప్రాంతంలో ఎన్నో కష్ట పరిస్థితులలో దేశసరిహద్దులను కాపాడుతున్న వీరులైన మనసైనికులు మీరు కానుకలుగా పంపే వెచ్చని బట్టలను ఎంతో గొప్పగా పరిగణిస్తారు.

ఈ క్రింది వస్తువులను పంపండి :

ఉన్ని బట్టలు, లోపల ధరించే బనీన్లు, డ్రాయర్లు, కేప్-కంఫర్టర్లు, స్కార్ఫ్సు. మేజోళ్ళు, గ్లోవ్స్, పుల్లోవర్లు దుప్పట్లు, కాటన్ పిల్లో-స్లిప్పులు (3′ × 1½′) (తెలుపు). నూలు పక్క-దుప్పట్లు (తెలుపు) 'పజమా' సూట్లు (తెలుపు)

శస్త్ర చికిత్స కుపయోగించే కాటన్, నూలు బాండేజీలు (బూడిద, వైమానికదళనీలం, ఖాకీ బీజ్, లేక ఇతర "న్యూట్రల్" రంగులలో వుంటే మంచిది).

ప్యాకెట్లలో వున్న వస్తువుల వివరాలను ప్యాకెట్లపై స్పష్టంగా తెలపాలి. వాటిని ఈ క్రింది చిరునామాకు రవాణా చార్జీలు చెల్లించి పంపాలి.

1. అడ్మినిస్ట్రేటివ్ కమాండెంట్, హెడ్‌క్వార్టర్స్, సికింద్రాబాద్ స్టేషన్, బొలారం.

లేక

2. స్టేషన్ కమాండర్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్, బేగంపేట, హైదరాబాద్.
3. శ్రీ యం. హెచ్. కె. ఘజ్నవీ, గవర్నర్ సహాయ కార్యదర్శి, రాజభవన్, హైదరాబాద్.

చిన్న నవల

కొడవటిగంటి కుటుంబరావు

కథా సాహిత్య విభాగాలలో చిన్న నవలకు (లేక నవలికకు) ఉండే ప్రాముఖ్యాన్ని రచయితలుగాని, పాఠకులుగాని తగినంతగా గుర్తించుతున్నట్టు కనపడదు. విమర్శకులైనా నవలలకూ, నవలికలకూ పెద్దతేడా పాటిస్తున్నట్టు కనబడదు. కాని అలాటి తేడా లేకపోలేదు.

చిన్న కథకూ, నవలకూ గల తేడా సర్వత్రా గుర్తించబడుతూనే ఉంది. చిన్న కథలో ఒకేఒక జీవితఘటన చిత్రించబడుతుంది. పాత్రచిత్రణ ఉంటుందిగాని అది కూడా ఒక్క ఘటనకే పరిమితమై ఉంటుంది. చిన్న కథను Snap-shot ఫోటోతో పోల్చారు. అందులో జీవితం తాలూకు కదలికలు కనబడవు. పాత్రల మనస్తత్వాలలో పరిణామాలుండవు. ఒకటిరెండు సన్నివేశాలూ, పాత్రల మనస్సులలో కలిగే చైతన్యమూ ఉన్నప్పటికీ అవి, పైన చెప్పినట్టు, ప్రధాన ఘటనను ఆశ్రయించే ఉంటాయి. ఆ ఘటనయొక్క ప్రభావం పాత్రల చిత్తవృత్తిపై ఏ విధంగా ఉండేదీ చిత్రితమవుతుంది. ప్రధాన పాత్ర ఆశ్చర్యంతో అలానే చూస్తూ ఉండిపోవటంతోనో, ప్రియురాలు ప్రియుడి ఒడిలోకి ఒరిగిపోవటంతోనో కథ అంతమైపోతుంది.

నవలలో కదిలే జీవితం ప్రతిబింబమవుతుంది. దీన్ని సినిమా చిత్రంతో పోల్చుతారు. నవలలో అనేక సన్నివేశాలూ, అనేక సంఘటనలూ ఉంటాయి. పాత్రల చిత్తప్రవృత్తులేగాక వాటిలో కలిగే మార్పులూ, పాత్రలపై సంఘటనల ప్రభావంతోబాటు సంఘటనలకు పాత్రలు వహించే బాధ్యత కూడా స్పష్టంగా చిత్రితమవుతాయి. జీవితం తాలూకు "వాతావరణం" కూడా నవలలో ఉంటుంది. మానవుల ఆశయాలూ, ఆశయసిద్ధికి వారు చేసే కృషి, ఆ కృషికి ఏర్పడే అవాంతరాలూ, జీవిత సంఘర్షణా నవలలో విపులంగా చిత్రించటానికి వీలున్నది.

ఆ కారణంచేతనే ఎన్నో కథలు చదివినప్పటికీ తెలియని జీవిత విశేషాలు ఒక్క నవలలో తెలుస్తాయి. ఒక కాలానికి చెందిన నవలలన్నీ చదివేస్తే ఆ కాలపు సాంఘిక చరిత్ర చాలావరకు తెలిసిపోతుంది. ఈ చరిత్ర ఏ ఒక్క నవలలోనూ సమగ్రంగా ఉండటానికి వీల్లేదు. ఎందుచేతనంటే నవలాకారుడు తనకు పరిచయం అయిన వాతావరణాన్నీ, జీవితాన్నీ, పాత్రలనూ మాత్రమే సృష్టించగలడు. ఉదాహరణకు నా "చదువు" అన్న నవలలో డిప్రెషనుకు ముందు నడిచిన ఇరవై సంవత్సరాల సాంఘిక వాతావరణాన్ని చిత్రించ యత్నించాను. అదేకాలాన్ని తీసుకుని మరి ఇరవైమంది ఇరవై నవలలు రాయవచ్చు. అదే విధంగా నా "గడ్డురోజులు" డిప్రెషన్ కాలానికి సంబంధించిన నవల. ఆ గడ్డురోజులను గురించి ఎన్ని నవలలైన రాయవచ్చు.

సాంఘిక నవలల్లాగే చారిత్రక నవలలూనూ. చారిత్రక నవలల్లో గతకాలపు వాతావరణమూ, జీవితమూ, ఆచార వ్యవహారాలూ, వ్యక్తులూ, పునరుజ్జీవనం పొందుతాయి. చరిత్రకే ప్రాణం వస్తుంది. ఇటీవలి కాలంలో అడవి బాపిరాజుగారూ, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారూ, ఇప్పుడు నోరి నరసింహశాస్త్రిగారూ చారిత్రక నవలలు రచించటం జరిగింది, జరుగుతున్నది.

చిన్న కథకూ, నవలకూ గల ఈ తేడాలు మనసులో ఉంచుకుని మనం చిన్న నవలను పరిశీలించవలసి ఉంటుంది. చిన్న కథను పెంచినా, నవలను కుంచించినా చిన్న నవల అవుతుందన్న భావం ఎవరికైనా ఉంటే అది సరిఅయిన భావంకాదు. ఇలాంటి అపోహ కలగటానికి కొన్ని కారణాలు లేకపోలేదు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు "వడ్లగింజలు" కథను మొదట చిన్న కథగా రాసి తరవాత అదే కథను చిన్న నవలరూపంలో మళ్ళీ రచించారు. కాని రెండిటి స్వభావమూ ఒకటికాదు. చిన్న నవలలోకి జమీందారీ సంస్కృతీ, ఆనాటి వాతావరణమూ, ఆచారవ్యవహారాలూ చక్కగా దిగివచ్చాయి. వారి చిన్న కథ

మనని తీసుకుపోలేని వాతావరణంలోకి చిన్న నవల తీసుకుపోగలిగింది. ఇదే కథ పెద్ద నవల అయిఉండునా అంటే అది సాధ్యం కాదు. ఎందుచేతనంటే ఈ చిన్న నవలలో కూడా ప్రధానఘటన ఒకటే.

ఇదే నవలకూ, చిన్న నవలకూ ఉండే ముఖ్యమైన తేడా అని నా అభిప్రాయం. చిన్న నవలలో ప్రధాన సంఘటన ఒకటే ఉన్నప్పటికీ, ఆ సంఘటనకు కారణ భూతాలైన పాత్రల చిత్తవృత్తులకూ, వాటి చుట్టూ ఉండిన వాతావరణానికీ తగినంత ప్రాముఖ్యం ఉంటుందనిపించినప్పుడు చిన్న కథ రాయటం కంటె చిన్ననవల రాయటం మంచిది. పాత్రలపైన సంఘటనల ప్రభావంకన్న సంఘటనలపై పాత్రల ప్రభావం హెచ్చుగా ఉన్నట్టు చిత్రించటానికైనా చిన్న నవల బాగా ఉపకరిస్తుంది.

పైన చెప్పిన ''వడ్లగింజలు" కథే తీసుకుందాం. ఒక రాజుగారు ఒక చదరంగపు ఆటగాడితో పందెంవేసి ఆడి ఓడిపోతాడు. పందెం ప్రకారం చదరంగపు బల్లమీదిగళ్ళన్నిటికీ రెట్టింపు వడ్లగింజలుఇస్తూ రావలసి వచ్చేసరికి రాజుగారికి తన ఓటమి ఎలాటిదో అర్థమవుతుంది. ఈ కథ చిన్నకథగా రాస్తే రాజుప్రధానపాత్ర అవుతాడు. ఓటమియొక్క ప్రభావం అతన్ని ఏం చేసిందో మనకు తెలుస్తుంది. కాని చిన్న నవలలో శంకరప్ప ప్రధానపాత్ర. అతను పని బెట్టుకుని ఈ సంఘటనకు బీజం వేస్తాడు.

మనిషి శరీరతత్వంపైన అనుక్షణమూ వాతావరణంలోని మార్పుల ప్రభావం ఉంటున్న విధంగా, మనిషియొక్క మనస్తత్వంమీద సాంఘిక వాతావరణంయొక్క ప్రభావం ఉంటూనే ఉంటుంది. ఇది బహుసున్నితమైనది. కాల ప్రవాహం ఈ వాతావరణాన్ని మార్చేస్తూ ఉంటుంది. మనుష్యుల జీవితాలలో ఈ వాతావరణం నిర్వహించే పాత్రకు ఎంతైనా ప్రాముఖ్యం ఉన్నది.

అయితే ఈ వాతావరణం చిన్న కథలలో దాదాపు ఏమీ ప్రతిబింబించదు. అందుచేత రెండు మూడు దశాబ్దాల క్రితం రచించిన కథలు ఈనాడు చదువుతూంటే అవి మన మనస్సును "స్పృశించ'' లేవు. అంతకన్న పాత నవలలే అయినప్పటికీ అవి చదువుతూంటే మనం ఆ వాతావరణంలోకి వెళ్ళిపోయి ఆయా పాత్రల చిత్తవృత్తులనూ, వారికి కలిగే ప్రేరణలనూ సానుభూతితో చదివి ఆనందించగలుగుతాం. ఇలాటి సౌకర్యం చిన్న నవలలలోకూడా ఉంటుంది.

"రీడర్స్ డైజెస్ట్'' లాటి పత్రికలలో నవలలను సంగ్రహపరిచి ప్రచురిస్తారు. అంత మాత్రంచేత అవి చిన్న నవలలైపోవు. నవలకుగాని చిన్న నవలకుగాని ప్రమాణం ప్రధానంకాదు—విషయ విశ్లేషణా, రచనా విధానమూ ముఖ్యం. అంత మాత్రాన రెండు పేజీలలో నవల రాయవచ్చుననీ, నూరు సంవత్సరాల కథను చిన్న నవలగా రాయవచ్చుననీ కాదు.

చిన్న కథల్లోలాగే చిన్న నవలలో కాల ప్రమాణం పరిమితంగా ఉండటం మంచిదని నా విశ్వాసం. జీవితాన్ని వివరంగా చిత్రించే అవకాశం చిన్న నవలలో అట్టే ఉండదు. కాని సాంఘిక వాతావరణాన్ని చిత్రించే అవకాశం బాగా ఉంటుంది. పాత్రలను ఈ వాతావరణం ఎంతకాలమైనా సజీవంగా ఉంచుతుంది. చిన్న కథల్లాగా చిన్న నవలలు పాతబడిపోవు. కథలోని సంఘటనలకు పాత్రల బాధ్యత ఏపాటి ఉన్నదీ, పాత్రల చిత్తవృత్తులకు ప్రేరకాలేవైనదీ, ఆయా పరిస్థితుల్లో ఆయా పాత్రలు చేసిన తప్పులేవో, ఒప్పులేవో పాఠకుడికి స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. చిన్ననవలల్లో సాంఘిక చరిత్ర చెప్పకోదగినంతగా ప్రతిబింబితం కాకపోవచ్చుగాక, కాని అవి జీవితం తాలూకు డాక్యుమెంటరీ చిత్రాల్లాగా ఉండిపోతాయి. వాటికి గల ఈ ప్రాముఖ్యాన్ని రచయితలూ, పాఠకులూ, విమర్శకులూ గ్రహించాలి.

మొపాసా ఒక అతిచిన్న నవల రాసినట్టు జ్ఞాపకం. అందులో ఒక మనిషి జీవితమంతా చిత్రించాడు. చిన్నదే అయినప్పటికీ అది నవలే. టాల్‌స్టాయ్ మొదలైన రష్యను రచయితలు అనేక చిన్న నవలలు రచించారు. ఇటీవల ఒక తెలుగు పత్రికలో ఒక కథ చదివాను; అది తల్లిపుట్టుకతో ప్రారంభమై కూతురి చావుతో అంతమవుతుంది. న్యాయంగా ఇది నవలగా రచించి ఉండవలిసింది. ఒకపాత్రయొక్క జీవితంలో అనేక దశలూ, ఆపాత్రయొక్క మనస్థితిలో ఎన్నో పరిణామాలూ చిత్రించ దలచినప్పుడు దాన్ని నవలగానే రాయటం మంచిది. నేను రచించిన ''ఆడజన్మ" అట్టే పెద్దదికాదు. నేను రచించిన ఇతర చిన్ననవలల ప్రమాణంలోనే ఉన్నది. అయినా అది నవల. నా ''సవతి తల్లి'' నవలకాదు — పెద్దకథ మాత్రమే.

పెద్దకథకూ చిన్న నవలకూ తేడా చెప్పటం కొంచెం కష్టం. నేను రచించిన "లేచిపోయిన మనిషి'' పెద్దకథ కాదు, చిన్న నవల. నేను ముందే చెప్పినట్టు, ఈ తేడాలు కథాంశాన్ని బట్టీ, రచనా విధానాన్ని బట్టీ నిర్ణయించాలి.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి ప్రశస్తమైన కథలు చదివిన వారు ఒక్క విషయం గమనించి ఉంటారు. వాటిలో చాలా భాగం చిన్న నవలలుగా రాయడానికి అనువైనవి. చిన్న కథలుగా చూస్తే వాటిలో శిల్పసౌష్టవం తక్కువ, కాని కుదించిన చిన్న కథలుగా చూస్తే పాత్రల వాతావరణం చిత్రించటంలో ఆయనకుగల అసమాన ప్రజ్ఞ స్పష్టమవు

కమ్యూనిటీ రేడియో సెట్లు

1962 నవంబరు నెలలో దిగువ గ్రామాలలో కమ్యూనిటీ రేడియో సెట్లను నెలకొల్పారు :

మెదకుజిల్లా : నారాయణఖేడ్ మునిసిపాలిటి (నారాయణఖేడ్ తాలూకా), హైద్రాబాదుజిల్లా : కొంపెల్లి పంచాయితి (మేడ్చల్ తాలుకా), వరంగల్లు జిల్లా : మచ్చాపూర్, తాటికాయలు (వరంగల్లు తాలుకా) బుహంపూర్ (మహబూబాబాదు తాలుకా), కరీంనగర్ జిల్లా : బొమ్మకల్లు (కరీంనగర్ తాలుకా), నిజామాబాదు జిల్లా: అనకాపూర్, దోనచిల్లు (ఆర్మూరుతాలుకా), పోతనగల్లు II. వారిణి (శ్రీనగర్) (బోధన్‌తాలుకా), ఆదిలాబాదుజిల్లా : రాంపూర్, పోచర్ల (ఆదిలాబాదు తాలుకా), చిత్తూరు జిల్లా : టి.పోట్టూరు (చిత్తూరుతాలుకా), మహబూబునగరం జిల్లా : వల్లభాపురం పంచాయితీ, కొండారెడ్డి పల్లి, బొలమూరు పంచాయితీ, పోలిచెట్టి పల్లి పంచాయితీ (అచ్చంపేట తాలుకాలోవి). బిజినాపల్లి పంచాయితీ (నాగర కర్నూలు తాలుకా) నల్లగొండజిల్లా: చినకొండూరుపంచాయితీ,(భోనగిరితాలుకా) నల్లగొండ మునిసిపాలిటీ (నల్లగొండ తాలూకా), అనంతపురం జిల్లా: అనంతపురం మునిసిపాలిటీ హరిజన కాలనీ (అనంతపురం తాలుకా), పెనకొలపాడు (ఘూటితాలుకా), దొడ్డేరి (మడకసిర తాలుకా), శ్రీకాకుళం జిల్లా : పెదసీడి, బోరుభద్ర, రొంపివలస, తుంగతంపర, పెదమల్లిపురం (పాతపట్నం తాలుకాలోవి), నరసన్నపృవలస, గొడ్డలూపి (బొబ్బిలి తాలుకా), మెట్టూరు, రామాపురం, కోరట్ల పాడు (సోంపేట తాలుకా), ఉంగరాడ, గొల్లపాడు (పాలకొండ తాలుకా), విశాఖ పట్నం జిల్లా : అమలాపురం (నరసీపట్నం తాలుకా), తాటవారికిత్తలి (విజయ నగరం తాలుకా), ఖమ్మం జిల్లా : నేలకొండపల్లి కొత్తూరు (ఖమ్మం తాలుకా)

1963 జనవరి నెలలో దిగువ గ్రామాలలో కమ్యూనిటీ రేడియోసెట్లను నెలకొల్పడం జరిగింది.

నెల్లూరు జిల్లా : రెడ్డిగారి కొత్తపల్లి (కనిగిరి తాలూకా), మహబూబునగర్ జిల్లా: అబనగపూర్ (మక్తల్‌తాలుకా), విశాఖ పట్నం జిల్లా : బురదపేట, మూచెర్ల, గాజులరిగ, (విజయ నగరం తాలుకాలోవి), హైద్రాబాదు జిల్లా : జీడిమెట్ల, శామీర్‌పేట (మేడ్చల్ తాలుకాలోవి), మెదకుజిల్లా : ఇబ్రాహింనగర్, మేడిపల్లి (సిద్దిపేట తాలుకా), కరీంనగర్ జిల్లా : మన్నెగూడెం, గోవిందారం (మెట్టపల్లితాలుకా), కనగర్తి (జె), కిల్వనపర్తి (సుల్తానాబాదు తాలుకా), వరంగల్లు జిల్లా: కక్కిరాలపల్లి, వెంకటాద్రిపేట, కూనూరు (వరంగల్లు తాలుకాలోవి), చిలకోడు, గుండ్రాతి మడుగు (మహబూబాబాదుతాలుకా), నిజామాబాదుజిల్లా : నిజామాబాదు మునిసిపాలిటీ. ★

తుంది. ఆయన వాటిని చిన్న నవలలుగా రాసి ఉండవలసిందని నాకు అనిపిస్తుంది.

చిన్న నవలలు రాయటంలో నా అనుభవాన్ని పాఠకుల అనుమతితో కొద్దిగా చెప్పదలిచాను. అనేక పర్యాయాలు నేను నవలగా రాయదలచుకున్న కథను చిన్న నవలగా రాయటం జరిగింది. దానికి కారణం, నా కథలో సామాజిక జీవితాన్ని విపులంగా ప్రతిబింబించే అవకాశం లేదని తోచటమే.

ఒక సందర్భంలో నేను చిన్న నవలగా రాయదలుచుకున్న కథలో అనేక సంవత్సరాల మీద జరిగిన సంఘటనలు చిత్రించవలసి వచ్చింది. ఆ సంఘటనలను మొదటి నుంచి చివరదాకా జరిగిన క్రమంలో చెప్పుకుపోతే నవలే రాయాలి. అలా రాసి రచనకు పటుత్వం చేకూర్చే దక్షత నాలో లేదని స్పష్టమయింది. అందుచేత రచనను దాదాపు చివరలోనే ఎత్తుకొని గడిచిన సంఘటనలను, సినిమా పరిభాషలో Flash back అంటారే ఆ పద్ధతిలో, పరస్పర సంబంధం ఆట్టే వాటి మధ్య ఉంచకుండా, చిన్న నవల రాశాను. ఇందువల్ల పాఠకులకు ఆ రచన బాగా నచ్చిందని చెప్పలేను గాని, నాకు మాత్రం తృప్తి కలిగింది. నవలగా రాసి ఉంటే అది పాఠకులను తప్పక మరింత విసిగించి ఉండును. ఆ విషయంలో నా కెలాటి సందేహమూ లేదు.

తెలుగులో కథలు పుష్కలంగానే ఉంటున్నాయిగాని అవి క్షణికమైన, తాత్కాలికమైన, ఆనందాన్ని చేకూర్చేవి. తెలుగు సాహిత్యం పుష్టిపొందాలంటే నవలలూ, చిన్న నవలలూ రావాలి. చిన్న కథలు రాసేవారు తాము తీసుకునే ఇతి వృత్తాన్ని మరీ హ్రస్వదృష్టితో చూస్తారు. నవలలు రాసేవారు తమ యితి వృత్తాన్ని కొన్ని ఘట్టాల కింద విభజించి దేనికదిగా వివరించుకుంటూ పోతారు. చిన్న నవల రాయదలచిన వాడు తాను రాయదలుచుకున్నదంతా ఒకే సారి సమగ్రంగా ఆలోచిస్తాడు, కాని దాన్ని లోతుగా పరిశీలించి, ఎక్కువ శ్రద్ధతో ఆలోచించి, శిల్పాన్ని నిర్లక్ష్యం చెయ్యకుండా చక్కగా అమర్చుతాడు. చిన్న నవలలో చిన్న కథలో ఉండే శిల్పమూ, నవలలో ఉండే విస్తృతీ కలిసివస్తాయి. ఇదే ఈ సాహిత్య ప్రక్రియలోని విశిష్టత.

చిన్న నవలలు ధారావాహికంగా పత్రికలలో ప్రచురించినప్పటికీ కొద్ది సంచికలలో ముగుస్తాయి. కొసకి వచ్చేసరికి మొదలు మరిచిపోయే ప్రమాదం పాఠకుడికి ఉండదు. ఇటీవల సాహిత్య స్వరూపం పైన పత్రికల ప్రభావం విశేషంగా ఉంటున్నది గనక మన రచయితలు చిన్న నవలలను విరివిగా రచించి సాహిత్యంలో చిరస్థాయిగా ఉండదగిన రచనలను సృష్టిస్తారని ఆశించ వచ్చు. పత్రికలు కూడా చిన్న నవలలను ప్రోత్సహించటం ఎంతైనా అవసరం.

హిమాలయ యోధులు

★ ★

శతఘ్నిదళం సాహస కృత్యం

చైనా దాడి జరిపినప్పుడు నేఫా ప్రాంతం అంతటా మన సైనికులు వీరోచిత పోరాటం జరిపి రక్తం చిందించారు. మన దేశ ఉత్తమ సాంప్రదాయాలకు అనుగుణంగా అసమాన్య సాహస కృత్యాలను ప్రదర్శించారు.

చైనా ముష్కరులు మన భూభాగాలపై దాడిజరిపినసమయంలో తవాంగ్ ప్రాంతంలో బ్రిగేడియర్ హోషియార్ సింగ్ బ్రిగేడ్ లో ఒక విభాగానికి కమాండింగ్ ఆఫీసరుగా ఉన్న మేజర్ బ్రహమ్‌సత్ పంజాబులోని రోహటక్ జిల్లా భాప్రోడా గ్రామానికి చెందిన వాడు. ఆయన జాంగ్ సమీపంలోని తవాంగ్ చూనదిని సంరక్షిస్తూఉండి చైనావారు అత్యధిక సంఖ్యలోవచ్చి దాడి జరిపినప్పటికీ మూడు వారాలకు పైగా వారు ముందుకు రాకుండా ప్రతిఘటించడం జరిగింది. దీనికి కారణం ఇక్కడ నాయకత్వం వహించిన మేజర్ సత్ అపూర్వ సాంకేతిక ప్రావీణ్యం ప్రదర్శించి చైనావారు అక్కడి భవనాలను ఆక్రమించుకోడానికి వీలులేకుండాచేయడమే.

చైనావారు ఆ చుట్టుప్రక్కల నక్కల బొరియలలో దాక్కొని కాలం గడపవలిసి వచ్చింది. ఆ తర్వాత తన స్థావరాలపై చైనా వారు పెద్దపెట్టున దాడులు ప్రారంభించినప్పుడు మేజర్ సత్ భారీఎత్తున శతఘ్నులను సరిఅయిన గురితోకాల్చి చైనావారి నాలుగు దాడులను త్రిప్పికొట్టాడు. దానితో శత్రుసైనికులలో అలజడి, చికాకు కలిగింది. చైనావారికి మనశతఘ్నులంటే గుండెబెదురు కలిగి నరకయాతన అనుభవించారు.

ఆ మరునాడు ఇతర సైనికులతోపాటు మేజర్ సత్ దళానికికూడా అక్కణ్ణించి ఉపసంహరించుకోవాల్సిందిగా ఆ దేశాలు వెళ్ళాయి. మేజర్ సత్ దళం వెనక్కువస్తూ ఉండగా శత్రువులు చాల దగ్గరినుంచి పెద్దపెట్టున హఠాత్తుగా కాల్పులు సాగించారు. అతని కారుకు నిప్పంటుకుంది. అతనికి గాయాలు తగిలాయి. అయినా లెక్కచేయక దగ్గరఉన్న నలుగురినీ వెంటనే ఒకజట్టుగా చేసి శత్రుస్థావరం పార్శ్వబాగంపై దాడి జరపడానికి సన్నాహం చేశాడు. అనుకోకుండానే మరోవైపునుంచి అతనిపై తీవ్రమైన కాల్పులు జరిగాయి. అయినా ఇవేవీ లెక్కచేయకుండానే మేజర్ సత్ అసమాన ధైర్యసాహసాలతో వీరోచితంగా శత్రువును ఎదుర్కొన్నారు. ఆ సమయంలోనే మర తుపాకినుంచి వచ్చిన ఒక గుండు తగిలి అతనికి బలమయిన గాయం తగిలింది. మేజర్ సత్ ముందుకు పోలేకపోయినా అసువులు బాసేవరకూ శత్రువులను ప్రతిఘటిస్తూ, తన జట్టులోని సైనికులను ప్రోత్సహించాడు.

దొంగచాటు దాడి

సీలా–బోమిడిలా యుద్ధరంగంలో కెప్టెన్ దయాల్ సింగ్, ఆయన సహాయక కంపెనీ రాజపుత్ర దళం నవంబరు 24 వ తేదీన ఎదుర్కొన్న దొంగచాటు దాడిని గూర్చిన మరో సంఘటనను ప్రత్యక్షంగా చూచిన జవానులు చెప్పారు.

చైనావారు యుద్ధ విరమణ ప్రకటన చేసిన తర్వాత యీ దళం వెనక్కువస్తుండగా శత్రువులు దాడిచేశారు.

కెప్టెన్ సింగ్ తన రివాల్వర్‌ను బయటికి తీసి, చైనీయుల కాల్పులకు ఎదురుకాల్పులు జరపాల్సిందిగా తన సైనికులకు ఉత్తరువులు ఇచ్చాడు.

ఆ వెంటనే కెప్టెన్ సింగ్ ఒక బ్రెన్ గన్ తీసికొని అందులో మందుగుండు అయిపోయే వరకూకాల్పులు కొనసాగించాడు. ఆ తర్వాత వెనుక స్థావరాలలో ఉన్న తన మనుష్యుల వద్దకుపరిగెత్తి చేతిబాంబులను తుండుగుడ్డలో మూటకట్టుకుని కాల్పుల స్థలానికి తిరిగి వచ్చాడు.

తన ఛాతీపై గుండు తగిలేవరకు వెనక్కుముందుకు చేతి బాంబులను విసిరాడు.

అస్సాం తేయాకుతోట కార్మికుల వీరోచిత పాత్ర

నేఫా, తేజ్‌పూర్‌లకు ఉపద్రవం ముంచుకు వచ్చిన రోజుల్లో, అస్సాంలో బ్రహ్మపుత్రానదికి ఉత్తరాన రెండు లక్షల మందికి పైగా తేయాకు తోటల కార్మికులు అకుంఠిత ధైర్యస్థైర్యాలతో, అచంచల దీక్షతో, ఉన్నచోటు విడిచిపెట్టకుండా నిశ్చలంగా ఎలా తమ పని సాగించుకుపోయినదీ, ఆ వృత్తాంతం ఇప్పుడు వివరించవచ్చు.

దేశ స్వాతంత్ర్య రక్షణకోసం వారి దీక్షా సంకల్పమూ, వారి కర్తవ్యపాలనా, చైనా దురాక్రమణ నిరోధం గురించిన చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్నే సృష్టించాయి.

చైనాదాడి గురించి సమాచారం పంపడానికి తేజ్‌పూర్ చేరిన ప్రపంచ పత్రికా ప్రతినిధులు, తేయాకు కార్మికుల వీరోచితపాత్రను గురించి ఎంతగానో ప్రశంసించారు.

(మిగతా 26 వ పేజీలో)

పారిశ్రామిక విశేషాలు

కేంద్రప్రభుత్వ రంగం

సింథటిక్ మందుల ఫ్యాక్టరీకి సంబంధించిన లెవెలింగ్, సివిల్ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం అనుకున్న ప్రకారం పూర్తి కాగలదని ఆశింపబడుతున్నది.

కేంద్ర ప్రభుత్వ భారీ పరిశ్రమలశాఖ మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం రామచంద్రపురం వద్ద నున్న భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీస్థలాన్ని దర్శించిన తరువాత, ఈ ఫ్యాక్టరీని విరమించడం జరగదని ప్రభుత్వానికి హామీఇచ్చారు. ఇప్పుడు ఈ ఫ్యాక్టరీ నిర్మాణపు పనులు త్వరితగతిని కొనసాగుతాయని ఆశింపబడుతున్నది.

ప్రైవేటు రంగం

విశాఖపట్నంలోని తైలశుద్ధికర్మాగారంలో నాఫ్తా (ఒక విధమైన మట్టితైలం) నుంచి పెట్రోలియంగ్యాస్ ద్రావకాన్ని వుత్పత్తిచేయడానికి కాల్టెక్స్ తైల శుద్ధి కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వం లైసెన్సు ఇచ్చింది.

ప్రఖ్యాత అమెరికన్ సంస్థ అయిన వార్నర్ లాం బెర్ట్స్ సహకారంతో హైద్రాబాదులో బీటాపిగోలిన్, పిరిడైన్, పెవిబేసిస్, ఇతర ప్రాథమిక రసాయనిక పదార్థాలను వుత్పత్తి చేయడానికి వార్నర్ హిందూస్తాన్ లిమిటెడ్ కంపెనీకి లైసెన్సు ఇవ్వడం జరిగింది, ఇందుకొరకు పెట్టుబడి క్రింద సుమారు రూ 25 లక్షలు ఖర్చుపెట్టబడుతాయి.

సింగరేణి బొగ్గుగనుల కంపెనీ లిమిటెడ్ బొగ్గు వుత్పత్తిని సాలీనా 3 మిలియన్ టన్నుల నుంచి 5.26 మిలియన్ టన్నుల వరకు పెంచడానికి కూడా లైసెన్సు ఇవ్వబడింది.

సాలీనా 6 కోట్ల అడుగుల వెల్డింగ్ ఎలెక్ట్రోడ్స్‌ను వుత్పత్తి చేయడానికి మరొక సంస్థకు లైసెన్సు ఇవ్వబడింది. ఈ సంస్థ హైద్రాబాదులో నెలకొల్పబడుతుంది. ఇందుకొరకు రూ 15 లక్షల మూలధనం అవసరమవుతుందని అంచనా వేయబడింది.

1. సింగరేణి కాలరీస్ లిమిటెడ్

1963 జనవరి నెలలో సింగరేణి కాలరీల బొగ్గగనులలోని 2,90,731.7 టన్నుల బొగ్గుత్రవ్వబడింది. 1962జనవరి నెలలో 2,47,084.6 టన్నుల బొగ్గు త్రవ్వబడింది.

రిపబ్లిక్ దినోత్సవంనాడు సింగరేణి కాలరీల జనరల్ మేనేజర్, సింగరేణి కాలరీల పౌరసంఘం అధ్యక్షులు శ్రీయస్.కె. నర్గుండ్‌కర్ కంపెనీసిబ్బంది, పని కార్మికులు, కొత్తగూడెం పట్టణ పౌరుల తరపున జాతీయ రక్షణనిధికిగాను రూ 3 లక్షల చెక్కును ముఖ్య మంత్రికి అందజేశారు. ఇంతకు ముందు రు. 1,50,000లు జాతీయ రక్షణనిధికి విరాళంగా ఇవ్వడంజరిగింది. అంతేగాక కాలరీల ఉద్యోగులు తమ ప్రావిడెంటు ఫండు నుంచి రూ 50,000ల మొత్తాన్ని జాతీయ రక్షణ సర్టిఫికెట్లలో పెట్టుబడి పెట్టారు.

నిజాం చక్కెర ఫ్యాక్టరీ లిమిటెడ్

చెరకు క్రషింగ్: ఈ నెలలో 105,779 మెట్రిక్ టన్నుల చెరకుక్రష్‌చేయబడింది.

చక్కెర ఉత్పత్తి: ఈనెలలో 121,620 సంచుల చక్కెర ఉత్పత్తి చేయబడింది.

చెరకుగడ సరఫరా: ఈ నెలలో చక్కెర ఫ్యాక్టరీ సొంత పొలాలు, రైతుల వద్ద నుంచి ఫ్యాక్టరీకి చేరిన చెరకు గడ వివరాలు దిగువ చూపబడినవి.

సెంట్రల్ రైల్వే	22,057	
యల్. టి. రైల్వే	48,685	
రోడ్డు ద్వారా	35,561	
మొత్తం	106,303	టన్నులు

ప్రముఖుల రాక: ఆంధ్ర ప్రదేశ్ గవర్నరు, జనరల్ యస్. యం. శ్రీనగేష్ 1963 జనవరి 17 వ తేదీన ఈ ఫ్యాక్టరీని సందర్శించిన సందర్భంలో వారికి కంపెనీ తరపున మేనేజింగ్ డైరెక్టరు జాతీయ రక్షణనిధికి విరాళంగా రూ 3 లక్షల చెక్కును సమర్పించారు.

ముఖ్యమంత్రి డా. యన్. సంజీవరెడ్డి, ప్రణాళికామంత్రి డా.యం. చెన్నారెడ్డి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షులు శ్రీ బ్రహ్మయ్యగారలు 1963 జనవరి 3 వ తేదీన చక్కెర ఫ్యాక్టరీని

సందర్శించారు. కార్మిక రవాణాశాఖల మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి ఫ్యాక్టరీ స్థలంలో చక్కెర ఫ్యాక్టరీ మజ్దూర్ సభ భవనానికి 1963 జనవరి 28 వ తేదీని శంకుస్థాపన చేశారు. ఉత్తర ప్రదేశ్, పంజాబు రాష్ట్రాల నుంచి చెరకు ఉత్పత్తిలో నిపుణులైనవారు 1963 జనవరి 29 వ తేదీన ఫ్యాక్టరీని సందర్శించారు.

ఏలూరులో పాదరక్షల ఉత్పత్తికి శిక్షణ ఉత్పత్తి కేంద్రం

రెండవ పంచవర్ష ప్రణాళికలో లఘు పరిశ్రమల అభివృద్ధి క్రింద ఏలూరులో చర్మకారీ పరిశ్రమకూ, పాదరక్షల ఉత్పత్తికి శిక్షణ ఉత్పత్తికేంద్రాన్ని నెలకొల్పడానికై ప్రభుత్వం 1955 ఆగస్టు 17 వ తేదీన పరిశ్రమలు, సహకార, కార్మిక శాఖ జి. ఓ. నెం. 1692 జారీచేస్తూ ఒక పథకం ఆమోదించింది. ఈ పథకంప్రకారం ఈ కేంద్రంలో 12 నెలల వరకు 28 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఇందులోచేరిన వారికి ప్రతినెలా తల 1కి రూ. 25 ల స్టయిఫెండు ఇవ్వబడుతుంది.

ఇంతవరకు నాలుగు జట్టులలో 77 మంది కళాకారులకు ఈ కేంద్రంలో దిగువ పేర్కొనబడినవిధంగా శిక్షణ ఇవ్వడం జరిగింది.

1958–59 = 20

1959–60 = 20

1960–61 = 18

1961–62 = 19

మొదటి జట్టులో శిక్షణపొందినవారికి వారు తమ వృత్తిని తరువాత అభివృద్ధి చేసుకోవడానికి వీలుగా, ఒకొక్కరికి రూ. 200 ల కుటీర పరిశ్రమల రుణం ఇవ్వబడింది.

రెండవ, మూడవ జట్టులో శిక్షణ పొందినవారు అవసరమైన పరికరాలు, కుట్టు మిషనులు, ముడిపదార్థాలు కొనుక్కోవడానికి అప్పు ఇవ్వవలసిందని పెట్టుకున్న దరఖాస్తులను, వాటి పరిశీలన కొరకు ఆంధ్రప్రదేశ్ అడ్‌హాక్ చర్మకారీ సంఘపు మెంబర్ సెక్రటరీకి పంపడం జరిగింది.

1962 డిసెంబరు నెలలో అయిన ఖర్చు వుత్పత్తి, విక్రయాల వివరాలు దిగువ చూపబడ్డాయి.

ఖర్చు	ఉత్పత్తి	విక్రయం
6,338–50	2,451–29	630–67

విజయవాడలోని ప్రభుత్వ కేంద్ర విక్రయశాల

విజయవాడలోని ప్రభుత్వ కేంద్ర విక్రయశాల 1962 డిసెంబరు నెలలో మొత్తం రూ 15,077 ల విలువగల చేతిపనుల వస్తువులనుకొని రూ 12,391 ల విలువగల వస్తువులకు విక్రయించింది.

(24 వ పేజీ తరువాయి)

"కర్తవ్యాన్ని విడనాడి పారిపోవటం ప్రాణభయంతో మాన మర్యాదలను మతాన్ని ఆస్తిపాస్తులను త్యజించి, అన్నిటినీ దుర్మార్గులకు అప్పగించి పోవటం, ఇది పురుష లక్షణం కాదు. ఇది అసహజం, అవమానకరం"అని గాంధీజీ హితవు. అస్సాం తేయాకు కార్మికులు ఈ హితవును అక్షరాలా పాటించారు.

ఉత్కృష్ట ధైర్య స్థైర్యాలు

విపత్సమయంలో ఈ కార్మికులు చలించలేదు. నిస్సహాయులని వీగిపోలేదు. వీరి ధైర్య స్థైర్యాలు ఉత్కృష్టమైనవి.

వీసమైనా చలించకుండా ఈ కార్మికులు అందరూ ఏకమై పౌర రక్షణకోసం అవసరమైన చర్యలు సాగించారు. తమ తోటలచుట్టూ ఉన్న వంతెనలు, తూములు, టెలిఫోన్, టెలిగ్రాం తీగెలు మొదలైనవి రక్షించేపనికి స్వచ్ఛందంగా ముందుకువచ్చారు. ఆస్తులూ, యంత్రాగారాలు కాపాడ్డానికి రాత్రీపగలూ కాపుదలవేశారు. ఎన్నడూ భయపడలేదు. పిరికితనం వారిని అంటలేదు. తేయాకు ఉత్పత్తి వీసమైనా తరగనియ్య లేదు.

నది ఉత్తర తీరంలో కార్మికుల ప్రవర్తన అందరినీ మేల్కొలిపింది. వీరితత్వం దానంతట అదే అంతటా వ్యాపించింది. అస్సాం అంతటా వెయ్యికిపైగా ఉన్నతోటల్లో కార్మికులందరూ వీరి ఆదర్శాన్ని అనుసరించ నారంభించారు.

అస్సాం తేయాకు కార్మికులు ఉదారంగా తమ వేతనాలలో కొంత వరకును జాతీయ రక్షణ నిధికి సమర్పించారు. స్త్రీ కార్మికులు తమ బంగారు ఆభరణాలు ఇచ్చారు. యోధుల ప్రాణాలు కాపాడ్డంకోసం రక్తదానం చేశారు.

రక్షణకృషిని పెంపొందించడం కోసం వారు వేసుకున్న కార్యక్రమంలో "శ్రమదానం" ఒక అంశం. ముఖ్యమైనరోడ్లు వెయ్యడానికీ వెడల్పు చెయ్యడానికీ బాగుపరచడానికీ వారి స్వచ్ఛంద సేవ తోడ్పడింది.

ఆదర్శప్రాయమైన క్రమశిక్షణ

వ్యవసాయ వస్తూత్పత్తిని పెంచడానికి తేయాకు కార్మికులు అనేక చర్యలు తీసుకున్నారు. తేయాకుతోటల్లో చాలచోట్ల ఉండిపోయిన ఖాళీస్థలాలలో కూరగాయలూ, పాదులూ వేశారు. వాణిజ్య పంటలు పెంచారు. వ్యవసాయోత్పత్తి పెంపుదల కోసం సహకార సంఘాలు నెలకొల్పబడ్డాయి.


అనేక తేయాకు తోటల్లో రక్షణ సంఘాలు ఏర్పాటయినాయి. రక్షణావసరాల కోసం స్థానికంగా లభ్యమయ్యే సాధన సంపత్తిని సమీకరించి, ఈ సంఘాలు ప్రజల్లో స్థైర్యం నిలపడానికి ఉపకరిస్తున్నాయి.

కర్తవ్యపాలనా, దేశభక్తీ – ఇవేకాదు, ఆదర్శప్రాయమైన ఆత్మనిగ్రహమూ, క్రమశిక్షణా, విపత్సమయంలో స్వశక్తిపై ఆధారపడే తీరూ—ఈ అన్నిటిలోనూ వారు చక్కని తార్కాణం చూపారు. ★

భారత నేపాల్ దేశాల సంబంధాలు

చరిత్ర, సంస్కృతులను బట్టి అయితేనేం భౌగోళికంగా వాటి వాటి ఉనికిని బట్టి అయితేనేం భారత, నేపాల్ దేశాలు సఖ్యతతో కలిసి మెలిసి వ్యవహరించడం తప్పని సరే అవుతుంది. ఈ ఉభయదేశాల మధ్యా స్నేహ సంబంధాలు కొన్ని శతాబ్దాలుగా వస్తూనే ఉన్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించి నప్పటినుంచీ కూడా భారతదేశం ఈ సంబంధాలను మరింత పటిష్ఠం చేయడానికి పాటుబడింది. నేపాల్‌లో రాణాల నిరంకుశ పాలనను అంతమొందించి రాజుకి సముచిత స్థానం తిరిగి లభింప చేయడంలో నేపాల్ ప్రజలకి మన ప్రధానమంత్రి తోడ్పడిన సంగతి అందరూ ఎరిగినదే. ఆర్థిక రంగంలో సహితం గత పన్నెండు సంవత్సరాలలోనూ దాదాపు ముప్పై కోట్ల రూపాయలు నేపాల్‌కి సహాయం చేసింది మన దేశం. విద్యుచ్ఛక్తి, నీటిసాగు కార్యక్రమాలకీ, రోడ్ల నిర్మాణానికీ, స్కూళ్లు, ఆస్పత్రులు నిర్మించడానికీ ఈ సొమ్ము వినియోగ పడింది. ఈ ప్రాంతంలో పరిస్థితులు అతి త్వరత్వరగా మారిపోతూ ఉన్నాయి. ఆ దృష్ట్యా ఈ సంబంధాలు మరింత ప్రాధాన్యం వహించగలవు. అసలు మామూలు పరిస్థితులలోనే ఈ ఉభయ దేశాలూ పరస్పర యోగక్షేమాల కోసమై మంచి ఇరుగు పొరుగుగా వ్యవహరించవలసే ఉంటుంది.

మన దేశీయ వ్యవహారాల మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి నేపాల్ రాజధాని ఖట్మాండూ వెళ్ళి మూడురోజులు ఉండి వచ్చారు. మన ఉభయ దేశాలమధ్య సంబంధాలను పటిష్ఠం చేయాలన్న భారత దేశపు ఆకాంక్షకు ఇది ఒక ప్రబల నిదర్శనం. శ్రీ శాస్త్రి ఈ మూడు రోజులపాటూ చర్చలు సాగించిన అనంతరం వెలువడిన సంయుక్త ప్రకటనలోనే పేర్కొన్నారు – అరమరికలు లేకుండా సాగిన ఈ సంప్రదింపులవల్ల ఉభయ దేశాలమధ్య సంబంధాలు మరింత బలపడతాయి అని. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నేపాల్ మంత్రి మండలి



ఉపాధ్యక్షులు డాక్టర్ తులసీగిరి మరోసారి చెప్పారుకూడా. భారత నేపాల్ దేశాల మధ్య భౌగోళికంగానూ, సంస్కృతీ, సంప్రదాయాలకు అనుగుణంగానూ వస్తూన్న సంబంధాలు దుర్భేధ్యమైనవని ఖట్మాండూలో ఈ సమాలోచనలు ఎంతో ప్రయోజనకరంగానూ పరస్పరం సహాయకారిగానూ సాగినట్టు తెలియ చేశారు కూడాను. ఈ ప్రాంతంలో ఇప్పుడున్న స్థితిగతులనూ మొత్తంమీద అసలు ప్రపంచ పరిస్థితినీబట్టి చూసినప్పుడు తమ ఉభయ దేశాలకీ చెందిన అనేక ఉమ్మడి వ్యవహారాలను గురించి ఈ చర్చలు సాగినట్టు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అసలు తత్వరీత్యా ఈ రెండూ మిత్ర దేశాలు కనక స్వల్పమయిన విభేదాలు ఇంకా కొన్ని ఉన్నప్పటికీ ఒకరి అభిప్రాయాలనుఒకరు మరోసారి ఆలకించి అవగాహన చేసుకున్నట్లయితే పరిష్కరించుకోవచ్చునన్న నమ్మకాన్ని ఈ సంయుక్త ప్రకటనలో వ్యక్తం చేశారు. వీటన్నిటికంటె ప్రధాన మయిన అంశం మరొకటి ఉంది. ఆర్థిక రంగంలో కానీ ఇతరత్రా కానీ ఈ ఉభయదేశాల మధ్యా ఏవయినా అభిప్రాయ భేదాలంటూ ఏర్పడితే వాటిని పరిష్కరించేందుకై ఖాయమైన పద్ధతిన యంత్రాంగం ఒకటి ఏర్పాటు కాబోతున్నది. మన ప్రధాన మంత్రి మొన్న చెప్పినట్టు ఏదో ఒక నిర్దిష్ట మయిన సమస్యను దృష్టిలో ఉంచుకొని శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి ఖట్మాండూ వెళ్ళలేదు. మన ఉభయ దేశాల మధ్య మైత్రీ సద్భావాలను పెంపొందించడమే ఇక్కడ ప్రధానోద్దేశం. నేపాల్ సుఖసంతోషాలతో వర్ధిల్లాలనే తప్ప మరో తలంపు భారత దేశానికి లేదని రాజుకీ ఆయన సలహాదారులకీ నచ్చచెప్పడానికి కూడా ఈ సందర్భంలో కృషి జరిగింది. పొరుగు రాజ్యపు ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యంచేసుకోవాలని భారత దేశం అభిలషిస్తున్నది అనే అనుమానం అక్కడ ఎవరికయినా ఇంకా ఉన్నా శ్రీ శాస్త్రి ఖట్మాండూ యాత్ర మూలంగా అది తప్పకుండా తొలిగిపోయే ఉంటుంది. శాంతియుత సహజీవన

సూత్రాలు అయిదింటికీ కట్టుబడింది భారత దేశం కనక నేపాల్ లో కానీ మరో దేశంలో కానీ ఆంతరంగిక వ్యవహారాలు ఎలాఉన్నా భారత దేశానికి అవసరంలేదు. నేపాల్‌లో రాజకీయమైన చిక్కులన్నిటికీ పంచాయితీ పద్ధతి ప్రజాస్వామిక విధానం తారక మంత్రం అని గనక రాజు భావించే పక్షంలో అది కేవలం ఆయనకూ ఆయన ప్రజలకూ సంబంధించిన వ్యవహారం. నేపాల్ శ్రేయస్సునే ఆకాంక్షిస్తుంది భారత దేశం.

రక్షణ వ్యవహారాలలో భారత నేపాల్ దేశాలు సమన్వయంగా పనిచేయడం గురించి ఖట్మాండూలో ప్రచారంలో ఉన్న వార్తలను ఖండించారు శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి. ఇందులో విడ్డూరం ఏదీ లేదు. ఎందుచేత నంటే ఎన్నడో 1950 జూలైలో మైత్రీ ఒడంబడిక కుదుర్చుకున్నప్పుడే భారత నేపాల్ దేశాలు పరస్పర శ్రేయో సమగ్రతలను కాపాడుకునేందుకై తగు రక్షణలను కల్పించుకున్నాయి. ఈ ఒడంబడిక మొట్ట మొదటి ప్రకరణంలోనే "భారత నేపాల్ దేశాల మధ్య శాశ్వతంగా శాంతి మైత్రీ నెలకొనాలి" అనిపేర్కొన్నది.

ఈ రెండు దేశాలవారూ ఎదటివారి సర్వం సహాకాధికారాన్నీ, ప్రాంతీయ సమగ్రతనూ, స్వాతంత్ర్యాన్నీ గుర్తిస్తారు. ఏదయినా పొరుగు దేశంతో ఘర్షణగానీ అభిప్రాయభేదం గానీ బాగా వచ్చిందీ అంటే ఆ సంగతి ఒకరికొకరు తెలియ బరచుకుంటారు. తమ భద్రత, సమగ్రత అన్నవి అవతలివారి శ్రేయస్సుపై ఆధారపడి ఉంటాయన్న సంగతి ఉభయులూ గుర్తించారు. అందుకే యుద్ధకాలంలోనూ మిగతా రోజులలోనూ కూడా అరమరికలు ఏవీ లేకుండా స్వేచ్ఛగా ఒకరి అభిప్రాయాలను ఒకరు తెలియజెప్పుకోవడం ద్వారా ఈ రెండు దేశాలూ తమ ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుకోగలవు. శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి ఖట్మాండూ యాత్ర ఫలితంగా ఉభయ దేశాల నాయకులూ ఉత్తరోత్తరా మరికొన్ని పర్యాయాలు కలుసుకోడానికి అవకాశం ఏర్పడింది. ఈ విధంగా కలుసుకుని వారు సంగతి సందర్భాలను యోచించి శాంతికీ, ప్రజాస్వామిక విధానానికీ హానికలగకుండా కాపాడుకునేందుకు గాను తగు చర్యలను రూపొందించడానికి వీలు కలుగుతుంది.

— కె. సుబ్బరాయన్

చైనా పాకిస్థాన్ సరిహద్దు ఒప్పందం

కాలంనాటి కథలెండి. ఒకానొక ఊళ్ళో ఒక చిన్న బిడ్డను గురించి ఇద్దరు వనితలు తగూ పడ్డారట బిడ్డ తనది అంటే తనది అని. బుద్ధి సూక్ష్మతగల న్యాయాధికారి ఈ సంగతి విచారించి బిడ్డని రెండుగాకోసి చెరొక భాగం తీసుకోమన్నాట్ట వారిద్దరిని. తలారి కరకు కత్తి పైకిలేవగానే ఆ బిడ్డ కన్నతల్లి లేచి గట్టిగా అరిచిందట, కడుపు తీపి కొద్దీ బిడ్డను ఏమీ చేయకండి నాకు ఇవ్వకపోయినా ఫరవాలేదు గాని అని. ఇదీ కథ. ఈనాడు పాకిస్థాన్ చైనాలు రెండూ కలిసి తమలో ఎవరికీ చెందని కాశ్మీరులో కొంతభాగాన్ని వాటాలు పంచుకున్నాయి. ఆ సమయంలో వారెవరికీ ఈ కథలో ఆ బిడ్డ కన్నతల్లి పడిన ఆవేదన కలగలేదు. సహజమేగా మరి. న్యాయతః భారతదేశానికి చెందిన భూభాగాన్ని గురించి ఆలోచించేప్పుడు ఈ ఉభయ దేశాలవారూ ఆచార వ్యవహారాలను సంప్రదాయాలనూ అన్నిటినీ గాలికి వదిలివేయగలిగారు. వారు కావాలనుకున్నదల్లా ఒక్కటే - ఈ భూభాగాన్ని గురించి ఒప్పందం అంటూ ఒకటి కుదిర్చేసుకోవడం. అందుకే ఇంత హడావిడిపడి సరిహద్దు ఒప్పందం అంటూ కుదుర్చుకున్నారు మొన్న. వాస్తవానికి చైనా పాకిస్థాన్‌లకి ఉమ్మడి సరిహద్దు అంటూ లేదు. అందుచేతనే ఈ వ్యవహారం బజారుకెక్కితే దాని అసలు రంగు ఎక్కడ బయటికి వస్తుందో ఎందుకు వచ్చిన గొడవ లెమ్మని ఉభయులూ కూడా ఈ ఒప్పందాన్ని మళ్ళీ ఒకసారి ధ్రువపరచడం అంటూ లేకుండా చేసుకున్నారు. కాశ్మీరులో పాకిస్థాన్‌వారు అక్రమంగా ఆక్రమించుకుని ఉన్న ప్రాంతాలను గురించి కుదుర్చుకున్నారు - ఈ పెకింగ్ ఒప్పందాన్ని. విదేశాంగ శాఖ మంత్రులిద్దరు సంతకాలు చేసిన ఈ ఒప్పందాన్ని చర్చించి ధ్రువపరచడమంటూ లేకుండా చేసారూ అంటే పాకిస్థాన్‌లో జాతీయ మహాసభనూ, ప్రజలనూ, పత్రికలనూ బుద్ధిపూర్వకంగా ఈ వ్యవహారం జోలికి రాకుండా తప్పించివేశారన్నమాట. చైనా సంగతి ఇక చెప్పనే అక్కరలేదు. పెకింగ్ ప్రభువులు చెప్పేదే వేదం అక్కడ —అందుకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం ఏర్పడేందుకు ఆస్కారమేలేదు.

ఈ జరిగిన అన్యాయానికీ, అక్రమానికీ భారతదేశం తీవ్రంగా ఆక్షేపణ తెలిపింది. మనకు చెందిన భూభాగాన్ని గురించి అక్రమంగా కుదుర్చుకున్న ఒప్పందం న్యాయ శాస్త్ర రీత్యానూ రాజ్యాంగ రీత్యానూ చెల్లదు. మనం అటువంటి పనిని సహించలేము. ఈ విషయంలో మనం మరీ అనుకోవలసింది పాకిస్థాన్ విషయంలోనే. కాశ్మీరు, ఇంకా తత్సంబంధమయిన వ్యవహారాలను గురించి రావల్పిండిలో చర్చలు జరగడానికి సరిగా ముందుగా చూసి ప్రకటించింది పాకిస్థాన్—తమకూ చైనాకూ మధ్యగల

ఉమ్మడి సరిహద్దు విషయమై సూత్రప్రాయంగా అంగీకారం కుదిరింది అని. ఇక ఇప్పుడు కలకత్తాలో మరో వరస చర్చలు జరగబోతున్నాయనగా కేవలం వాటిని చెడగొట్టడానికే అన్నట్టు చైనాతో సరిహద్దు ఒప్పందం మీద సంతకాలు చేయనేచేసింది పాకిస్థాన్. ఇంకా మిగిలిపోయిన సమస్యలన్నిటి విషయంలోనూ పాకిస్థాన్‌తో ఒక పరిష్కారానికి రావాలనీ ఆరాటపడే వారందరికీ ఇది నిజంగా ఎంతో ఆందోళన కలిగించక మానదు. కాని పరిష్కారం కుదుర్చుకోవాలన్న మన ఆకాంక్షకు నిదర్శనంగా పాకిస్థాన్‌తో సంప్రదింపులు అనుకున్న ప్రకారంగానే జరుపుతాము: అని వెల్లడించారు ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ మొన్న పార్లమెంటులో మాట్లాడుతూ. ఈ చర్చలు భగ్నం కావడమే చైనాకు కావలసింది. చైనావారి సామ్రాజ్య విస్తరణ కాంక్షకు భారత–పాకిస్థాన్ దేశాల సఖ్యత గొప్ప ఆటంకంగా ఉండగలదు. అందుచేతనే కాశ్మీరు విషయంలో కలగజేసుకో దలచలేదని అంటూ ఇన్నాళ్ళూ చెప్పుతున్న కబుర్లు అన్నిటినీ అవతలికి నెట్టివేసి భారత – పాకిస్థాన్ సంబంధాలలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంది చైనా.

కుడి ఎడమ చూసుకోకుండా, ఏది ఏమవుతోందోనన్న ఆలోచన లేకుండా తెగించి లోకంమీదపడే పెకింగ్ ప్రభువుల వంటి వారికి ప్రవర్తన విషయంలో అంతర్జాతీయ నియమ నిబంధనావళి అనేవాటికి అర్థమే ఉండదు. ఏకపక్ష సామాజిక వ్యవస్థను రూపొందించడానికి చైనాలో పూనుకుని కృషి జరపడం మొదలుపెట్టి అట్టే కాలం కాలేదు. అలాంటిది ఇంతటితో భిన్నాభిప్రాయాలకూ ఆదర్శాలకూ రానివ్వడం అనేది వారికి అలివి మించినపని. ఇప్పుడు వారున్న పరిస్థితిలో పెకింగ్ ప్రభువులు ఇతరులతో సహజీవనాన్ని కానీ ఇరుగు పొరుగు దేశాలమధ్య మైత్రిని కానీ సహింప జాలరు. అందుచేతనే మన సరిహద్దు ప్రాంతాలలో కొన్ని ప్రాంతాలు స్వతహాగా తమకు చెందవని తెలిసి కూడా వాటిని అంటి పెట్టుకుని ఉంటున్నారు. ఇంతేకాదు మన భూభాగంలో పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించుకున్న ప్రాంతాలలో వీలయినంత ఎక్కువగా వారి వద్దనుంచి స్వాహా చేయాలని చూస్తున్నారు. ఈ ప్రయత్నంలోకనక వారు భారత–పాకిస్థాన్ దేశాలమధ్య సఖ్యతానుబంధాలను పూర్తిగా తెగగొట్టగలిగారు అంటే ఇకనేముంది, వారి మనోరథం ఒకటి ఈడేరినట్టే. ★

మీ కృతజ్ఞతకు చిహ్నాలు

హిమాలయ సరిహద్దులలో అత్యున్నత శిఖరాలపై తమ విధిని తాము నిర్వహిస్తున్న సాహసికులైన మన సైనికులు ఆహార పదార్థాలు, ఇతర సౌకర్యాల కానుకలకు సహృదయంతో స్వాగతమిస్తారు.

ఈ క్రిందివాటిలో వేటినైనా పంపవచ్చు:

1. త్రాగే చాక్‌లేట్ బోర్న్‌విటా, లేక ఇంకా అటువంటివి. 2. డబ్బాలలో నిల్వచేసిన కాఫీ, పాలు. 3. బాదం కాయలు, వాల్నట్లు, జీడిపప్పు. 4. బిస్కెట్లు, స్వీట్లు (వండినస్వీట్లు ఉదా: లోజాంజెస్, లెమన్ డ్రాప్స్ మొదలైనవి). 5. బ్యాటరీ రేడియో సెట్లు (ముఖ్యంగా 2 వేవ్ ట్రాన్సిస్టర్లు) 6. ఇండోర్ ఆటవస్తువులు. 7. స్పోర్ట్స్‌గేర్. 8. టాయిలెట్ వస్తువులు. 9. పిరియాడికల్స్, పత్రికలు, పుస్తకాలు.

ప్యాకెట్లలోపల వున్న వస్తువుల వివరాలను ప్యాకెట్లపై స్పష్టంగా తెలుపుతూ రవాణా చార్జీలను చెల్లించి ఈ క్రింది వారికి పంపవచ్చు.

1. అడ్మినిస్ట్రేటివ్ కమాండెంట్, హెడ్‌క్వార్టర్సు, సికింద్రాబాద్ స్టేషన్, బొలారం.

లేక

2. స్టేషన్ కమాండర్, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, బేగంపేట, హైదరాబాద్.

లేక

3. శ్రీ యం. హెచ్. కె. ఘజ్నవీ, గవర్నరు సహాయ కార్యదర్శి, రాజభవన్, హైదరాబాద్.

మారిన మనిషి

బలివాడ కాంతారావు

సాధారణంగా జరగనిది ఆ వేళ రాత్రి తొమ్మిది కాకండానే భోజనం టేబిలు యెదురుగా డాక్టరు యశ్వంతరావు కులకర్ణి కూర్చు న్నాడు. భార్య వందన, ముఖంలో చిరునగవు వెలిగింది. పిల్లలిద్దరూ నిద్దరపోతుండగా ఒంటిగా కూర్చొని ఓ అరగంట క్రితమే లేనిపోని ఆలోచనలతో మెదడు నింపుకుంది. బహుశః పెళ్ళికాక మునుపు సుఖం పేరుతో నిర్మించుకున్న వూహలకీ, జరుగుతున్న నిజానికీ తేడా మనసులో కొట్లాడిందేమో ? భార్య భోజనం సగమైనా పూర్తికాలేదు. కులకర్ణి అలా యెదురుగా కూర్చొని ఆమె పెదిమలను టేబిలుమీద వున్న యెర్రని ఆపిలుపండునూ సరిపోలుస్తున్నాడు.

ఇద్దరూ జీవితంలో వింతగా కలుసు కున్నారు. అప్పుడప్పుడూ, వాళ్ళ భావాలు, నటనలూ వింత అనుభవాలై జీవిత వృక్షానికి క్రొత్త చిగుళ్ళలా వుంటాయ్. ఆమె అతనిని ఒక పిక్‌నిక్ స్థలంలో చూసింది. ఆమె కారులో వచ్చింది. అతను బస్సుమీద వచ్చాడు. తిరుగ వెళ్ళిపోతూ బస్సుస్టాపుకి నడచిపోతున్న అతనిని చూసి కారు ఆపింది. అతను వచ్చి నిల్చున్నాడు. ఆమె కారు తలుపు తీసి కూర్చోమంది. ఇలాంటి ఘట్టాలు మామూలు నగరాల్లో జరగక పోయినా — బొంబాయి లాంటి మహానగరా ల్లోనూ, సినీమాల్లోనూ అగుపిస్తుంటాయ్.

అంతస్థులూ జాతీ వాళ్ళపెళ్ళికి అడ్డు గోడలు పెట్టలేక పోయాయ్. ఆమె భాష సింధీ అతని మరాఠీ హిందీలో సమన్వయ మైపోయాయ్. వాళ్ళిద్దరికీ ఒక పాప, ఒక బాబువున్నారు. స్వంత ఆర్జనతో కొన్నకారు, కట్టించుకున్న యిల్లూవుంది.

ఆమె యివన్నీ కావాలని కోరుకుంది — వాటి కోసం అటమటించింది. ఇవన్నీ రాగానే యింకేదో కావాలనే కోరిక—తను ప్రేమించి పెళ్లాడిన భర్త యెల్లప్పుడూ తన దగ్గరగా వుండే—ఆ భాష ఆ భావన, ఆ హృదయ స్పందన, పాలవెన్నెలలా, పూలపాన్పులా— ఆ జీవితం యొక్క సొగసే వేరు. ఆమెకు యీ కనీసపు కోరిక తీరని కోరికయై వూహలో వుండిపోవటం యిష్టం లేదు.

ఆ వేళ సాయంత్రంనించీ పెనుగాలులతో కుండపోతగా పోస్తున్న వర్షం కూడా ఆమెకు చిరాకెత్తిస్తోంది. భర్త యింత వేగిరంగా డిస్పెన్సరీ నుంచి లోనికి కాలుపెట్టినవాడు; నిండు జాబిలి వుండే—పోర్టికో మీద రెండు వాలు కుర్చీలు వేసుకొని యిద్దరూ హాయిగా గడిపే వారే ! చప్పున చిరాకుగా "వేగంగా వచ్చారు — ఈ వేళే యీ పాడు వర్షం !'' అంది.

"నన్ను యింత వేగిరం రప్పించింది యీ పాడు వర్షమే కదూ ?"

ఇద్దరూ గదిలో పరుపుమీద కూర్చున్నారు. రేడియోలోంచి మెల్లగా "రసిక బలమా'' లత మధుర స్వరం వినిపిస్తోంది.

ఇంతలో అంగటి తలుపు యెవరో "డాక్టరు...డాక్టర్......'' అని బాదటం మొదలు పెట్టారు. సాధారణంగా బెల్ వాగేది. ఏంటో తొందర—? డాక్టరు వెంటనే పరుగెత్తాడు. కొంత సేపయ్యాక ఆమె రాలుతున్న కన్నీరు తుడుచుకొని మెల్లగా లేచింది. గోడచాటున నిల్చొని ఆ వచ్చిన మనిషీ, భర్త ఆడుకుంటున్న మాటలను వింటోంది.

డాక్టరు ఆ వచ్చిన వ్యక్తికి తగిలిన చిన్న చిన్న గాయాలకు కట్టుకట్టాడు.

"ఫీజు యెంత ?''

"మీ రెవరు ?''

"మనుషుల రాబడి చూసి డబ్బు పుచ్చు కుంటారా ?''

"అవును.''

"నాకు రాబడి లేకపోతే...''

"మీ రేమీ యివ్వకండి...లేని వాడిని కలవాడు భరించవలసిన బాధ్యత వుందిగా!"

"అలానా...నేను ప్రభుత్వం పనిమీద వచ్చాను. వస్తూనే ఆ రైలు లైను దగ్గర పడిపోయాను...''

"ఇంతరాత్రి మీద యీ వర్షంలో మీరు చేసేపని...''. అతను తన సి. ఐ. డి. చిహ్నాన్ని చూపించాడు. డాక్టరు అన్నాడు

"ఈ చుట్టుపట్ల హంతకులెవరూ వుండరనుకుంటాను.''

"చూడండి" అంటూ డిస్పెన్సరీ కిటికీ తెరిపించి పడమటి వేపు చూపించాడు. అప్పుడే ఒక యెలక్ట్రిక్ ట్రైన్ వెళ్ళిపోతోంది. ఆ వెలుగులో ఓవర్ బ్రిడ్జీ క్రింద ఒక మూలకు ఒకే ఒక చిన్నపాక అగుపించింది. మళ్ళీ ఓ క్షణంలో చీకటి—హోరు మనే వర్షం!

''అందులో యే కటికపేదవాడో పెళ్లాం పిల్లలతో పిడికిటిలో ప్రాణం పెట్టుకొని వుంటాడు.''

డాక్టరు మాటలు విని నవ్వుతూ "ముందు కిటికీ ముయ్యండి'' అన్నాడు. డాక్టరు కిటికీలు ముయ్యగానే ''ఈ చుట్టుపట్ల యింకెవ్వరూ లేరుకదా...?''

''లేరు!''

''అందులో వున్నవాడు ఒకడిని చంపటానికి ప్రయత్నించినవాడని మా నమ్మకం. వారం రోజులనించీ ప్రయత్నిస్తున్నాం — పసిగట్టాడేమో యింటికే రాలేదు!''

"ఎక్కడ ఆ నేరం జరిగింది..."''

''ఒక పెద్ద కలవారింట్లో కన్నం వెయ్యాలని చూసి...''

''ఏం చేశాడు...?"

''కత్తితో యింటి యజమానిని పొడిచాడు. ఆయనకి ఆయుస్సు వుంది."

''వారం రోజులై యింటికి రాలేదంటున్నారు. అయితే పెళ్ళాం పిల్లలూ యేం తింటున్నారు?''

"ఆ పెళ్ళమా? చాలా ఘరానా మనిషి. దొంగసారా చేరవేస్తుండగా రెండుసార్లు దొరికి జైలుకు వెళ్ళింది?''

''పిల్లలూ?''

''తొలికాన్పు — నవమాసాలు నిండిపోయాయ్. ఏ క్షణంలో ప్రసవిస్తుందో? వాడికి యింకెవరూ లేరు. వాడికి ఆమె పరిస్థితి తెలిసే వుంటుంది. వచ్చితీరుతాడు. అప్పుడు ఆ పాకలో వాడ్ని పట్టుకో వచ్చు-"

''అయితే...''

''మీ సంశయం...వాడు రాకపోతే యెలా అనా? ఆ దగ్గరలో కొండవుంది చూశారా? ఏ తుప్పల్లోనో దాగొనివుంటాడు. అందుకే కదా మేమీ కూలివాళ్ళ డ్రెస్‌లో వున్నాం..అర్ధరాత్రి దాటగానే..దిగుతాడు."

''ఈలోగా ఆమె ప్రసవిస్తే...''

"పుట్టిన పిల్ల ఏడుపువిని దిగిపోతాడు...''

"ప్రసవం చిక్కైతే...''

''లోకంలో యెందరు చావటంలేదు. ఒక నేరస్తురాలు పోలీసువాళ్ళ లిస్టునుంచి తగ్గుతుంది...''

డాక్టరు మెల్లగా అక్కడే స్టాండుకువున్న రైనుకోటు వేసుకుంటుండగా ''ఎక్కడకు ప్రయాణం?''

"ఆ నిండు చూలాలను యిక్కడకు తీసుకవస్తాను''

''నా మాట వినండి. మీరు అనవసరంగా యీ నేరస్తుల వ్యవహారాల్లో చిక్కుకుంటున్నారు.''

"మీరు చెప్పవలసినవి చెప్పారుగా...''

''కనికారం అందరికీ చూపించడం మంచిదికాదు. పాముకు పాలిచ్చి పెంచినట్లే అవుతుంది. నా మాటవినండి. మీ చేతులకు బేడీలు వేసే పరిస్థితిని తీసుకు రాకండి.''

"నేనేం నేరం చెయ్యలేదుగా...?''

''నేరస్థురాలను మీ యింట్లో పెట్టుకోబోతున్నారు. మాకు దక్కబోయే ఖూనీ కోరుని మాచేతికి చిక్కకండా చేస్తున్నారు... మీరు వెళ్ళటానిక్కి వీలులేదు.''

''నాతో మీపని అయిపోయిందిగా... మీరిక వెళ్ళవచ్చును'' అంటూ ముందుకు నడిచాడు. అతను వెళ్ళిపోతూ ''మీరేకాదు. మీ కుటుంబాన్ని — తరతరాలవారినీ బాధపెట్టుతున్నారు'' అన్నాడు. వర్షం యింకా పడ్తు నేవుంది.

కారు స్టీరింగు పట్టుకునే సమయానికి వందన పరుగునవచ్చి చెయ్యి పట్టుకుంది. "వద్దు - వద్దు - వెళ్ళకండి...''

''తడిచి పోతున్నావ్..రా నువ్వూరా..''

''నేనూ రానూ, మీరూవెళ్ళొద్దు. ఈ కనికారం మన బ్రతుకుల మీదకే వస్తుందని...''

డాక్టరు కారుతలుపు తీసాడు. ఆమె లోన కూర్చొని అతనిభుజం పట్టుకొని ధైర్యంగా "దానికేమైనా మన మీదకే వస్తుంది. అలాంటి నేరస్తులతో మనకేంపని? మనకీ పిల్లలున్నారు—వాళ్ళ భవిష్యత్తయినా ఆలోచించండి.''

డాక్టరు కారు యింటిముందుకు తీసుకువెళ్ళి తలుపుతెరుస్తూ — ''నీవే ఆ పరిస్థితిలో వుంటే...?'' ఆమె మాటాడకండా దిగిపోయి చరచర యింట్లోకి వెళ్ళిపోయింది. డాక్టరు తిన్నగా కారు తీసుకువెళ్ళి ఓవర్ బ్రిడ్జిమీద ప్రక్కకు ఆపాడు. టార్చిలైట్ వేసుకొని బురదలో దిగాడు. ఒక ప్రక్క రోడ్డుగోడ, మిగతా మూడు ప్రక్కలు చిన్న రేకులూ, తడికలూ కలిపికట్టిన గోడలు. వర్షంవెలిపిరి ఒక పైపునుంచి బాగా కొట్టోంది. లోన ఒక మూలకు బురదలో ఒక స్త్రీ మూలుగుకుంటూ వణుకుతూ ప్రసవవేదన పడుతోంది.

"ఈ దగ్గరలో నున్న డాక్టరుని. నా యింటికిరా అమ్మా — పురుడు పోసుకొని వచ్చేద్దువుగానీ...''

ఆమె మూలుగుతూ ''దేముడిలా

వచ్చావు బాబూ లేకపోతే — గతిలేక చచ్చిపోయేదాన్ని...''

ఆమెను మెల్లగా లేవనెత్తాడు. తనమీద నున్న రైన్‌కోటుతో ఆమెను కప్పి అతి కష్టంమీద రోడ్డు యెక్కించాడు. అతను పూర్తిగా తడిచిపోయాడు. కారు యింటి ముందర ఆగినా భార్య యెదురుపడలేదు. డిస్పెన్సరీ ప్రక్కనేవున్న గదిలో మంచం మీద ఆమెను వేసాడు. తను బట్టలు మారుస్తున్నప్పుడైనా భార్య అతనివేపు చూడలేదు. బీరువాలో ఆమె చీరెలు రెండు, దుప్పటి తీసుకవెళ్ళు తున్నప్పుడైనా యెందుకని అడగలేదు.

రాత్రి పన్నెండు దాటి పోయింది. డాక్టరు ఆమె విషయంలో శ్రమ పడ్తున్నాడు. ఇంకా పురుడురాలేదు. వందన కిటికీలోనించి వర్షంలో తడిచిపోతున్న కారును చప్పున చూసింది. భర్త యింటికి సంబంధించిన విషయాల్లో యెప్పుడు శ్రద్ధతీసుకున్నారని? తను పట్టుపట్టనిది, తగువు తెచ్చుకోనిది ఈ కారుమాత్రం వచ్చిందా? సుఖించడానికి అవకాశా లన్నీవున్నా బాధపడే భర్తనుచూస్తే ఆమెకు యేవగింపుకలిగింది. వెళ్ళి కారును గేరేజీలోపెట్టి వచ్చింది. అంగటి తలుపులు చారవేద్దామనుకుంటుంటే ఒకడు వర్షంలో తడిచి ఆమెను లెఖ్ఖచెయ్యకుండా లోన పడ్డాడు. పడినవెంటనే దాచిన పదునైన కత్తితీసి ఆమె ఎదురుగాపెట్టాడు. ఆమెగుండె ఆగిపోయినట్లయింది. కళ్ళు నిల్చుండి పోయాయ్. నోరు ఆవళించినా మాట రాలేదు. పెద్దకేక వేయాలనుకొంది. కానీ కొయ్యబారిపోయింది. ఆ క్షణంలోనే ఆమె అనుకున్న సుఖాలన్నీ యీ కత్తితో ఛేదింపబడి పోయాయ్.

వాడు నవ్వుతూ కత్తిమళ్ళీ మొలలో దాచిపెట్టాడు "లోపలనించి మూలుగు వస్తుంది...మా యింటిదేకదూ?"

"హాఁ...'' అని మూలిగింది.

"ఆనాడు ఓ కంట సూస్తుండని సెప్పినానుకదా? మా తల్లి ఆపదలో దాన్నోకంట సూసినావు..."

"ఆఁ—ఆఁ'' అంది

"నాకు తెలుసును — నువ్వు సూస్తావని. దాన్నే నువ్వు తేకండా వుంటే అది అక్కడ సచ్చిపోను...అది సచ్చిపోతే...నీకూ... పిల్లలకీ యీ కత్తితో ... ఫైసలా సేసేద్దును..."

ఇంతలో యీ గొడవకు డాక్టరు బయటకు వచ్చాడు. డాక్టరుని చూడగానే సాష్టాంగపడిపోతూలేచి "మా రాజా—నాను మా సెడ్డోడ్ని—తాగుతాను — దొంగతనం సేస్తాను...అవుసరం అయితే పీకలు యీ కత్తితో కోసేస్తాను — అమ్మ — పిల్లలతో ఒక రోజున అలాగ ఆ బిరిజి మీదికి షికారుకు వస్తే — మావి ఒంటిపేణాలు — యిరుగునేదు — పొరుగునేదు — దగ్గరవున్నావమ్మా—కలిగిన యిల్లాలివి — డాక్టేరు పెళ్ళానివి — మాలాంటి బీదోలని ఓ కన్నుతో సూడమ్మా అన్నాను. మా రాజుతల్లీ యీ రేతిరికాడ మరిసిపోకండా తమర్ని పంపింది — మా దొడ్డ యిల్లాలు. మీ పిల్లలకూ మీకు బగమంతుడు నూరేళ్ళ ఆయుస్సువు యిచ్చి — మరి పది మేడలూ మిద్దెలూ యిస్తాడు"

మళ్ళీ డాక్టరు గబగబ లోనికి వెళ్ళిపోయాడు. ఆతృతపడుతూ లోనికి వెళ్ళబోతున్న ఆమె భర్తను లోనికి రానివ్వలేదు. అక్కడేవున్న బెంచీమీద కూర్చోబడిపోయాడు.

''కూర్చో ... తల్లీ ... కూర్చో ..." అన్నాడు.

ఆమె యెదురుగా వున్న కుర్చీమీద కూర్చుంది.

''ఇది వుత్తియెర్రి బాగుల్ది అమ్మా... అదిగాని యేం అయిపోనాదీ అంటే ఈ పట్నం పట్నం అంతా నిప్పంటించేస్తాను. ఎళ్ళి ఆ దేముడి ముక్కుమీద రకతం వచ్చినట్టు గుద్దుతాను..."

ఆమె విధిలేనట్లు వింటోంది.

"ఈ మేడలోకి వచ్చింది — దేముడి లాంటి మా రాజుసేతుల్లో పడ్డాది. దానికేమీ సెడుగు రాదులే — మీ కంటె తల్లి దండ్రులెవరున్నారు దానికి?''

"ఇది తొలికాన్పు"

''అవునమ్మా అవును—అదంతా అదొకగాద—

"నా బతుకే ఒక కథ. నే నెక్కడ పుట్టాను? ఎందుకు పుట్టినాను? ఎక్కడకు వచ్చినానూ? అంతా మాయతల్లీ...బతుకంతా మాయ! ఈ మాయ తెలుసుకోలేక యెన్ని కోరుకుంటాం, యెంతకొట్టుకుంటాం?''

లోనుంచి గట్టిగా మూలుగూ యేడుపూ వినిపిస్తోంది. వాడు లేచిపోయి యిటూ అటూ వెర్రిగా తిరుగుతున్నాడు. చివరకు ఒక్కసారి తలుపు కొట్టి "బాబ్బాబూ... నన్ను రానివ్వండి."

కొద్ది క్షణాలుపోయాక కెవ్వున ఒక కేక వినపడింది. తలుపు తెరువబడింది. అంతా ప్రశాంతం. ఎదురుగా నిల్చోగానే "కొడుకు..." అన్నాడు డాక్టరు.

"కొడుకా...నాకు కొడుకా...ఈ దొంగ నాయాళకి కొడుకు పుట్టాడా బాబూ?"

"అవును చూడు...''

దొంగ గెంతులువేస్తూ కారుతున్న కన్నీరు తుడుచుకొంటూ మొల నున్న కత్తిని గదిలో ఒక మూలకు విసిరేశాడు.

కొన్ని క్షణాలు మాటలు రాలేదు అప్పటికి గానీ భార్యవేపు చూడలేదు. ఆమె కళ్ళు మూసుకొని వుంది.

"రంగీ—రంగీ'' అన్నాడు మెల్లిగా.

రంగి పలుకలేదు. "బాబ్బాబు" అన్నాడు.

"బాగా శ్రమపడిపోయింది, అలా పడుకోనీ...నడు బయటకు, నడు...''

మెల్లగా బయటకు వచ్చాడు. ఇంకా కుర్చీమీద కూర్చున్న వందనతో "నా తల్లీ రా తల్లీ—ఇదంతా మీ చలవ...నా బాబును చూడండి" అంటూ ఆమె లేచేవరకు విడిచి పెట్టలేదు. చూసి "బాగున్నాడు'' అంది.

కాస్సేపయ్యాక వీళ్ళిద్దరితో పాటు డాక్టరు కూడా బయటకు వచ్చాడు.

"రా —" అన్నాడు.

ఆ దొంగ వెంట పడ్డాడు.

"నీ పేరు...''

"గోవింద్...''

''గోవింద్ : ఆ బట్టలతో వుంటే రొంప పట్టుంది...రా...బట్టలు మార్చు !" అంటూ బీరువానించి ఒక కమీజు, ఫేంటు తీసి యిచ్చాడు. అవి వేసుకున్నాక "రా...ఇక్కడ కూర్చో" అని డైనింగు టేబిలు యెదురుగా నున్న కుర్చీ చూపించాడు.

"నేల కూర్చుంటాను బాబూ—''

''ఫరవాలేదులే...రా" అంటూ చెయ్యి పట్టుకొని కూర్చో బెట్టాడు. భార్యకు సైగ చేశాడు. ప్లేటులో జామ్‌రాసిన బ్రెడ్ తెచ్చి పెట్టింది. మాటాడకుండా ఆత్రుతగా గోవింద్ తిన్నాడు. హల్వాముద్ద పెట్టింది. అదీ ఖాళీ—అరటిపళ్ళు అరడజను పెట్టింది. అదీ పూర్తయింది. గ్లాసుడు నీరు త్రాగాడు. మరు క్షణంలో వాడి కళ్ళవెంబడి నీరు కారటం మొదలుపెట్టింది. కమీజుతో తుడుచుకుంటూ, "రెండు రోజులై ఆరాటనపడి కడుపు కాలుతున్నా మరి మాట రాలేదు దంపతు లిద్దరూ మౌనంగా వున్నారు. ఉప్పొంగి పోతున్న దుఃఖాన్ని దిగమ్రింగటానికి ప్రయత్నిస్తూ "తమరు చూపించిన దయలో నూరోవంతు–సివరికి మా అయ్య సూపించినా యిలాగ దొంగని అయ్యే వాడ్ని కాదు బాబూ :''

మళ్ళీ దుఃఖం పెళ్ళుబికి పోయింది.

''ఇంత సెద్దోడికి యింత గౌరవం యెందు కిస్తారు బాబూ ?''

డాక్టరు మెల్లగా ''మనిషి దేవుని ముద్దుకొడుకు — అందుకే ఆలోచించడానికి మెదడు యిచ్చాడు. మనుష్యుల్లో మెదడు లేని వాళ్ళే తోడు మనిషిని చెడ్డవానిని చేస్తారు...ఏడవకు !''

"బాగా చెప్పావ్ మారాజా! నేను చేస్తున్న వన్నీ పాపం పనులని నాకు తెలుసు. కానీ యేం సేస్తాను ? నాకే తినడానికి తిండి కట్టుకోడానికి గుడ్డవుంటే దేముడు వద్దన్న యీ పనులన్నీ సేస్తానా బాబూ ?"

ఆతని జీవితం తెలుసుకోవాలన్న ఆతృతతో డాక్టరు "పాపం : చాలా కష్టాలు పడి వుంటావు.''

"కష్టాలంటావా బాబూ? అవన్నీ తలసుకుంటే మరి బతకలేను. మా యమ్మ సచ్చిపోనాది నా కొచ్చింది బాధ! మా యమ్మ వుంటే నాలుగింటి నౌఖరీ సేసి మా అయ్య తాగడానికి యిచ్చేది. అది లేకపోబట్టి మా అయ్య కర్రతో బాదీ మరీ జేబుదొంగతనాలకి పంపించేవోడు. దొరికిందంతా లాగుకొనే వాడు. వాడు తాగే వోడు. నాకు తాగించే వోడు. తాగి తాగి ఒక రోజున నడుస్తూనే రోడ్డుమీదపడి సచ్చిపోనాడు. ఏకాకిని. ఆడున్నప్పుడు నాలుగు కొట్టినా నావాడని ఒకడుండే వాడు. అన్నిటికీ నేనే అన్ని యిదాల వయసు వచ్చేసరికి పాడుపడి పోయాను—పట్టుబడి పోయాను. జైలుకు వెళ్ళాను. వచ్చినాను. ఎక్కడైనా నౌకరీ దొరుకుతుందేమో అని చూసాను. శిక్షపడి నోడికి నౌకరీ యెవురిస్తారు ?

''మళ్ళీ దొంగతనాలు. ఇంచుమించు నా వయసు దాయే — నాకు దాపురించింది. ఎంత తెచ్చినా దాని దాహం తీరింది కాదు. దాన్నించే మళ్ళా జెయిలుకెళ్ళాను. నాను తిరిగి వచ్చేసరికి అది యింకోడితో లేచి పోయింది. మనసు చెడిపోయింది. లోకం అంతా డబ్బుతోనే వుంది మారాజా, యవడి బాగు ఆడిది. ఎవడితోవ ఆడిది. మట్టిని పుట్టిన సెట్టు మనిషికి కాయలూ పళ్లూ యిస్తాది. మనిషికి పుట్టిన మనిషి తోడిమనిషిని సూడనేడు. బాధలన్నీ సూసి దేముడిమీదే సిరాకెత్తింది. మాకు కూడూగుడ్డా లేనిది నీకు బంగారం కిరీటం యెందుకయ్యా అని గుడిలోనే కన్నంవేసాను. ఆ కిరీటంవల్ల వచ్చిన డబ్బుతో బట్టలుకొని సుట్టుపట్లవున్న లేనోలకి పంచి పెట్టేసినాను.

"ఆనాడే నాకొకడు కలిశాడు. తాగి పెళ్ళాన్ని బాదుతున్నాడు. అడ్డుకుంటే నన్ను కొట్టాడు. అదేంటో ఆనాడు మా యమ్మే గేపకానికి వచ్చింది. మా యమ్మలాంటి ఆడదాన్ని అప్పటికి నా సుట్టుపట్ల సూడనేదు. ఆ ఆడదాన్ని సూడగానే అదేంటో నా కంత అభిమానం పుట్టుకొచ్చింది. వాడివళ్లు పచ్చడి చేసేను. సచ్చిపోతాడేమో అనుకున్నాను. బతికేడు. నానంటే పక్కబెదురుగా వుండేది. నాతో దొంగతనాల్లో ఒంతు కలిశాడు. మా యిద్దరివైరం పోయింది. నాతో అంతా సెప్పుకున్నాడు. అది వాడి పెళ్ళాంకాదు. మంచికబుర్లాడి నమ్మించి తీసుకొచ్చాడట. ఆడి అసలు పెళ్ళం పిల్లలూ వూర్లో

వున్నారట. వాడు దొరికిందంతా తాగుడుకే పోసాడు. నేను వాడి పెళ్ళాం తిండికి సరి పడింది యింట్లో వేసేవాడిని. వాళ్ళ యింట్లోనే తినేవాడిని.

"ఒక రోజున పోలీసులను తప్పించుకోటానికి రైలుబండిమీద చెయ్యిజారి నేలపడి సచ్చినాడు.

"దీని కింకెవరూ గతిలేరు. నాను కట్టుకున్నాను. సుఖంఅంటే దీనివల్లే యెరుగుదును బాబూ! నామాటకు ఒక నాడు యెదురు తిరగలేదు. నాకు సారాకావాలంటే తెస్తూ పట్టుబడిపోయి జైలు కెళ్ళిపోయింది. ఇంటికొస్తే కమ్మని కబురు, కడుపునిండా తిండి కంటినిండా కునుకు యిచ్చింది. ఇప్పుడు నా వంశాన్ని నిలబెట్టింది." వర్షం తగ్గిపోయింది. డాక్టరు ఒక నిట్టూర్చి "ఇంత గడిస్తూ ఆ పాకలో వున్నావేం ?"

గోవింద్ నవ్వాడు "నాయం అనేది లోకాన సావనేదు బాబూ! అది సచ్చిపోతే పొద్దు పొడుస్తుందా గాలి వీస్తాదా ? పాపం! డబ్బున్న కొంప గడుస్తాదా ? నీతిలేని కొంప నిలుస్తాదా ?''

"ఇన్ని తెలిసి...'' ఆమె అందుకుంది.

"గోతిలో యెందుకు పడ్డావంటావమ్మా...ఏం సెయ్యమంటావు ? కడుపు మాసంద్రం— తెల్లారితే పరగడుపే ... ''

గోవింద్ ఒక్కసారి యేడుస్తున్న కొడుకు వున్నగదివేపు చూశాడు. డాక్టరు వెళ్ళగానే యేడుపు ఆగింది. తిరిగివచ్చి దగ్గర కూర్చోగానే గోవింద్ ముఖం వెలిగింది—

"సూడమ్మా...ఇన్ని పాపాలు చేసినా దేముడికి నేనంటే యెంత కనికారమో ? మీ యింట్లోనికి తెచ్చి— ఒక పండులాంటి కొడుకునిచ్చాడు. ఇంకా దేముడికి యెదురు తగిలితే కోపంరాదూ ? మానాన్న దొంగతనం చేసాడు—తాగాడు. నాకూ అవే అబ్బాయి. నా కొడుకు కెదరగానేను చేస్తే నా కొడుక్కీ అవే అబ్బుతాయి. అంచేత యీ వేళనించి దేముడి తోడు ... యీ చెడ్డపనులన్నీ మానేస్తాను. కష్టపడి కూలి సేసుకుంటాను. రెండు రోజులకి ఒకసారి గెంజి తాగినా తృప్తితో బలంగా వుంటాను"

ఇంతలో బయట తలుపు యెవరో తట్టారు. డాక్టరువెళ్ళి తలుపు తీయగానే బైటనిలబడే సీ. ఐ. డి. మెల్లగా "మిమ్మల్ని అభినందించాలి"

డాక్టరు బయటకు వెళ్తూ ''ఎందుకూ ?'' అన్నాడు.

"వాడ్ని పట్టుకోడానికి మీరు సహాయం చేసారు.''

డాక్టరు రెండు చేతులూ చూపించి "నా చేతులకు కూడా బేడీలు వెయ్యండి."

''మీ రెలాగైనా వెళ్ళి ఆమెను తీసుక వచ్చి మీ యింట్లో పెట్టాలని అలా జడిపించాను. మీ పట్టుదల మేం అనుకున్నట్లే హెచ్చయిందిగా."

"వాడు అక్కడికే వచ్చేవాడు. నా యింట్లో వాడ్ని యెందుకు అరెస్టు చేస్తారు ? వాడు నా అతిధి.''

"మాకు తెలుసు వాడు అక్కడికి రాడని. ఇక్కడికి మీరు తీసుక రావటం వాడే మూలనించైనా చూస్తాడు. ఇక్కడకు మేం రాలేమనే ధీమాతో వస్తాడు. ఏం ? అనుకున్నట్లే జరిగిందిగా."

"అయితే యిప్పుడేం చేయదలచారు?''

''వాడు తప్పించుకొని పారిపోకుండా మీ యింటి చుట్టూ పోలీసులు చుట్టుముట్టారు. వాడ్ని అరెస్టు చేస్తాం—మేజస్ట్రేటు ముందు నిలబెట్టాం —"

"వాడు యిప్పుడు మొదటి రకం మనిషి కాడు. పూర్తిగా మారిపోయాడు. కొడుకును చూడగానే చెమటోడ్చి గంజిత్రాగి బ్రతుకుతానంటున్నాడు — వాడ్ని దయచేసి విడిచి పెట్టండి—న్యాయంగా బ్రతకడానికి అవకాశం యివ్వండి.''

''చట్టం సమ్మతించదు."

"కానీ దేవుడు సమ్మతిస్తాడు."

''చట్టం మనిషి చేసింది...''

"కానీ దేముడు మనిషిని చేసాడు."

"మీరు యీ శతాబ్దం మనిషిలా లేరు. ఎదురుగా కనపడే నగ్న సత్యం చట్టం. ఒక విధమైన నమ్మకం దేముడు. మాకు నమ్మకాలతో పనిలేదు. నిజంతో పని..." అంటూ ముందుకు పోతుంటే డాక్టరు చెయ్యి అడ్డు పెట్టాడు. సి. ఐ. డి. బేడీలు తీసి అతని ముందుపెట్టి అతని చేతులు త్రోసుకుంటూ లోనికి వెళ్ళాడు.

అప్పటికీ గోవింద్ వందనతో యింకా కబుర్లు చెప్తున్నాడు. వీళ్ళను చూసి చప్పున లేచి పోయి పారిపోవటానికి బయటకు బేడీలతో వెళ్తూ వీధి గుమ్మం దగ్గర గోడకు ఆనుకొని నిల్చున్న డాక్టరు వేపు చూసాడు. డాక్టరు తలదించి వున్నాడు.

"బాబూ...నా కోసం విచారించకండి. మీ రుండగా నా కేం బెంగనేదు.''

వాళ్ళంతా వెళ్ళిపోయినా డాక్టరు అలా శూన్యంగా చూస్తూ నిల్చుండి పోయాడు.

ఆ మూడో రోజున రాత్రి భోజనాల దగ్గర వందన అన్నది. వాడు తిరిగి జైలునించి వచ్చేవరకూ "ఆమెను యిక్కడే వుంచేద్దాం.''

ఇండియాపై చైనా దుష్ప్రచారం

కొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఆసియా — ఆఫ్రికాదేశాలు చైనా కుతంత్రాలను ఒక కంట కనిపెట్టే వున్నాయి. పచ్చి దౌర్జన్యం, శాంతియుత విధానాల ముసుగుతో ఆసియాపై పెత్తనం వహించడానికి చైనా పన్నాగాలు పన్నుతున్నది. తన దురాక్రమణ చర్యలను అమలుజరపడంలో భారతదేశం అడ్డంగా కన్పిస్తున్నది.

ఆసియా—ఆఫ్రికాదేశాల సమావేశం జరిగినప్పుడల్లా, ఆసియా, ఆఫ్రికాదేశాల ఐకమత్య పరిరక్షణను గురించిన చర్చలు జరిగినప్పుడల్లా—ఇటీవల మోషిలో జరిగిన చర్చలలో కూడా — చైనా ప్రతినిధులు, చైనాజాతి దురాక్రమణ వాంఛలేనట్టిదని, శాంతియుత విధానాలకు కట్టుబడి వున్నదని నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తూనే వున్నారు. చైనాలో ప్రజా ప్రభుత్వం 1946 లో గద్దెక్కినప్పటినుంచి, ఆసియా దేశాల వ్యవహారాలలో చైనా నిర్వహించిన పాత్ర సరైన పాళంలోనేవుంది. ఆసియాలోని పొరుగునగల మిత్రదేశమైన భారతదేశంపై ఒక నిర్ణీత పథకంలో చైనా దాడి ప్రారంభించడంతో, చైనా నాయకులు నిర్మించ నుద్దేశించిన చైనా శాంతిప్రియత్వం పటాపంచలైంది.

సహజీవన సిద్ధాంతంపట్ల చైనా బహిరంగంగా వ్యక్తపరచిన అసహ్యం ఆసియా ఆఫ్రికాదేశాలు గుర్తించాయి. దీర్ఘకాల వలస పరిపాలననుంచి విముక్తి పొంది కొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఆసియా ఆఫ్రికాదేశాలు, తమస్వాతంత్ర్య పరిరక్షణతోపాటు, ఆర్థిక సాంఘిక అభివృద్ధి ప్రణాళికలను అమలుజరపడంలో అత్యంత శ్రద్ధాసక్తులతో వున్నాయి. బాండుంగ్ సమావేశం ఆమోదించిన దశ సూత్రాలు ఆ దేశాల ఉద్దేశాలకు ప్రతిబింబాలు.

ఒక శక్తివంతమైన దేశం ఈ సిద్ధాంతాలను వుల్లఘించినప్పుడు ఉత్తరోత్తరా తమకు కూడా ఆ దేశంనుంచి ప్రమాదం తప్పదన్న విషయాన్ని ఆ దేశాలు తెలుసుకున్నాయి. సామ్రాజ్య విస్తరణ విషయంలో సుదీర్ఘ చరిత్ర కలిగివుండి, పెరుగుతూన్న జనాభా వత్తిడివల్ల దేశ విస్తరణకు ఉద్యమించిన చైనా అట్టి వాంఛ కలిగివున్నపుడు మంచి చెడ్డలతో నిమిత్తం లేకుండా తాను అనుకున్నది చెయ్యాలన్న అంధవిశ్వాసంతో కూడిన చైనాను చూచి వారు భయపడడం సహజం.

చైనా భారతదేశంపై దాడి చేయడంలో ప్రశాంత సహజీవన సిద్ధాంతంపట్ల చైనాకుగల అసహ్యం స్పష్టంగా తెలుస్తున్నది. బాండుంగ్ సమావేశంతర్వాత, చైనా ప్రశాంత సహజీవన సిద్ధాంతంపట్ల విశ్వాసంతో ఆసియా ఆఫ్రికాలలోని యితర దేశాలతో వ్యవహరిస్తుందన్న విశ్వాసం ఆసియా, ఆఫ్రికా దేశాలలో సన్నగిల్లినది.

చైనా భారతదేశంపై దాడి జరపడంతో చిన్న దేశాలన్నీ పెకింగు శాంతి వాంఛలను అనుమానించ జొచ్చాయి. సామ్రాజ్య వాదులపై దాడి పేరుతో భారతదేశంపై దండయాత్ర సాగించే సరికి వారికి ఆశ్చర్యం కలిగింది. ప్రపంచ శాంతి, ప్రశాంత సహజీవన సిద్ధాంతాల విషయంలో చైనా, రష్యాలమధ్య సిద్ధాంతరీత్యా విభేదాలు వచ్చాయి కూడా.

1946 లో చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచీ చైనా అనుసరిస్తున్న విదేశ విధానం, సైనిక విధానాలను పరిశీలించి చూస్తే, సైనిక బలంద్వారా విస్తరణ, విద్రోహచర్యలకే ప్రాధాన్యం వున్నట్లు బోధపడక మానదు.

చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం లోపుగానే మావ్ సేటుంగ్ సైన్యాలు పొరుగునవున్న బలహీన దేశాలైన కొరియా, టిబెట్టులపై విరుచుకొని పడ్డాయి. ఈ చర్యలవల్ల రేగిన అంతర్జాతీయ గాలి దుమారంలో కమ్యూనిస్టు ప్రభుత్వం తన ప్రజలకు దేశ పునర్నిర్మాణ విషయంలో యిచ్చిన వాగ్దానాన్ని నిర్లక్ష్యం జేయడం జరిగింది. ప్రజలకు శాంతిని చేకూర్చడానికి బదులు కొరియా యుద్ధంలో మూడేళ్ళ పాటు ముంచడం జరిగింది. టిబెట్ ఆక్రమణ కొరియా యుద్ధం ముగిసేవరకు

నమామ్యహమ్

సోమసుందర్

వందనమమ్మా నందనవనమా
సుందర సురుచిర సుహాసినీ !
చందన తరు పరిమళహాసనీ,
కాంచనవల్లీ — కమ్మనితల్లీ
భూయో భూయో నమామ్యహమ్.

కరువులు బరువులు వగపులగడ్డలు
తొలంగ జేయుము విభావరిన్ ;
నరుని గళమ్మున కల్హారమాలిక
లలంకరించుము స్ఫురన్మణీ !
భూయో భూయో నమామ్యహమ్.

సాహిత్యోత్సవ సంగీతోద్భవ
శిల్పకళామయ సుమంగళీ !
తుషారవేల్లిత, అరవిందస్మిత
శ్యామలగాత్రీ సునందినీ !
భూయో భూయో నమామ్యహమ్.

గతేతిహాసము, ఆగత కోశము
లావర్తించుము ప్రభాతమా !
మహాప్రభావము మంజులభావము
సమీకరించుము ప్రస్తుతమా !
భూయో భూయో నమామ్యహమ్.

జలాశయమ్ముల జనాశయమ్ముల
సమాదరించుము నందనమా !
తెలుగుల తల్లీ వెలుగుల వెల్లీ —
సుందర చంపక సుమవల్లీ
భూయో భూయో నమామ్యహమ్.

వందనమమ్మా సుందరసుమమా,
స్ఫురదంచిత నవ శుభ తరణీ !
లసన్మరంద స్నపిత కరయుగళ
గళన్మాధురీ ప్రదీప తరుణీ !
భూయో భూయో నమామ్యహమ్.

ఆపివేయబడింది. మూడేళ్ళు యుద్ధం చేసినతర్వాత కొరియాలోగాని టిబెట్‌లో గాని సాధించిన దేమీలేదు. మరో దండయాత్రకు దిగేముందు పశ్చిమ రాజ్యం వలస పాలన క్రిందవున్న ఇండో చైనాను ఎంచుకున్నది. తర్వాత లావోస్, కంబోడియాలలో జోక్యం కల్పించుకోడం జరిగింది. ఈ చర్యలు ఒక్క వియత్నాంలో తప్ప మరెక్కడా ఫలించలేదు. తమ రాజకీయ అధికార విస్తరణకు సైనిక జోక్యం, జాతీయ స్వాతంత్రోద్యమాలలో ప్రవేశించడం చైనా పద్ధతిగా వున్నది.

విదేశాలలోని చైనీయులు

చైనావారు కొన్ని శతాబ్దాలుగా ఆగ్నేయాసియాలోని దేశాలలోకి వ్యాపించారు. థాయ్‌లెండ్, బర్మా, మలయా, ఇండోనీసియా, ఫిలిప్పీన్సు లలో చైనావారు వున్నారు. చైనీయులు విదేశాలలో స్థిరపడినా వారి విధేయత మాతృదేశంపట్లనే వుంటున్నది. కొమింటాంగ్ ప్రభుత్వంలోను, కమ్యూనిస్టు ప్రభుత్వంలో కూడా విదేశాలలోని చైనీయుల సంక్షేమంకోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ వుండేది. ఆగ్నేయాసియాలోని ప్రతిదేశం, పెకింగ్‌తో స్నేహ సంబంధాలుగల ఇండోనీసియాతో సహా అలజడి తప్పలేదు. మలయాలో కూడా అక్కడి చైనీయులవల్ల అల్లర్లు సంభవించాయి. ఇండోనీసియా గట్టి చర్యలు తీసుకున్నది.

అధికారం హస్తగతం చేసుకోవడం ద్వారా ఉపగ్రహ రాజ్యాలను నెలకొల్పే అవకాశాలు సన్నగిలడంతో ప్రశాంత సహజీవనం అనే కొత్త ముసుగు తొడుక్కొని చైనా ముందుకు సాగింది. వస్త్రాలు, తదితర సరుకులు ఎగుమతుల ధరలను తగ్గించి ఆ ప్రాంతంలో వ్యాపార విధానాలనే చైనా తారుమారు చేసింది. బ్యాంక్ ఆఫ్ చైనా శాఖలద్వారా విదేశాలలోని చైనీయులు తమ ఆదేశాలను పాటించినచో వారికి ఋణ సౌకర్యాలను కూడా కల్పిస్తున్నది.

ఆసియా నాయకత్వంకోసం చైనా తంటాలు పడుతున్నదని కొంతకాలం క్రిందట చెప్పబడింది. కమ్యూనిస్టు దేశాల నాయకత్వంకోసం ప్రయత్నిస్తున్నదని కొంతకాలం చెప్పబడింది. స్వదేశంలో యిబ్బందులు ఎక్కువైనాయని, వ్యవసాయాభివృద్ధి పథకాలు పటాపంచలయినాయని చెప్పబడింది. ఈ ప్రాంతంలోని స్వతంత్ర దేశాలను దాస్యంలో వుంచాలన్న చైనా లక్ష్యసాధనకు భారతదేశం అడ్డంకిగా తయారైంది. ఆసియాపై ఆధిపత్యం సాధించుకోడానికి మార్గావరోధంగావున్న భారతదేశాన్ని తొలగించుకుంటామన్న కాంక్షతోనే చైనా భారతదేశంపై దాడిచేసింది. ★



గణికుని రాజనీతి

ధరణీశుఁ డుద్యతదండుఁడై యుచిత
దండవిధానంబుఁ దప్పక ధర్మ
చరితులఁగా మహీజనుల రక్షించి
సద్వృత్తుఁ డగునది సర్వవర్ణములు
వరుసన తమతమవర్ణధర్మముల
వర్తిల్లుదురు గడవక దండభీతి
నరిమిత్రవర్జితుఁడై సమబుద్ధి యగు
మహీవల్లభుననుశాసనమును.

గుఱుకొని కార్యాకార్యము,
లెఱుఁగక దుశ్చరితుఁడై యహితుఁ డగునేనిన్
మఱవక గురునైనను జను
లెఱుఁగఁగ శాసించునది మహీశుఁడు బుద్ధిన్.

ధీరమతియుతులతోడ వి
చారము సేయునది మును విచారితపూర్వ
ప్రారబ్ధ మైనకార్యము
పారముఁ బొందును విఘాతపదదూరం బై.

జనపాలుఁడు మృదుకర్మం
బుననైనను గ్రూరకర్మముననైననునే
ర్పున నుద్ధరించునది ద
న్ననపాయతఁ బొంది చేయునది ధర్మంబుల్.

అమలినమతి నాత్మచ్ఛి
ద్రము లన్యు లెఱుంగ కుండఁదా నన్యచ్ఛి
ద్రము లిమ్ముగ నెఱుఁగుచు దే
శముఁ గాలము నెఱిఁగి మిత్రసంపన్నుం డై.

బలహీను లైనవో శ
త్రులఁ జెఱుచుట నీతి యధికదోర్వీర్య సుహృ
ద్బలు లైనవారిఁ జెఱుపగ
నలవియె యక్లేశసాధ్యు లగుదురె మీఁదన్

అలయక పరాత్మకృత్యం
బుల బతి యెఱుంగునది దూతముఖమునఁ బరభూ
ములవృత్తాంతము లెఱుఁగఁగ
బలుమఱుఁ బుచ్చునది వివిధ పాషండతతిన్.

నానా విహారశైలో
ద్యానసభాతీర్థదేవతాగృహమ్ముగయా
స్థానముల కడుగునెడ మును
మానుగ శోధింపవలయు మానవతతికిన్.

వీరు నమ్మంగఁ దగుదురు వీరు నమ్మఁ
దగరు నాకు నా వలవదు తత్త్వబుద్ధి
నెవ్వరిని విశ్వసింపక యెల్లప్రొద్దు
నాత్మరక్షాపరుండగునది విభుండు.

ఇమ్ముగ నాత్మరక్ష విధియించు
విధంబున మంత్రరక్ష య
త్నమ్మునఁ జేయఁగా వలయుఁ
దత్పరిరక్షణశక్తి నెల్లకా
ర్యమ్ములు సిద్ధిఁ బొందుఁ బరమార్థము
మంత్ర విభేద మైనఁ గా
ర్యమ్ములు నిర్వహింపఁగ
బృహస్పతికైనను నేరఁ బోలునే.

పలుమఱు శపథంబులు నం
జలియును నభివాదనమును సామప్రియ భా
షలు మిథ్యావినయంబులుఁ
గలయవి దుష్టస్వభావ కాపురుషులకున్.

తన కిమ్మగునంతకు దు
ర్జనుఁ డిష్టుఁడపోలె నుండి సర్పముపోలెం
దన కి మ్మగుడును గఱచును
ఘనదారుణకర్మ గరళ ఘనదంష్ట్రిలచేన్.

కడునలుకయుఁ గూర్మియు నే
ర్పడ నెఱింగించునది వాని ఫలకాలము పె
న్పిడుగును గాడ్పును జనులకుఁ
బడుటయు వీచుటయు నెఱుకపడియెడు భంగిన్.

తఱి యగునంతకు రిపుఁ దన
యరకటఁ బెట్టికొని యుండునది దఱి యగుడుం
జెఱుచునది రాతిమీఁదను
వఱలఁగ మృద్ఘటము నెత్తివైచిన భంగిన్.

తన కపకారమునను జే
సిన జనుఁడల్పుఁడని నమ్మి చేకొని యుండం
జన దొకయించుకము ల్లయి
నను బాదతలమున నున్న నడవఁగ నగు నే.

బాలుఁడని నమ్మి రిపుతో
నేలిదమునఁ గలసి యునికి యెంతయు వలదు
త్కీలానలకణ మించుక
చాలదె కాల్పంగ నుగ్రశైలాటవులన్.

మొనసి యపకారిఁ గడ నిడి
కొని యుండెడు నృపతి దీర్ఘకుజ శాఖాగ్రం
బున నుండి నిద్రవోయెడు
మనుజునకు సమానుఁడగుఁ బ్రమత్తత్వమునన్.

తడయక సామభేదముల
దానములన్ దయతోడ నమ్మఁగా
నొడివియు సత్య మిచ్చియు
ఇనున్ జననాథకృతాపకారులం
గడఁగి వధియింపఁగా నటుల
కావ్యమతం బిదిగాన యెట్టులుం
గడుకొని శత్రులం జెఱుపఁ
గాంచుట కార్యము రాజనీతిమైన్.

కావున సర్వప్రకారంబుల దపకారకారణు లయినవారిం బరుల నయిన బాంధవుల నయిన నుపేక్షింపక యాత్మరక్షపరుండవయి దూరంబు సేసి దూషించునది.

(రైవతకోత్సవము-అర్జునుడు యతివేషమున సుభద్రకడ సపర్యలందుట)

పొలుపుగఁ బూసి కట్టి తోడి
భూరివిభూతి ప్రకాశితంబు గాఁ
గలయఁగఁ దత్పరిజనులు
కాంస్య మృదంగ ముకుంద వేణు కా
హళపటహధ్వనుల్ చెలఁగ
నాటలుఁ బాటలు నొప్ప నెల్లవా
రలుఁ జని చేసి రర్చనలు రైవత
కాద్రికి నుత్సవంబుతోన్.

గురుకుచ యుగ్మముల్ గదలఁ
గ్రొమ్ముడులందుల పుష్పముల్ పయిం
దొరఁగ నిదాఘబిందు వితతుల్
చెదరన్ మదిరామదంబునం
బరవశ లయ్యు నిం పెసఁగఁ
బాడుచుఁ దాళము గూడ మెట్టుచుం
దరుణియ లొప్ప నాడిరి
ముదంబునఁ దమ్ము జనాలి మెచ్చగన్.

సారణ సత్య కాక్రూర విదూరథ
సాంబ సంకర్షణ శంబరారి
భాను సుషేణోగ్రసేన శైనే
యానిరుద్ధ హార్దిక్య కదోద్ధవాది
యాదవు లధిక ప్రమోదులై యొక్కటఁ
దరుణులుఁ దారును గరి కరేణు
హయశిబి కారూఢులయి తదుత్సవమున
కరిగితి మఱి జగద్గురుఁడు గృష్ణుఁ
డింద్ర లీలతో నుపేంద్రుండు రుక్మిణీ
దేవి మొదలుగాఁగ దేవులెల్ల
నొప్పు తోడరాఁగ నప్పర్వతమునకుఁ
జనియె సకలజనులుఁ దనకు నెరగ.

ఇట్లరిగి జనార్దనుండు ధనంజయుం దలంచి తత్సమీపగతుం డయి తోడ్కొని యాతనికి నప్పర్వతరమణీయ ప్రదేశంబులం జూపుచు విహరించి యిద్దఱు నొక్క విమలమణివేదికయం దభిమత సంభాషణంబుల నుండునంత.

క్వణదణు కింకిణీకలిత
కాంచన కాంచికలాపమున్ రణ
న్మణికల నూపురంబులు సమధ్వని
నొప్పంగ భక్తిఁ బాదచా
రిణి యయి కన్యకా జన
పరీత సుభద్ర తదద్రిపూజన
ప్రణతులు సేసె నింద్రసుతుఁ
బార్థు నిజేశ్వరుగాఁ దలంచుచున్.

దాని సుభద్రఁగా నెఱిఁగి
తత్క్షణజాత మనోజ సంచల
న్మానసుఁడైన యవ్విజయు
మానుగఁ జూచి మునీంద్ర నీకుఁ జ
న్నే నలినాక్షులందు మది
నిల్వఁగ నంచును మందహాసగ
ర్భానసుఁడై తథాంగధరుఁ
డాతని కిట్లనియెం బ్రియంబునన్.

నీవు సుభద్రయందు బద్ధానురాగుండ వగుట తొల్లియు నే నెఱుంగుదు నోడకుండుము. నీకోర్కె వసుదేవ దేవకీదేవులకుం జెప్పి సఫలంబు సేయుదునని యర్జునునకు హృదయానందంబుగాఁ బలికి యప్పుడు వడిగల చారుల రావించి ద్వారవతియం దర్జునుండున్న వాఁడను కుశలవార్త ధర్మజున కెఱింగింప నింద్ర ప్రస్థపురంబునకుం బుచ్చి యున్నంత నచ్చటికి వచ్చి బలదేవాది యాదవు లతి భక్తులై యతియ కా వగచి యర్జునునకు నమస్కరించి యాతని వలన సర్వ తీర్థంబులుఁ దత్సేవాఫలంబులును విని సంతసిల్లి యివ్వర్షాకాలంబు మాయందయుండి చాతుర్మాస్యంబు సేసి మమ్ముం గృతార్థులం జేయుండని ప్రార్థించి పార్థుం దోడ్కొని చని వానికి నన్నపానాది విధులం బరిచరింప సుభద్రం బంచి కన్యాపురంబునందు నివాసంబు సేసిన.

అందు ధృతిమందరుండు పు
రందర నందనుండు దనకు రమణగుణశ్రీ
సుందరి సుభద్ర నెయ్యం
బొందఁగఁ బరిచర్య సేయుచుండఁగ నుండెన్.

ధీరుఁడు యతిరూపంబున
నారఁగ నిం దున్నయాతఁ డర్జునుం డని స
త్యారుక్మిణులకుఁ జెప్పె ము
రారాతి రహస్యమున ననంత ప్రీతిన్.

అలయక నాఁడునాఁటికి లతాంగి
యపూర్వములైన భోజనం
బులు గడుభక్తిఁ బెట్టుచు
నపూర్వములైన వపుర్విలాసయు
క్తులు వెలయించుచున్ ముదముతోఁ
బెనిచెన్ మఱునాడు నాఁటి క
గ్గల మగుచుండ నెయ్యమను
గామవికారము సవ్యచాచికిన్.


మరియును.

అలినీలకుంతలుం డనియును
హారినీల సమవర్ణుఁ డనియు నాజానులంబి
తాయతస్థిర బాహుడనియు
నారక్తాంతనలినదళాకారనయనుఁ డనియు
నుత్తుంగ ఘనవిశాలోతస్కుఁ డనియును
గవ్వడి యనియును గరము వేడ్క
వివ్వచ్చు నెప్పుడు వినియెడునది దనవినినట్ల
యతిఁజూచి వీఁడు విజయుఁ
డో కాకో యనుచు సంశయోపేత చిత్తయై
యుండి యుండనోప కొక్కనాఁడు
భోజనావసానమున నున్న యమ్మునిఁ
కిందువదన ప్రీతి నిట్టు లనియె.

మునీంద్రా నీయాడని తీర్థంబులుం జూడని పురంబులు నెఱుంగని రాజకులంబును లేదని విచారింతు.

అమరావతికి నెన యనఁగ నివ్వసుమతిఁ
బరంగు నింద్రప్రస్థపురవరంబు
చూచితిరే పాండుసుతు లందు సు
ఖమున్న వారె మాయత్త యంభోరుహాక్షి
కుంతీమహాదేవి కుశలయే యమ్మహావీరుఁ
డర్జునుఁడు జితారి తీర్థ
గమనోద్యతుం డయ్యెఁ గ్రమరి వచ్చెనే
యెఱుంగుదురేని నాకెఱుంగఁ జెప్పుఁ

పబ్లిక్ వర్క్సు శాఖ కార్యకలాపాలు



తుంగభద్ర జలవిద్యుత్ — తుంగభద్ర నెల్లూరు హైడ్రో–థర్మల్ పథకాలు : తుంగభద్ర రెండవదశ పనులక్రింద నదినుంచి కాలువలో నీరు విడిచే స్థలంవద్ద, లంగరు వద్ద పనిమినహా లో ప్రెషర్ పైప్‌లైన్, పెన్‌స్టాక్, సర్జిటాంకుల నిర్మాణం సివిల్ పనులు పూర్తి అయ్యాయి. 3వ 4వ పెన్‌స్టాక్‌ల కాంక్రీట్, రెండవ యల్. పి. పి. యల్. పై మట్టిపొర కప్పడం పనులు చురుకుగా కొనసాగు తున్నాయి. ఆర్డర్ ఇచ్చిన పవర్ ప్లాంటు పరికరాలన్నీ ప్రాజెక్టు స్థలానికి చేర్చడం జరిగింది. తుంగభద్ర పవర్ స్టేషన్‌కు కావలిసిన హైడ్రో సెట్లను 1963_64 వ సంవత్సరంలోనూ, 30. యం. డబ్ల్యు. నెల్లూరు సెట్టును 1964_65 వ సంవత్సరంలోనూ తెప్పించడం జరుగుతుందని భావించ బడుతున్నది.

ఎగువ సీలేరు జలవిద్యుచ్ఛక్తి పథకం : సివిల్ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. స్విస్‌రుణం క్రింద జనరేటర్లు, టర్బనులు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్విచ్‌గేర్లకై స్విస్ పరిశ్రమదారులకు ఆర్డర్లు ఇవ్వడం జరిగింది. అన్ని పరికరాలకు అవసరమైన దిగుమతి లైసెన్సులు తీసుకోవడం జరిగింది.

రామగుండం జలవిద్యుచ్ఛక్తి పథకం ; రెండవదశ : డి. యల్. ఎఫ్. సహాయంతో యీ పథకాన్ని అమలు చేయడం జరుగుతున్నది. 60. యం. డబ్ల్యు. టర్బో–ఆల్టర్నేటర్లకై కేంద్రజల, విద్యుచ్ఛక్తి కమీషన్ ఆర్డర్లు ఇచ్చింది. దీనికీ సలహా ఫీజులకు అవసరమైన విదేశీమారక ద్రవ్యాన్ని కూడా విడుదల చేయడం జరిగింది. బాయిలర్, అనుబంధ విభాగాలకై స్పెసిఫికేషన్‌లను తుదిసారిగా రూపొందించడం జరుగుతున్నది. సలహా దారులను నియమించడం జరిగింది.

కొత్తగూడెం థర్మల్ పథకం : ప్రాథమిక సివిల్ పనులను ప్రారంభించారు. బాయిలర్లు, జనరేటర్లు, బయటి స్విచ్‌గేర్లకు సంబంధించిన స్పెసిఫికేషన్‌లను జారీచేసి టెండర్లను పిలవడం జరిగింది. 1963 జనవరిలో బాయిలర్లకు చెందిన టెండర్లు అందాయి. జనరేటర్లకు సంబంధించిన టెండర్లను 1963 ఫిబ్రవరిలోనూ, స్విచ్ గేర్లకు చెందిన టెండర్లను 1963 మార్చిలోను స్వీకరించడం జరుగుతుంది. పునర్నిర్మాణం అభివృద్ధి పనులకై యీ పథకానికి అంతర్జాతీయ బ్యాంకునుంచి సహాయం కోరబడింది. బ్యాంకు ప్రతినిధులు, శాఖాధికారులతో తరచుగా సంప్రదింపులు జరుపుతున్నారు. అవసరమైన సమాచారాన్ని వారికి అందజేయడం జరిగింది. ప్రపంచ బ్యాంకు త్వరలోనే రుణం మంజూరు చేస్తుందని ఆశించబడుతున్నది.

డనిన నేన చూపె యయ్యర్జునుండ నీ
యొద్ద నివ్విధమున నున్నవాఁడఁ
దరుణి నీకు నాకు ధరణీ ధరుండును
జలజభవుఁడు సేసె సంగమంబు.


బ్రాహ్మంబు మొదలుగాఁ గల యెనిమిది వివాహంబులయందును గాంధర్వ రాక్షసంబులు క్షత్త్రియులకు నుత్తమ వివాహంబులు గావున నిది గాంధర్వ వివాహంబున కవసరం బనిన సుభద్ర లజ్జావనతవదన యయి.

నన్ను నీనర్హులెల్ల నిందున్న వారు
వార యెఱిఁగిచేయుదురు వివాహమనుచు
వనజనేత్ర కన్యాపురంబునకుఁ జనియె
నరిగెఁ దన లతాగృహమున కర్జునుండు.


[నన్నయభట్టు భారతము - ఆదిపర్వమునుంచి]




ఉన్న బంగారం అంతా రక్షణనిధికి సమర్పణ : నల్లగొండకు చెందిన శ్రీమతి సి. హెచ్. వరలక్ష్మమ్మ ఆమెవద్ద ఉన్న మొత్తం 70 గ్రాముల బంగారం ఆభరణాలను రక్షణనిధికి విరాళంగా ఇచ్చారు.



గ్రామీణ స్వచ్ఛందదళం : అనంతపురంజిల్లా, గుత్తి బ్లాక్ కార్యాలయంలో గత జనవరిలో గ్రామీణ స్వచ్ఛంద దళంలో శిక్షణ పొందిన దళపతులు.




సైప్రస్ ఉపాధ్యక్షులు డాక్టర్ కుచ్చుక్, 1963 మార్చి 12 వ తేదీన
హైదరాబాదులోని మక్కామసీదును దర్శించారు.




కేంద్ర రవాణా, కమ్యూనికేషనుల మంత్రి శ్రీ జగ్జీవన్‌రాం, 1963 మార్చి 8 వ తేదీన
హైదరాబాదు, గౌలిగూడలో 5000 లైనుల టెలిఫోన్ ఎక్స్ఛేంజికి ప్రారంభోత్సవం
చేశారు. ఇంటర్‌మీడియెట్ డిస్ట్రిబ్యూషన్ ఫ్రేమ్‌ను ఫోటోలో చూడవచ్చు.

1963 మార్చి 7 వ తేదీన కేంద్రరవాణా, కమ్యూనికేషనుల మంత్రి శ్రీ జగ్జీవన్‌రాం హైద్రాబాదులో భారత ట్రావెల్ ఏజంట్సు సంఘం 12 వ సమావేశానికి ప్రారంభోత్సవం చేశారు.






లంబాడీ సుందరి.



గోలకొండ దుర్గం. (చూ. 73వ పేజీ)



వరంగల్లులోని 'నంది' కాకతీయుల శిల్పాలకు సుందరమైన నమూనా. (చూ. 73వ పేజీ)

ప్రశ్నలు-సమాధానాలు

శ్రీ యస్ వామనరావు వెంకంపేట అగ్రహారం, శ్రీకాకుళం జిల్లా

ప్రశ్న: విశాఖ పట్నంలో ఎరువుల ఫ్యాక్టరీని ఎప్పుడు నెలకొల్పుతారు?

సమాధానం: ఈ ఫ్యాక్టరీకి అవసరమైన భూమి, నీరు, విద్యుచ్ఛక్తి, సహాయక వరతుల ఆమోదం, పరికరాల దిగుమతికి అవసరమైన లైసెన్సు మొదలైన సమస్యలు ఇంకా పరిష్కారం కావల్సిఉన్నాయి. రెండు, మూడు సంవత్సరాలలో యీ ఫ్యాక్టరీఉత్పత్తి ప్రారంభించగల్గుతుంది.

శ్రీ యస్. హరిహరరావు. వెంకంపేట అగ్రహారం పంచాయతీ అధ్యక్షులు, శ్రీకాకుళం జిలా.

ప్ర: 1953వ సంవత్సరంలో సంకిలి వద్ద నాగావళి నదిపై నిర్మించిన విజయనగరం-పాలకొండ రోడ్డు వంతెన కూలిపోయింది. దానిని ఇంతవరకూ పునర్నిర్మించలేదు. **ఈ వంతెనను తిరిగి కడతారా?**

స. శ్రీకాకుళం జిల్లా సంకిలి వద్ద నాగావళిపై వంతెనను నిర్మించే ప్రతిపాదనలు యేమీలేవు. అయితే, పనసమండివాడవద్ద బ్యారేజితో కూడిన రోడ్డు వంతెనను నిర్మించడం వల్ల చాలాలాభాలు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు.

శ్రీ రావిపూడి యోగేశ్వరస్వామి, కొంత పాటూరు, గుంటూరు జిల్లా.

ప్ర: ఇతర రాష్ట్రాలలో బి ఇ, యం బి బి యస్ చదువుతున్న ఆంధ్ర విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తుందా? రుణాలను మంజూరు చేసేటట్లయితే ఏ అధికారులను కలుసుకోవాలి?

స. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రేతరప్రాంతాలలోని విద్యా సంస్థలలో చదువుతున్న ఆంధ్ర ప్రదేశ్ విద్యార్థులకు రుణాలు మంజూరు చేయడానికై 1962-63 వ సం. బడ్జెటులో కేటాయింపు యేమీ చేయలేదు. వచ్చే సంవత్సరంలో ఇటువంటి కేటాయింపు జరుగుతే రుణాలు పొందడానికై ఇంజనీరింగ్ విద్యార్థులయితే సాంకేతిక విద్యాశాఖ డైరెక్టరుకు, వైద్య విద్యార్థులయితే వైద్యసర్వీసుల డైరెక్టరుకు, వ్యవసాయం విద్యార్థులయితే వ్యవసాయశాఖ డైరెక్టరుకు, పశువైద్యం విద్యార్థులయితే పశుపోషణ శాఖ డైరెక్టరుకు దరఖాస్తులు పంపాలి.

శ్రీ ద్వారకా బి. గోపాలకృష్ణ, విజయనగరం.

ప్రశ్న: బ్లాకులలోని సాంఘిక విద్యాధికారుల సర్వీసులను ఇటీవలనే విద్యా శాఖకు మార్చినట్లు తెలియవచ్చింది. ఇది నిజమేనా?

స. సాంఘిక విద్యా కార్యకర్తల పదవులను తీసివేయాలనే ప్రతిపాదన ఉండింది. అయితే యీ పదవులను ఉంచాలని ఆ తర్వాత నిర్ణయించారు.

ప్రబోధము

పాతకోట రాధాకృష్ణమూర్తి

వాకులో బాకులో పదనుచూపిన మేటి
"బోసుబాబు" చరిత్ర మాసిపోదు !
గర్జించు సింగమై కదనానదూకెడి
"సర్దార్ పటేల్" సాహసంబు చెడదు !
ఎల్ల వారికి ధైర్యమిచ్చి ముందురికించు
"తాతయ్య" చిరునవ్వు తరుగలేదు !
రాష్ట్రానికై నిజప్రాణాల నిచ్చిన
"రామన్న" కీర్తికొంత లేదు !

రంగుగా ఉగ్గుపాలను రంగరించి
సాహసము నూరిపోయు నీ జాతిసుమ్ము —
అరుల తలకాయలను గోరువరకు నీవు
పదము త్రిప్పకు మేనాడు భారతీయ !

అదిగో "జవ్హారులాలు" దివ్యరథముద్య
త్కాంతి పుంజమ్ములన్
పదిదిక్కుల్ మిఱుమిట్లు గాగ కదలెన్
సంగ్రామ రంగమ్మునన్
పదరా భారతపుత్ర ! నీ బలము నీ
ప్రాశస్త్యముం జూపి యా
మద మాతంగ విరోధి కంధరములన్
మల్లాడి ఖండింపరా !

నెత్తురుబొట్టు చిందిన జనింతురు వేనకువేలు వీరు ల
త్యుత్తమ దేశభక్తులు—మదోన్నతులై మనమీద దూకు ను
న్మత్తుల బంతులట్లుసరిమార్గమునం బడవేయరే ! జగం
బెత్తిన గెల్వలేదునిను నేగుము ముందుకు భారతీయుడా !

తిమ్మిని బమ్మిచేయగలదిట్టలు — తిన్నగ తిన్నయింటి వా
సమ్ములు లెక్కవెట్టగల జాణలువేమని వచ్చినారు — లే
లెమ్ము! కృపాణపాణివయి లేశము జంకక పొట్టి వారి నొ
క్కుమ్మడి రూపుమాపు మదిగో రణనాదము భారతీయుడా!

"హింస" "అహింస" యంచు జపి
యించుచు నున్న స్వదేశ మిత్ర వి
ధ్వంసము పూర్తియౌను — పెర
వారిని చంపుటో లేదో యన్న మీ
మాంసలు కట్టిపెట్టుము — ప్ర
మాదము వచ్చిన వెన్నుచూపకే
హింసకునైన పాల్పడుట
యే రణధర్మము భారతీయుడా !

పచ్చని కాపురాలకును పాపము నెంచక రాతి గుండెతో
చిచ్చిడినాడురా ! అకట ! జేనెడు పొట్టకు నక్రమమ్ముతో
వెచ్చని నెత్తుత్రాగి యొక వీరునిగా తలయెత్తె-గుండెలో
గ్రుచ్చక వాడి బాకు నదిగో యిదిగోయని నిద్రపోదువా ?

పాలుపోసి బంగారంపు పళ్ళెరమున
త్రాగుమని యిచ్చినావు సర్పమ్మునకును —
అదియె నీ మేలు మరచి నిన్నార్పదలచె
రార ! మేలుకో ! వీర భారత కుమార !

మంచుమలమీద నంది గర్జించినాడు
కాళికాదేవియయ్యె లోకైకమాత
హరుడు చిచ్చుకంటిని తెరచినాడు
వైరి తప్పించుకొని బైటపడగలండె !

ఉడుగని పౌరుషమ్ము విజ
యోత్సవ కారణమోయి — సర్వథా
సడలని దేశభక్తి మన
జాతికి పెట్టని కోటగోడ — ముం
దడుగిడి భారతీయుల బ
లా బలముల్ చవి చూపిరమ్ము — అ
క్కడ జయలక్ష్మి నీదె ! రణ
గాండివ ! నిర్మల భారతీయుడా !

ప్రభుత్వ నిర్ణయాలు

కేంద్ర, సహకార బ్యాంకులు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు, హైద్రాబాదు సహకార అపెక్స్ బ్యాంకు అవిసీసుకున్న ఫిక్సెడ్ డిపాజిట్లను వడ్డీతో సహా తిరిగి చెల్లించడానికి మూడేండ్లు, అంతకుమించిన కాలానికి గ్యారంటీ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

విజయవాడలోని ఆంధ్ర రాష్ట్ర సహకారబ్యాంకు సీజనులో వ్యవసాయపు పనులకొరకై ఇండియా రిజర్వు బ్యాంకు నుంచి అప్పు తీసుకోవడానికి వీలుగా రూ. 50 లక్షల ప్రత్యేక పరిమితి వరకు గ్యారంటీ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

ఇదే విధంగా తణుకులో చక్కెర సహకార సంఘం, కొరకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి పాలకొల్లు వ్యవసాయ పరిశ్రమల సంఘ సభ్యులు వాటా ధనం పెట్టుబడి పెట్టడానికి రుణం పొందడానికి వీలుగా రూ. 15 లక్షలకు హామీ యివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

యునిసెఫ్, కేర్ మున్నగు సహాయక సంస్థలు బహుమతిగా పంపిన పాలపొడి ధాన్యంగింజలవంటి పదార్థాలను అక్రమంగా స్వాధీనంలో వుంచుకోవడాన్ని నిరోధిస్తూ శాసనం తయారు చేయడానికి కూడా ప్రభుత్వం నిర్ణయించింది.

ఆంధ్రప్రదేశ్, మైసూరుప్రభుత్వాలు సమిష్టిగా నిర్వహిస్తున్న తుంగభద్ర స్టీల్ ప్రాడక్ట్స్, కెనరాబ్యాంకునుంచి రూ.20 లక్షల మేరకు అప్పు తీసుకోవడానికి వీలుగా ఆర్థిక గ్యారంటీ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

తెనాలిలో చెరువు ప్రాంతంలో మునిసిపల్ ఆఫీసు, దుకాణాలు, గోదాముల నిర్మాణపు ప్రణాళికను అమలుపరచడానికి లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ నుంచి తెనాలి మునిసిపాలిటీ రూ. 10 లక్షల మేరకు అప్పు తీసుకోవడానికి వీలుగా గ్యారంటీ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

వ్యవసాయ సీజనల్ పనులకొరకు నెల్లూరు కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు తరఫున రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి విజయవాడ కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు ఒక కోటి రూపాయలు అప్పు తీసుకోడానికి వీలుగా హామీ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

సహకారసంఘాలకు బదులుగా పరపతిపైన చెరకు ఉత్పత్తిదారులకు పంపిణీ చేయడానికిగాను నేరుగా సహకార చక్కెర ఫ్యాక్టరీలకు అమ్మోనియా సల్ఫేట్ ఎరువును సరఫరా చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, గుంటూరు, నెల్లూరు, మహబూబునగరు, కర్నూలు జిల్లాల్లో జాయింట్ కలెక్టర్ల పదవులను రద్దుపరచడానికి విశాఖపట్నం హైద్రాబాదులలో ఈ పదవులను కొనసాగించడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

వ్యర్థ వ్యయం మానండి!
విలాసాలకు స్వస్తి చెప్పండి!
జాతీయ రక్షణ కృషిని బలపర్చండి!

ప్రజాస్వామ్యానికే సవాల్ !

సి. సుబ్రహ్మణ్యం

గత మూడుమాసాల్లో భారతదేశం ఒక మహత్తరమైన అనుభవాన్ని గడిచింది. జాతిచరిత్రలో కనీవినీయెరుగని చైతన్యం సర్వత్రా కనిపించింది. జాతీయ స్వాతంత్ర్య సమరాన్ని స్ఫురింపజేసే భావసమైక్యత నేడు ప్రస్ఫుటమవుతున్నది. ప్రస్తుత పరిస్థితిని యెదుర్కోవడానికి అసంఖ్యాక ప్రజలు ప్రదర్శిస్తున్న ఉత్సాహోద్రేకాలు ప్రశంసాపాత్రమైనవి.

దిగ్భ్రాంతికి గురియైన దేశం కేవలం ఒక ప్రతీకార చర్యకు పూనుకోవడం వంటిది కాదిది. అన్నిటికంటే ముఖ్యమైన విషయమేమంటే, మన ప్రజలకు ఈ దేశం మనదే అనే భావం కలగడమే. దేశం మనుగడకు ఇది జీవన్మరణ సమస్య. మనం రూపొందించుకున్న జీవిత విధానానికి ఇది ఒక అగ్నిపరీక్ష అని ప్రజలు గుర్తించారు. ఇది గణనీయమైన విషయం. మనలో ఎన్ని లోపాలువున్నా కూడా ఒక నూతన సమాజాన్ని సృష్టించుకోవడానికి ముందుకు చొచ్చుకుని పోతున్నాం. స్త్రీలూ, పురుషులూ ఒక నూతన దృక్పథానికి కట్టుబడి వున్నారు. భారతీయత్వం మన నాడులలో ప్రవహిస్తున్నది. ఇది అంతరించి పోవడానికి వీలులేదు.

భారత ప్రజాస్వామ్యాన్ని ఊగిసలాడించిన ఈ సవాల్ ఏమిటి? ఇది ద్విముఖంగా వుంది. మొదటిది ఏమంటే, మనకు స్పష్టంగా కనిపించేది సైనికులతో చైనా ప్రమాదాన్ని అరికట్టడమే. ఇది సైనిక వ్యూహాలకు సంబంధించిన సమస్య. సైనిక శక్తిని పటుతరం చేయడానికి అవసరమైన ఆర్థిక శక్తిసామర్థ్యతలను పెంపొందించడం ముఖ్యమని ఇందువల్ల ద్యోతకమవుతుంది. ఈ రోజులలో సైనిక శక్తికి పారిశ్రామిక ప్రాతిపదిక వుండాలి. ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ లేనట్లయితే సైనికంగా మనం శక్తివంతులం కాలేము.

పరిశ్రమల కీలక పాత్ర

ఆధునిక యుగంలో యుద్ధంయొక్క స్వరూప స్వభావాలు చాలా చిక్కులతో కూడుకొని వున్నాయని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. పరిశ్రమలకూ, రక్షణ సమస్యలకూ మధ్య అత్యంత సన్నిహిత సంబంధాలున్నాయి. సైనిక పద్ధతులు అభివృద్ధి చెందడం, పరిశ్రమల టెక్నాలజీ అభివృద్ధిచెందడంపై ఆధారపడివుంటుంది. కొన్ని సందర్భాలలో యుద్ధాలనుంచే, క్రొత్త క్రొత్త పారిశ్రామిక పద్ధతులు ఉత్పన్నమవుతాయి. అయితే నేడు, సాంకేతిక వృద్ధి సాధించిన దేశాని దే సైనికంగా పైచెయ్యి అయివుంటుంది. ఉదాహరణకు: అణుబాంబును తయారు చేయడానికి దేశాలమధ్యగల పోటీని పరిశీలించండి. ఆకాశవిజయంలో కూడా సైనిక తంత్రాలు నిగూఢమై వున్నాయి. యుద్ధ ప్రజ్వలనకుముందూ, ఆ తరువాతా వున్న పోటీలో పరిశ్రమలు అత్యంత కీలక పాత్ర వహిస్తాయి. మనం వున్న ప్రస్తుత పరిస్థితిలో ఈ విషయాన్ని విస్మరించలేము.

రక్షణ సమస్య అనేది మనల్ని ఎదుర్కొంటున్న పెద్ద సవాల్‌లో ఒక అంతర్భాగం మాత్రమే. ప్రజాస్వామ్యపద్ధతిలో వెనుకబడ్డ దేశాన్ని ప్రగతిపథంలో నడిపించడమే చాల ముఖ్యమైనది. లక్షలాది భారతీయుల జీవనస్థాయిని పెంపొందించడానికి మనదేశం చేస్తున్న అవిరళకృషి ప్రపంచ చరిత్రలో అపూర్వమైనది. ప్రణాళికా బద్ధమైన పద్ధతులలో వెనుకబడ్డ మనదేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి కృషిచేస్తున్నాము. ఇది మొదటి విషయం. మనం నిర్ణయించుకొన్న ప్రజాస్వామిక పద్ధతులకు లోబడి, శాసన సభను ఎన్నుకొన్నాం. ప్రభుత్వ పరిపాలన నిర్ణీత చట్టం ప్రకారం కొనసాగుతుంది. పత్రికాస్వాతంత్ర్యం వుంది. వీటిని కాదని వేరేపద్ధతి అవలంబించడానికి ప్రయత్నం చేయాలంటే ఇవన్నీ అధిగమింపరాని ప్రతిబంధకాలుగా తయారవుతాయి.

వ్యక్తి స్వాతంత్ర్యానికి అనుకూలంగా ఈ పద్ధతి ఎన్నుకోబడింది. వ్యక్తిత్వాన్ని అణగద్రొక్కే సమాజంలో ఇలాంటి స్వాతంత్ర్యానికి తావులేదు. వాస్తవిక పరిస్థితులు బైటికి పొక్కని సమాజంలో అభివృద్ధి సాధనకు చైనా, తదితర కమ్యూనిస్టు దేశాలలో ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంబించ బడుతున్నాయి. ఇవి ఇతరులకు కలవరం కలిగించే విధంగా కొంతవరకు విజయం సాధించాయి.

మనం ఎన్నుకొన్న మార్గం మన అభివృద్ధికి దోహదం కల్గిస్తుందా అనేది కాదు, మనముందువున్న సమస్య. నిస్సంకోచంగా ఇది మన అభివృద్ధికి తోడ్పడుతుంది. మన అభివృద్ధి సాధించడానికి ఎంతకాలం పడుతోంది, మనం వెనుకబడ్డ తనంనుంచి ఎంత త్వరగా బైటపడతాము అనేదే ప్రధానమైన సమస్య.

స్వేచ్ఛారహిత సమాజం

స్వేచ్ఛారహిత సమాజానికీ, స్వేచ్ఛాయుత సమాజానికీ మధ్యవున్న పోటీలో మొదటిదానికే కొన్ని అనుకూలాలు వున్నాయి. పరిశ్రమలు, వ్యవసాయాభివృద్ధి ద్వారానే ఆర్థిక ప్రగతి సాధించడానికి వీలుకలుగుతుంది. స్వేచ్ఛారహిత సమాజంలో నాయకుడైనవాడు సున్నితమైన విషయాల్ని లెక్కచేయకుండా తనకు తోచినట్లు పనిచేయడానికి అవకాశముంది. అయితే చట్టానికి కట్టుబడిన సమాజంలో ఇలా జరగడానికి వీలులేదు. స్వేచ్ఛారహిత సమాజంలో సొంత ఆస్తిపైగల హక్కులు గుర్తించబడవు. ఇష్టప్రకారం ముడిసరకులను నిరాఘాటంగా ఉపయోగించవచ్చు. వినిమయదారులు అవసరాల్ని విస్మరించవచ్చు. ఇవి బైటికి కనిపించే లాభాలుమాత్రమే. అందుకనే, మనకంటే ఎక్కువగానే చైనా పారిశ్రామికాభివృద్ధి సాధించింది. కారణమేమైనా ఈ వ్యత్యాసం మనకు చాలా ప్రమాదకారి. సాధ్యమైనంత త్వరలో మనం అధిగమించాలి.

అత్యధిక జనాభాగల వెనుకబడ్డ దేశంలో వ్యవసాయం అభివృద్ధి చెందవలసిన అవసరం ఎంతైనా వుంది. ఇందుకు పరిశ్రమలుకూడా అభివృద్ధిచెంది వుండడం చాల ముఖ్యం. ఇతర దేశాల్లోవలెనే మనదేశంలో కూడా, పరిశ్రమలు ఆధునిక పద్ధతులలో పురోగమించడమేగాక, వ్యవసాయాభివృద్ధికి కూడా తోడ్పడాలి. రసాయనిక ఎరువులు, ట్రాక్టర్లు పరిశ్రమకు వ్యవసాయానికి ఎంత దగ్గరి సంబంధం వుందో తెలియపరుస్తాయి.

రసాయనిక ఎరువుల యంత్రాలకూ, ట్రాక్టర్ల ఫ్యాక్టరీలకూ అవసరమైన యంత్ర సామగ్రిని ఉత్పత్తి చేయడానికి అవసరమైన వస్తుసామగ్రినిగూర్చి పరిశీలించినట్లయితే, వ్యవసాయరంగంలో విప్లవాత్మక పరిణామాలను తీసుకొనిరావడానికి పారిశ్రామిక ప్రాతిపదిక ఏర్పడివుండడం ఎంత ముఖ్యమో మనకు గోచరిస్తుంది. వ్యవసాయరంగంలో అధికోత్పత్తిని సాధించాలంటే పరిశ్రమలు అభివృద్ధి చెందాలి. కనుక, పరిశ్రమాభివృద్ధికి ప్రణాళికలు అత్యంత ప్రాధాన్యత వహిస్తాయి. వ్యవసాయానికంటే ఇవి తక్కువైనవికావు.

స్వాతంత్ర్య సముపార్జనానంతరం, గత దశాబ్దంలో పరిశ్రమాభివృద్ధి బాగానే జరిగింది. ఇది ప్రశంసనీయమైన విషయం. ఉదాహరణకు 1948లో 1.5 మిలియన్ టన్నులవరకు మాత్రమే ఉక్కు ఉత్పత్తి అయినది. 1962 నాటికి దాని వుత్పత్తి సుమారు 6 మిలియన్ టన్నులవరకు పెరిగింది. ఇప్పుడు సుమారు 30 వేల ఆటోమొబైల్స్‌నుతయారుచేస్తున్నాము. ట్రక్కులు కూడా ఇదే సంఖ్యలో వుత్పత్తిఅవుతున్నాయి.మన పరిశ్రమాభివృద్ధికి మచ్చుతునకలుగా ఈ రెండు ఉదాహరణలు చాలు.

15 ఏండ్ల క్రిందటనుంచి మాత్రమే మన దేశంలో పరిశ్రమలు అభివృద్ధి చెందడం ఆరంభమైనదని చెప్పవచ్చు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని చూచినట్లయితే మన పరిశ్రమల వుత్పత్తి ప్రోత్సాహజనకంగా వుంది. అయితే ఇతరదేశాలు సాధించిన లక్ష్యాలనూ, మన దేశ జనాభా వత్తిడినీ, మన ప్రజల దారిద్ర్యాన్నిబట్టి పరిశీలించినట్లయితే,ఇంతవరకు మనం సాధించిన ప్రగతి స్వల్పం మాత్రమే. ఇప్పటి ప్రకారమే మనం పోతున్నట్లయితే, 1970-71 సం॥ నాటికి మన జాతీయ ఆదాయం తలకి రెండింతలు కూడాపెరగదు.మనఅభివృద్ధి విషయంలో ఆందోళనకరమైన అంశం ఇది. త్వరత్వరగా పరిశ్రమాభివృద్ధిని సాధించనట్లైతే మనం ఇంకా దిగుమతులపైననే ఆధారపడుతూ వుండవలసి వుంటుంది. మనం దిగుమతులపైన అధికంగా ఖర్చుపెడుతున్నంత వరకూ మన అభివృద్ధికి చాలా ఖర్చు చేయవలసి వుంటుంది. ప్రగతి ఆలస్యం కావచ్చు కూడా.

మన ప్రణాళికలు ఈ విషయాన్ని గమనించే స్థూలంగా పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి కావలసిన పద్ధతులు సూచించాయి. పరిశ్రమలకు అవసరమైన

యంత్రాల తయారీ, ఇనుము, ఉక్కు, నాన్-ఫెర్రస్ మెటల్స్, మెషీన్-టూల్స్, సిమెంటు, రవాణా బండ్లు మున్నగు కీలక పరిశ్రమలలో ఉత్పత్తి పెంచడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. పరిశ్రమాభివృద్ధిని చూరగొనే దేశానికి ఇవి ప్రాథమిక అవసరాలు. రసాయనిక ఎరువులు, వ్యవసాయానికి అవసరమైన ఇతర వస్తు పరికరాల అధికోత్పత్తికి కూడా మనం తగు ప్రాముఖ్యత యిచ్చాం. మనం ఆశించిన ప్రగతిని సాధించడానికి, వివిధ ఆర్థిక రంగాలలో అభివృద్ధి సవ్యంగా కొనసాగే విధంగా కార్యక్రమం రూపొందించుకున్నాం. ఇంతకంటే యెక్కువగానే పరిశ్రమల అభివృద్ధిపట్ల శ్రద్ధవహించాలని నేను భావిస్తున్నాను.

యంత్రాల ఉత్పత్తి

1970-71 సం॥ నాటికి మనం సాలీనా రూ. 2,000 కోట్ల విలువగల అన్ని రకాల యంత్ర సామగ్రిని ఉత్పత్తి చేయాల్సి వుంటుందని అంచనా వేయబడింది. ఇప్పుడు సంవత్సరానికి 500 కోట్ల రూపాయల విలువగల యంత్ర సామగ్రిని వుత్పత్తి చేస్తున్నాం. అనుకొన్న వుత్పత్తి స్థాయిని అందుకోవాలంటే నిజంగా ఎంతకృషి చేయవలసిందీ ఊహించుకోవచ్చు. ఉత్పత్తిని పెంచడమేగాక మనకు అవసరమైన వివిధ రకాల వస్తు సామగ్రులను కూడా మనం తయారు చేయవలసి వుంటుంది. కనుక అందుకై ఇప్పటినుంచే జాగ్రత్తగా ప్రణాళికను రూపొందించుకోవాలి.

ఉదాహరణకు, సాలీనా మిలియన్ టన్నుల ఉక్కును వుత్పత్తిచేసే యంత్రాలను తయారుచేయాలంటే ఆరేడేండ్లకు ముందుగానే యంత్రనిర్మాణ కార్యక్రమానికి పూనుకోవాలి. ఇది జాగ్రత్తగా పరిశీలించి, దీర్ఘ కాలిక ప్రణాళికను రూపొందించుకోవాలి. ఈ కృషిలో పంచవర్ష ప్రణాళికల పరిమితులకు లోబడి వుండటానికి వీలులేదు. ఐదేండ్ల తరువాత కాలం ఆగిపోదు. కొన్ని నిర్ణీత లక్ష్యాలను నిర్ణయించుకోవడానికి పంచవర్ష ప్రణాళిక ఒక ఉపకరణ మాత్రమే. కనుక పరిశ్రమల ప్రణాళికను తయారు చేయడంలో 10, 15 ఏండ్ల దీర్ఘకాలిక అభివృద్ధికి ఇప్పటి నుంచే రూపురేఖలు తీర్చిదిద్దడానికి మనం ఆలోచించాలి. అంతేగాని పంచవర్ష పరిమితులకు కట్టుబాటు చేయకూడదు.

మనం విదేశాలకు డబ్బు చెల్లించే విషయంలో పరిశ్రమలు కీలకపాత్ర వహిస్తాయి. మన దిగుమతులకు సరిపోయేట్లుగా విదేశాలకు తగిన పరిమాణంలో మన వస్తువులను విక్రయించే స్థితిలో మనం వుండాలి. మన దేశంలో ముందు ముందు ఏర్పడే డిమాండుకు తగినట్లుగా మన పరిశ్రమలను అభివృద్ధి పరచాలి. ప్రపంచ వర్కుషాపులలో ఒకటిగా భారతదేశం తయారవడానికి మనం ప్రయత్నించాలి.

దీని అర్థం ఏమిటి? మన దేశంలో తయారయ్యే వస్తువులకు ఇక్కడ డిమాండు వుంటుందా లేదా అనే విషయాన్ని మాత్రమే పరిశీలించి, తదనుగుణంగా మన ప్రణాళికల్ని తయారు చేసుకొంటే సరిపోదు. అభివృద్ధి చెందుతున్న ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాల పరిస్థితిని గమనించాలి. ఈ దేశాల్లో వినిమయ సరుకుల మార్కెట్టును హస్తగతం చేసుకోవాలనే సామ్రాజ్యతత్వధోరణి మనకు ఖండితంగా లేదు. అయితే ఈ దేశాల్లో వివిధ యంత్రపరికరాలకు మార్కెట్లను సంపాదించడానికి నిరంతరం కృషిచేయాలి. పది, పదిహేనేండ్ల తరువాత ఈ దేశాలకు పూర్తిగా ఉక్కు యంత్రాలను ఎగుమతి చేయడానికి ప్రణాళికను రూపొందించుకోవడంలో అసాధ్యమేమీ లేదు. విదేశాలకు డబ్బు చెల్లించడానికి తేయాకు, కాఫీ, జనుము లేదా ఉక్కు విక్రయాలపై మనం ఆశలు పెట్టుకొని వుండడంతగదు.

బరువుబాధ్యతలను స్వీకరించడానికి సిద్ధపడాలి

ఇదంతా ఊహాగానంగా కనిపిస్తుందని నాకు తెలుసు. అయితే, ముందు అవసరాలకు ప్రణాళికను రూపొందించుకొని కొత్తపద్ధతులలో, కొత్త రీతులలో కొత్త యంత్రాలతో నేర్పుతో, ధైర్యంగా పెట్టుబడిపెట్టాలి. ఇందుకు అంతర్గతంగానూ, బహిర్గతంగానూ తగిన పరిమాణంలో వివరాలులభించాలి. భవిష్యత్తుకొరకై వర్తమానంలో కొంత త్యాగం చేసినట్లయితేనే, మనకు కావలసిన వనరులు లభిస్తాయి. పెట్టుబడి లేనిదే అభివృద్ధి సాధ్యంకాదు. పొదుపులేనిదే పెట్టుబడి సాధ్యంకాదు. త్యాగం చేయనిదే పొదుపు చేయడం సాధ్యం కాదు. అంటే బరువు బాధ్యతలను స్వీకరించి, కష్టాలకూ యిబ్బందులకూ మనం సిద్ధపడాలన్నమాట.

సమర్థవంతమైన పారిశ్రామికీకరణ జరగాలంటే, యంత్రాలు యెంత ఆధునికంగా వుంటాయో వాటిని నడిపేవారు

కూడా అంతే ఆధునికంగా వుండాలి. యంత్రాలు, క్రొత్త పద్ధతులు, ఎంత ముఖ్యమో, మానవసంపద కూడా అంతే ముఖ్యమని దీనిభావం. ఈ విషయంలో, మన బాధ్యతలకు తగినంతగా మనం పురోగమించలేదు. మన పరిశ్రమలను నడపటానికి, పనివారలకు ఇంతకంటే యెక్కువగా శిక్షణ సౌకర్యాలు కల్పించాలి. మంచి కార్యనిర్వాహకుల కొరత వుంది. శిక్షణపొందిన సాంకేతిక నిపుణులు తగినంతమంది లభ్యం కావడంలేదు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించాలి.

మానవశక్తి కొరత

మన పారిశ్రామికీకరణ కార్యక్రమానికి అనుగుణంగా పనివారలకు శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలను తగురీతిగా రూపొందించి ధైర్యంగా అమలుపరచడానికి మన పరిశ్రమలు ముందుకు రావాలి. క్రొత్త పద్ధతులు అవలంబించాలంటే క్రొత్త పరిశోధనాసంస్థలు ఏర్పడాలి. వీటిని నిర్వహించేందుకు తగినవ్యక్తులు కూడా లభించాలి. ఇవి రెండూ మనదేశంలోకొరతగా వున్నాయి. ఎక్కడచూసినా మానవశక్తి కొరత మనల్ని ఎదురుకుంటూన్నది. అధిక జనాభాగల మనదేశంలో ఇలాంటిసమస్య వుత్పన్నంకావడం విపరీతమైన విషయం. ఈ రంగంలో విషమ పరిస్థితి తొలగాలంటే ధైర్యంగా, కృత నిశ్చయంతో పనిచేయాల్సిన అవసరంవుంది.

పారిశ్రామిక వేత్తలు వుత్పత్తినిగురించే మాట్లాడుతారు. ఇప్పట్లోఎక్కడచూసినా ఇదే మాట వినిపిస్తుంది. అయితే, ఇలా వుండడం మంచిదేమో అని నాకు అనిపిస్తుంది. మన పరిశ్రమల్లో ఒక విధంగా చూస్తే దుబారా జరుగుతున్నట్లు తెలుస్తున్నది. మీకు ఒకవిషయాన్ని చెప్పదలచుకున్నాను. ఇటీవల నా స్నేహితుడొకడు అమెరికా దేశస్థుడు నాతో పాటు ఒక ఫర్టిలైజర్ ఫ్యాక్టరీని పరిశీలించాడు. నేను యెక్కడికివెళ్ళినా అనేక మంది కార్మికులు బయటికివచ్చి నాకు నమస్కారాలు చేశారు. అప్పుడు నా స్నేహితుడన్న మాటవిని, "ఇది నామనస్సుకు బాగాహత్తుకొనిపోయింది. ప్రపంచంలో ఏ దేశంలోనైనా, పనిలో యెక్కువ మంది నియమించబడ్డారాలేదా అనే విషయాన్నిపరిశీలించడానికి నేను వెళ్ళవలసివస్తే, రిజిష్టర్లనూ, పుస్తకాలనూ జాగ్రత్తగా చూడాల్సివచ్చేది. అయితే కండ్లముందర సాక్ష్యాధారాలు లభించేవి ఈ దేశంలోమాత్రమే". ఎంతమంది అవసరమో, అంత మందిని మాత్రమే పనిలో నియమించేట్లయితే, ప్రముఖవ్యక్తి ఎవరైనా చూడటానికివచ్చినప్పుడు ఇంత మంది తమ పనులను వదలివేసి బయటికి వచ్చేవారు కారని ఆయన సూచనప్రాయంగా తెలిపిన అభిప్రాయమిది.

విషచక్రం

ఇది సత్యమైన విషయం. ఈ కారణం వల్లనే మనఖర్చులు చాలయెక్కువ. ఇది ఒక విషచక్రంవంటిది. ఒకడు సక్రమంగా నిర్వహించగలిగినపనిలో ఇద్దరు వ్యక్తులు నియమించబడినారంటే, ఇద్దరూ ఆ పనిని సక్రమంగా నిర్వహించరు. ఎక్కువగా ఎంతమంది నియమించబడుతారో, పని సామర్థ్యం కూడా అంత వరకు పడిపోతుంది. ఈ విషయంలో ధైర్యంతో మనం ఒక నిర్ణయంతీసుకోవాలి. జాతిప్రయోజనందృష్ట్యా మనం నడిపేప్రతి పరిశ్రమలో అంతర్జాతీయ స్థాయిలప్రకారం ఎంత తక్కువ మందితోను పని జరుగుతుందో అంత మందిని మాత్రమే నియమించాలి. మన ఉక్కు యంత్రాలను, ఫర్టిలైజర్ ఫ్యాక్టరీలను ధర్మ సత్రాలుగా మార్చే స్థితిలో మనంలేము. అలా జరిగితే, మన పరిశ్రమలు సమర్థవంతంగా పనిచేయలేవు.

పరిశ్రమ తన స్వరూప స్వభావాలను సరిదిద్దుకోవలసిన అవసరం ఏర్పడింది. యజమానులు, కార్మికుల మధ్య సమన్వయంవుంటేనే ఇదిసాధ్యమవుతుంది. అదృష్టవశాత్తు మన దేశంలో ఈ విషయంలో ప్రయోజన పూర్వకమైన కృషి జరగాలనేభావం సర్వత్రావ్యాపించివుంది. నేడు మనం రక్షణ, అభివృద్ధి సవాలును ఎదుర్కొంటున్నామని గుర్తుంచుకోవాలి. ప్రస్తుత పరిస్థితిలో ఒక విషయాన్ని త్యజించడంద్వారా మరో విషయాన్ని సాధించలేము. వాస్తవంగా చూస్తే అభివృద్ధిరంగంలో పరాజయం కలిగితే అది కొన్ని సందర్భాల్లో యుద్ధరంగంలోజరిగే పరాజయాలకన్న తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. అదృష్టవశాత్తూ, మన దేశంకోసం సర్వ త్యాగాలు చేయడానికి ప్రజలు సర్వదా సంసిద్ధులై వున్నారు. ఈ పరిస్థితిని లాభసాటిగా వుపయోగించుకొని దేశాన్ని శాంతి, ప్రగతి మార్గాలలో ముందుకుతీసుకొనిపోవాలి.

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)

దేశం మేల్కొంది

మూలం
ఇక్రాం జావీద్

తెలుగుసేత
దాశరథి

అందమైన, పసుపు పచ్చ రంగు, 'చంద్రికాభవనం' నిశ్శబ్దంగావుంది. ఆ భవనంలో ఎక్కడివస్తువు అక్కడ కదల కుండావుంది. తోటలో అలంకరించినపూల తీగలు, పూల తోరణాలు, పందిళ్ళు, మొక్కలు; చెట్లకొమ్మల్లో రంగురంగుల ఎలక్ట్రిక్ బల్బులు ఇంకా మిలమిలా మెరుస్తూ అందాలు కురుస్తున్నాయి. లాన్‌లో పెండ్లికోసం వేసిన షామియానా ఇంకా అలాగేఉంది. భవనం అలంకరణలో ఎట్టిమార్పూ లేదు. అయినా ప్రతివస్తువూ కళతప్పివుంది. వరండాలో ముసలవ్వ ఎర్రటిముఖంలో నిస్పృహతో ఊకిసలాడుతున్నది. ఆకురాలుకాలం అవతరించిన ఆమె జీవితంలో చెప్పరాని నిరాశ. ఆమె ముసలి కళ్ళల్లో కన్నీళ్ళ వరద గడ్డ గట్టిపోయింది.

నేను ఆమె కళ్ళల్లో నీళ్ళను చూడలేను. లోకంలో అందరికంటే ఎక్కువ ప్రేమగా నన్నుచూచేది ఆమె. నాకుచిన్నతనాన్నే తల్లిదండ్రులు పోయారు. పెద్దవ్వ నన్ను తన పిల్లల కంటే ఎక్కువగా పెంచింది. అన్నయ్యా నసీం కంటే నన్ను ఎక్కువ ప్రేమతో చూసేది. నసీం కూడా తండ్రిలేనివాడు. పెద్దవ్వకు ఒకే ఒక కుమారుడు. నాకంటే వయస్సులో నాలుగైదేండ్లు అతను పెద్ద. పెద్దవ్వలాగే అతనుకూడా నన్ను ఎంతగానో ప్రేమించేవాడు. చిన్నతనంలోనే అతని తెలివితేటలు, అతని దేశభక్తి వెలుగులోకి వచ్చాయి. అతనికి వంశ పరంపరగా వస్తున్న వారసత్వం దేశభక్తి. స్వర్గీయులైన తండ్రిగారు ఆయన జీవితాంతం దేశ స్వాతంత్ర్యంకోసం పోరాడారు. ఆజాద్ హింద్ సైన్యంలో చేరి దేశ స్వాతంత్ర్యం కోసం అనేక త్యాగాలు చేసిన వీరుడు నసీం తండ్రి. ఆయన అడుగు జాడల్లోనే నడుస్తున్నాడు నసీం.

నాలుగు రోజుల క్రితం నసీం పెండ్లి జరిగింది. చంద్రికాభవనం ఆనందపు వెన్నెల్లో ఓలలాడింది. ఎటుచూచినా ఆటలు, పాటలు, ఆనందాలు. నసీం మెడలో పూలు ఇంకా వాడిపోనేలేదు. అత్తరు పరిమళం గోరంటాకు రంగు ఇంకా చెడనే లేదు. పూల పరిమళాలు ఇంకా మాసిపోనేలేదు. పెండ్లి వేడుకలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. అకస్మాత్తుగా గాలివాటు మారింది. వాతావరణంలో పూలసువాసనలకుబదులు తుపాకీ మందువాసన వ్యాపించింది. ఈశాన్య దిక్కునుంచి గాడుపులు హిమాచలాల మీదుగా మానవుని క్రూరత్వపు దుర్వాసనలను మోసుకువచ్చినవి. దేశమంతటా దుఃఖం కమ్ముకుంది.

మన పొరుగుదేశం మనమంచితనాన్ని గమనించి అకస్మాత్తుగా మన దేశం మీద దాడిచేసింది. మనం ఎవరినైతే మిత్రుడుగా, సోదరుడుగాభావించి మన కౌగిలిలోకితీసుకున్నామో, శాంతిసౌమనస్యాల తీయనిమాటలు ఎవడు మాట్లాడాడో, విశ్వంలోని జాతులన్నిటి స్వాతంత్ర్యాన్ని కాంక్షిస్తున్నట్లు ఎవడు నటించాడో అతడే దొంగచాటుగా వెన్నుపోటు పొడిచాడు. అతని శాంతి కాముకతలోని అసలు రహస్యం బయటపడింది. మానవత్వానికే సిగ్గుచేటైన అతని దాడి అతని నిజస్వరూపాన్ని బహిర్గతం చేసింది.

అనువాద భారతి

"దేశస్వాతంత్ర్యం ప్రమాదంలో చిక్కుకుంది, మేలుకోండి" ఇదే కేక అందరి నోటా దశదిశల మారుమ్రోగింది. "చంద్రికా భవనంలో" పెండ్లి వేడుకలు ఆగిపోయినై. పెద్దవ్వ ముసలిమొహంలో దుఃఖమేఘాలు కమ్ముకొచ్చాయి. నసీం నరనరాల్లో రక్తం ఉప్పొంగిపోయింది. ఇటీవలే అతను ఎం.ఏ. పట్టం పొందాడు. ఇక ముందు ఏం చేయాలి అన్నది ఆలోచించుకుంటూండగానే వివాహంజరిగింది. వివాహంతోపాటు దేశ సమస్య ముందు నిలుచుంది. వెంటనే తన భవిష్యత్తును నిర్ణయించుకున్నాడు నసీం. సైన్యంలో చేరడానికి అర్జీ పెట్టుకున్నాడు. ఆర్డరు కోసం ఎదురుచూస్తున్నాడు. రెన్నాళ్ళ పెళ్ళికూతురు అల్యా పెదవుల మీది చిరునవ్వు చల్లారిపోయింది. "చంద్రికా భవనం" నిశ్శబ్దం అయిపోయింది. ఆ భవనంలోని ప్రతివ్యక్తి ఏదో అంతు తెలియని ఆలోచనల లోతుల్లోకి దిగిపోయివున్నాడు. ప్రతివ్యక్తికీ ఇదొక పెద్దపరీక్షా సమయం. దేశస్వాతంత్ర్యంకోసం ప్రజలు తమ గుండెల్ని తుపాకిగుండ్లకు గురిచేసిన పాతరోజులు పెద్దవ్వకు జ్ఞాపకానికి వచ్చాయి. ప్రాణాలుబలిపెట్టి స్వాతంత్ర్యం సంపాదించిన వీరులు స్ఫురణకు వచ్చారు. అలా సంపాదించిన అపురూపమైన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవలసిన రోజు వచ్చింది. నిమిష మొకయుగంగా ఆర్డర్ల కోసం ఎదురు చూస్తున్నాడు నసీం. తన కర్తవ్యం తనను గొంతెత్తి పిలుస్తున్నది. హిమాలయాల ఔన్నత్యం అతన్ని పిలుస్తున్నది. పెద్దవ్వకు ఎటూతోచడంలేదు. ఒకవైపుదేశస్వాతంత్ర్యం, మరోవైపు ఒకేఒక కొడుకు! ఈ ఒక్కదీపం ఆరిపోతే వంశం నశిస్తుంది. కాని ఇప్పుడు ఒక వంశం ప్రశ్న కాదు, దేశం అంతటినిగూర్చిన ఒక ప్రశ్న ఆమె ముందుంది. చివరికి ఆమె ఒక నిర్ణయానికివచ్చింది.

"నువ్వు యుద్ధానికి వెళతావు నసీం. వెళ్ళడానికి నా అనుమతి నీకు లభించితీరుతుంది'' అంది పెద్దవ్వ.

''నేను నీ తల్లిని. దేశం మనందరితల్లి. కనుక నాకంటే దేశానికే నీమీదఎక్కువ హక్కుంది" అన్నదామె. కళ్ళల్లోగంగానది పొంగివచ్చింది.

"అమ్మా," అనిఅరిచాడు నసీంబాధతో. ''నీ కళ్ళల్లో తొణికే కన్నీళ్ళు నాకు నిరుత్సాహాన్ని కలిగిస్తాయమ్మా'' అన్నాడు నసీం.

''ఇవి దుఃఖపు కన్నీళ్లుకావునాయనా ఇవి ఆనంద బాష్పాలు. నిజంగా ఇవాళ నాకు చాలా సంతోషంగా వుంది బిడ్డా! చాలా....చాలాసంతోషం." ఆమె గద్గద కంఠం నన్ను కదిలించి వేసింది. నసీం భావాలు, అతని ఆలోచనలు నాకుబాగా తెలుసు. కాని పెద్దవ్వ కనబరచిన ఈ నిబ్బరం నాకుకొత్తే. ఆశ్చర్యం, ఆనందం కలగలసిన మనస్సుతో వరండా లోంచి ఇంట్లోకివెళ్లాను. అల్యా! తళతళలాడే ఆభరణాలు, జరీబుటా పట్టుచీర, పలచని ముసుగుతో అల్యా కనిపించింది. అల్యా నాకు కొత్త కాదు. మా మేనమామ పెద్దకూతురు ఆమె. బుద్ధిమంతురాలు! బాగా చదువుకున్నపిల్ల, గులాబీ రంగు బుగ్గలు, పచ్చనిశరీరం. అందం, అందులో అంతులేని గాంభీర్యం. ఆమె ఫిలాసఫీతో బి. యే. ప్యాసయింది. నాతో కూడా కాలేజీలో చదువుకునేది. బి.యే. కాగానే ఆమె పెళ్ళిఅయింది. నేను ఎం. ఏ. లో చేరాను. మొదటి నుంచీ ఆమెకు నసీం అంటే చాలా ఇష్టం. నసీం ఎప్పుడూ ఆమెనే ఆరాధించేవాడు వారి మధుర ప్రణయపు ఔన్నత్యాలు నాకుతెలుసును వారిద్దరూ శాశ్వతంగా ఏకం కావాలని నేను సర్వదా కోరుకునేవాణ్ణి. నాకోర్కె తీరనేతీరింది. ఇద్దరూ ఏకమైనారు. కాని పెళ్లయిన రెండునాళ్ళకే ఈ వియోగ మేమిటి? అయితే ఈ ఎడబాటు కొలది నాళ్లదేకావచ్చు, చాలాకాలంపట్టవచ్చు. ఏవో ఆలోచనల్లోపడి బొమ్మలా కదలకుండా నుంచునివుంది అల్యా.

''అల్యా వదినా!" మెల్లగాపిలచాను.

''ఎవరు? అన్వరా" అంటూ ఉలిక్కిపడింది,

''వదినా! అన్నయ్య యుద్ధానికి వెళ్లాలను కుంటున్న సంగతి నీకు తెలిసిందా?'' అని అడిగా రహస్యంగా.

''నాకు తెలుసు. ఆయన నిర్ణయంసరైనదే" అంది గంభీరంగా ఆమె. ఇంకా ఇలా అంది:

"అన్వర్? నీకు తెలుసుగా, నేనంటే ఆయనకు ఎంతఇష్టమో. ప్రాణం కంటే ఎక్కువగా నన్ను ప్రేమించారు. అయితే దేశంముందు నేనూ, నాసుఖమూ ముఖ్యం కావు. దేహం నశిస్తుంది. పుట్టాక చావన్నది తప్పదుకదా! కాని ప్రేమ శాశ్వతంగా నిలుస్తుంది. శరీరం బతకడం చావడంతో ప్రేమకు సంబంధంలేదు. ప్రేమే జీవితం. అంతులేని, హద్దులేని స్వాతంత్ర్యంపేరే ప్రేమ. నా ప్రేమ కూడా".. అంటూ మధ్యలో ఆగిపోయింది. నసీం ఆ గదిలోకి వచ్చాడు. ఆయన చేతిలో గులాబీరంగు కాగితం వుంది.

''ఇవాళే నేను వెళ్లాలి. ఇప్పుడే టెలిగ్రాం వచ్చింది" అన్నాడాయన గంభీరంగా.

(53వ పేజీ చూడుడు)

పంచాయతీరాజ్య పురోగమనం

గ్రామీణ నీటి సరఫరా పథకం

ఫిబ్రవరి 23 వ తేదీన జరిగిన ఆదిలాబాదు జిల్లా పరిషత్తు 4వ స్థాయీసంఘం సమావేశంలో ప్రభుత్వం మంజూరుచేసిన గ్రామీణ నీటి సరఫరా పథకం క్రింద పంచాయితీ సమితులకు, నాన్ బ్లాక్ ప్రాంతాలకై రు. 1,23,948 కేటాయించారు.

తెలంగాణా ప్రాంతీయ కమిటీ కేటాయించిన నిధులనుంచి పాఠశాల భవనాల నిర్మాణానికీ, మరమ్మతులకై స్థాయీ సంఘం రు. 24,000 లను మంజూరు చేసింది.

ములుగు పురోగమనం

వరంగల్లు జిల్లా ములుగు పంచాయతీ సమితి బ్లాకులో ప్రణాళిక, పంచాయతీ రాజ్ శాఖల మంత్రి సమక్షంలో జనవరి 8 వ తేదీన రక్షిత నీటిసరఫరా పథకానికి ప్రారంభోత్సవం జరిగింది. యీ పథకం అమలుకు రు. 65,000 ల ఖర్చు అవుతుంది.

ప్రజావిరాళాలతోసహా రు. 15,000 ల ఖర్చుతో ములుగులో నిర్మించబడిన ప్రాథమిక పాఠశాల భవనానికి జనవరి 1 వ తేదీన ప్రారంభోత్సవం జరిగింది.

ఇతోధిక రసాయనిక ఎరువులు

1963 జనవరిలో తూర్పు గోదావరిజిల్లాలోని ప్రత్తిపాడు పంచాయతీ సమితిలో 4811 టన్నుల గ్రామీణ కంపోస్టు ఎరువులను తయారు చేశారు. 22½ టన్నుల రసాయనిక ఎరువుల పంపిణీ జరిగింది. 11 ఆధునిక వ్యవసాయపరికరాలను పంపిణీ చేశారు. యీ మాసంలో దాదాపు 39 ఎకరాలభూమిని సేద్యయోగ్యం చేశారు.

ప్రదర్శనా క్షేత్రాలు

1963 జనవరిలో చిత్తూరు జిల్లా నగరి పంచాయతీసమితిలో ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేయడానికి వీలుగా పురోగామి రైతులు 463 పౌనుల రసాయనిక ఎరువులను ఉపయోగించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రదర్శించే 17 ప్రదర్శనా క్షేత్రాలను నెలకొల్పడం జరిగింది.

ఈ నెలలో 11 ఫర్లాంగుల కచ్చా రోడ్లనూ 4 చిన్న కాలువల వంతెనలనూ నిర్మించడం జరిగింది.

మేలురకం విత్తనాల పంపిణీ

1963జనవరిలోమహబూబునగర్ జిల్లా కొల్లాపూర్ పంచాయతీ సమితి బ్లాకులో 250 మణుగుల మేలురకం విత్తనాలనూ, 798 మణుగుల రసాయనిక ఎరువులనూ **3 ఆధునిక** వ్యవసాయ పరికరాలనూ పంపిణీ చేయడం జరిగింది.

వయోజన పాఠశాలలు

కొల్లాపూర్‌లోని వయోజన పాఠశాలలో 26 మంది వయోజనులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఆరు రోజులపాటు దళపతుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. 33 మంది దళపతులకు ఇందులో శిక్షణ ఇవ్వడం జరిగింది.

ప్రత్యేక ఉద్యమ నిర్వహణ

1963 జనవరిలో అనంతపురం జిల్లా ఘాటీ పంచాయితీ సమితిలోని పి. కె. చెరువులో వరి పైర్లకు పడగాడ్పులవ్యాధి నివారణకై ప్రత్యేక ఉద్యమాన్ని నిర్వహించారు. యీ సందర్భంగా 55 ఎకరాలలో 'ఫిటోలన్' మందుచల్లడం జరిగింది. రైతులు తెగులు నివారణ మందులను పూర్తిధరకు కొనుగోలు చేశారు. యీ చర్య ఫలితంగా పైరు పరిస్థితి మెరుగైంది.

మహిళా మండలులు

నల్లగొండజిల్లా చింతపల్లి బ్లాకులో 4 మహిళా మండలులను ప్రారంభించారు. వీటిలో 117 మంది సభ్యురాండ్రు ఉన్నారు. జనవరి నెలలో 85 మణుగుల మేలురకం విత్తనాలనూ, 704 మణుగుల రసాయనిక ఎరువులనూ, 10 ఆధునిక వ్యవసాయ పరికరాలనూ పంపిణీచేయడం జరిగింది. రెండు మంచి నీటి బావులను కూడా త్రవ్వారు. ★

మీరు పొదుపుచేసిన సొమ్ము
మన దేశావసరాలకి అవసరం!

చైత్ర చైతన్యము

జూలూరి హనుమంతరావు

పల్లవించిన దెల్లచోటుల
ఫుల్ల సుమముల చైత్రమాసము
ఉల్లముల నవరాగములు రం
జిల్ల జేయుచు మధురమాసము.

శిశిర మందున సన్నగిల్లిన
చేవలను సమకూర్చుకొనగా
చైత్రమాసము నవనవోన్మే
షముల గూర్చెను క్రొత్తజీవము

చేదు వగరులు నరనరాలకు
చేరి చైతన్యమ్ము కూర్చెను
భారతీయుల భావములలో
పరువములు శౌర్యములు నిండెను

పౌరషమ్మున వాడవాడల
వీరగీతము లాలపించుచు
భారతీయత చాటి చెప్పెడి
బారులౌ కోకిలల గనరో!

వీర గీతములకు చలించుచు
ధీర గుణముల పొంగులెత్తుచు
తనువులను విరికనుల జేసిన
తరులతా కోమలులగనరో!

భారతావని వెల్లివిరిసిన
వీరశౌర్యము లెల్లదిక్కుల
పిక్కటిల్లగ శత్రుసేనల
యుక్కడంచగ నిలచె నిచ్చలు

జగము లోపల నెన్నడేనియు
సాటిలేనిది భరతదేశము
నిఖిల కాలములందు నిర్మల
నిత్యమంగళ మాతృదేశము

ప్రతి పదమ్మున వీరగంధము
పట్టి నిలచిన లతాంగనలే!
ప్రతి నిమేషము వీరగీతము
పాడు కోకిల యోధగణమే!

ధీర చిత్తులుకందు భారత
దేశ యోషా పురుషులారా!
వీరమూర్తులు కందు భారత
వీరగాథా విజయులారా!

సరిహద్దుల పరిరక్షణలో మన సైనికుల సమధికోత్సాహం

కొన్ని వేల అడుగుల ఎత్తున నీరు గడ్డకట్టే శైత్యం వుండే మంచు కొండ ప్రాంతంలో', దేశరక్షణకై కంకణధారులైన మనసైనికులు దృఢ సంకల్పం, సహనం, సమయస్ఫూర్తి ప్రదర్శిస్తూ ఎన్నోకష్టాలను ఎదుర్కొంటున్నారు. వీరిలో ఎక్కువ మంది దేశంలో వెచ్చగా సుఖంగా ఉండే మైదానప్రాంతాల నుంచి వచ్చినవారే. అయితే ఏం, ఈ క్రొత్త వాతావరణానికి, పరిసరాలకు అతి త్వరగా అలవాటు పడుతున్నారు. ఈ క్రొత్తవాతారణంలో, ఎన్నో ఇబ్బందులు వచ్చినా లెక్క చెయ్యకుండా అమితోత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు.

అసాధారణ వాతావరణం. గాలిలో ప్రాణవాయువు లోపించడంచేత ఇక్కడ మనిషి ఊపిరి పీల్చుకోవడమే ఎంతోకష్టం. ప్రతి కదలిక ఎంతో శ్రమతోకూడిన పనే. దాదాపు సమతలంగావున్న ప్రదేశంలో ఊరికే నడుస్తున్నప్పుడు కూడా అడుగు అడుగుకూ ఊపిరి తీసుకోడానికి ప్రయాసపడవలసిందే, రొప్పుతూ ఆగి ఆగి అడుగు వేయవలసిందే.

అయితే ఈ పరిస్థితికి అలవాటు పడటానికి ఈ ఆటంకాలను అధిగమించడానికి మన సైనికులకు ఎన్నోరోజులు పట్టడంలేదు. మొట్టమొదటి రోజున ఏదో కొత్తగా చిత్రంగా ఉన్నట్టు అనిపిస్తుంది. ఒక్క రెండు రోజులు గడిచేసరికి అతనికి ఆ వాతావరణం పూర్తిగా అలవాటు అవుతున్నది. ఇక అక్కడ నుంచి అతను హాం దాగా, మంచి ఆరితేరిన పర్వతారోహకుడు లాగా అడుగు తడబడకుండా ఒక పర్వత స్థావరం నుంచి మరొక పర్వత స్థావరానికి కదిలి వెళ్ళడం ప్రారంభిస్తాడు.

14000 అడుగుల పైచిలుకు ఎత్తున కోడిగుడ్డు నిముషంలో గడ్డకట్టుకొని బిగిసి గోల్ఫ్‌బంతిలా తయారయ్యే వాతావరణంలో మంచుగడ్డలతో నిండిన సరస్సుల మీదుగా సమతల ప్రదేశం అనుకొని అడుగు పెట్టగల ప్రమాదం ఉన్న పర్వత ప్రాంతంలో భారతదేశపు సరిహద్దులను సంరక్షిస్తూ మన సైనికులు తమ గురుతర బాధ్యతలను గుర్తెరిగి ఉన్నారు. ప్రత్యేక సాధనసంపత్తి సమకూర్చుకొని సరియైన దుస్తులు ధరించి మంచిబూట్లు వేసుకొని మన సైనికులు నీరు గడ్డకట్టే ఉష్ణోగ్రతను 12 డిగ్రీలు తక్కువగాఉండే ఉష్ణోగ్రతలో ప్రాణసంరక్షణ చేసుకుంటూ అసమాన ధైర్య సాహసాలతో, అమితమైన గుండె నిబ్బరంతో మాతృభూమి పరిరక్షణకై కృషి చేస్తున్నారు. శీతల వాయువులు వీస్తూ మరింత చలికలిగిస్తూ ఉన్నా, అదేమీ మన సైనికుల ఉత్సాహానికి అడ్డురావడం లేదు. విధ్యుక్తధర్మం నిర్వహణపట్ల శ్రద్ధ తగ్గడంలేదు.వారు సరిగ్గా మామూలుమైదాన ప్రాంతాలలో, విధులు నిర్వహిస్తున్నప్పటి లాగానే ఈ ఉత్తుంగ హిమాలయ పర్వత ప్రాంతాలలో మనుష్య సంచారం అంటూ లేకనిశ్చలంగా భయంకరంగా కన్పించే వాతావరణంలోకూడా అంత క్రమశిక్షణ, జాగరూకతతో విధులను నిర్వహిస్తున్నారు. తమ తమ నిర్ణీత స్థానాల్లో నిలిచి పగలూ రాత్రి నిర్విరామంగా కాపలా కాస్తున్నారు.

అంత ఎత్తు, అంత తక్కువ ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతంలో, మరో ప్రమాదంకూడా ఉంది. అది నిర్జలం కావడం. శరీరంలో నీరు హరించుకు పోతున్నట్టు అనిపిస్తుంది. ఇందు మూలంగా వికార పెడుతుంది. తల నొప్పి మొదలైనవి కూడా వస్తాయి. ఇందుకు విరుగుడు చాలినంతగా తరుచు ద్రవపదార్థాలు పుచ్చుకోవడమే. మన సైనికులు తమ రేషన్లలో భాగంగా అందజేయ బడుతున్న టీ, కాఫీ, కోకో తరచు గ్లాసులు గ్లాసులు త్రాగేస్తూ ఉండడంచేత ఈ ప్రమాదంనుంచి తప్పించుకొంటున్నారు. ఎత్తైన పర్వత ప్రాంతాలలో మన సైనికులకు ఇచ్చే రేషన్లలో బాదంకాయలు, అక్రోటుపండ్లుకూడా ఉంటాయి. వీటి మూలంగా శరీరానికి వెచ్చదనం, శక్తి సమకూరుతాయి.

కాఫీ, టీ, కోకో తయారు చేసుకోడా

నికి నీళ్ళు ఒక పట్టాన దొరకవు. కొన్ని వేల అడుగుల దిగువనుంచి పైకి మోసు కొనివచ్చి అవసరమైతే అనువైన ప్రదే శాలలో నిలువ చేసుకోవలసి వస్తుంది. ఇక్కడ నిప్పు చేసుకోడానికి పెద్ద ఇబ్బంది ఏమీలేదు. ఈ పర్వతాలపై ఉన్న అర ణ్యాలలో కావలసినన్ని దేవదారు చెట్లు న్నాయి. ఒక చెట్టుకొట్టి కావలసినంత వంట చెరకు సంపాదించుకోవచ్చును.

మన జవాన్లు ఈ పర్వతాలను తమ నివా సాలుగా చేసుకొన్నారు. గుట్టలతో పుట్ట లతో స్నేహం కట్టారు. వారు ఉల్లాసంగా స్వేచ్ఛా విహంగాలమల్లే తిరుగుతూ ఉండగాచూస్తూ మన హృదయాలు స్పంది స్తాయి. దేశం సరిహద్దుల భద్రత వారి చేతుల్లో ఉన్నది.

భారత సైనిక దళాలు నెలకొల్పిన సత్సంప్రదాయాలు ప్రపంచ విఖ్యాతమైనవి. మనసైనికుల సేవా సహకారాలు ప్రపంచంలో అన్ని ప్రాంతాలవారికి చిరపరిచితమే. ధైర్య సాహసాలుగల భారత సైనికుడు సహారా ఇసుక ఎడారులలో, బర్మా, మలయాలలోని దట్టమైన అరణ్యాలలో, యూరపులో చలిలో, పశ్చిమ ఆసియాలో మాడ్చిచంపే ఎండలో వీరోచిత పోరాటాలు జరిపిన విషయం జగద్విదితం. కాని ఈనాడు అతను పూర్వంకంటె ఎక్కువ జాగరూకతతో, బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నాడు. మాతృదేశ స్వాతంత్ర్య పరిరక్షణ భారాన్ని అతను గుర్తెరగడమే అందుకు కారణం. నిన్న మొన్నటి దాకా స్నేహితుడులా నటిస్తూ వచ్చిన ధర్మాధర్మ విచక్షణలేని క్రూరుడైన శత్రువును ఎదు ర్కోవలసి వచ్చిందని అతనికి బాగాతెలుసు. అందువల్ల అతను ఏమాత్రం బద్ధకించడానికి వీల్లేదు. అతనికృషి నిర్విరామంగా సాగవలసిందే. యుద్ధరంగంలో ఉన్న మన సైనికులందరూ ఈ భావంతోనే అడుగు అడుగునా దేశభక్తిని ప్రదర్శిస్తూ తమ విధులను నిర్వహిస్తున్నారు.

ఇక్కడ ఉన్న జవాన్లు ఎవరూ కూడా సెలవుమీద ఇంటికి వెళ్ళడానికి ఇష్టపడడం లేదు. ఎవర్ని అడిగినాసరే "ముందు ఈ చైనా వ్యవహారం తేలనివ్వండి—ఆ తర్వాత వెళ్లి ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకొంటాము" అని సమాధానం చెబుతారు.

వారి సంకల్పం అంత అచంచలంగా అంత సుదృఢంగా ఉన్నది. ★

(49 వ పేజీ తరువాయి)

"పరిస్థితి బాగా లేదు! ఎంత పెద్ద త్యాగానికైనా వెనుదీయడానికి వీలులేని పరిస్థితి" అన్నాడు.

"అయితే ఇవాళే వెళ్లాలా?" అనడిగాను నేను.

"అవును, తప్పదు" అన్నాడు నసీం దృఢ నిశ్చయంతో.

"బలవంతుడూ, జిత్తులమారీ అయిన శత్రువును మనం ఎదుర్కోవలసి వుంది. దేశంలోపల ఆకలి, అవిద్య, దారిద్ర్యం వీటికి వ్యతిరేకంగా మనం పోరాడుతుండగా మనను దగాచేసి శత్రువు మనమీద దాడిచేశాడు.మన స్వాతంత్ర్యాన్ని అపహరించడానికి ప్రయత్నిస్తున్నాడు. మనను బలవంతంగాయుద్ధంలోకిలాగుతున్నాడు. ఇకజాప్యంపనికిరాదు. సరికొత్తఆయుధాలను మిత్రదేశాలనుండి సాధించాలి.క్రమశిక్షణతో శత్రువును హతమార్చాలి. అయితే, ఇతర దేశాలనుంచి ఆయుధాలు కొనడానికి మనకు డబ్బుకావాలి,బంగారం కావాలి, ఆభరణాలు కావాలి" అన్నాడు.

ఆల్యా మాట్లాడలేదు. మెల్లిగా చేతి గాజులుతీసింది. చెవుల నుంచి దుద్దులు తీసింది. మెడలోంచి నెక్‌లేస్ తీసింది. నసీంచేతికి అందించింది. ఇంతలో పెద్దవ్వ వచ్చింది. తన చేతుల నుంచి కడియాలు తీసింది. నసీంచేతిలో పెట్టింది.

"నాయనా! ఈ బంగారు మురుగులు నా అంత్యక్రియల కోసం దాచాను. ఇవి తీసుకుపో. దేశశత్రువుకు వీటితోఅంత్యక్రియలు చేయినాయనా," అందిపెద్దవ్వ. నసీంకళ్ళు మిలమిలా మెరిశాయి. చందమామవంటి ఆల్యాముఖంలోకిచూచాడు. తరువాత నాతో అన్నాడు:

"అబ్బాయ్! నేను వెళుతున్నా. ఎప్పుడు తిరిగివస్తానో చెప్పలేను. చాలా కాలం ఈ యుద్ధంకొనసాగవచ్చు. కనుక జాగర్త. చంద్రభవన గౌరవంకాపాడే బాధ్యత నీకు అప్పగిస్తున్నాను" అని. నా మనస్సులో తుఫాను చెలరేగింది.

"అన్నయ్యా! పోరాటం యుద్ధరంగంలో మాత్రమే జరగదని నాకు తెలుసు. దేశంలో వీధివీధిలో ఇంటింటా ఈ పోరాటం సాగాలి. మనమంతా మేల్కొన్నాం. నేను ఈ పవిత్ర సమరంలో భాగం పంచుకుని తీరుతాను" అన్నాను. నసీం నన్ను గట్టిగా కౌగలించుకున్నాడు.

"మన పౌరుషానికి తిరుగు లేదు, హృదయాల్లో ప్రేమ దీపాలు వెలుగుతున్నవి. నైతికశక్తి మన వెంటవుంది. దేశంలోని నలభై నాలుగు కోట్ల జనులు ఇప్పుడు ఏకమైనారు. గెలుపుమనదే" అని ఉద్రేకంతో అన్నాడు.

పెద్దమ్మ నసీంను ముద్దుపెట్టుకుంది. "వెళ్ళిరానాయనా! నా దీవెనలు నిన్ను సర్వదా కాపాడగలవు" అంది. నసీం అతి గంభీరంగా పెద్దమ్మ వైపు, వదిన వైపు చూచి మెల్లగా ఇంట్లోంచి బయటికినడిచి వెళ్లాడు. ★

శ్రీనాథయుగము: అన్యదేశ్యములు

తూమాటి దొణప్ప

(గత సంచిక తరువాయి)

'...ఆంధ్రులు నానా
దేశంబుల యందు నిలిచి తెలుఁగులె తత్త
ద్దేశోక్తులంటఁ బలికిన
నా శబ్దములన్యాదేశ జాంధ్రములయ్యెన్[18]'

(పైది. 1-108) అని నిర్వచించి

'ఆలంబు చివ్వ...మక్కువ తెల్లమియనఁ
దనరు నిటులన్యదేశ జాంధ్రములు పెక్కు'

(పైది. 1-109) అని కొన్ని పదముల నుదాహరించినాఁడు. వాస్తవముగా నివి అన్యదేశ జాంధ్రములు కావు. విన్న కోట పెద్దన నిర్దేశించిన సహజాంధ్రదేశ భవమును, అప్పకవి చెప్పిన శుద్ధాంధ్రంబులు నొక్కతెగ. పెద్దన దేశోద్భవమే అప్పకవి పేర్కొనిన అన్యదేశ జాంధ్రము. కవి జనాంజనకారుఁడగు కిమ్మూరి నరస రాజు (క్రీ. శ. సు. 1800) ... కొన్నిటికి హ్రస్వ దీర్ఘములు కూడా కలవు....లకోరీ మొదలైన దేశ్య పదాలకు యెట్లంటె :

'పాదుశానవలా హు మాదులు దేశ్యంబు
లోలినింద లకోరీ లకోరి
తేజి తేజీ నేజ నేజా కటారీ - క
టారి బాజాది రెంటను జెలంగు...'

అని 'పాదుశా...కటార్యాదులను దేశ్యములుగా నిరూపించినాఁడు.[19] కాఁగా, మన వ్యాకర్తల విషయ విభాగ నిర్ణయమున ఏక వాక్యత లేదనియు, లక్ష్యలక్షణ సమన్వితము గాకుండుటచే సుబోధముగా లేదనియు తాత్పర్యము.

శబ్దరత్నాకరకారుని దృష్టి

'దేశ్యముల ఆంధ్రదేశ్యము, అన్యదేశ్య మని ద్వివిధము. ఆంధ్రదేశ్యము,— తల్లి, తండ్రి లోనగునది. అన్యదేశ్యము.—తావి, మోవి లోనగునది' (పు. xi, భాషాప్రశంస, శ. ర., 1885) ఇదీ శ. ర. కారుని చూపు 'అన్యదేశ్యము దేశ్యముతోఁ జేర్పఁబడినది గాన దానికిఁ బ్రత్యేకముగా సంజ్ఞ యిడఁబడదు.' (4 వ నియమము, నియమ విధానక్రమము, పు. xviii, శ. ర.). కాని, శ. ర. లో ఈ నియమము సక్రమముగా పాటింపఁ బడలేదనుట క్రింది ఉదాహరణముల మూలమున స్పష్టము. శ. ర. తొలి ముద్రణము నందే అటనట 'ఇది అన్యదేశ్యము' అని కొన్ని పదముల యొద్ద సూచితము. శ. ర. మలి ముద్రణములలో హిం. (= హిందూస్తానీ), అన్యదే. (= అన్యదేశ్యము) అను సంకేతములు ధారాళముగా ఉపయుక్తము. శ. ర. తొలి ముద్రణము ప్రతినుండి మచ్చునకు కొన్ని :

1. అచ్చాళు : దే. విణ. (అచ్చము + ఆళు) జంజాటము లేనివాడు....(ఆళు అన్యదేశ్యము). అనుబంధము, పు. 1125.

2. జెండా : దే. వి. టెక్కెము, ధ్వజము. ...(ఇది అన్యదేశ్యము). అను. పు. 1142.

3. దస్తూరి : దే. వి. వ్రాఁత.... (ఈ యన్యదేశ్య మీ గ్రంథము నందు మాత్రము కనఁబడెడి), పు. 530.

4. నగాసు : దే. వి. చిత్రము (ఇది అన్య దేశ్యము), అను. పు. 1146.

5. నంబెరుమాళ్ళు : దే. వి. బ. (నమ్ + పెరు మాళ్ళు.) శ్రీరంగ నాయకులు. (ఇది అన్యదేశ్యము). అను. పు. 1146. మలి ముద్రణములలో 'ఇది అన్యదేశ్యము' అను సూచన తొలఁగింపఁబడి, అర. (= అరవము) దే. వి. బ. గా మార్పఁబడినది. (చూ. శ. ర., 1912 ప్రతి, పు. 575).

6. సలాము : దే. వి. నమస్కారము.... (ఇది యవ్యదేశ్యము). పు. 1079.

---

18. అప్పకవి యీ తీర్పును దృష్టిలో నిలిపికొనియేకాఁబోలు, 'ఆంధ్రులితర దేశముననిలిచి యా యితర భాషలలోని పదములను దమ భాషలోఁగలుపు కొనినవి అన్యదేశ్యము' లని సులభవ్యాకరణ కారుఁడు వ్రాయుట. 'ప్రసిద్ధాన్యదేశ్యంబులు ప్రయోగార్హంబు' లని వ్రాయుచు గాణపతసూత్రవివరణ కర్త తమిళకర్ణాటపదములను ఉదాహరించుటయు ఇంచుమించు ఇట్టిదే.

19. కవిజనాంజనము, విశాఖపట్టణము పరవస్తువారి గ్రంథాలయమునందలి తాళపత్రప్రతి, 80 వ ఆకు. 2 ఎ వైపు.

7. హూసారు : దే. వి. జాగ్రత్త....(ఇది యన్యదేశ్యము). పు. 1122.
8. హొన్ను : దే. వి. పొన్ను. బంగారు. ...(ఇది యన్యదేశ్యము). పు. 1123.
9. హోళి : దే. వి. కాముని పండుగ కడపటినాఁడు తగులఁ బెట్టుటకై పోగు చేసెడి గడ్డి కంప. (ఇది యన్యదేశ్యము). పు. 1124

మీఁది పరిశీలనమును బట్టి నవీనోత్తరాహ భాషా పదములతో పాటు తమిళ, కర్ణాటాది ద్రావిడ భాషల నుండి ఎరవు తెచ్చిన ఆళు,[20] నంబెరుమాళ్ళు,[21] హొన్ను[22] మొదలగు పదములును శ.ర. కారుని దృష్టిలో అన్యదేశ్యములని నిర్ధారించుట యుక్తము. కాని, శ. ర. 'భాషా ప్రశంస' లో అన్యదేశ్యమునకు లక్ష్యములుగా నుదాహృతమయిన తావి, మోవి పదము లీ దృష్టితో చూచినను అన్యదేశ్యములగుట అసంభవము. శ. ర. కారుని ఈ పరిగణనమునకు పూర్వ వ్యాకర్తల నిరూపణము ఆధారము. అప్పకవి 'మోవి' ని అన్యదేశ్యజాంధ్రముగా నిరూపించినాఁడు. కేతన కెమ్మోవి, కమ్మతావులను దేశ్యంపుఁదెనుఁగులుగాఁ (ఆం. భా. భూ., 25) పేర్కొనినాఁడు. కేతన కెంజాయ, మంతనము–అను తద్భవములను దేశ్యంపు తెనుఁగులలోను, ఉవిద, జోటి, సరి – అను తద్భవములను దేశి తెనుంగులలోను పఠించుట విచార్యము. తావి, మోవి పదములు ఆంధ్రదేశ్యములుగా ఉట్టంకించిన బాలవ్యాకరణోద్ద్యోత మార్గము శాస్త్రీయము. '...మహారాష్ట్రి మొదలగు విజాతీయ భాషలనుండివలెనే (తమిళము, కన్నడము మొ.)సజాతీయ భాషల నుండియు సంక్రమించిన శబ్దములు అన్యదేశ్యములు గనే గ్రహింపఁబడవలసి యుండు' నని శ్రీ కోరాడ రామకృష్ణయ్య గారి సమీక్ష[23] పరిసర స్థములగు సజాతీయ దేశభాషల నుండి ఎరవుతెచ్చిన పదములను 'తిచై చ్చొల్' (= దిశల నుండి వచ్చిన పలుకులు)అని వ్యవహరించుట తమిళ వ్యాకరణ సంప్రదాయము.[24] ప్రస్తుత సమీక్షలో 'తిచై చ్చొల్' – సజాతీయ భాషల నుండి సంక్రమించిన పదరాశి–అప్రసక్తము.

పూర్వాంధ్రము - అన్యదేశ్యాభాసములు

'గాడీ' (= బండి) అను అన్యదేశ్యము నన్నయ భారత (ఆది. 8–221) ప్రయుక్తమని భావించుట[25] ప్రమాదమనియు, 'గాడీలు' పదఘటిత మపపాఠమనియు, 'గాడిదలను' అనునదచట మూలానుసారమగుటయకాక, అదియే కవ్యభిప్రేతమనియు సోపపత్తికముగా నిరూపితము.[26] కైపు, తరవారి, బాఁకు (–పాఁకు) లను నన్నెచోడకవికృతిలోని అన్యదేశ్యములుగా శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రి, ఎం. ఏ., గారు చేసిన మదింపు కూడ సువిచారితము కాదని నిర్ధారితము.[27]

'లేదింకం బగయని ధను
రాదుల దెస వాహనముల యందు సంత్య
క్తాదారులై పగతురనెఁ
డాదమఱచి నిద్రవోదు రదితఱిపోడు
వన్' (భారతము, సౌప్తిక. 1–51) అని

20. తమిళము. ఆళ్=వీరుఁడు; సమర్థుఁడు; భక్తుఁడు.
21. తమిళము. నంబెరుమాళ్ (నమ్ (< నామ్) + పెరుమాళ్)= శ్రీరంగమునందలి క్షేత్రమూర్తియగు విష్ణువు; పెరుమాళ్=స్వామి; ప్రభువు; విష్ణువు.
22. కన్నడము. పొన్, పొన్ను, పొమ్, హొన్, హొన్ను, హోమ్ = బంగారు. పకారము హకారముగా వికారమునందుట కర్ణాట భాషా విశిష్టస్వభావము. ఇది క్రీ. శ. పదియవు శతాబ్దినాఁటినుండి కర్ణాటభాషలో ప్రవర్తితమయిన ధ్వని పరిణామము. తెలుఁగునందలి హత్తు, హదను, హాయి, హుంకక్కి, హెగ్గడి, హెచ్చు, హేరాళము, హోరాటము మొదలగు పదాది హకారఘటితములు కన్నడమునుండి ఎరవు తెచ్చిన పదములు.
23. భాషా చారిత్రకవ్యాసములు, పు. 138.
24. 'చెంతమిట్ చేర్ న్త పన్నిరునిలత్తున్ । తజ్ కుఱిప్పినవే తిచై చ్చొల్ కిళవి' (తొల్కాప్పియమ్, చొల్లదిగారమ్, సూ. 400)
25. అముద్రిత గ్రంథ చింతామణి మయూఖము, సంపుటి 15, సంచికలు 1-2, జనవరి, ఫిబ్రవరి, 1902, పు. 32; దేవరపల్లి వేంకట కృష్ణారెడ్డి, తెంకణాదిత్యకవి, పుటలు 76-83.
26. నన్నయ - అన్యదేశ్యాభాసములు, సాహితి, ఫిబ్రవరి - మార్చి 1963 సంచికలు.
27. 'నన్నికవిద్వయము' - అన్యదేశ్యాభాసములు, సాహితి, నవంబరు - డిసెంబరు. 1962 సంచికలు.

తిక్కన ప్రయోగించిన 'ఆదమఱచు' 28 లోని 'ఆద' పారసి బాసయందలి 'యాద్' (= జ్ఞప్తి, స్మృతి) తో జన్య జనక సంబంధము కలదను ఆచార్య శ్రీ కోట సుందరరామశర్మ గారి ప్రతిపాదనము 29 విచార్యమానము. తిక్కన నాఁటికి 'త్రాసు' 30 అను మూర్త పదార్థ బోధకమగు అన్యదేశ్యము మాత్రము ప్రతిదేయము. వాణిజ్య పరముగా 'త్రాసు' అతి ముఖ్యమయిన వస్తువు. భాషల సంసర్గము నందలి ప్రథమ దశలో నిట్టి మూర్త పదార్థ బోధకములగు పదములే ఎరవు తేఁబడుచుండు ననుటయు, ఆ మూర్త పదార్థ బోధకములగు పదములు చిరకాల సాహచర్యమునఁగాని ప్రతిదేయములు కావనుటయు స్థితి స్థాపక విషయము. ప్రస్తుత సమీక్షాయుగమునందలి అన్యదేశ్యములును ముక్కాలు మువ్వీసము మూర్తపదార్థ బోధకములగుటయు, వీనిలో పెక్కులు విలాతి సీమల నుండి దిగుమతి యయిన దినుసులను దెలుపు మాటలగుటయు ప్రత్యక్ష ప్రమాణము. విశేషించి, సంస్కృతము నందలి 'ఆత్మన్' శబ్దమునకు వికృతియగు 'ఆద' శౌరసేనీ ప్రాకృతమున రూఢము. సంస్కృతమునందలి అపదాదితకారము శౌరసేనీ ప్రాకృతమున దకారమగుట సర్వసాధారణ మగు ధ్వని పరిణామము. 31 కావున, తెఁలుగు నందలి 'ఆద' 32 ను శౌరసేనీ ప్రాకృత సమముగా నిరూపించి వైకృత మనుట యొప్పు.

అన్యదేశ్య నిరూపణమున తబ్బిబ్బులు

అన్యదేశ్యములు కొన్ని వాని మూలరూపము లేవో గుఱుతింపరానంత మార్పాటును పొందినవి. 'లష్కరీ' (= దళవాయి; సేనాని; సైనికుఁడు; సేనాసంబంధమయిన) అను పారసి భాషాపదము తెలుఁగున 'లసికిరి' గా పరిణతము — కాకమాని మూర్తి కవికృతమగు రాజవాహన విజయమున నీ పదమిట్లు ప్రయుక్తము.

'లసికిరి జోదులగ్గలిక
లగ్గల కెక్కినఁ గుంతపఙ్క్తులన్
వసుమతిఁ గూల్చియున్ గదల
వైచియుఁగత్తుల వ్రక్కలించియున్
వసుల వధించియున్ ముసల
వర్గములం బడమోది వాలుకల్
మసలక వేసి వంచియును
మందుల తిత్తులు గాల్చివైచియున్'

(రాజవా 5–31)33 ఈ పద్యమున సమాపక క్రియ లేదని కాఁబోలు 'లసికిరి'ని ప్రథమ పురుష మహద్బహువచనము నందలి

28. 'ఆదమఱ' = జ్ఞప్తిభ్రంశే, అకర్మక క్రియ. జ్ఞప్తిదప్పుట' అని ఆంధ్రధాతుమాల, పు. 5. 'ఆదమఱచు'నకు శ్రీనాథయుగ ప్రయోగములు కొన్ని ; 'అఱిగియచ్చట శయ్యపైనాదమఱచి; నిద్రగూరిన తల్లిపై నెపముగొలిపి'

—పద్మ పురాణము, ఉత్తరఖండము, 9–116;

'మధురలోన నాదమఱచి నిద్రించిన; నరులనెల్ల నొక్కనాఁటిరాత్రి
ద్వారవతికిఁదెచ్చి...' —పైది, 9–363;
'కొంత తడవాదమఱచి నిద్రింతురపుడు' —వరాహపురాణము, 11–126.

29. Bulletin of the Linguistic Circle of New Delhi, Edited by Prof A. C. Sekhar. New Delhi, 1955.

30. చూ. పదపట్టికలోని 'త్రాసు' అను ఆరోపముక్రింద.

31. స్పష్టప్రతిపత్తినిమిత్త మీ క్రింది ఉదాహరణములు :

సంస్కృత,	దుహితృ	>	శౌ. ప్రా.	దుహిదా, దుహిదరమ్, దుహిదే.
,,	ద్యూత	>	,,	జూద
,,	ద్యూతకార	>	,,	జూది అరో
,,	పితృ	>	,,	పిదా, పిదరమ్, పిదరో
,,	మతి	>	,,	మది
,,	మాతృ	>	,,	మాదా, మాదరమ్, మాదాట, మాదే.

32. 'ఆద' (=విచారము) దేశ్యముగా శ. ర. లో ఉట్టంకితము (చూ. పు. 74): ఆధి (=మనోవ్యథ) శబ్దభవమని పురుషోత్తమ కవీయము. పు. 8.

33. నూతిలోఁబడిన బిందెను తీయుటకు పాతాళభేదివేయఁగా బేతాళములు బయలువడినట్లు, ఏదో యొక ఉత్తమపాఠము చిక్కకపోదను ఆశతో పరిశీలించిన ఒక్క తాళపత్రప్రతి (ఆం. వి. గ్రంథాలయమున 111 నెంబరు గల బొబ్బిలి ప్రతి) లో
'లలకిలి జోదు లగ్గలిక; లగ్గలకెక్కిన కుంత పఙ్క్తులన్; వసుమతి గూల్చియున్ గదల
వైచియు...' అను నీ యసందర్భపు పాఠమొకటి కన్పట్టినది. వ్రాయసకాఁడు ప్రాసభంగమును గమనించినట్లులేదు. 'లలకిలి జోదు లగ్గలిక లగ్గలకెక్కిన' వరకు ఒక యాకుమీఁదను, మిగిలిన పద్యభాగము తర్వాతియాకు మీఁదను లిఖితమగుటచే, ముందు వెనుకలు పరిశీలించి, సవరించుకొనుటకు ప్రతి విలేఖకునకు ఉసులుపాటు లేకపోయినది కాఁబోలు !

భూతకాలిక క్రియా రూపముగా భావించి (పిసికిరి – పిసుకు, పలికిరి – పలుకులవలె) ‘లసుకు’ అను నొక అనిష్ట మూర్తిని సృష్టించి, దే. స. క్రి. అను సంజ్ఞా పత్రమును దాని మొగమునఁ గట్టి, సందర్భమునుబట్టి గుఱికి బారెఁడు దూరముగా ‘నాశముచేయు’ అను ఉజ్జాయింపు టర్థముతో శ. ర. కారులు ఉల్లేఖించుట ప్రామాదికము.[34] శ. ర. కు పూర్వ రచనలగు విల్లియంబ్రౌను కూర్చిన జెంతూ నిఘంటువునఁగాని, ఆంధ్రదీపికలోఁగాని, ఆంధ్ర ధాతు మాలలోఁగాని, కాంబెల్ నిఘంటువునఁగాని, బ్రౌణ్యమునందుగాని, వీనికి పూర్వతనములగు ఆంధ్ర పద్య నిఘంటువులఁగాని ఈ ‘లసుకు’ అడపొడ కానరాదు. ఇది నూటికి నూఱుపాళ్ళు సీతారామాచార్యుల సృష్టి. పైపద్యము, తర్వాతిదగు ‘...మాళవాధిపు బలము లిమ్మాడిక్కనొంచె మగధనృపు సేన నొకనాఁటి పగటిలోను (రాజవా. 5–32) తో అన్వయము. ఈ‘లసికిరి’ (< లష్కరు) జోదులు మగధనృపు సేనకు చెందినవారు. ‘లసికిరిజోదు’ లనఁగా మూలబలము (Standing Army) నకు చెందిన యోధులు. కైకూలి బంటులు, దినరోజు జోదులు, ఒంటరి జోదులకంటె ‘లసికిరి జోదులు’ భిన్నులు. శ. ర. మీఁది ప్రమాణ బుద్ధి వలన అర్వాచీన కోశకారులు, భాషాతత్త్వ పరిశోధకులు, గ్రంథ వ్యాఖ్యాతలు దీని నిశ్లేనకలు దించుట గమనార్హము. ఆంధ్ర పద పారిజాతము, లసుకుట, పు. 698; లక్ష్మీనారాయణీయము, పు. 737; బ్రౌణ్యము – రివైజ్‌డ్, పు. 1106; శబ్దార్థ చంద్రిక, పు. 770; శంకరనారాయణ, పు. 1036; ఆంధ్రవాచస్పత్యము, పు. 2212; పూతల పట్టు శ్రీరాములు రెడ్డి, తాళ్ళూరి – ఆరుమ్మగం పిళ్ళగారల ‘రామచంద్ర’ విద్యార్థికోశము, చిత్తూరు, 1943, పు. 303; దాచేపల్లి వారి శబ్దార్థ దీపిక, 1956, పు. 1141, తుదకు పరమ ప్రామాణికులయిన సూ. ని. కారులును (చూ. సూ. ని. vi, 1958. పు. 927) సుపరీక్షితము గావింపక ఈ తప్పు నట్లే మక్కికి మక్కిగా నకలు వ్రాసి అచ్చొత్తించుట ఆశ్చర్యము. ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన ఆంధ్ర క్రియా స్వరూపమణిదీపిక (1962) యందును ‘లసుకు’ దేశ్యక్రియగా అవిమర్శముగా అంగీకృతము. ప్రచురితము కానున్న మఱి యెన్ని కోశముల కెక్కనున్నదో? ఇఁక భాషా పరిశీలకుల, వ్యాఖ్యాతల మాట: శ. ర. వ్రాఁతను అంధ పరంపరగా అనుకరించినవారు డా. చిలుకూరి నారాయణరావుగారు (చూ. ఆంధ్రభాషా చరిత్రము, సంపుటము 1. పు. 100, ‘తెలుఁగు నందలి దేశ్యమూల ధాతువుల పట్టికలో 292 వ నెంబరుగా ‘లసుకు’ ఉట్టంకితము). రాజవాహన విజయము – మంజువాణీ ముద్రాక్షరశాలా ప్రతి, 1937 – లోని ‘లసికిరి’ = నశింపఁజేసిరి’ అనుటీకకు శ. ర. యే ప్రమాణము. ఒకచోట దొరలిన తప్పు ఎందరెందఱు హేమా హేమీలను తప్పుదారి పట్టించెనో తెలుపుటకీ యొక్క ‘లసుకు’ జాతకము చాలు! ఆచార్య శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తి గారు దీని నిజతత్త్వము నెఱిఁగియే కాఁబోలు ఆంధ్రదేశ్య క్రియా స్వరూప నిరూపకమగు తమ సిద్ధాంత గ్రంథమునందు ‘లసుకు’ ను పరిహరించుట.[35]

అచ్చముగా కోశసంబంధమయినది కాకపోయినను ఒక ముచ్చట! తంజావూరు మహారాజా శరభోజీ సరస్వతీ మహలు లైబ్రరీలోని ఆంధ్రభాషామయమైన తాళపత్ర గ్రంథ సంచయమునకు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు వారొక కేటలాగును తయారు చేయించి ప్రకటించినారు.[36] ఆచార్య శ్రీ పి. పి. ఎస్. శాస్త్రిగారు దీనికి ప్రధాన సంపాదకులు. పూజ్యులు, కథావశేషులు శ్రీ కురుగంటి సీతారామ భట్టాచార్యులవారు దీని నిర్మాణమున ముఖ్య సారథులని వినికి. ఇందులో 275 వ నంబరు కలదిగా సంక్షేప రామాయణ మను పేర తాటియాకుల ప్రతి యొకటి వర్ణితము. ఈ ప్రతి రూపురేక లేవో టూకీగా వివరించిన పిమ్మట ‘గ్రంథమసంపూర్ణము. రామాయణ కథ సంక్షేపముగాఁ జెప్పఁబడియెను...గ్రంథమున నెక్కడను గ్రంథకర్తృ నామాదికములు గన్పట్టవు. కృతిభర్త లేఁడు, ఆశ్వాసములు, ఆశ్వాసాంత గద్యములు కూడ మృగ్యములు. This work is samksipta ramayanamu of unknown authorship’[37] అని చివర నంపాదకుల రిమార్కు కలదు. ఈ వ్రాతలను చూచి ఏమనవలెనో తెలియదు. ఎంత తొందఱ

34. శ. ర. 1885, పు. 983.

35. Dr. Bh. Krishnamurti, Telugu Verbal Bases – A comparative and Descriptive study, Ph. D. Thesis, University of California Publications in Linguistics, Vol. 24, Berkeley, 1961.

36. A Descriptive Catalogue of the Telugu Manuscripts in the Tanjore Maharajah Serfoji Saraswati Mahal Library, Andhra University Publication, Waltair, 1933.

37. చూ. పైది, పుటలు 79, 80.

పాటు! వాస్తవముగా నీ తాళపత్ర గ్రంథ భాగము పోతనకృత భాగవతము, నవమస్కంధము (259-349) నందలి సంక్షేప రూప మయిన రామాయణ కథ! ఇంచు మించు తొంబది గద్య పద్యముల భాగము!!! అంతా అచ్చువడైదు గ్రంథముల పరిమితికి లోపు మాట!!!. ఎవఁడో రామాయణ కథాపారాయణాభిలాషతో పోతన కృతి నుండి విడిగా ఎత్తివ్రాసికొనిన తాటి యాకుల బొత్తి: పోతన భాగవతము, అందును నవమస్కంధము, పైగా అతి ప్రసిద్ధ మయిన రామకథ. ఇందలి ఒకొక్క పద్యమును పోతన శైలిని పట్టియిచ్చెడి శబ్దాలంకార సర్వస్వము. ఏమయిననేమి, కేటలాగు నిర్మాతల యెఱుకకిది అంద లేదు. నిర్మాతలు ఎవరైననేమి, ప్రమాదో ధీమ తామపి: మా ప్రాంతముల నీ రామా యణ కథ—గజేంద్రమోక్షము, ప్రహ్లాద చరిత్రము, రుక్మిణీకల్యాణములవలె-బడిపిల్ల లందఱకును కంఠోపాఠము. ఒకందుకు సంతోషము. ఘటికా శతవ్యాస కల్పనులగు కొందరు విమర్శకుల దృష్టిలో ఇది పడి నట్లు లేదు. పడియుండెనా, 'తంజావూరి రామాయణ' మని అపూర్వ పరిశోధక వ్యాస మొకటి అవతరించి యుండెడిది. 'ఎటువంటి బుద్ధిశాలులకును నిట్టి మహా కార్యముల యందు పొరపాట్లు కలుగక మానవు'. అంతమాత్రమున వారి చిరం తన కృషి సుధీసేవ్యము కాకపోదు. అమ ర్చిన దానిలో అత్తగారు వ్రేలుపెట్టినట్లు, ఒకరికృషిలో తప్పులుపట్టుట చాల తేలిక! తంజావూరి ముచ్చట మనలను చాల దూరము తెచ్చినది. పరదోష కథా పరాఙ్ముఖులగు పెద్దలకు రామాయణము లోని ఈ పిడుకల వేఁట ఇంపునింపదు గావున, ఈ ప్రసంగము నింత కట్టిపెట్టి ప్రకృత మనుసరింతము.

అన్యదేశ్య ప్రయుక్తియందు శ్రీనాథుఁడు ప్రథముఁడు కాకపోయినను ప్రముఖుఁడు. ప్రధానముగా ఇతనిది గౌడీరీతి-వైదర్భీ రీత్యను యాయుల కంటె గౌడీరీత్యను యాయులకు శబ్దముల కూర్పు పట్ల శ్రద్ధ యెక్కువ. రసాద్యుచితబంధ ముగఁ గవిత సెప్పవలయుచో తత్తత్ప్ర కరణోచితముగను, తత్తత్పాత్రోచితము గను భాషాప్రయోగపద్ధతి యుండుట ఆవశ్యకమని యెఱిఁగిన పద వాక్య ప్రమాణ పారీణుఁ డీతఁడు; తత్ప్రయోజన సిద్ధికై 'శబ్దంబుపలక్షించియు', 'అశేష మనీషి హృదయంగమంబుగా శబ్దంబనుస రించియు' (నైష. 8-202) సాహితీ నిషేవణ మొనర్చిన సరససాహిత్య సామ్రాజ్య చక్రవర్తి శ్రీనాథుఁడు. క్రొత్త మాటలను ఏర్చి కూర్చుట శబ్దదారిద్ర్యము వలనఁ గాదు. ప్రాతవడ్డ మాటలను పరి హరించుటయు, క్రొత్త పలుకుబడులను స్వీకరించుటయు కవి సంప్రదాయము. విశే షించి, నూతన వస్తు సన్నిధిని ప్రసన్న వివేకముగా తద్బోధకములగు పదములను ప్రయోగించుట అర్థవ్యక్తికి, ఝటితి స్ఫూర్తికి అవశ్య కర్తవ్యము. పలుకుల పొందికలో నాజూకు పోకడలకు మోజు పడెడి రసప్రలుబ్ధుల కిట్టి పట్టులు అమృత చషకములు.

ప్రస్తుత చర్చలో పరిశీలితములయిన ప్రధాన గ్రంథములు :

1. అధ్యాత్మ సంకీర్తనలు : తాళ్ళపాక అన్నమయ్య
   5-10 సంపుటములు
2. కావ్యాలంకార చూడామణి : విన్నకోట పెద్దన్న
3. కాశీ ఖండము : శ్రీనాథుఁడు.
4. క్రీడాభిరామము :? వల్లభా మాత్యుడుఁ ;? శ్రీనాథుఁడు
5. చాటువులు (వీధినాటకము): శ్రీనాథుఁడు
6. ఛందోదర్పణము : అనంతుఁడు
7. జైమిని భారతము : పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుఁడు.
8. జ్ఞాన వాసిష్ఠము : మడికి సింగన
9. ద్వి. భాగవతము : మడికి సింగన (దశమస్కంధము)
10. ద్వి. హరిశ్చంద్ర : గౌరన
11. నవనాథ చరిత్ర : గౌరన
12. నాసికేతూ పాఖ్యానము : దగ్గుఁబల్లి దుగ్గన
13. పంచతంత్రము : దూబగుంట నారాయణకవి
14. పంచతంత్రము : బైచరాజు వేంకటనాథుఁడు,
15. పద్మపురాణము : మడికి సింగన
16. పరతత్త్వ రసాయనము : ఈశ్వర ఫణిభట్టు
17. పల్నాటి వీరచరిత్ర :? శ్రీనాథుఁడు. (బాలచంద్ర యుద్ధము)
18. ప్రబోధ చంద్రోదయము : నంది మల్లయ, ఘంట సింగయలు.
19. భాగవతము : బమ్మెర పోతన
20. భాస్కర రామాయణము : అయ్యలార్యుఁడు (యుద్ధకాండశేషము)
21. భీమేశ్వర పురాణము : శ్రీనాథుఁడు
22. భోజరాజీయము : అనంతుఁడు
23. రత్నపరీక్ష : భైరవ కవి
24. రసాభరణము : అనంతుఁడు
25. రుక్మాంగద చరిత్ర : ప్రౌఢకవి మల్లన

26 వరాహపురాణము : నంది మల్లయ, ఘంట సింగయలు
27, విక్రమార్క చరిత్రము : పేరంరాజు జక్కన
28 వీరభద్రవిజయము : ? బమ్మెర పోతన
29 శివయోగసారము : కొలని గణపతి దేవుడు
30 శివరాత్రి మాహాత్మ్యము : శ్రీనాథుడు
31. శివలీలా విలాసము : నిశ్శంక కొమ్మన్న.
32 శృంగార నైషధము : శ్రీనాథుడు
33 శృంగార శాకుంతలము : పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు
34 శృంగార సంకీర్తనలు : తాళ్ళపాక అన్నమయ్య

(4 వ సంపుటము)

35 శ్రీరంగమహత్వము : భైరవకవి
36 షోడశ కుమార చరిత్రము : వెన్నెల కంటి అన్నయ్య
37 సకలనీతి సమ్మతము : మడికిసింగన
38 సింహాసనద్వాత్రింశిక : కొఱవి గోపరాజు
39. హరవిలాసము : శ్రీనాథుడు
40 దక్షిణ హిందూదేశశాసన సంపుటములు

శ్రీనాథునకు పూర్వులగు కొట్టరువు తిక్కన, నాచన సోమన, పాల్కురికి సోమన, మూలఘటికకేతన మొదలగువారు ప్రయోగించిన అన్యదేశ్యములను ఆయా తావుల ఉదాహృతము. కేవలము కోశప్రయోగములతో సరిపెట్టక ఏతద్యుగీనములను సర్వాంధ్రగ్రంథములను పారముముట్ట పరిశీలించి ఆవశ్యకములగు ప్రయోగ భాగము లిందు ప్రదర్శితము. సాధు పాఠ నిర్ణయము అక్కఱ కలదని తోచిన పట్టుల వివిధ ముద్రణముల పాఠములును, తాళపత్రప్రతుల పాఠములును, అనువాదములైనచో సంస్కృత మూలములును ఉట్టంకితము. ఈ యుగమునకు చెందిన శాసన ప్రయోగములును ఎడనెడ ఉద్ధృతము.

పదపట్టికలోని ప్రధానారోపములు 107, వీని రూపాంతరములు 23, మొత్తము ఆరోపములు 130. ప్రధానారోపపదములకు తప్ప, వీని రూపాంతరములకు వరుస సంఖ్య వేయలేదు. ఇందులో శ్రీనాథ ప్రయుక్తములు చక్కనగమునకు పైమాట.

అరబీ, అసివారు, కత్తలాని, కప్పలి, కమరు, కాకితము, కిచ్చడి, కుందనము, కుల్లా, కోహళి, ఖుసి, గంజాయి, గసగస, గాగరా, గుల్లాము, గోవ, చికిలి, జబ్బు, జరి, జలపోసనము, జోగు, తరుణాసీరి, తవాయి, తేజీ, త్రాసు, దుకాణము, పంజార, పంజు, పండువా, పరాకు, పారసి, పేషణి, బాజారు, బిబ్బీ, బొందిలి, మసీదు, మైజారు, మోళము, రావు, లాహిరి, లుంగ, వలికా, పల్లి, సమ్మాను, సహా, సురతాణి, సేబాసు, హజారము, హురుముంజి మొదలయినవి శ్రీనాథ ప్రయుక్తము. ఇందులో పల్నాటి వీరచరిత్రము (బాలచంద్ర యుద్ధము)నందలి అసలు, ఖర్చు, చబుకు, చామలా, చావడి, డమామి, దేరా, తాయెతు, బరాబరి, బాకు, ముఖమల్లు, రోజు, సన్నాయి, సరిహద్దు, హద్దు — ఈ పదునైదును చేరలేదు. సమకాలికులు వాడగా శ్రీనాథుడు వాడని అన్యదేశ్యములు సగమున కించుక తక్కువ. అవి ఇవి : అపరంజి,[38] ఈనాము, కంఖాణి, కంగారు, కొజ్జా, ఖాన, గలబ, గస్తు, గొంగడి, గోరక్కుడు, గోహరి, చవుక, చాడి, జమ్ముఖాణము, జిరా, జీబు, జులుము, జూటరి, తబల, దరిబేసి, దుహిలీ, నకీబు, పింగాణి, పౌజు, బిడారము, మాలిమి, మేకు, మోజా, లాలు, లూటి, వహి, విలాతి, శాలువు, సంగడి, సవా, సామ్రాణి, సుపాణి, సోళాదొప్పి, హుమాయి — మొదలగునవి.

మరాఠీ భాషకు నిసర్గములయి తెలుగున ప్రతిదేయములగు అన్యదేశ్యములు : కిచ్చడి, గంజాయి, గలబ, గాగరా, గొంగడి, గోరక్కుడు, గోవ, చవుక, చాడి, చావడి, జూటరి, డమామి, దేరా, పరాకు, పేషణి, బాకు, బిడారము, బొందిలి, రావు, లూటి, వహి, సంగడి, సవా, సుపాణి, సొగటాలు, సోళాదొప్పి — మొదలగునవి.

అరబ్బీ పారసీ కాద్యన్య సీమలలోని భాషలకు నిసర్గములయి ప్రత్యక్షముగా పారసినుండిగాని, పరోక్షముగా మరాఠీ భాషా ముఖమునఁ గాని తెలుగునకు ఎరవు తెచ్చినవి మొత్తము పదములలో ముక్కాంపాలు. ఏవి ప్రత్యక్షముగా వచ్చినవో, ఏవి పరోక్షముగా వచ్చినవో బరాబరిగా గెఱగిచి తూచి చెప్పుటకు ఉపలబ్ధ సామగ్రి చాలదు. అందాజు అంచనా యిది : అపరంజి, అరబీ, అసలు, అసివారు, ఈనాము, కత్తలాని,

---

38. 'గురుతైన యపరంజి గొప్పముత్తెపునత్తు మోవిపై నొకవింత ముద్దుగుల్క'అని క్రీడాభిరామము (గంటివారి ముద్రణము) ఉపోద్ఘాతము (పు.62)లో శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి గారు శ్రీనాథచాటు పద్యభాగముగా ఉదాహరించినను 'హురుముంజి ముత్యములు' ప్రసిద్ధములగుటవలన, ఈ పద్యపాదము 'గురుతైన హురుముంజి గొప్పముత్తెపునత్తు' అని యుండుట యుక్తమని భావించుటచే 'అపరంజి'ని శ్రీనాథప్రయుక్తముగా పరిగణింపలేదు.

కమరు, కాకితము, కుందనము, కుల్లా, కొౙ్జా, ఖర్చు, ఖాన, ఖుషి, గసగస, గస్తు, గులాము, గోహరి, చబుకు, చికిలి, జబ్బు జరి, జలపోసనము, జిరా, జీబు, జులుము, తబల, తాయెతు, తేజీ, త్రాసు, దరిబేసి, దుకాణము, దుహిలీ, నకీబు, పంజు, పారసి, పింగాణి, పౌజు, బరాబరి, బాజారు, బిబ్బి, మసీదు, మాలిమి, ముఖమల్లు, మేకు, మైజారు, మోజా, మోశము, రోజు, లాలు, లాహిరి, లుంగ, విలాతి, సన్నాయి, సరిహద్దు, సహా, సామ్రాణి, సురతాను, సేబాసు, హజారము, హద్దు, హుమాయి, హురుముంజి – మొదలగునవి.

తక్కినవానికి సమీపమాతృక లివి :
కప్పలి, జోఁగులు మలయాభాషలోనివి.
తరుణాసీరి, తవాయి,రమణా – లు
బర్మాకు చెందినవి.

'సమ్మాను' చీనీ భాషాజన్యము; పరోక్షముగా మలయా భాషనుండి ప్రతి దేయము.

వలికా, వల్లి–పదముల మూలములు మృగ్యము.

ఈ పట్టిక సమగ్రమనుట సాహసము. నా యెఱుకకందని అన్యదేశ్యములు మఱికొన్ని యుండవచ్చు. విశేషాంశములు ఆయా ఆరోపములకడ వివృతము.

ఈ క్షేత్రమున సాఁగిన కృషి చాల స్వల్పము.[39] పర్యాప్తమయిన పరిశీలనము వలన అపూర్వములయిన అంశములనేకము ఆవిష్కృతము కాఁగలవని ఆశంస :[40]

పదపట్టిక[41]

1. అపరంజి : ఉదిరి, పుటము పెట్టిన బంగారము. 'అపరంజి – యనఁదప్తకాంచనమౌ' (సాంబ – స్తా.67): 'అరయనిత్తడిఁదెచ్చి యపరంజిఁజేసె' (అధ్యాత్మసంకీ. సంపుటి v, సంకీర్తన 185), 'అపరంజి పసిఁడి కలరుతావివలె' (వేం.పంచ 4–92). 'అపరంజి పసిఁడి కామాక్షులు' (పైది 4–101), 'పశ్చిమంబు పన్నీరపరంజి బుంగలనునించి'(పైది.4–341). < పారసి. అఫ్రంజ్ = పడమటి సీమవారు పరంగులు; అఫ్రంజ = ఈజిప్టు దేశములోని ఒక పట్టణము. అఫ్రంజీ = పాశ్చాత్యుఁడు: వారి రాకపోకలతో ఎక్కువగా వాడుక కెక్కిన ఒక దినుసు మేలిమి బంగారము: అపరంజి < అరబ్బీ.అఫ్రంజియ = విలాతి సీమకు సంబంధించిన(బ్రౌణ్యము,రివైజ్డ్, పు. 1404).

2 అరబీ: అరబ్బీ దేశపుభాష,సెమిటిక్ భాషా కుటుంబమునకు చెంది అరేబియా యందును ఇస్లాము మతధర్మవాహకముగా తక్కిన ముస్లిము ప్రపంచమునందును వ్యవహారముకలభాష. 'అరబీభాష తురుష్కభాష...' (భీమ. 1–73) < పారసి. అరబ్ = కౌశల్యము, నేర్పు;ధార్మికత్వము; ప్రతిభ; అక్కఱ.

3. అసలు : మూలము, మొదలు.'అమ్మనీ యల్లుని నసలేనెరుంగ – ఏరీతి దెలియుదు నేయుపాయంబు' (పల్నాటి. పు. 73). < మరాఠీ. అసల్,అస్సల్ = పురాతనము; మూలము; అసలీ = మౌలికము; అరబ్బీ అస్ల్ = మూలము; వాస్తవము; పారసి. అస్ల్ = ప్రాచీనము; అస్లాఫ్ = పూర్వులు; పితృదేవతలు; ఇస్లాఫ్ = సంచకరమిచ్చుట.

4. అసివాఱు: వాహ్యాళి, సవారీమార్గము. 'ఎవ్వాఁడు నలువతేరెక్కి యష్టాదశ ద్వీపాళి యసివారు దిరిగెలీల'(కాశీ,4–194). 'ఎవ్వండు నలువతేరెక్కి యష్టాదశద్వీపి యందసివారు దిరిగె లీల' అని పెక్కు తాళపత్రప్రతుల పాఠము. అసి (= అల్పార్థకము) + పాఱు (= పరుగెత్తు), అసివాఱు = మందగమనము–అను నిట్టి రూపనిష్పాదన రీతి ననుసరించిన ఆంధ్రనిఘంటువుల (శ.ర.,పు.65;బ్రౌ.రి., పు.103: సూ. ని., సం.I. పు. 361) వైఖరి ప్రామాదికము. దీనిని శకటరేఫ ఘటితముగా భావించుటయు భ్రాంతిమూలకము. 'అసివారు' ననంతర రూపమగు 'స్వారి' విదేశ్యమను వజ్ఝలవారి అభిప్రాయము నిర్మూలకము (చూ. వైయాకరణ పారిజాతము, 1937.. పు. 112). 'అస్వార్' అను పారసిపదము దీనికి అసలు మాతృక. < మరాఠీ. అసివార = రౌతు, అశ్వారోహకుఁడు; పారసి. అసూవార్, అస్వార్ = రౌతు. 'ఆ పంచగౌడ ధాత్రీపదం బెవ్వాని కసివారుగానేఁగునట్టి బయలు' (మను చ. 1–11) అను పద్యపాదమును ఎవ్వానికి + అసివారుగా అని విఱుచుటకు మాఱు, ఎవ్వాని + కసివారుగా అని తప్పుగా

39, మోదేకుర్తి సత్యనారాయణ, తెలుగుశాసనాలలో అన్యదేశ్యాలు, భారతి, అక్టోబరు, 1959.

40. ఆచార్య శ్రీ గంటి జోగిసోమయాజిగారి పర్యవేక్షణమున లకంసాని చక్రధరరావు - ఆంధ్ర విశ్వకళా పరిషత్పరిశోధక విద్యార్థి–ఆంధ్ర భాషయందలి అన్యదేశ్యముల తలస్పర్శి విమర్శనమునకు పూనుకొనుట ముదావహము.

41. పదపట్టికలో వాడిన సంకేతములు సుపరిచితములు. '<' ఈ సంకేతము మొనవైపున నున్నది జన్యపదమనిగాని, పరిణతరూపమనిగాని అర్థము.

విఱిచి ఆంధ్రపద పారిజాతకర్తలు 'కసివారు' అను అనిష్టరూపమును సృష్టించిరి. (చూ. ఆంధ్రపద పారిజాతము, 1888, పు. 132). వీరిని అవిమర్శముగా అనుకరించినవి, లక్ష్మీనారాయణమును (చూ. పు. 223), ఆంధ్రవాచస్పత్యమును (చూ. పు. 787). ప్రాచీన వ్యాఖ్యలయందును ఇట్టితప్పు విఱుపు కన్పట్టదు. 'అసివాఱుగాన్ = సవారీ మార్గముగా' అని జూలూరి అప్పయ్య పండితుల ప్రతిపదటీక, పు. 3; (భారతీ ముద్రాక్షరశాల, చెన్నపురి, 1875). ప్రసిద్ధులయిన గురుజాడ శ్రీరామమూర్తి, ఓగిరాల జగన్నాథకవి గారలు సంతరించిన ఆంధ్రపద పారిజాతముపై అల్పబోధనులగు కొందఱు చేయిపడియుండుట పరిశోధక విదితము. 'ఆంధ్రపద పారిజాతము అను శుద్ధాంధ్ర నిఘంటువు ఓగిరాల జగన్నాథకవిగారిచేతను, గురజాడ శ్రీరామమూర్తిగారిచేతను రచియింపంబడి తన్మిత్రులగు పిడుగు-సుబ్బరామయ్యగారిచేతను, మఱికొందఱు పండితులచేతను మఱికొన్ని పదములను సోదాహరణముగాఁజేర్పించి' ప్రచురించుట వలన ఈ పొరపాటు దొరలియుండునని నాయూహ. 'మఱికొన్నిపదములను' సోదాహరణముగాఁజేర్చిన 'మఱికొందఱు పండితులే' దీనికి కారకులు.

5. ఈనాము : చేసిన సేవలకు మెచ్చి యిచ్చెడి బహుమతి, పసదనము. 'కరి మయూర మరాళికలకు నొయ్యారమినా మిచ్చి' (వరాహ. 4-159). < మరాఠీ. ఇనామ = బహుమతి; పారసి, అరబ్బీ. ఇన్' ఆమ్ = బహుమతులు.

6. కంఖాణి : ఆఫ్ఘనిస్థానపు పరిసరములఁగల సీమనుండి కొనితెచ్చిన మేలి రకము గుఱ్ఱము. 'కంఖాణతురగరింఖాపుంఖిత...' (వరాహ. 5-27), 'సంజ్ఞా కంఖాణిన్' (పైది. 5-96). 'కంఖాణ' సంస్కృతపదమను ఆంధ్రనిఘంటువుల నిర్ణయము సత్యవిదూరము. సంస్కృత సమాసమధ్యమునఁ బ్రయుక్తమగుటయే వీనికి ప్రమాణముకాబోలు: 'ఈ శబ్దము తెనుఁగు గ్రంథములయందే కానిపించుచున్నది: అని సూ. ని. కారుల జ్ఞాపిక. (చూ., సూ. ని., సంపుటి II పు. 3). ఆంధ్రదేశీయులగు సంస్కృత నిఘంటుకారులు దీనిని సంస్కృతపదముగా భావించుట అశాస్త్రీయము. 'కఙ్ఖాణః - అ. పు. గుఱ్ఱము' (సర్వశబ్దసంబోధిని, పు. 117), 'కంఖాణః - అదంతః పుంసి ॥ అమరః ॥ ॥ అశ్వే ॥ గుఱ్ఱము' (సంస్కృతశబ్దార్థకల్పతరు, పు, 108). అమరకోశమున నీపదము లేకున్నను, శబ్దార్థకల్పతరుకర్త అమరసింహుని పేర్కొనుట ఆశ్చర్యము. వాస్తవముగాఁ అమరమునలేని పదములకును అమరమును ఆకరముగా బ్రదర్శించుట ఈ నిఘంటువునందలి విపరీత వైఖరి. తక్కిన ప్రసిద్ధ సంస్కృత నిఘంటువులలో ఈ యారోపమేకన్పట్టదు. వాస్తవముగా ఈ పదము సంస్కృతము కాదు. అశ్వములకు ప్రసిద్ధినందిన యొక దేశవాచకమిది. శుద్ధదేశ్యములగు పదములను సైతము సంస్కృత సమస్తపదములలోఁ బ్రయోగించుట శ్రీనాథునివచో విలాసములలో నొకదినుసు. కైవారము, హేరాళము మున్నగు సంస్కృతేతరపదములు సంస్కృతసమాసములలోఁ బ్రయుక్తమగుట శ్రీనాథరచనములఁగన్పట్టు లక్షణము. '...శ్రీనాథునకు సంస్కృత సమాసమున సంస్కృతేతరపదములఁ జేర్చు నలవాటుగలదు. ఇట్లే 'హేరాళ' పదమును గూడఁబ్రయోగించినాఁడు .... కయివారము అనురూపాంతరముండుటచేతను అచ్చ తెనుఁగు గ్రంథములలోనుండుటచేతను దీనిని (కైవారమును)ఆచ్ఛికముగా గ్రహించుటయే యుక్తము.' అను సూ. ని. మతము (చూ., సూ., సం. II. పు. 460) సూరిజనసమ్మతము. ' ... కలిభుపాలుని యొద్ది పాఠకులమీ కైవార దుర్భాషణంబులకుంగాని యతండు మెచ్చండు ... ' (నైష.7-89), 'ఆవేళను గంధర్వులు - కైవారపదానుసారకమనీయముగాఁ - బ్రావేశిక ధ్రువాగానావళులఁ బరిఢవించిరి ...' (హర. 6-9), భారతీదేవి కైవార వాక్యంబులు పఠియింపుచున్నది ప్రస్ఫుటముగ ...' (కాశీ.7-57). 'ఇచటఁ గైవారశబ్దము సంస్కృత సమాసఘటితమైయున్నది. ఇది సంస్కృత శబ్దము గూడని శ. ర. న నున్నదిగాని యచ్చకర్ణాట శబ్దముగఁ గర్ణాట నిఘంటువులలోనున్నది. ప్రాచీన సంస్కృత నిఘంటు గ్రంథములలో నెక్కడ నీ శబ్దముగనఁబడదు. కావున నిది దేశ్యమొండెఁగవివార (కవులపలుకులు) శబ్దతద్భవ మొండెంగావలయు. ఈ శబ్దము స్తుతిపరముగనే యఱవమునను గన్నడమునను వాడఁబడుచున్నది ... శ్రీనాథుఁడు (దీనిని) సంస్కృతముగ భ్రమించెనని తోఁచుచున్నది.' (వావిళ్ళవారి కాశీఖండ ప్రతిలోని అధస్సూచిక).కైవారము దేశ్యమే గాని తద్భవముగాదు. కన్నడమున 'కయ్‌పాట్, కైపాట్, కైవార' పదములున్నవి. చేయెత్తి మంగళాశాసనము పలుకుటయని దీని యర్థము. 'కైవార' (పంపరామాయణం ఎంబరామచంద్ర చరితపురాణం, 12-50). తమిళమునందును 'కైవారమ్' అను పదమిదే యర్థమున దేశ్యముగా నుట్టంకితము. తమిళమున 'కైవారిగళ్' అనఁగా నిలిచి చేయెత్తి రాజులను పొగడుటకు నియమితులయిన వారని యర్థము. ఇట్లే '... హేరాళ క్రీడా

(మిగతా 68 వ పేజీలో)



ప్రగతి పథంలో

(జిల్లాలనుంచి అందిన అభివృద్ధి కార్య క్రమాలను గురించిన సంక్షిప్త వార్తలు)

ఆదిలాబాదు జిల్లా

సంగీత, నాటక సదస్సు

1963 మార్చి 5వ తేదీన ఆదిలాబాదు లోని ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో 5 వ సంగీత, నాటకసదస్సును నిర్వహించారు. భోత్, మన్మాడ్, మంచిర్యాల, చెన్నూరు బెల్లంపల్లి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశా లలు యీ సదస్సులో పాల్గొన్నాయి.

చెన్నూరు జిల్లాపరిషత్తుఉన్నతపాఠశా లకు ప్రథమ బహుమతి, భోత్ జిల్లా పరి షత్తు ఉన్నతపాఠశాలకు ద్వితీయ బహు మతి లభించాయి.

కడప జిల్లా

సహాయక ప్రదర్శనం

కడపలో ఫిబ్రవరి 20 వ తేదీన జాతీయ రక్షణనిధి సహాయార్థమై ప్రఖ్యాత సినిమా నటి రాజసులోచన నాట్య ప్రదర్శనం జరిగింది. యీ ప్రదర్శనం ద్వారా లభించిన దాదాపు రు. 1,20,000 లు నిధికి ఇవ్వబడ్డాయి.

కరీంనగరం జిల్లా

శిక్షణ శిబిరం

మంతెనబ్లాకులోని పోతారంలో ఫిబ్రవరి 14 వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు గ్రామ సహాయకుల శిక్షణ శిబి రాన్ని నిర్వహించారు. పరిసరాలలోని ఐదుగ్రామాలకు చెందిన 50 మంది గ్రామ సహాయకులు యీ శిక్షణలో పాల్గొ న్నారు.

కర్నూలు జిల్లా

ఉన్ని ఉత్పత్తి కేంద్రం

గుమ్మఘట్టలోని రేవనసిద్దేశ్వర ఉన్ని పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం క్రొత్త భవనానికి 1963 ఫిబ్రవరి 18 వ తేదీన చేనేతశాఖ డైరెక్టరు ప్రారంభోత్సవం చేశారు.

కృష్ణా జిల్లా

గ్రామీణ స్వచ్ఛందదళం

కృష్ణాజిల్లా చల్లపల్లి పంచాయతీ సమితిలోని గ్రామాలలో 1963 ఫిబ్రవరి నెలలో 237 మందిని గ్రామీణ స్వచ్ఛంద దళంలో చేర్చుకోవడం జరిగింది. మాజేరు గ్రామంలో 12 మందిని రక్షణ శ్రామిక బ్యాంకులో సభ్యులుగా చేర్చుకోవడం జరిగింది.

గుంటూరు జిల్లా

పరిశీలనా పర్యటన

మధ్యప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన 12మంది బి. డి. ఓ. లు పరిశీలనా పర్యటనపై ఫిబ్రవరి 6 వ తేదీన ఈమని బ్లాకును సందర్శించారు. రాజేంద్రనగర్ లోని ఓరియన్టేషన్ శిక్షణకేంద్రంనుంచి వీరు వచ్చారు.

తూర్పుగోదావరి జిల్లా

సిబ్బందీ క్వార్టర్లు

ప్రణాళిక, పంచాయతీ రాజ్ శాఖల మంత్రి, ఫిబ్రవరి 5 వ తేదీన కోట నందూరులోని సమితిసిబ్బంది క్వార్టర్లకు పునాదిరాయి వేశారు.

ఆరోగ్య కేంద్రం

ప్రణాళిక, పంచాయతీరాజ్ శాఖల మంత్రి, ఫిబ్రవరి 4 వ తేదీన సంకవరం లోని శ్రీమతి పర్వత సుబ్బాయమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి పునాది రాయి వేశారు.

భూరివిరాళం

ఈ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికై పర్వత కుటుంబం వారు రు 10,000 లు,

రెండు ఎకరాలభూమిని విరాళంగా ఇచ్చారు.

నల్లగొండ జిల్లా

శతవార్షికోత్సవం

న్యాయ, సమాచార శాఖల మంత్రి ఫిబ్రవరి 27 వ తేదీన భువనగిరిలో స్వామి వివేకానంద శతవార్షికోత్సవాలకు ప్రారంభోత్సవం చేశారు. ఆలేరు పంచాయితి సమితిలోని యాదగిరిగుట్టలో గ్రామ సహాయకుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. 48 మందికి శిక్షణ ఇవ్వడం జరిగింది.

రక్షణ శ్రామిక బ్యాంకు

మునుగోడు సమితిలోని 25 గ్రామ పంచాయతీలలో గ్రామీణ స్వచ్ఛందదళం పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇంతవరకు 13 రక్షణ శ్రామిక బ్యాంకులను ప్రారంభించారు. గ్రామీణ స్వచ్ఛంద దళం, రక్షణ శ్రామిక బ్యాంకులలో మొత్తం 1,547 మంది చేరారు.

నిజామాబాదు జిల్లా

విస్తృతపౌష్టిక ఆహార కార్యక్రమం

వృత్తులు, ఉపకరణాల సంఘం అధ్యక్షులు, సభ్యులు ఫిబ్రవరి 17 వ తేదీన బనస్వాడ పంచాయతీ సమితిలోని మహ్మద్ నగర్‌ను సందర్శించారు. విస్తృతపౌష్టిక ఆహార పథకంక్రింద లాభించే గ్రామవాసులకు ఆయన గ్రుడ్లు మొదలైన వాటిని పంచారు.

నిజామాబాదు ప్రచారకార్యకర్తలు

బ్లాకు, మునిసిపాలిటీ స్థాయిలోని ప్రచార కార్యకర్తల శిక్షణ నిమిత్తం నిజామాబాదులోని టౌన్‌హాలులో ఫిబ్రవరి 2 వ తేదీ నుంచి 4 వ తేదీ వరకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ప్రతిబ్లాకునుంచీ 5 గురు ప్రతినిధులు, ప్రతి మునిసిపాలిటీ నుంచి ఇద్దరు ప్రతినిధులు యీ శిక్షణలో పాల్గొన్నారు.

మెదకు జిల్లా

సంగీత నాటక సదస్సు

1963 ఫిబ్రవరి 15,16 తేదీలలో సంగారెడ్డిలో మెదకుజిల్లా సంగీతనాటక సదస్సు జరిగింది. రామాయంపేట జిల్లా పరిషత్తు ఉన్నతపాఠశాల ప్రదర్శించిన 'విజయపథం' సార్దానా జిల్లా పరిషత్తు ఉన్నతపాఠశాల ప్రదర్శించిన 'రక్షణనిధి' బుర్రకథ ఉత్తమమైనవిగా నిర్ణయించి బహుమతులు ఇచ్చారు.

నెల్లూరు జిల్లా

వాలంటీర్ల ఉత్సాహం

కొండపి బ్లాకులోని అన్ని పంచాయితీలలోనూ 1963 ఫిబ్రవరి రెండవ వారం వరకు గ్రామీణ స్వచ్ఛందదళాలలో 1,580 మందీ, రక్షణశ్రామిక బ్యాంకులలో 720 మందీ సభ్యులుగాచేరారు.

శ్రమదానం

అనేక గ్రామాలలో శ్రమదానం ఇవ్వబడింది. రోడ్ల మరమ్మతులు, బావుల పరిశుభ్రత, బావులత్రవ్వకం, కమ్యూనిటి హాలు నిర్మాణం పనులను చేపట్టారు.

వరంగల్లు జిల్లా

వాలంటీర్ల దీక్ష

స్వయంసహాయం కార్యక్రమం క్రింద పాఠశాల విద్యార్థులకై బావిని త్రవ్వడంతోపాటు ఒకగదిని, హాలును నిర్మించాలని నెల్లికుదురు బ్లాకులోని రామానుజపురం గ్రామం రక్షణ శ్రామిక బ్యాంకు వాలంటీర్లు ప్రతిజ్ఞ పూనారు. తదనుగుణంగా 66 మంది పురుషులు, 30మంది స్త్రీలు శ్రమదానం ఇచ్చారు.

భవనానికి అవసరమైన వస్తువులనూ ఉచితంగా చేరవేయడానికి ఆరుగురుబండ్ల యజమానులు అంగీకరించారు. యీ పనుల నిర్మాణానికై గ్రామస్తులు 200 రాళ్ళను విరాళంగాఇచ్చారు. ఇంతవరకు దాదాపు 522 అడుగుల పునాదిని వేశారు.

శిక్షణ శిబిరం

గణపురంబ్లాకులోని నప్కల్ గ్రామములో ఫిబ్రవరి 23 వ తేదీ నుంచి 25 వ తేదీవరకు గ్రామ సహాయకుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. యీ సందర్భంగా వ్యవసాయం, పశుపోషణకు సంబంధించిన ప్రదర్శనాన్ని ఏర్పాటుచేశారు.

విశాఖపట్నం జిల్లా

దళపతుల శిక్షణశిబిరం

గజపతి నగరం పంచాయతీసమితి తరఫున జనవరి 19 నుంచి 24 వ తేదీ వరకు దళపతుల శిక్షణశిబిరాన్ని నిర్వహించారు. బి. డి. ఓ. యీ శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు.

హైద్రాబాదు జిల్లా

1963 జనవరిలో ఈపూరు పంచాయితీసమితిలో 1½ మైలు కచ్చారోడ్డును నిర్మించారు. యీ నెలలో బ్లాకు సిబ్బంది 57 ఎడ్లకు విత్తుకొట్టడం పనులను నిర్వహించారు.

చైనా చేసే
అక్రమం, అన్యాయమైన వాదన

భారతదేశంతో సంప్రదింపులు జరిపేటందుకు వీలుగా చైనా కొలంబో ప్రతిపాదనలను అంగీకరించక పోవడమేకాక సాధ్యమైనన్ని విధాల ఆక్రమించుకో చూచిన ప్రాంతాలపై తనకుహక్కు ఉన్నట్టు అన్యాయమైన, అక్రమమైనతన వాదనలను పునరుద్ఘాటించడం కొనసాగిస్తున్నది. అయితే చైనా వాదనలు అన్యాయమైనవనీ, నిరూపణ లేనివనీ, 1960వ సంవత్సరంలో భారత చైనా అధికారుల మధ్య జరిగిన చర్చల సందర్భంగా ఎన్నోసాక్ష్యాధారాలను చూపటం జరిగింది. వీటికి సంబంధించిన విషయాలను క్లుప్తంగా దిగువ ఇవ్వడం జరిగింది.

భారత ఉపఖండాన్ని తూర్పు ఆసియాతో భౌగోళికంగా వేరుచేస్తూ ప్రకృతి అతిసుందరమైన హిమాలయ పర్వతశ్రేణులను అడ్డుగోడగా నెలకొల్పింది. ఈ అడ్డుగోడ వంపులు తిరిగి 2400 మైళ్ళు పొడవు ఉంది. ఆఫ్ఘనిస్తాన్ తూర్పు సరిహద్దులనుంచి బర్మా పశ్చిమ సరిహద్దుల వరకూ యీ శ్రేణి కొనసాగుతుంది.

జమ్మూ కాశ్మీరులకు, సిక్యాంగ్ టిబెటులకు మధ్య యీ శ్రేణి పశ్చిమ రంగం సరిహద్దుగా ఉంది. పంజాబు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లకు, టిబెటుకు మధ్య దీని మధ్యరంగం సరిహద్దుగా ఉంది. నేపాళు టిబెటుకు మధ్య తూర్పురంగం సరిహద్దు. దీనినే మక్‌మోహన్ రేఖ అని అంటారు.

హిమాలయ ఉన్నతశ్రేణులే మన సరిహద్దులు అనడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఈ శ్రేణులు విస్పష్టమైన, ప్రాకృతికమైన సరిహద్దులు. అంతేకాక ఆయా ప్రాంతాల ముఖ్య నదులలోకి సాధారణంగా ఎక్కువ మొత్తంలో నీటిని మళ్ళించే ఉన్నత శ్రేణుల ఇరు ప్రక్కలా ప్రకృతి సిద్ధంగానూ భౌగోళికంగానూ వేరుచేయబడిన యీ రెండు ప్రదేశాల సంస్కృతి, నాగరికతలు ఆయా ఏటవాలు ప్రాంతాలలో విస్తరించి ఉన్నట్టు చరిత్రకారులు గమనించారు. నదులలోకి నీరు తేవడానికై ఆయా ప్రాంతాల వారు ముఖ్య వనరుల వద్దకు వెళ్తూ ఉంటారు.

ఉన్నత శ్రేణియే నది ఉత్పత్తి ప్రదేశం కానిచోట్లలో నది ఉత్పత్తి ప్రదేశమే దేశాల సరిహద్దులుగా పరిగణింప బడుతూ ఉంటాయి.

ప్రపంచ మొత్తంలో వివిధ దేశాలమధ్య పర్వత శ్రేణులే సరిహద్దు రేఖలుగా గుర్తించడం సరిఅయిన విధానంగా గుర్తించారు. ఈ దృష్ట్యా ఇదే భౌగోళిక సూత్రం మన సరిహద్దులకు ఏవిధంగా అతికినట్టు సరిపోయిందో భారతదేశ మ్యాపును చూస్తే తెలుస్తుంది.

మన వాదనను చరిత్ర ధ్రువ పరుస్తుంది

భారతదేశ చరిత్ర ప్రారంభమైనప్పటి నుంచీ యీ పర్వతాల ఉన్నత శ్రేణుల వరకూ గల ప్రాంతం భారతభూభాగంగానే ఉంది. హిమాయల ఉన్నత శ్రేణులకు దక్షిణాన నివసించే వారు "భారతీయులని'' మన ఆది చరిత్రను తెల్పే విష్ణుపురాణంలో పేర్కొన్నారు. ఉపనిషత్తులలోని యీ పర్వతాల వర్ణనలు ఆశ్చర్య చకితులను చేస్తాయి. ఈ ప్రదేశాలన్నీ వారికి ఎంత సుపరిచితాలో వీటివల్ల ద్యోతకమవుతుంది. పంజాబు నుంచి అస్సాం వరకు గల హిమాలయ శ్రేణి ప్రాంతం ప్రజలలోని ఐక్యతా భావం ఆతర్వాతి చరిత్ర అయిన మహాభారతంవల్ల మనకు తెలుస్తుంది. ఉదాహరణకు — హిమాలయా పర్వత ప్రాంతాల మార్గంగా ప్రాగ్జ్యోతిష (అస్సాం) నుంచి ఉలుక (ఉత్తర పంజాబులోని) వరకు అర్జునుడు తన ఉద్యమాన్ని విస్తరింప చేసినట్టు చెప్తారు.

చారిత్రక సాక్ష్యాధారాలు కూడా యీ ప్రాంతంపై హక్కు మనదేనని రుజువు చేస్తాయి.

పశ్చిమ రంగం

పశ్చిమరంగంలో సీక్యాంగ్ సరిహద్దు, కున్‌లిన్ కనుమల దక్షిణం వరకు విస్తరించి లేదని చైనా దేశంతో సహా వివిధ దేశాలలో తయారైన అనధికార మ్యాపులు, పత్రాలు నిరూపిస్తాయి. అక్సాయ్‌చిన్ మైదానం, చంగ్‌చిన్మో లోయ ప్రాంతాలు టంక్సి, లడక్ తహసీళ్లలో భాగాలుగా ఉన్నాయి. కాశ్మీరు ప్రభుత్వం అక్కడ చెక్‌పోస్టులను నెలకొల్పి నిర్వహిస్తున్నది. ఈ ప్రాంతంలో రెవిన్యూ వసూలు చేసినట్టు రెవిన్యూ పరిష్కార పత్రాలవల్ల వెల్లడి అవుతుంది. ఈ ప్రాంతంలో వ్యాపార సంబంధమైన దారులను కూడా ఇది నిర్వహించింది.

"చాంగ్‌చిన్మో లోయ మార్గంగా" యీ ప్రాంతంలో వ్యాపార మార్గాల సర్వే చేసే అనుమతిని పొందడానికి వీలుగా 1870 వ సం॥ లో బ్రిటిష్ ఇండియన్ ప్రభుత్వం కాశ్మీరుతో ఒప్పందం చేసుకున్నది. చాంగ్ చిన్మో లోయ మొత్తం, దాంచేక్, కామోక్ ప్రాంతాలలో షికారు చేయడాన్ని క్రమబద్ధం చేస్తూ కాశ్మీరు చేసిన శాసనాలు కూడా ఉన్నాయి.

మధ్య రంగం

మధ్యరంగానికి సంబంధించినంత వరకు కౌరిక్, స్పిటీ ప్రాంతంలోని గ్యూషిష్కా కనుమ నిలాంగ్ — జడాంగ్ ప్రాంతం, బారాహోతి, సంగ్చామల్లా, లప్తల్ ప్రాంతాలు భారతదేశ భూభాగాలని నిరూపించే సాక్ష్యాధారాలు ఎన్నో ఉన్నాయి. హ్యూన్‌సాంగ్ యీ ప్రాంతంలో పర్యటించి ఇవి భారతీయుల భూభాగాలని ధ్రువపర్చారు.

8 వ శతాబ్దంనుంచి (1815 లో) బ్రిటిష్ వారు ఆక్రమించుకునే వరకూ భారతీయ రాజవంశీయులు ఈ ప్రాంతాలను పరిపాలించారని రికార్డులు రుజువుచేస్తాయి. ఈ మొత్తం ప్రాంతంలో భారతీయ ప్రభుత్వం పటిష్ఠమైన పరిపాలననూ, సివిల్ అధికారులను నిర్వహించినట్టు తెల్పే ఆధారాలు అనేకం ఉన్నాయి. సవివరమైన రెవిన్యూ పరిష్కారం రికార్డులు, పన్నుల వసూళ్ళ రికార్డులు, అధికారిక గ్రామ మ్యాపులు, అధికారుల పర్యటన వివరాలు, రోడ్ల నిర్మాణం, స్థలవర్ణనల రిపోర్టులు, భూగర్భ సర్వేల వివరాలు భారతీయ అధికారవర్గాల వాదనలను రుజువుచేస్తాయి. ఆ రికార్డులు అడపాతడపా తయారయినవికావు. యీ రోజువరకూ సాధారణ ప్రభుత్వాధికారాన్ని తెంపులేకుండా కొనసాగిస్తున్నదనడానికి నిదర్శనంగా ఈ రికార్డులు నిలుస్తాయి.

తూర్పురంగం

తూర్పురంగంలో సంప్రదాయసిద్ధమైన భారతీయ సరిహద్దులు, యీ రంగానికిచెందిన పూర్వ చరిత్రవల్ల స్పష్టమవుతాయి.

హిమాలయ, ముఖ్య శ్రేణులలోనూ, దిగువ పర్వతాల మధ్య ప్రాంతాలలోనూ ఎల్లప్పుడూ భారత రాజకీయ అధికారం చలామణి అవుతున్నట్టు బ్రిటిష్, ఫ్రెంచి, జర్మనీ, యాత్రికులవల్ల, చైనావారి మ్యాపుల వల్ల వెల్లడి అవుతుంది. అవిభక్త భారత దేశంలోని ఇతర గిరిజన ప్రాంతాలలోనూ, వాయవ్య ప్రాంతంలోనూ పరిపాలనా బాధ్యతలను నిర్వహించినట్టుగానే ఈ గిరిజన ప్రాంతంలో కూడా బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం పరిపాలనాధికారాలను వినియోగించింది. ఈ రాజకీయ అధికారాన్ని అహోం పరిపాలకులనుంచి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం స్వీకరించింది.

రాజకీయాధికారుల ద్వారా పన్నులు చెల్లించుతూ, భారత ప్రభుత్వ అధికారానికి భక్తి ప్రపత్తులనూ, విశ్వాసాన్ని అక్కడి ప్రజలు ప్రకటించారు.

1844 వ సం॥ నుంచి కూడా భూటియాన్ అబోర్స్, దఫ్లాస్, మిరిస్, మిష్మీస్, ఇతర గిరిజన తెగలు భారత ప్రభుత్వ అధికారానికి లోబడి ఉంటామని తమ ఆమోదాన్ని తెల్పాయి.

గిరిజనుల ప్రత్యేక జీవిత విధానాలనూ, సాంప్రదాయాలనూ, సంరక్షించడానికై ఈ ప్రాంతాలలో ఇతరుల ప్రవేశాన్ని భారత ప్రభుత్వం నిరోధించింది. భారత ప్రభుత్వం అనుమతిలేనిదే యీ ప్రాంతలో ప్రదేశాల లోకి ఎవ్వరూ ప్రవేశించలేరు. యీ ప్రాంతాలలో ప్రత్యేక పరిపాలనా విధానాలను ప్రవేశపెట్టారు. 19 వ శతాబ్దంమధ్య భాగం నుంచి రాజకీయ అధికారులు ప్రకటించిన వార్షిక రిపోర్టులు యిక్కడి పరిపాలనా వివరాలను అందజేస్తాయి. 1873 వ సం॥ నుంచి ఈ రోజువరకు నిర్వహించబడిన పరిపాలనా రెగ్యూలేషన్స్ శాసనచట్టాలకు మించిన వేరు సాక్ష్యాలు అవసరంలేదు.

భౌగోళిక, చారిత్రక, వాస్తవిక సాక్ష్యాధారాలను విస్మరించి మన సరిహద్దుల ఏర్పాటు జరగలేదనడమే కాక మనవైన కొన్ని ప్రాంతాలపై తనకు హక్కు వున్నదని చైనా వాదిస్తున్నది. వారి వాదనలు అనుచితమైనవనీ, అన్యాయమైనవనీ, 1960 వ సం॥ లో జరిగిన భారత - చైనా అధికారుల సమావేశంలో మన అధికారులు సవివరంగా రుజువు చేశారు.

బూటకపు హక్కు

మన సరిహద్దులను నిర్ణయించడం జరగలేదని లేవనెత్తిన చైనావారి వాదనలను ఖండిస్తూ సరిహద్దులలోని పొలిమేరరాళ్ళు,

ముఖ్యమైన పర్వతశిఖరాల వివరాలను వారికి దృష్టాంతరంగా స్పష్టంగా చూపడం జరిగింది. ప్రకృతి సిద్ధమైన సరిహద్దులను గూర్చి కూడా సవివరంగా వారికి తెల్పడం జరిగింది. అంతేకాక చైనా అధికారులు కోరిన పూర్తి వివరాలను అందజేయడం జరిగింది. వారు వేసిన 60 ప్రశ్నలకు భారతీయ అధికారులు సమధానాలను కూడా ఇచ్చారు.

సరిహద్దులనుగూర్చి చైనా అజ్ఞానం

చైనా అధికారుల తీరు వేరువిధంగా ఉంది. వారు తమదని వాదించే సరిహద్దులను గూర్చి మన అధికారులు యీ విధంగా అన్నారు.

"ప్రారంభంలో వారు(చైనా అధికారులు) తమవని మ్యాపులలో చూపిన సరిహద్దు రేఖలు స్పష్టమైనవనీ, ఖచ్చితమైనవనీ వాదించిన చైనావారు మ్యాపులలో చూపిన సరిహద్దులకు సంబంధించిన నిర్దిష్టమైన సమాచారాన్ని ఇవ్వలేక పోయారు. వారు ఇచ్చిన వివరాలుకూడా అస్పష్టంగా ఉన్నాయి. ముఖ్యమైన ప్రదేశాలనుగూర్చి స్పష్టంగా తెలుసుకోడానికి వీలుగా 120 ప్రశ్నలు వేయగా వాటిలో 60 కి మాత్రమే చైనావారు సమాధానాలు ఇచ్చారు. అందులో కొన్ని మాత్రమే స్పష్టంగానూ, పూర్తిగానూ ఉన్నాయి.

"భారతీయ అధికారుల ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు ఒకప్రశ్న కంటే ఎక్కువ వాటికి అన్వయించుకోవచ్చుననీ, ఆ సమాధానాలు మిశ్రమంగా ఉన్నాయనీ, చైనావారు ఆ తర్వాత నొక్కిచెప్పారు. ప్రశ్నలు విడి విడిగా ఇవ్వబడ్డాయి. అంతేకాక చైనావారు ఇచ్చిన సమాధానాలలోకూడా ప్రత్యేకంగా యీ ప్రశ్నలను ఉదహరించారని ఇక్కడ చెప్పాల్సిఉంది. కొన్ని ప్రశ్నలకు సాధారణ సమాధానాలు, కొన్నిటికి ప్రత్యేకమైన వివరాలనూ కోరడం జరిగింది. చైనా అధికారులు అందజేసిన అస్పష్టమైన, సమాధానాలను గూర్చి, వ్యాఖ్యానాలను గూర్చీ చెప్పాల్సిందేమీలేదు. ఎందుకంటే ఎంతసేపూ స్వంత హక్కును గూర్చిన వారి స్వకీయ కథలనే వారు వల్లిస్తూ ఉంటారు. చైనా తనకు హక్కు ఉన్నదని చెప్పుకునే "పురాతన సరిహద్దు" లనుగూర్చి మాత్రమే వారు మాట్లాడుతారు.

"సమాధానాలు ఇవ్వని ప్రశ్నలను" అతి సూక్ష్మమైనవీ, అల్పమైనవిగా కొట్టివేశారు. అయితే చైనావారే స్వయంగా ఎన్నో అటువంటి ప్రశ్నలు వేశారు. లాంగ్జూ, కింజిమానే వంటి చిన్న భూఖండాలను గురించి కూడా ప్రత్యేక ఆసక్తితో ఎక్కువ వివరంగా వారు ప్రశ్నలు అడిగారు. వాస్తవంగా తమకు హక్కు ఉన్నదనే సరిహద్దు పూర్తి భూభాగాన్ని సర్వేచేయడం జరగలేదని చైనా వారు అంగీకరించారు. వారు హక్కుఉన్న దనే కొంత భాగంలో సాంప్రదాయకమైన రేఖ 'విశాలమైన' లేక 'రమారమి' సరిహద్దు మాత్రమే. ఇంకో విధంగా చెప్పాలంటే తన సరిహద్దుల విషయమై భారత ప్రభుత్వానికి క్షుణ్ణంగా తెలుసుననీ, తమకు హక్కు ఉన్న దనీ, వేల సంవత్సరాలనుంచి పరిపాలించామనీ చెప్పుకునే చైనావారికి ప్రదేశాల స్థల వివరాలుగానీ, ఆ ప్రాంతం ఎక్కడ ఉన్న దనే విషయంగానీ ఏమీ తెలియదనీ యీ చర్చలు వెల్లడించాయి. సరిహద్దుల వివరణల గూర్చిన వీరి అజ్ఞానం, చైనావారి వాదనలు విలువయినవి కావనే విషయాన్ని స్ఫురింపజేస్తుంది.

చారిత్రక ఆధారాలను నిరూపించడానికి సంబంధించినంతవరకు భారతీయ అధికారులు ఎంతో సమాచారాన్ని, వివిధ విషయాలను అందజేశారు.

ఇటీవల భారత మ్యాపులలో చూపిన సాంప్రదాయకమైన సరిహద్దు రేఖలు విస్పష్టమైనవీ, సరిఅయినవవీ యీ సమాచార వివరణలు ఖచ్చితంగా తెల్పుతాయి. ఇవి సాంప్రదాయకమైనవేకాక చరిత్రలోని వివిధ దశలలో చేసుకున్న ఒప్పందాలకు అనుగుణమైనవనే విషయాన్ని ధ్రువపరుస్తాయి.

అయితే తనకు హక్కుఉన్నదనే చైనా వాదనకు సంబంధించిన సాక్ష్యాధారాల మాటేమిటి?

అవి స్వల్పమైనవీ, అత్యాశతో కూడినవీ, ఇటీవలివీ, అస్పష్టమైనవీ అని మాత్రమే చెప్పవచ్చు.

తనకు హక్కు ఉన్నదని చైనావారు చూపిన సాక్ష్యాన్నిగూర్చి భారతీయ అధికారులు వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు:

"తనవని చెప్పుకునే వివిధ రంగాలలోని ప్రదేశాలు మొదటినుంచి చైనా, ఆ మాటకొస్తే సీక్యాంగ్, టిబెటుల పరిపాలనలో ఉన్నాయని రుజువుచేసే ప్రయత్నంకన్నా చైనీయుల సాక్ష్యాలు తగినంతగా లేక పోవడం అంత ఎక్కువేమీకాదు, వివాదగ్రస్తమైన ప్రదేశాలపై ఉన్న అధిపత్యం గూర్చి భారత ప్రభుత్వం దశాబ్దాల రెవిన్యూ, పన్నుల వసూళ్ళ రికార్డులనూ, పరిపాలనకు సంబంధించిన పురాతనదస్తావేజులను మొత్తం ప్రవేశపెట్టితే చైనా ప్రభుత్వం అడపాతడపా ఒకటి, రెండు పత్రాలను-అవీ కొన్ని పురాతన ప్రదేశాలకు సంబంధించిన అస్పష్టమైన వివరాలతో కూడినవి ప్రవేశపెట్టి ఇప్పుడు తనవంటున్న ప్రదేశాలలో శతాబ్దాల తరబడి వారి పరిపాలన కొనసాగుతున్న దనటానికి అవి సాక్ష్యమని చైనా వాదిస్తున్నది. అక్సిన్‌చిన్ ప్రాంతంపై సీక్యాంగ్‌కు పరిపాలనాధికారం ఉన్నదనడానికి రుజువుగా ఒకే ఒక పత్రాన్ని చూపారు. ఆ పత్రం ఇటీ

షలిది మాత్రమే. అది కూడా షాహిదుల్లా అనే క్రొత్త పరిపాలనా సబ్‌డివిజన్‌ను నెలకొల్పే ప్రతిపాదనకు సంబంధించినది మాత్రమే. భారత సరిహద్దులోని ఉత్తర ప్రాంతంలో యీ ప్రదేశం ఉంది. పరిపాలనా ప్రాజెక్టులోని దక్షిణ హద్దులో కోరాకోరం కనుమ ఉన్నట్టుగా ఇది తెల్పుతుంది. సంప్రదాయకమైన సరిహద్దుల ప్రకారం కాశ్మీరు ఉత్తర సరిహద్దు పొడుగునా యీ కోరాకోరం కనుమ ఉంది. విశాలమైన ఆక్సాయ్‌చిన్ ప్రాంతం పరిపాలనా వ్యవహారాల కంట్రోలుకు యీ క్రొత్త డివిజన్ ఏ విధంగా బాధ్యత వహిస్తుందో దీనివల్ల స్పష్టమవుతుంది.

ఈ క్రొత్త పరిపాలనా యూనిట్‌ను నెలకొల్పినట్టుగా గానీ, 1928 వ సం॥ నుంచి 1950 వరకు ఆక్సాయ్‌చిన్ మైదానంపై సీక్యాంగ్ సబ్‌డివిజనుకు అధికారం వున్నట్టుగా గానీ ఎట్టి సాక్ష్యాధారాలను చైనా చూపడం జరగలేదు.

1950 వ సం॥ నుంచి సీక్యాంగ్, చైనాలు ఈ ప్రాంతంపై అధికారం నిర్వహించలేదనే భారతవాదాన్ని చైనీయులసాక్ష్యం ధ్రువపరుస్తుంది"

శతాబ్దాల తరబడి ఈ ప్రాంతాలను భారతదేశం పరిపాలించినట్టు భారతీయ అధికారులు ఎన్నో రికార్డులను దృష్టాంతరంగా చూపారు. చైనావారు ప్రత్యక్షమైన సాక్ష్యాధారాలేవీ ఇవ్వలేకపోయారు. అయినా వారు ప్రయత్నించారు. దీనిని గురించి మన అధికారులు ఇలా చెప్పారు:

"చైనా తనదనే ప్రదేశాలను టిబెటు పరిపాలించేదేనని రుజువు చేయడానికి వారు ఇచ్చిన సాక్ష్యం కూడా అస్పష్టంగానూ, సారహీనంగానూ ఉంది.

లడక్ మొత్తానికి డాంచొక్‌లోచి పై 9వేటు ఎస్టేట్ ఉత్పత్తులను సేకరించడానికి సంబంధించిన ఒకే ఒక పత్రాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఇదేవిధంగా స్పిటీ విషయంలో కూడా ఒకే ఒక పత్రం అదీ మతవిచారణకు సంబంధించిన పత్రాన్ని ప్రవేశపెట్టారు. పరిపాలన అధికారానికీ, సాంప్రదాయకమైన హక్కును రుజువుచేయడానికీ యీ పత్రం ఆధారం అన్నారు. షిప్కి ప్రాంతం విషయంలో అక్కడి పరిపాలనను నిర్వహించారనడానికి రుజువుగా కొందరు వ్యక్తులకు చెందిన 1930 వ సం॥ పు 'ఒప్పందల' లను సాక్ష్యంగా చైనా చూపింది. అయితే యీ 'ఒప్పందల' కేవలం వ్యక్తిగతమైనదే కాని అధికారిక రుజువులుగా పనికిరావు.

నిలాంగ్ – జడాంగ్ విషయంలో 170 సంవత్సరాల వ్యత్యాసంలోవున్న రెండు పత్రాలనుగూర్చి చైనా పేర్కొన్నది. అవైనా పన్నులు వసూలుచేసినట్టు తెల్పేవికావు. అవి టిబెటుకు వెళ్ళే సరకుల రవాణా బకాయిల చెల్లింపులకు సంబంధించినవి మాత్రమే. టిబెటుకు వ్యాపారానికి వెళ్ళిన నిలాంగ్ జడాంగ్‌కు చెందిన వ్యక్తులనుంచి బకాయీ వసూళ్ళకు చెందినవి. టిబెటు ప్రాంతంలోకి వెళ్ళని వారివి మాత్రం కావు.

టిబెట్ భారత దేశాలమధ్య సాంప్రదాయకంగా వున్న వ్యాపార వాణిజ్య పద్ధతిలో భారతదేశం టిబెట్‌కు ఆహార పదార్థాలు ఇతర జీవితావసర వస్తువులను సరఫరా చేసింది. టిబెట్ ఉన్ని ఎగుమతి చేసేది. ఇది కేవలం పారిశ్రామిక ముడిపదార్థం మాత్రమే. కనుక, స్థానిక టిబెట్ అధికారులు సరిహద్దు వ్యాపారాన్ని ప్రోత్సాహించటానికి పూనుకొన్నారు. హిమాలయ కనుమలుదాటి అక్కడ స్థావరం ఏర్పరచుకోవడం స్థానిక టిబెట్ అధికారులకు దుస్తరమవుతున్నందువల్ల వారు కనుమల వరకు వచ్చి వ్యాపారం ఆరంభించారు. అయితే వారు గుడారాలు వేసుకొని పచ్చికబయళ్ళలోనే నిలిచి పోయేవారు. గ్రామాల వరకు వచ్చే వారుకారు. వీరికి డబ్బులు చెల్లించవలసిన వ్యక్తులు ఈ గ్రామాల్లోనే సంవత్సరం పొడుగునా నివసించేవారు. బకాయీలు వసూలు చేసుకోవడానికి వుపయోగించబడ్డ ఈ శిబిర స్థావరాలు భారత సరిహద్దుకు అత్యంత సమీపంలో వున్నాయి. చైనావారు వాదించే సరిహద్దు ప్రాంతానికి చాలా దూరంలో వున్నాయి. ఏది ఎట్లయినా, భూకమతాలు పచ్చికబయళ్ళతోసహా పన్ను వసూళ్ళు జరిగే వని చైనా అధికారులు చెబుతూన్న వాదాన్ని సమర్థించడానికి వారు రికార్డులు ఏవీ చూపలేదు. టిబెట్ అధికారులకు భారత దేశంలో ఇందుకు సంబంధించిన అధికారం ఏదీలేదని స్పష్టంగా రుజువు చేయబడింది. చైనావారు లోపాయకారిగా చూపుతున్న అత్యల్ప సాక్ష్యాధారాలనూ మనదేశం చూపెట్టిన సక్రమమైన రెవిన్యూ సెటిల్మెంటు, భూమి పన్నులు, అధికార పర్యటనలు, సాధారణ పరిపాలనకు సంబంధించిన యితర సాక్ష్యాధారాలనూ పోల్చిపరిశీలించినట్లయితే, ఈప్రాంతాలు భారత దేశాధీనమైన గ్రామాలనీ అవి భారతదేశంలో అంతర్భాగంగా వున్నాయనీ, నిస్సందేహంగా తెలుస్తుంది. పోతే, చైనా అధికారులు తమ సాక్ష్యాధారాలుగా చెబుతూన్న వసూళ్ళు కేవలం టిబెట్‌లోకి పోవడానికి సౌలభ్యం కొరకై వున్న లావాదేవీలు మాత్రమే. భారతదేశ పన్నువసూళ్ళు, సెటిల్మెంటు రికార్డులు, ఈ ప్రాంతంలో భారత పరిపాలన కొనసాగి నట్లుగల విపులమైన సాక్ష్యాధారలకు చైనా అధికారులు ఛాలెంజిచేసే స్థితిలోలేదు. చైనావారు చూపిన సాక్ష్యంలో పసలేదు. ఇవి ఏ మాత్రమూ

ప్రత్యేకతలేని మార్గాంతర బకాయవసూళ్ల అనే విషయం తేలిపోయింది.

ప్రాచ్య రంగంలో చైనా అధికారులు సాంప్రదాయ సిద్ధంగావున్న సరిహద్దు ప్రాతం ఇదీ అని వారు ఇప్పుడు చెబుతున్న తమ వాదాన్ని బలపరచడానికి నిరవధికంగా పరిపాలనకు సంబంధించిన సబ్—డివిజనులు తెలిపే చార్టుకానీ, మ్యాపుకానీ, ఇతర నిర్దుష్టమైన సాక్ష్యంకానీ చూపెట్టలేదు. వాలాంగ్ ప్రాంతానికి సంబంధించిన ఒకె ఒక డాక్యుమెంటులో ఒక సెలయేరు మాత్రం పేర్కొనబడివుంది. ఇది కూడా చైనావారు ఇప్పుడు చెబుతున్న సరిహద్దుకు ఎక్కడా సమీపంలో లేదు. వారు చూపించిన సాక్ష్యానికి ఇదికొంత దగ్గరగావుంది. వారు అందజేసిన డాక్యుమెంటులో ఇక్కడ బౌద్ధమతం ప్రబలివుంది అనీ ఆ మతానికి సంబంధించిన మఠాలు అక్కడకూడా వున్నాయని మాత్రమే తెలుపుతుంది. ప్రజలు నివసించె ప్రాంతాలలొ సాగు అవుతున్న దిగువ కనుమలతోకానీ, పబ్లిక్ వర్కు్స్‌తోగానీ సంబంధం వున్నట్లు సాక్ష్యం లేదు. హిమాలయ పర్వత శ్రేణికి దక్షిణ దిగ్భాగంలో నివసించే ప్రజలపైన, మత విషయకంగాకానీ, రాజకీయంగాకానీ ఏ రూపంలో కూడా అధికారం చెలాయించినట్లు చైనా సాక్ష్యం తెలుపక పోవడం చాలా గమనార్హమైన విషయం."

భారత, చైనా సాక్ష్యాధారాల పరిశీలన

		భారత సాక్ష్యాధారాలు	చైనా సాక్ష్యాధారాలు
చట్టబద్ధమైన ప్రాతిపదిక	పశ్చిమ రంగం 23		
	మధ్య రంగం 44		
	ప్రాచ్య రంగం 47	114	47
సాంప్రదాయకమైన ప్రాతిపదిక	పశ్చిమ రంగం 51	159	66
పరిపాలన	,, 108		
సాంప్రదాయకమైన ప్రాతిపదిక	మధ్య రంగం 89	235	41
పరిపాలన	,, 146		
సాంప్రదాయకమైన ప్రాతిపదిక	ప్రాచ్య రంగం 40	122	91
పరిపాలన	,, 82		
		630	245

(61వ పేజీ తరువాయి)

సంచారిణి నూకాంబ' (భీమ.1-101) యను ప్రయోగమును శ్రీనాథుని ప్రౌఢ వాక్పాటవముగాఁ బరిగణింపనగు. హేరాళము సంస్కృత పదమని శబ్దరత్నాకరము (చూ. పు. 1123), కాని యిది పేరాళమ్ (< పేర్ + ఆళమ్) అను శుద్ధ దేశ్యమునకు అర్వాచీనరూపము, 'ప'. 'హ'గా మాఱుట ద్రావిడభాషలలో ఒక్క కన్నడమునకు పరిమితము. కన్నడమునను క్రీస్తు పదియవు శతాబ్దమునుండియు ప్రవర్తకమయిన ధ్వనిపరిణామమిది. తమిళమున పేరాళన్, పేరాళి = ప్రసిద్ధవ్యక్తి, యశస్వి. కన్నడమున పేరాళ్ = యుద్ధవీరుఁడు; సమర్థుఁడు; హేరళ, హేరాళ = విరివి, విస్తారము. ఇట్టి సమాస రచనలో శ్రీనాథుఁడు అర్వాచీనకవులకు ఆచార్య పీఠము. కంఖాణ శబ్దమునకు అర్వాచీనకవి ప్రయోగములు కొన్ని :

'అంబుధి తెరల చందంబునఁదుటుములై
భాసిల్లు కంఖాణ బలము లొదవి'
— విజయ. 3-152

'గజ కంఖాణ శతాంగ పత్తి బల
వర్గంబుల్...' — పైది. 3-174

'సురకుల ధురీణ కంఖాణ కరికృపాణ
రమ్యధావళ్య జైత్రపారావతంబు'
— సారంగ. 1-127.

'మదగజ కంఖాణ మాణిక్యగాణిక్య
కనకాంబరము లుపాయనములందె'
—ఏనుఁగులక్ష్మణకవి రామవిలాసపీఠిక.


'అరుణకంఖాణరింఖా ఘాతమైమించు
నస్తగైరిక రజోవ్యాప్తియనఁగ'
— రంగారాయ. 3-137.

(సశేషం)

మనం యిప్పుడేం చేయాలి?

కె. లక్ష్మీరఘురామ్

మనం బహు విచిత్రమైన కాలంలో విషమ పరిస్థితుల్లో జీవిస్తున్నాము. మన తరమంతా యిలా తెల్లవారిపోవలసిందే. పుట్టాంగనుక గిట్టేవరకూ కాలక్షేపం చేయకపోము. కాని మనలో ఎంత మంది నిబ్బరంగా— "నాకేమి కొరత? తిండికి బట్టకూ కరువులేదు. నిక్షేపంగా కాలక్షేపంచేస్తున్నాను" అని అనుకోగల స్త్రీలున్నారు? ఎట్లాగో జీవయాత్రగడుపుతూ వుండవచ్చు. అభిరుచులు ఆశయాలు చంపుకొని, కోరికలు, వాంఛలు నశింపజేసుకొని కళాభిరుచులు రాజకీయ వాంఛలు, సాహిత్య విహారాలు తలవగూడని తలంపులుగా చేసుకొని నాల్గుకాళ్ళ పశువువలె జీవించలేకపోతేము. కాని సంపూర్ణ జీవితం ఎలా లభిస్తుంది? దానికోసం విద్య ఆరోగ్యం, ధనం, ముఖ్యంగా కావలసిఉన్నది. విద్యావైద్యాలు ప్రభుత్వం అందరికీ లభింపచేసే ప్రయత్నంలోనేవున్నది, కాని మనమో? ప్రభుత్వంగాని భగవంతుడు గాని ఎవరి చేతిలోనూ ధనం తెచ్చిపోయడం సాధ్యమయ్యేదికాదుకదా! "ధనమూలమిదం జగత్"అన్నారు. తడిలేనిదే ఏకార్యమూ సాగదు. ఏ ఆశయమూ సాధించలేము. ఆర్థిక స్థోమతలేనిస్త్రీ ఎల్లకాలమూ భర్త మీదనో, తండ్రిమీదనో, పుత్రుని మీదనో ఆధారపడి వుండవలసిందే. స్త్రీల కోసం ఎన్నిబిల్లులోవచ్చాయి. మనలో మార్పు రానప్పుడు అవి నిష్ప్రయోజనంకాకమరేమౌతాయి? ఏదియేమైనా ఆర్థిక స్థోమతే అత్యావసరమైంది నేటి పరిస్థితుల్లో మన స్త్రీలకు. ఒకప్రక్క జీవిత విధాన పరిమాణం పెరిగిపోతూవున్నది. ఆర్జించే వాడి మీద ఆధారపడేవాళ్ళు ఎక్కువై పోయారు. ప్రజారాజ్యాలలో ప్రజా కార్యకలాపాలకు ధనవ్యయం హెచ్చవుతున్నది. తప్పనిసరిగా పన్నుల భారం భరింపజాలని దవుతున్నది. అప్పుడు ఏకుటుంబం ఆర్థికంగా నిర్విచారంగావుండగలదు? మనదేశంలో ధనికవర్గానికిచెందిన వారు చాలా కొద్దిమంది. మిగిలిన వారంతా ఎంతచెట్టుకు అంతగాలన్నట్లుగా ఆర్థిక యిబ్బందులకు లోనైనవారే. యిప్పటి పరిస్థితులలో కుటుంబంలో ఒక్కరే ఆర్జించేవారుంటే లాభంలేదు. స్త్రీలుకూడా ఆర్థికంగా కుటుంబానికి దోహదంయివ్వవలసిన అవసరం వున్నది. యిదేమీ తప్పుపని కాదు. పూర్వంనుంచి కూడా ఆయాదేశ కాల పరిస్థితులను బట్టి ఈ వ్యవస్థ మనలో వుంటూనే వున్నది. కదురుతో కవ్వంతో స్త్రీలు అనాది నుంచి కుటుంబానికి ఆర్థికంగా సాయపడ్డ వారే గదా! యిప్పటి పరిస్థితులను బట్టి స్త్రీలు ధనార్జనతోపాటు దేశ సేవ కూడా చేసే అవకాశాలు ఎన్నో ఉన్నాయి. వాటిని ప్రోత్సాహించడం ప్రభుత్వ ధర్మం? అట్టి కార్యక్రమాలలోనిదే **C. S. W. B.**వారి సోషియో ఎకనామిక్ (సాంఘిక ఆర్థిక కార్యక్రమం) ప్రోగ్రామ్. సాంఘిక సంక్షేమశాఖవారు ఈ కార్యక్రమంలో స్త్రీలు అనేక వృత్తి విద్యలు, పారిశ్రామిక విద్యలు నేర్చుకొనడానికి అనేక అవకాశాలు కల్పించివున్నారు. ఈ అవకాశాలను స్త్రీలందరూ సద్వినియోగం చేసుకొనవలసినఅవసరం ఎంతైనావున్నది. ఈ అవసరం పారిశ్రామికంగా వెనుకబడ్డ మన ఆంధ్రలో మరీ ముఖ్యంగా ఉన్నది.



పులిమీద పుట్ర అన్నట్లు ఈ పరిస్థితులలో చైనా వారి దాడి మన దేశాన్ని అత్యవసర **(emergency)**పరిస్థితులలో పడవేసింది. యిప్పుడు మన దేశరక్షణకు కావలసిన సామగ్రినంతా వుత్పత్తి చేయవలసివున్నది. ఈ సామగ్రి అంతా ప్రభుత్వమే తయారు చేయడం అసాధ్యమైన

విషయం. యుద్ధం చేయడానికి తుపాకీలు, తుపాకీగుండ్లు, మరఫిరంగులు, విమానాలు, జీపులు, కార్లు ఎన్నో అవసరం. కెమెరాలు ఫిల్ములు, కాగితములు, మందులు సైనికుల డ్రెస్సుకు కావలసిన బట్ట, బూట్లు, టోపీలు, వున్ని వస్త్రములు, సాక్సులు, గ్లవ్సు, గడియారములు, భోజనసామగ్రి చాలా అవసరం. కాబట్టి వీటన్నిటి ఉత్పత్తిని పెంపొందింప చేయవలసి వున్నది. యివిగాక సామాన్య పరిస్థితులలో నే దేశంలో యింకా ఎన్నో వైద్య శాలలు విద్యాభవనాలు, పెద్ద పెద్ద పరిశ్రమలు కట్టనున్నారు. దిగుమతులు లేవు గనుక అన్ని పదార్థాలూ మనదేశంలో నే తయారు చేయవలసిన ఆవశ్యకత ఏర్పడినది. వీటన్నిటినీ తయారు చేయడానికి ఆసేతు హిమాచలం భారతీయులంతా సిద్ధంగా ఉన్నారు. చాలా మంది అనుబంధ పరిశ్రమలకు ధన సహాయం, యితర సాయములు చేయడానికి సిద్ధంగా వున్నారు. కావున ఈ సదుపాయాలు స్త్రీలుపయోగించుకొని దేశసేవ చేస్తూ ధనార్జన చేయవచ్చును. ప్రతి గ్రామంలోనూ వీటికి చెందిన పరిశ్రమలను కుటీరపరిశ్రమలుగా ఆరంభించవలసివున్నది. వీటిని పరిజిష్టర్డు మహిళా సంఘమైనా నిర్వహించవచ్చును. లేదా గ్రామంలో కొద్ది మంది స్త్రీలతో ఒక సహకార సంఘంగాఏర్పడి ఈ పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చును. ఆర్థికంగా అసహాయులుగావున్న స్త్రీలకు వుపాధి కలిగించవచ్చును. మిగిలిన వారికి వేన్నీళ్లకు చన్నీళ్ళుతోడుగా ఈ కుటీర పరిశ్రమలు వుపకరిస్తాయి. ఆర్థికంగా స్త్రీలు స్వతంత్రులు కానన్నినాళ్ళు, వారిగతి అధోగతే. వారితో పాటు దేశానికి అధోగతే. మహిళాభ్యుదయంకోసం పాటుబడి కష్టపడి తయారు చేసిన బిల్లులన్నీ బూడిదతో పోసిన పన్నీరువలె నిష్ప్రయోజనమే.

చైనావారు మనమీద తిరిగి దండెత్తి వచ్చే పక్షంలో రణరంగానికి తరలివెళ్ళే పురుషుల పనులన్ని చేయడానికి స్త్రీలు సిద్ధంగా వుండాలి. ఇంతేగాక ఏకీకల పట్టణంమీదో దురదృష్టవశాత్తు శత్రువు బాంబులు వేసే పరిస్థితిలో నైనా సరే నిర్విచారంగా అనుదిన జీవితావసర కార్యక్రమాలన్నీ సాగిపోవాలి అంటే కేవలం వైద్యశాలలు నడపడంతో మాత్రమే తృప్తిపడక అవసరంవచ్చినట్లయితే బస్సులు, రైళ్ళు, విమానాలను సైతం నడపడానికి తంతి తపాలాశాఖను సక్రమంగా నిర్వహించడానికి కూడా సిద్ధపడాలి. టెలిఫోనులు, పత్రికలు, ముద్రణాలయాలూ నడపడం; బ్రిడ్జీలు, స్టేషన్లు, విమానాశ్రయాలు మొదలైనవాటిని జయించడం నేర్చుకొని వుండడం కూడా అవసరం. ఇదీఅదీ అనే వివక్షత లేకుండా ఏ విపత్కర పరిస్థితుల్లో నైనా స్త్రీలు దేశ రాజ్యతంత్రాన్ని కూడా సక్రమంగా నిర్వహించడానికి తగుశక్తిసామర్థ్యాలను అలవర్చుకొనివుండాలి. అంటే తుపాకీలు కాల్చడం, సిగ్నల్సు వేయడం, టెలిఫోన్లు పలికించడం, టైపు చేయడం, రేడియో ప్రసారాలు చేయడం నేర్చుకోవాలి. ఈ నేర్చుకొన్నవిద్యలు ఈ అత్యవసర పరిస్థితులలో దేశ రక్షణకు ఉపయోగపడగలవు. ఈ ఆత్యయిక పరిస్థితి తొలిగిన అనంతరం ఆ నేర్చుకొన్నవిద్యలు వాటికి సంబంధించిన వర్తక వ్యాపారాలలో ధనార్జనకు ఉపయోగపడగలవు.

ఈ అత్యవసరపరిస్థితి తొలగిన అనంతరం మనం సరికొత్త యుగంలోకి ప్రవేశించగలము. అగ్రరాజ్యాలలోవలె నే మనమూ మనదేశంలో పరిశ్రమల శకం ఆరంభించి పురోగమించగలము. కాబట్టి ఏ స్త్రీలు ధైర్యంచేసి కాలానుసారంగా జీవిత విధానాన్ని మార్చుకొనగలరో వారికే యిహమూ పరమూ అని మనం గుర్తించవలసివున్నది. ★

స్త్రీలు : సంక్షిప్త విద్య

ఆవుల జయప్రదాదేవి

ఈమధ్య మనం సంక్షిప్త విద్య అన్న మాటను తరుచుగా వింటున్నాము. ఈ పథకం భారతదేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ అమలు జరుపబడడం చూస్తున్నాము. అసలు సంక్షిప్త విద్య అంటే ఏమిటి? దాని లక్ష్యమేమిటి? అందులో వున్న అర్హతలేవి? అనే విషయాలను గురించి తెలుసుకుందాము.

సంక్షిప్త విద్య అంటే క్లుప్తీకరించి, కుదించబడిన విద్య. కొన్ని సంవత్సరాలు వరుసగా, నిర్ణీతమైన పద్ధతిలో విద్యాలయంలో శిక్షణ పొందవలసిన దానిని దాదాపు సగం కాలంలోనే ఆ చదువును పూర్తిచేయడాన్ని సంక్షిప్త విద్యా విధానం అంటారు.

ప్రస్తుతం చైనా దురాక్రమణ కారణంగా యేర్పడిన అత్యవసర పరిస్థితిలో దేశానికి కావలసిన డాక్టర్లను, ఇంజనీర్లను తయారు చేయడానికై దేశావసరానికి గాను ఆయా కోర్సులకు ఆరు మాసాలు లేక ఒక సంవత్సరం వరకూ కూడా సమయాన్ని తగ్గించి, తక్కువ కాలంలో ఆ కోర్సులను ముగించడానికి ప్రభుత్వం యత్నించుచున్న విషయం మనకందరకూ తెలిసిందే. ఇదేవిధంగా దేశాభ్యుదయానికి మహిళా సంక్షేమ కార్యక్రమాలకు కావలసిన కార్య నిర్వాహకులు మన దేశంలో చాలా కొరతగా వున్నారు. అటువంటి కొరతను భర్తీ చేయడానికి, జాతి పురోభివృద్ధి చెందడానికి ఏర్పాటు చేయబడింది ఈ సంక్షిప్త విద్యా పథకం.

మన దేశంలో స్త్రీలు విద్యలో వెనుకబడి ఉన్నారనడంలో సందేహం లేదు. ప్రత్యేకంగా బీహార్, జమ్మూ, కాశ్మీర్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు మన దేశంలోని ఇతర రాష్ట్రాలకంటే ఎక్కువ వెనుకబడి ఉన్నాయి. ఇక్కడి స్త్రీలు కేవలం చాలామంది విద్యా విహీనులుగా ఉన్నారు. నూటికి 70 వంతులు ఆడపిల్లలు బడికే పోని స్థితిలో ఉన్నారు. గ్రామాల విషయం అసలు చెప్పనే అక్కరలేదు. మన ఆంధ్రప్రదేశ్ ఈ విధంగా వెనుకబడిన రాష్ట్రాలలో చేరని మాట వాస్తవమే అయినా, ఇంకా మనం యెన్నో రంగాలలో అభివృద్ధికి రావలసి ఉన్నది. వాటిల్లో స్త్రీ విద్య ఒకటి. అవకాశం లేకనో, మూఢాచారాలననుసరించో సకాలంలో విద్య నభ్యసింపలేని స్త్రీలెందరో ఉన్నారు. దురదృష్టవశాన వితంతువులు, భర్తృ తిరస్కృతలు, నిరాధారలైన స్త్రీలు అనేక మంది ఉన్నారు. అటువంటి వారు ఎప్పుడో చదువులను మాని ఆ తరువాత చదువుకొనే అవకాశం లభింపక, తగిన విద్యావతులు కాజాలక, తమ అదృష్టాన్ని నిందించుకుంటూ, నిస్పృహతో జీవిస్తున్నారు. ఉదరపోషణ కూడా దుర్లభమై, తల్లిదండ్రులకో, అన్నదమ్ములకో భారమై, వారి దయాదాక్షిణ్యాల కెదురుచూస్తూ మానసిక వ్యథతో క్రుంగి క్రుశించుతున్నారు. అటువంటివారు తమ జీవితాన్ని తామెందుకూ పనికిరామనే నిరుత్సాహంతో, నిస్తబ్ధతతో కుములుతూ గడుపుతున్నారు. అటువంటి స్త్రీలకు ఈ సంక్షిప్త విద్యా పథకం నూతనోత్సాహాన్ని కలిగించి చేయూతనిస్తున్నది. ఆత్మ విశ్వాసాన్ని నెలకొల్పుతున్నది. స్త్రీల సంక్షేమ విధానంలో ఈ సంక్షిప్త విద్యాపద్ధతి అత్యున్నత స్థాయికి చెందుతున్నది.

ప్రస్తుత మహిళా సంక్షేమ కార్యక్రమాలలో గ్రామ సేవికలు, మిడ్‌వైఫులు, నర్సులు, బాల్వాడి టీచర్లు మొదలైనవారి కొరత ఎక్కువగా ఉన్నది. ఈ బాధ్యతలను నిర్వహించడానికి వయోజనములైన స్త్రీలు అవసరం. సాధారణంగా ఇందుకు అర్హత పొందవలెనన్న స్కూలు ఫైనలుగానీ, కనీసం 8 వ తరగతిగానీ ప్యాసై వుండాలి. ఇప్పుడు చదువుతున్న ఆడపిల్లలు తమ 12 లేక 15 సంవత్సరాలకే 8 వ తరగతి లేక స్కూల్ ఫైనలు పరీక్షలో ఉత్తీర్ణులవుతున్నారు. అటువంటి చిన్న వయస్సు

లైన వారు స్త్రీల సంక్షేమాలకు అత్యవసరమైన పై ఉద్యోగ స్థానాలను నిర్వహించడం అంత సమంజసంగా ఉండదు. అందువల్లనే ఈ సంక్షిప్త విద్యా విధానాన్ననుసరించి వయోజనులైన స్త్రీలకు శిక్షణనిచ్చి వారి వారికి తగిన రీతులలో వారి అభిరుచిననుసరించి ట్రైనింగు నివ్వడానికై ఈ పథకం ప్రారంభింపబడింది. ఒకవంక సమాజంలో ఉన్న కొరతను భర్తీచేయడం, మరోవంక సమాజంలోని దీనులైన స్త్రీలకు ఆస్కారాన్ని కల్పించడం దీని ముఖ్య లక్ష్యం.

ఈ కోర్సు ఒక్కొక్కటి రెండు సంవత్సరాలు నడుపబడుతుంది. బాచికి 25 మందిని తీసుకుంటారు. వీరి వయస్సు 20 సం॥ల నుండి 35 సం॥ల వరకు ఉండవచ్చును. ఇందులో శిక్షణపొందే సభ్యులకు అంటే విద్యార్థినులకు భోజనం, వసతి సౌకర్యాలు ఉచితంగా ఏర్పాటు చేయబడతాయి. తగిన ఉపాధ్యాయినులను నియమించి శిక్షణ ఇవ్వబడుతుంది. షుమారు నాలుగైదు తరగతుల అంతస్తుకు సరిపడే విద్యా జ్ఞానమున్న వారిని 8 వ తరగతి కోర్సులో చేర్చుకొని రెండు సంవత్సరాలలో ప్రభుత్వం నిర్వహించే 8 వ తరగతి పరీక్షకు పంపుతారు. అట్లాగే షుమారు రెండవ ఫారం లేక మూడవఫారం వరకూ పరిజ్ఞానమున్న వారిని స్కూలుఫైనలు లేక మెట్రిక్ పరీక్షలకు పంపుతారు. అందులో ఉత్తీర్ణులైన తర్వాత అనేక విధాలైన ట్రైనింగులకు అంటే నర్సులు, టీచర్లు మొదలైన కోర్సులకు వెళ్ళవచ్చు.

ఈ సంక్షిప్త విద్యా విధానాన్ని అమలుపరచడానికి స్వచ్ఛంద సంస్థలకు కేంద్ర సంక్షేమసంఘం ద్వారా ఆర్థిక సహాయం లభిస్తున్నది. ఒక్కొక్క బాచికి 30,000 రూపాయలకు మించకుండా గ్రాంటు మంజూరు చేయబడుతున్నది. ఇంతవరకూ జరిగిన దానినిబట్టి శిక్షణ పొందిన వారిలో నూటికి 80,90 వంతుల వరకూ ఉత్తీర్ణులవుతున్నారు.

ఈ విధమైన కోర్సులు పట్టణాలలోనే కాక ప్రత్యేకంగా పల్లెలలో కూడా నడుపడానికి నిర్ణయించడం జరిగింది. పల్లెల్లోని స్త్రీలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని స్త్రీల అవిద్యను, ఉద్యోగినుల అభావాన్ని కూడా తగ్గించగలరని ఆశించడం జరుగుతున్నది. ఇంతకు ముందు ఒక్కొక్క సంస్థ, ఒక్కొక్క సారి, ఒక్కొక్క కోర్సునే నడపాలనే నియమం వుండేది. కాని ఈ పథకం చేకూర్చుతున్న విజయాన్ననుసరించి సమర్థవంతంగా నడుపుతున్న సంస్థలకు ఒకేసారి రెండుకోర్సులో అనగా 8 వ తరగతికి ఒక బాచి, స్కూలు ఫైనల్‌కు ఒక బాచినీ కూడ తర్ఫీదు చేయడానికి అవకాశం కల్పించబడుతున్నది. అందుకు తగిన అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా చేస్తున్నది.

సంక్షేమ సంఘంవారు ఈ సంక్షిప్త విద్యావిధానాన్ని పర్వతప్రాంతాలలోను ట్రైబల్ ప్రాంతాలలోనూ ప్రత్యేక శ్రద్ధతో అమలు జరుప యత్నిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు లేనిచోట్ల రాష్ట్ర విద్యాశాఖవారి ఆధ్వర్యాన విద్యా కేంద్రాల యాజమాన్యాన ఈ పథకాన్ని నడిపింపవచ్చును. ఈ కోర్సులు ఆఫ్టర్ కేర్ హోముల్లోనూ, మహిళా సంస్థల్లోనూ నడుపబడుతున్నవి. స్త్రీల కారాగారాలలో కూడా నడిపే యత్నం జరుగుతున్నది.

రెండవ పంచవర్ష ప్రణాళికాకాలంలో 1959 నుంచి ఈ పథకం క్రింద మన దేశంలో 329 సంస్థలు పనిచేస్తున్నాయి. తత్ఫలితంగా స్కూల్ ఫైనల్‌కు 2,662 మంది, 8 వ తరగతికి 7,244 మంది మొత్తము 9,906 మంది వయోజనులైన స్త్రీలు శిక్షణపొందారు. ఇందుకు 91,96,164 రూపాయలు వెచ్చింపబడ్డాయి. ఈ కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో 19 సంస్థలు ఈ కోర్సులను నిర్వహించాయి. మూడవ ప్రణాళికా కాలంలో 500 కోర్సులు నడపడానికి 1.5 కోట్ల రూపాయలు వెచ్చించాలని నిర్ణయింపబడింది. ఈ 500 కోర్సులను 1,000 కోర్సులకు పెంచి 3 కోట్ల రూపాయలను కేటాయించవలసిందిగా రాష్ట్ర సంక్షేమ సలహా సంఘాధ్యక్షులు తమ యెనిమిదో వార్షిక సమావేశంలో కేంద్ర సంక్షేమ సంఘానికి సిఫారసు చేశారు. దీనితో ఈ ప్రణాళిక రెట్టింపుగా విస్తరించబడుతుందని ఆశించబడుతున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు 25 సంస్థల ద్వారా ఈ కోర్సులు నడుపబడుతున్నవి. 1961 నుండి 63 వరకూ 8 కోర్సులు, 62 నుండి 64 వరకూ 14 కోర్సులు నడుపబడుతున్నవి. 63 నుండి 65 వరకూ 11 కోర్సులు సిఫారసు చేయబడ్డాయి. అనగా మొత్తం 33 కోర్సులు నడుపబడుతున్నట్లు చెప్పవచ్చును. కేంద్ర సంక్షేమ సంస్థవారు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన రు. 10.50 లక్షలలో రు. 7.65 ఖర్చు అయినవి. ఇంకా రు. 9.00 లక్షల ఖర్చుతో 30 కోర్సులు నడపాలని ప్రయత్నిస్తున్నారు.

ఈవిధంగా ప్రజాప్రభుత్వ సహకారాలతో జరుగుతున్న ఈ కృషితో సక్రమమైన రీతులలో మహిళాలోకం సహకరించి దాన్ని సద్వినియోగం చేసుకొని తన జాతి పురోభివృద్ధికి ముందంజ వేయవలసిన అవసరం యెంతైనా వున్నది.★

మనచరిత్ర-సంస్కృతి

ఆంధ్ర ప్రజల కథ

మారేమండ రామారావు

[ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల నుంచి "మన ్కృతి చరిత్ర" అనే మరొక క్రొత్త శీర్షికను ప్రారంభిస్తున్నందుకు సంతోషిస్తున్నాము. ఆయా రంగాలలో నిపుణులైన ప్రముఖ రచయితల వ్యాసాలు ఈ శీర్షిక క్రింద ప్రచురించబడతాయి. ప్రస్తుత వ్యాసంలో ఆంధ్రుల పుట్టుపూర్వోత్తరాలు, చరిత్ర, వివిధ రంగాలలో సాధించిన ఘన విజయాలు ప్రస్తావించబడ్డాయి—ఎడిటర్.]

ఆంధ్రుల చరిత్ర అతిప్రాచీనమైనది. భారత దేశ సంస్కృతి, చరిత్ర పరిణామంలో ఆంధ్రులు ప్రముఖ పాత్ర వహించారు. ఒక ప్రత్యేక భాష, భౌగోళిక ప్రాంతం వారి పేరుతో విలసిల్లు తున్నది. అసంఖ్యాక ఆంధ్రులు లేక తెలుగు ప్రజలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నివసిస్తున్నారు. చాలమంది దేశమంతటా వ్యాపించివున్నారు. అయితే దక్షిణ భారతంలో తమిళ కర్నాటక ప్రాంతాలలో అనేకమంది ఆంధ్రులు స్థిరపడి పోయారు.

ఉనికి

భారతదేశంలో ఆంధ్రుల పుట్టినిల్లు అయిన ఆంధ్రదేశానికి ఒక ప్రత్యేకతవుంది. దక్షిణ పీఠభూమి పూర్వార్థ భాగంలో ఇది నెలకొని వుంది. ఆర్యుల స్థావరమైన ఉత్తర దేశానికీ, ద్రావిడుల స్థావరమైన దక్షిణ దేశానికి ఇది మధ్యలో వుంది. కనుక, ఈ రెండు సంస్కృతులనూ మేళవించి, భారతీయ సంస్కృతిగా పరిణతి పొందడానికి అనువైన కేంద్రంగా రూపొందింది. క్రీస్తు శకారంభంలో ఆగ్నేయ ఆసియా దేశాలకు వ్యాప్తి చెందిన సంస్కృతిలో ఆంధ్ర ప్రజల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాలలో ప్రజల భాష, ఆచార వ్యవహారాలు, పొరుగున వున్న యితర భాషా ప్రజల ప్రభావానికి లోబడినట్లు స్పష్టమైన నిదర్శనాలు వున్నాయి. చారిత్రక కారాణాల దృష్ట్యా ఆంధ్రప్రాంతం సర్కారు, రాయల సీమ, తెలంగాణా అని మూడు భాగాలుగా విభజింపబడివుంది. రాజకీయంగా ఈ మూడు ప్రాంతాలన్నీ అప్పుడప్పుడూ కొంత కాలంవరకు ఒకటిగా కలిసినప్పటికీ, ప్రతి ప్రాంతానికీ ఒక ప్రత్యేకత వుంది. రాజకీయ భిన్నత్వంలో సాంస్కృతిక సమైక్యత ప్రబలివున్నట్లు ఆంధ్రదేశాన్ని ఉదాహరణంగా పేర్కొనవచ్చు.

పుట్టు పూర్వోత్తరాలు

ఐతరేయ బ్రాహ్మణంలో మొట్ట మొదటి సారిగా ఆంధ్రుల ప్రసక్తి వున్నట్లు తెలుస్తున్నది. ఆ తరువాత రామాయణం, మహాభారతం, పురాణాలలో కూడా వీరి ప్రసక్తి వుంది. వీరు మొదట ఆర్యజాతికి చెందినవారనీ, ఆ తరువాత దక్షిణ పీఠ భూమికి వలసవచ్చి స్థానిక ఆర్యేతరులతో కలసిపోయారనీ తెలుస్తున్నది. ఆంధ్రుల ప్రాచీన చారిత్రక విషయాలు 4 వ శతాబ్దంలో మెగస్తనీస్ వ్రాసిన *ఇండికా* అను పుస్తకంలోను, 3 వ శతాబ్దంలో మౌర్య చక్రవర్తి అశోకుని శాసనాల్లోనూ పేర్కొనబడి వున్నాయి. ఆ కాలంలో వారు శక్తివంతులైన నాయకుల నాయకత్వంలో వున్నట్లు తెలుస్తున్నది.

రాజకీయ చరిత్ర

అశోకుని మరణానంతరం, శాతవాహన అనురాజు నాయకత్వంలో ఒక స్వతంత్ర రాజ్యం ఏర్పడడంతో ఆంధ్రుల చరిత్ర ఆరంభమైంది. ఆయన అనంతరం శాతవాహన వంశీకులు నాలుగు శతాబ్దాల వరకు ఈ రాజ్యాన్ని పరిపాలించారు. త్వరలోనే ఈ రాజ్యం ఒక మహాసామ్రాజ్యంగా వ్యాప్తి చెందింది. ఒక కాలంలో దక్షిణ పీఠభూమి, ఉత్తర భారతంలో కొన్ని ప్రాంతాలు తమిళ దేశంవరకు వీరి సామ్రాజ్యం విస్తరించి వుండింది. శాతవాహన రాజులు కొంతకాలం రాజ దండం ధరించారు. ఆ కారణంవల్లనే, ప్రాచీన భారతదేశ చక్రవర్తులలో ఒకరుగా వీరిని పేర్కొనడం జరిగింది. వీరు అనేక

విదేశదండయాత్రలకు తిరుగకొట్టి వేశారు. కళలనూ, సాహిత్యాన్నీ, మతాలనూ ఉదారంగా పోషించారు. వీరి కాలంలో సిరిసంపదలు విలసిల్లాయి. ప్రాచీన భారతదేశ చరిత్రలో 1 వ శాతకర్ణి, 2 వ శాతకర్ణి, గౌతమీపుత్ర, శాతకర్ణి శ్రీయజ్ఞవాటి రాజులు ప్రముఖులుగా ప్రసిద్ధి చెందారు.

శాతవాహనుల తరువాతి కాలం

క్రీ. శ. 3 వ శతాబ్దంలో శాతవాహన సామ్రాజ్యం పతనమైన తరువాత ఆంధ్ర దేశం ముక్కలై పోయింది. తెలంగాణా ప్రాంతం వాకాటకుల అధీనంలోకి వచ్చింది. ఆ తరువాత బాదమీ తొలి చాళుక్యుల హస్త గత మైంది. సముద్రతీర ప్రాంతాన్ని ఇక్ష్వాకులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు ఒకరితరువాత ఒకరు పరిపాలించారు. నైరుతి, ఆగ్నేయ ప్రాంతాలను పల్లవులు పాలించారు. గోదావరీతీర ప్రాంతాన్ని చిన్న చిన్న రాజులు 5 వ శతాబ్దాంతం వరకు పాలించారు. ఆతరువాత తూర్పు గంగులు వీరిని జయించి తమ రాజ్యం స్థాపించారు. 7 వ శతాబ్దారంభంలో చాళుక్యుల శాఖ ఒకటి (వీరినే తూర్పు చాళుక్యులు అంటారు) సముద్రతీర ప్రాంతంలో తమ రాజ్యాన్ని నెలకొల్పి సుమారు 400 ఏండ్లు రాజ్యం చేశారు. రాష్ట్రకూటులు, తరువాత చాళుక్యులు ఒకరితరువాత ఒకరు తెలంగాణా ప్రాంతాన్ని పాలించారు. తెలుగు చోళులలో ఒక శాఖ అయిన పల్లవులు, ఆ తరువాత బాణులు, వైదుంబులు రాయలసీమను కొంత కాలం పరిపాలించారు. వీరి అనంతరం దక్షిణదేశపు చోళరాజులు ఈ ప్రాంతాన్ని ఏలినారు. ఈ కాలంలో అంతఃకలహాలు, తరచు యుద్ధాలు, దురాక్రమణలు జరిగాయి. రాజకీయ పరిస్థితి అనిశ్చితంగా వుండేది. ఈ కాలంలో ఇక్ష్వాకుల రాజైన 1 వ శాంతమూల, విష్ణుకుండినుల రాజైన 1 వ మాధవవర్మన్, తూర్పు చాళుక్యుల రాజులైన 1 వ విష్ణువర్ధన, నరేంద్ర మృగరాజ విజయాదిత్య, గంగ విజయాదిత్య, రాజరాజ, యుద్ధాలు చేయడంలోను, శాంతిని నెలకొల్పడంలోను సమాన ప్రతిభగల రాజులుగా ప్రసిద్ధిచెందినారు.

కాకతీయుల కాలం

సుమారు 11 వ శతాబ్దం మధ్యభాగంలో ఆంధ్రదేశ పరిస్థితి చాల గందరగోళంగా వుండింది. తరువాత చాళుక్యుల అధికారం క్షీణించింది. వారికి తెలంగాణాలో లోబడి వున్న అనేకమంది తెలుగు సామంతరాజులు స్వాతంత్ర్యం ప్రకటించారు. ఆంధ్ర తీర ప్రాంతంలో అనేకమంది చిన్నచిన్న రాజులు అధికారంలోకి వచ్చారు. చాళుక్యుల అధికారంలోనుంచి తెలుగు చోళులు, తెలుగు పల్లవులు వంటి చిన్న రాజులు విడివడి పోయారు. ఇలాంటి గందరగోళ పరిస్థితిలో నుంచి వరంగల్ కాకతీయుల సామ్రాజ్యం అవతరించింది. తెలంగాణాలో చాళుక్యుల సామంత రాజులుగా కాకతీయులు తమ రాజకీయ చరిత్రను ఆరంభించారు. 2 వ ప్రోల రుద్రదేవుడు స్వాతంత్ర్యం ప్రకటించాడు. అతని వారసుడు తెలంగాణాను పూర్తిగా జయించాడు. ప్రసిద్ధికెక్కిన ఈయన మేనల్లుడు గణపతిదేవుడు కోనసీమలోను రాయలసీమలోను అనేక పర్యాయాలు జైత్రయాత్రలు చేసి ఆంధ్ర ప్రజలనందరినీ తన పరిపాలనక్రిందికి తెచ్చి ఒక గొప్ప సామ్రాజ్యాన్ని స్థాపించాడు. రాణి రుద్రమాంబ ఈ సామ్రాజ్యాన్ని కాపాడింది. ఆయమ మనుమడు, ఈ వంశానికి కడపటివాడు అయిన ప్రతాపరుద్ర దేవుడు ఢిల్లీ ముస్లిం సుల్తానులు చేసిన అనేక దండయాత్రలను పారద్రోలినాడు. ముస్లిం దురాక్రమణను ప్రతిఘటించిన హైందవ రాజు ఈయన. తరువాతకాలంలో హైందవమత పునరుద్ధరణ చెందడానికి మూలపురుషుడైనాడు. కాకతీయుల యుగం సిరిసంపదలకు ఆలవాలమైంది. కళారంగంలోనూ, సాహిత్య రంగంలోనూ చెప్పుకోతగిన ప్రగతి సాధించబడింది.

కాకతీయుల తరువాతి కాలం

1323 సం॥ లో కాకతీయుల సామ్రాజ్యం పతనం కావడంతో రాజకీయ అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది. ముస్లింల దండయాత్రలు దేశ ఆక్రమణ రూపంలో ఒక పెద్ద ప్రమాదం ఏర్పడింది. యువరాజుగావున్న సుల్తాన్ మొహమ్మద్ తుగ్లక్ వరంగల్‌ను వశపరచుకొన్నాడు. తూర్పులో నెల్లూరునుంచి పశ్చిమంలో క్విలాన్ వరకువున్న దక్షిణ ప్రాంతాన్నంతటినీ జయించాడు.

ఈ ప్రాంతాన్ని పరిపాలించడానికి తన ప్రతినిధులుగా ముస్లిం గవర్నర్లను నియమించాడు. ఆంధ్ర ప్రజలు త్వరలోనే ఈ ప్రమాదాన్ని గుర్తించి, ప్రజా యుద్ధాన్ని ఆరంభించారు. కాపయనాయక, ప్రోలయ వేమ, సింగమనాయకవంటి నాయకులు ముస్లింలను పారద్రోలి దేశాన్ని విముక్తం చేశారు. ఈ అవ్యక్తస్థితినుంచి అనేక కొత్త రాజ్యాలు ఏర్పడినాయి. కొండవీడులో రెడ్డి రాజులు, రాజకొండలో వెలమ రాజుల రాజ్యాలు ఉద్భవిల్లినాయి. తెలుగు సోదరులైన హరిహర బుక్కరాయలు 1326 లో విజయనగర రాజ్యాన్ని స్థాపించారు. 1347 లో దక్కన్‌లో ముస్లిం రాజ్యమైన బహమనీ రాజ్యం స్థాపించబడింది. ఈ బహమనీ రాజులు, ఆ కాలంనాటి హిందూ

రాజులతో నిరంతరం యుద్ధాలు చేశారు. రెడ్డి, వెలమరాజులు విద్యా పోషకులు. రెడ్డి రాజులలో కుమారగిరి, పెదకోమటి వేమ, కాటయవేమ, వెలమ రాజులలో సింగభూపాలుడు గొప్ప రచయితలుగా ప్రసిద్ధి చెందినారు. సుప్రసిద్ధ తెలుగుకవి శ్రీనాథుడు ఈ కాలానికి చెందినవాడే.

కుతుబ్‌షాహీ కాలం

1520 సం॥ లో కుతుబ్‌షాహీ రాజులు గోలకొండ రాజధానిగా తెలంగాణాను స్వాధీన పరచుకొని ముస్లిం రాజ్యాన్ని స్థాపించారు. ఒరిస్సాలోని గజపతి రాజులు, కుతుబ్‌షాహీ రాజులు, విజయనగర సామ్రాజ్యపు తరువాతి రాజులు అధికార, రాజ్యవిస్తరణ కాంక్షతో ఒకరితో ఒకరు పోరాడుతూ వచ్చారు. విజయనగర సామ్రాజ్యం ఆంధ్ర దేశం వరకు మాత్రమే పరిమితమైవుంది. కట్ట కడపటి కుతుబ్‌షాహీ రాజులు ఆంధ్ర ప్రాంతంలో అధికభాగాన్ని తమ అధీనం లోకి తెచ్చుకోవడంలో కృతకృత్యులైనారు. తమ ప్రజల సంక్షేమాభివృద్ధికి దోహదం కల్పించిన రాజులుగా పేరుగాంచినారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు గోల్కొండను జయించడంతో, ఆ రాజ్యము మొగల్ సామ్రాజ్యంలో కలిసిపోయింది. కుతుబ్ షాహీ పరిపాలనా కాలంలో జరిగిన ముఖ్య సంఘటన ఏమంటే ఫ్రెంచి, ఇంగ్లీషు వ్యాపారస్థులు ఇక్కడికివచ్చి, ఆంధ్ర దేశంలో అనేక స్థలాల్లో వ్యాపార సంస్థలను నెలకొల్పారు.

నిజాముల పరిపాలన

దక్కన్‌లో మొగలు సుబేదారులుగా వుండిన నిజాం-ఉల్-ముల్క్, అతని వారసులు, 1723 నుంచి ఆంధ్రదేశ వాస్తవిక పరిపాలకులైనారు. వీరినే నిజాంలు అని అంటారు. అయితే అనేక సంఘటనల ఫలితంగా సుమారు 30 ఏండ్లకు లోపుగానే నిజాం ఫ్రెంచి వారికి లోబడి పోయినాడు. ఫ్రెంచివారి నిర్బంధం వల్ల వారికి నిజాం 1753 లో సర్కార్లను ధారాదత్తం చేశాడు. త్వరలోనే ఇంగ్లీషు ఈస్ట్ ఇండియా కంపెనీ బలాత్కారంగా ఈ ప్రాంతాన్ని స్వాధీన పరచుకొనింది. నిజాం ఇంగ్లీషు వారితో చేసుకొన్న ఒప్పందం ఫలితంగా వారికి రాయలసీమను దత్తం చేశాడు. ఈ విధంగా ఆంధ్రదేశంలో రెండు పెద్దభాగాలు ఇంగ్లీషు పరిపాలన క్రిందికి వచ్చాయి. తెలంగాణా మాత్రం నిజాంల పరిపాలన క్రిందనే వుంటూ వచ్చింది.

మత చరిత్ర

వైదిక మతాన్ని ప్రచారం చేసి, దాన్ని పోషించడంలో ఆంధ్రులు ప్రముఖ పాత్ర వహించారు. యజ్ఞయాగాలు చేసే హిందూ మతం ఇక్కడ బహుళ ప్రచారంలో వుండింది. అనేకమంది రాజులు అశ్వమేధ, రాజసూయ, వాజపేయ యాగాలు, క్రతువులు చేశారు. ఆంధ్ర దేశంలోని తొలితామ్ర శాసనాల్లో దానగ్రహీతలుగా అనేక మంది సోమయాజుల పేర్లు వున్నట్లు మనకు తెలుస్తున్నది. బౌద్ధమతం తరువాత బ్రాహ్మణ మతాన్ని పునరుద్ధరించడానికి మొట్ట మొదట నాగార్జున కొండకు చెందిన ఇక్ష్వాకు వంశీకులు పూనుకొన్నారు. ఆ తరువాతి రాజవంశీకులు ఈ మతాన్ని పోషిస్తూ వచ్చారు. పరమ భాగవతులుగాను, పరమ మహేశ్వరులుగాను తమ్ముతాము అభివర్ణించుకుంటూ, వేదపండితులనూ, హైందవ దేవాలయాలనూ పోషించడంలో రాజులు ఒకరికి మించి మరొకరు పాటు పడినారు. ముస్లింలు దక్షిణ దేశంపై దండయాత్ర చేసి, ఇస్లాం మతం వల్ల హైందవ మతం మనగడకే ముప్పు వాటిల్లినపుడు ఆంధ్రులందరూ మరొకసారి విజృంభించి ప్రతిఘటన ఆరంభించారు. హైందవ మతోద్ధరణకు గొప్ప ఉద్యమం లేవదీశారు. ఒక మహానగరంగా, ఒక రాజ్యంగా, విజయనగరాన్ని స్థాపించి హైందవమత, సంస్కృతులను కాపాడడానికి వారు చేసిన కృషి అపూర్వమైనది.

అశోకుడు బౌద్ధమత వ్యాప్తికి పూనుకోవడానికి పూర్వమే ఈ మత ప్రభావం ఆంధ్రుల పైన పడింది. ఆంధ్రలోని మొట్ట మొదటి బౌద్ధ స్తూపాలు ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. బౌద్ధ భిక్షువులలో అంధకులు లేక ఆంధ్రకులు అనే ప్రత్యేకశాఖ ఒకటి వుండింది. ఆంధ్ర దేశంలో వెలసిన అనేక బౌద్ధ తీర్థాలలో, బౌద్ధ మతానికిచెందిన ఇతర శాఖలు కలిసి మెలిసి వుండినట్లు అనేక రికార్డులలో పేర్కొనబడి వుంది. నాగార్జునాచార్యుడు ఇక్కడవుండి పోవడంతో ఈ దేశం పావనమై పోయింది. ఆయన ప్రచారం చేసిన మహాయానసిద్ధాంతం ఆంధ్రదేశ ప్రజలలో బహుళ వ్యాప్తిలోకి వచ్చింది. వజ్రమాన, తంత్రయానలు కూడా ఇక్కడ ప్రబలివుండినాయి. ఘంటశాల, భట్టిప్రోలు, అమరావతి, నాగార్జునకొండ స్థలాలు అంతర్జాతీయ ఖ్యాతి వహించిన బౌద్ధతీర్థయాత్ర కేంద్రాలుగా విరాజిల్లినాయి.

లలిత, శిల్పకళలు

భారత దేశంలోని లలితకళలు, శిల్ప కళాభివృద్ధికి ఆంధ్రప్రజలు యెనలేని సేవ చేశారు. బౌద్ధమతం విశేష ప్రచారంలోవున్న రోజులలో ప్రధానంగా బౌద్ధస్తూపాలు అందరి దృష్టినీ ఆకర్షించాయి. నాలుగు ఆయక వేదికలూ, ఇటుకలతో నిర్మించిన కట్టడాల పైన శిల్పకళా ప్రతిభను ప్రతిబింబించు

చంద్రకాంతపు రాళ్ళలో ఆంధ్రత్వం ఉట్టిపడుతున్నది. ఇవి స్థూప సౌందర్యాన్ని యినుమడింప జేశాయి. అమరావతిలోని మహా చైత్యానికి చంద్రకాంతపు రాళ్ళతో అంచులు కట్టడం బౌద్ధ శిల్పకళా చరిత్రలోనే అపూర్వమైనవిషయం. ఒకేరాతిలో పెద్దవి, చిన్నవిగా మలచబడిన స్తూపాలు, ఆంధ్ర దేశంలో శంకరం అను ఊరువద్ద లభిస్తాయి. భారతీయ శిల్పకళలో సాంచి, అమరావతి రెండుప్రధాన విషయాల్ని తెలుపుతాయి. ఆంధ్ర శాతవాహన రాజైన 2వ శాతకర్ణి పరిపాలనా కాలంలో క్రీ. పూ. 1వ శతాబ్దంలో సాంచిలో తొలిసారిగా నిర్మించిన తోరణాలు శిల్పకళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాయి. "ప్రకృతి సాంప్రదాయాలలో వాస్తవిక" పరిస్థితిని అధిగమించి, అర్ధచంద్రాకారంలో చిత్రాలను మలచడానికి భారతీయ కళాకారుడు చేసిన తొలి ప్రయత్న మిదియని ఈ తోరణాలు మనకు తెలుపుతాయి. అమరావతిలో నాలుగు శతాబ్దాలవరకు శిల్పకళ ఉజ్వలంగా వెలసింది. ఇక్కడ మలచబడిన మానవ విగ్రహాలలో పరిపూర్ణత, సౌందర్యం అత్యున్నత స్థాయిని అందుకొన్నాయి. ఈ విగ్రహాల ఆకార స్వరూపాలలో జీవకళ తొణికిసలాడుతుంది. ఇవి జీవితానికి ప్రతిబింబాలు.

ఇక్ష్వాకుల కాలంలో హిందూ దేవుళ్ళకూ, దేవతలకూ అంకితం చేయబడిన అనేక దేవాలయాలు నిర్మించబడ్డాయి. పల్లవులు ఈ కార్య కలాపాన్ని కొనసాగించారు. విష్ణుకుండినులు బౌద్ధుల గుహ శిల్పకళా సాంప్రదాయాలను స్వీకరించి కొన్ని మార్పులతో త్రిమూర్తులకు అంకితమైన అనేక దేవాలయాలను మొగల్రాజపురం, ఉండవల్లి, బెజవాడలలో గుహలలో మలచారు. పల్లవులు ఈ పద్ధతినికూడా అనుసరించి, నెల్లూరుజిల్లా భైరవకొండలో కొన్ని గుహలు త్రవ్వించారు. వారు ఈ రెండు సాంప్రదాయాలను తమిళదేశానికికూడా కొనిపోయారు. ఈ ప్రాంతంలో అనేక గుహ దేవాలయాలను త్రవ్వించి మహాబలిపురం రథాల రూపంలో ఈ సంప్రదాయాన్ని మేళవించి స్మారక చిహ్నాలుగా కట్టడాలను నిర్మించారు.

చాళుక్యుల పరిపాలనా కాలంలో ఆంధ్రదేశంలో ద్రావిడ, వేసార అనే రెండురకాల దేవాలయ శిల్పకళా పద్ధతులు వ్యాప్తిలోకి వచ్చాయి. తొలిచాళుక్య కాలంనాటి వేసర దేవాలయాలు అలంపురం, సత్యవోలు చోట్లలో కనిపిస్తాయి. ద్రావిడ పద్ధతిలో దేవాలయాలు చాళుక్య భీమవరం, చేబ్రోలు, అమరావతీ ప్రాంతాలలో వున్నాయి. తూర్పు చాళుక్య కాలంలో నిర్మించబడిన నాగర దేవాలయాలలో శృంగార పూర్వకమైనవీ, శృంగార రహితమైనవీ, రెండూవున్నాయి. తూర్పుగండులు ఒక వినూత్న పద్ధతిలో వేసార దేవాలయాలను నిర్మించారు. ఈ రకం దేవాలయాలు సింహాచలం, ముఖలింగాలలో కనిపిస్తాయి.

కాకతీయులు, తరువాతి చాళుక్యుల శిల్ప కళా సాంప్రదాయాన్ని అనుసరించారు. ఇందులో కొన్ని మెరుగులుదిద్ది అనేక కట్టడాలు నిర్మించారు. ఈ పద్ధతిలో హనుమకొండ, రామప్ప, పిల్లలమర్రి, నాగులపాడులలో ఒక గర్భగుడి, మూడు గర్భగుళ్ళుగల దేవాలయాలు నిర్మించబడ్డాయి. కాకతీయుల దేవాలయాలు అంద చందాలలోను నిర్మలత్వంలోనూ, ఆకార స్వరూపంలోనూ పేరెన్నిక పొందినాయి. వీటిల్లో హోయసల పద్ధతిలోవలె అపరిమితంగా చెక్కడాలూ, అలంకారాలూలేవు. చాళుక్యపద్ధతిన శృంగార రాహిత్య నిర్మాణంవల్ల అందానికి లోటు రాలేదు. దక్కన్ మధ్యయుగంలో శిల్పకళా పరిణామంలో ఇవి పరాకాష్ట నందుకొన్నాయి.

విజయనగర కాలంనాటి దేవాలయాలు అనేకం రాయలసీమ అంతటా వ్యాపించి వున్నాయి. హంపీ తరువాత ఆ కాలంలో నిర్మించబడిన దేవాలయాలు ఇక్కడ మాత్రమే కనిపిస్తాయి. సువిశాలమైన మహా మంటపాలు, స్తంభాలు, చిన్న చిన్న స్తంభాలు, పెద్దజంతువుబ్రాకెట్లు, నల్లగ్రానైటురాయితో మూర్తులు మలచిన మండపాలు ఈపద్ధతిలోని శిల్పకళా వైదగ్ధ్యాన్ని తెలుపుతాయి. సమకాలీన శిల్పుల ప్రతిభావిశేషాలను చాటుతాయి.

వర్ణ చిత్రాలలోకూడా ఆంధ్రులు ప్రసిద్ధి చెందినారు. తొలుదొల్త మలచిన అజంతా గుహలలో బయల్పడిన గొప్ప వర్ణచిత్రాలు శాతవాహన కాలానికి చెందినవి. తరువాత వెలువడిన చిత్రాలుకూడా, వర్ణవిశేషాలలో సాంచీ, అమరావతీ శిల్పకళా ఖండాల ప్రతిస్వరూపాలుగానే అగుపిస్తాయి. ఇవి ఆంధ్ర వర్ణచిత్ర పద్ధతిలో తరువాత కాలంలో అభివృద్ధి చెందినట్లుగా రుజువు అవుతున్నది. అమరావతీ శిల్పకళా పద్ధతివలెనే ఇవికూడా అనేక శతాబ్దాలవరకు వర్ధిల్లినాయి. వర్ణచిత్ర కళ వృద్ధి పొందుతూ వచ్చింది. వీటి నిదర్శనాలు కొన్ని కాకతీయుల దేవాలయాలలో కనిపిస్తాయి. విజయనగర కాలంలో మూరల్ పెయింటింగ్ అత్యున్నతస్థాయిని అందుకొనింది. వీటి నిదర్శనాలు లేపాక్షి, సోంపేటలలో లభిస్తాయి.

సాహిత్యరంగంలో

భారతదేశ సాహిత్యాల అభివృద్ధికి ఆంధ్రదేశం అనేక విధాలుగా సాయపడింది. ప్రఖ్యాత ఆంధ్రచక్రవర్తి హాలుడు సంపుటీకరించి వెలయించిన సప్తశతి,

(మిగతా 79వ పేజీలో)

మనరాష్ట్రంలో హోంగార్డ్స్

ఆంధ్రప్రదేశ్ హోంగార్డ్స్ చట్టం (1948 వ సం॥ ఒకటవ చట్టం) ఇప్పుడు మొత్తం రాష్ట్రానికి వర్తిస్తుంది. యీచట్టంలోని ఒకటవ సెక్షన్ ఇప్పటికే మొత్తం రాష్ట్రంలో అమలులో ఉంది. మిగతా చట్టం కూడా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, కర్నూలు, అనంతపురం, కడప, నెల్లూర్లలో అమలులో ఉంది.

హైద్రాబాదు, సికింద్రాబాదు నగరాలలో వరంగల్లు, విశాఖపట్నం జిల్లాలలో కూడా యీ చట్టాన్ని అమలుచేయాలని ప్రభుత్వం నిశ్చయించింది. దిగువ* తెల్పిన ప్రాంతాలలో హోంగార్డ్స్ ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం నిశ్చయించింది.

రాష్ట్ర మొత్తంలో ఈ సంస్థ పోలీసు ఇన్స్పెక్టర్ జనరల్ అధీనంలో పనిచేస్తుంది. హైద్రాబాదు, సికింద్రాబాదు నగరాలలో పోలీసు కమీషనరూ, ఆయా జిల్లాలలో పోలీసు సూపరింటెండెంట్లు వీటికి జనరల్ ఇన్చార్జిగా ఉంటారు.

ప్రభుత్వం ప్రతి ప్రాంతానికీ ఏర్పాటు చేసే రిక్రూటుమెంటు కమిటీలు హోంగార్డ్లను సెలక్టుచేస్తుంది. దిగున తెల్పినవారు యీ రిక్రూటుమెంటు కమిటీలలో సభ్యులుగా ఉంటారు.

హైద్రాబాదు, సికింద్రాబాదు నగర ప్రాంతం

1. అధ్యక్షులు ; పోలీసు కమీషనర్.

2. ఇద్దరు అనధికార సభ్యులు : హైద్రాబాదు మునిసిపల్ కార్పొరేషన్ మేయరు లేక వారు నామినేటు చేసినవారు. 2. ప్రభుత్వము నామినేటు చేసే నగరంలోని ఏదేని నియోజకవర్గం యం.యల్.ఏ.

3. కార్యదర్శి: హోంగార్డ్స్ సంస్థ ఇన్చార్జిగా ఉన్న పోలీసు అసిస్టెంటు కమీషనర్.

ఇతర ప్రాంతాలలో

1. అధ్యక్షులు : జిల్లాలోని పోలీసు సూపరింటెండెంటు.

సంగ్రహప్రకటనలు

2. ఇద్దరు అనధికార సభ్యులు : (1) ఆయా జిల్లా పరిషత్తు అధ్యక్షులు. (2) ప్రభుత్వం నామినేటు చేసే స్థానిక ప్రాంతంలోని ఒక యం.యల్.ఏ.

3. కార్యదర్శి : పోలీసు సబ్ డివిజన్ ఇన్చార్జిగా ఉన్న సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసరు.

20-45 సంవత్సరాల మధ్యవయస్సులో వుండి శారీరక అర్హతలు గలిగి చదువనూ వ్రాయనూ వచ్చిన సత్ప్రవర్తన గలవారందరూ హోంగార్డ్స్‌లో చేరవచ్చు. తగిన పరిశీలనల తర్వాత వీరిని చేర్చుకోవడం జరుగుతుంది. అన్ని ప్రాంతాలలోనూ పురుషులకే ప్రవేశం లభిస్తుంది.

ప్రవేశం లభించిన ప్రతి హోంగార్డ్‌కు 3 నెలల పాటు ప్రతిరోజు రెండుగంటల చొప్పున పార్ట్‌టైంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. రవాణా, పోలీసు కమ్యూనికేషనుల నిర్వహణ, నర్సింగ్, అగ్నిమాపకం, ప్రాథమిక చికిత్స మొదలైన ప్రత్యేక పనులను చేపట్టడానికి వీలుగా సాధ్యమైనచోట్ల కార్యాచరణ యూనిట్లను ఏర్పాటు చేస్తారు. మూడుమాసాల శిక్షణ కాలంలోని ఆఖరు మాసంలో కార్యాచరణ యూనిట్లకు కావల్సిన ప్రత్యేక శిక్షణకై హోంగార్డ్‌లను ఎన్నుకోవడం జరుగుతుంది.

పైతెల్పిన 7 ప్రాంతాలలోనూ చేర్చుకోబడే హోంగార్డ్స్ వృత్తులలో ఉండేవారు

*	ప్రాంతం	సంఖ్య	స్థలం
1.	హైద్రాబాదు, సికింద్రాబాదు.	2 కంపెనీలు	హైద్రాబాదు, సికింద్రాబాదు.
2.	విశాఖపట్నం జిల్లా	1 కంపెనీ	విశాఖపట్టణం.
3.	కృష్ణాజిల్లా	1 కంపెనీ	విజయవాడ పట్టణం.
4.	గుంటూరు జిల్లా	1 కంపెనీ	గుంటూరు పట్టణం.
5.	తూర్పుగోదావరి జిల్లా	1 కంపెనీ	కాకినాడ పట్టణం.
6.	కర్నూలు జిల్లా	1 కంపెనీ	కర్నూలు పట్టణం.
7.	వరంగల్లు జిల్లా	1 కంపెనీ	వరంగల్లు పట్టణం.

కావడం వల్లనూ, వారు నివసించే నగరం లోనూ, పట్టణంలోనూ శిక్షణ ఇవ్వడం వల్లనూ, అదికూడా రోజుకు రెండుగంటలు పార్ట్‌టైంగా శిక్షణ ఇవ్వడం వల్లనూ, రిక్రూటు చేసుకోబడిన వారికి శిక్షణ కాలంలో ఎట్టి ప్రతిఫలం ఇవ్వడం జరగదు.

అయితే శిక్షణ తర్వాత వారు వార్షిక శిక్షణ శిబిరానికి పిలువబడినప్పుడుకానీ, రోజుకు రెండు గంటలకు పైగా పనిచేయ వలసి వచ్చినప్పుడుకానీ దిగువ తెల్పిన విధంగా వారికి ప్రతిఫలం ఇవ్వడం జరుగుతుంది.

1. కంపెనీ కమాండర్స్, ప్లాటూన్ కమాండర్స్ రోజుకు రు. 5/-ల చొప్పున.

2. సెక్షన్ కమాండర్స్, అసిస్టెంట్ సెక్షన్ కమాండర్స్ రోజుకు రు. 3/-ల చొప్పున.

3. హోంగార్డ్స్ రోజుకు రు. 2/-ల చొప్పున.

బీదలకు విద్యారాయితీలు

1960-61 వ సం॥లో పాఠశాలలు, కళాశాలలు, పాలిటెక్నికులలోని ఫైనల్ పరీక్షలకు వెళ్ళే తరగతులకు చెందిన మెరిట్‌గల బీద విద్యార్థులకు విద్యారాయితీ గ్రాంటు ఇచ్చే పథకాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. యీ పథకానికి సంవత్సరానికి రు. 5 లక్షలు ఖర్చు అవుతాయని అంచనా. 1961-62 వ సం॥లో కూడా యీ పథకం అమలును కొనసాగించారు.

1962-63 వ సంవత్సరంలో కూడా యీ పథకంఅమలునుకొనసాగించేప్రశ్నవచ్చింది. అయితే హరిజనులు, ఇతర వెనుకబడిన తరగతులకు చెందినవారి బాలబాలికలకు ఇచ్చే స్కాలర్‌షిప్పుల మాదిరిగానే ఆర్థికంగా వెనుకబడినవారి పిల్లలకు కూడా విద్యారాయితీలు ఇవ్వడం ఉద్దేశ్యం అయినప్పుడు హరిజనులు, ఇతర వెనుకబడిన తరగతుల బాలబాలికలకు వర్తించే నియమ నిబంధనలను కొద్ది మార్పులతో వీరికికూడా వర్తింపజేయడం ఉచితమని సూచించడం జరిగింది. హరిజనులు, ఇతర వెనుకబడిన తరగతుల పిల్లల విషయంలో మొదట బీదరికానికి తర్వాత మెరిట్‌కు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతున్నది.

తదనుగుణంగానే సవరించబడిన పథకాన్ని ప్రభుత్వం ఆమోదించి 1962-63వ సంవత్సరంలో యీ పథకాల అమలుకై రు. 5.00 లక్షలకు మించని విధంగా అవసరమైన మంజూరు చేసింది.

ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు విద్యారాయితీలు ఇవ్వడానికై యీసవరించ బడిన పథకం నిర్దేశించబడింది. యీ విద్యారాయితీలకై నిర్ణీత దరఖాస్తు ఫారాలను ఆయా ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్లకు పంపాలి. కేవలం ఆర్థిక పరిస్థితులు కారణంగా తమ చదువులను కొనసాగించలేకున్నారని స్పష్టపడిన చేయబడిన విద్యార్థులకు మాత్రమే యీ విద్యారాయితీలు మంజూరు చేయడం జరుగుతుంది.

ప్యాసుబుక్కు పద్ధతి

1958వ సంవత్సరంలో నియమించబడిన గ్రామాధికారుల విచారణ సంఘం చేసిన సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించి, ఆంధ్ర ప్రాంతంలో రైతులందరికీ నిర్ణీత పట్టేదారుల ప్యాసుబుక్కులను జారీ చేయాలని 1960 జూలైలో ఉత్తరువులు జారీచేసింది. అయితే తెలంగాణాలో 'పాపుతీ-బహి' అమలులో ఉంటుంది. పట్టేదారు ప్యాసు బుక్కులోని అంశాలు, పాపుతీ-బహిలోని అంశాలు ఒకటే అయినా పాపుతీబహిలో పూర్తి వివరాలు లేవు. ఒకే విధానాన్ని రూపొందించడానికి వీలుగా తెలంగాణా ప్రాంతంలో పాపుతీ-బహి స్థానే పట్టేదారుల ప్యాసు బుక్కులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిశ్చయించింది.

తమ యాజమాన్యంలోగానీ, అధీనంలో గానీ ఉన్న భూములకు సంబంధించిన భూమి శిస్తులు మొదలైనవాటిని చెల్లించే రైతులందరూ రెవిన్యూ అధికారులనుంచి ప్యాసు బుక్కులను తప్పనిసరిగా కొనుగోలు చేయాలని సలహా ఇవ్వడం జరిగింది.

ఇనాం చట్టం క్రింద పన్నులు

1955వ సం॥ ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంతం) ఇనాములు (పన్ను) చట్టం, 1956వ సం॥ ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రాంతం) ఇనాములు (రద్దు మరియు రైత్వారీలోకి మార్పు) చట్టం క్రింద అనుచితంగా ఎక్కువ రేట్లలో విధించబడిన పన్నులపై అసంతృప్తి చెందిన చిన్న ఇనాములలోని రైతులు లేక ఇనాందార్లు, తగిన చర్యలు తీసుకోవడానికి వీలుగా ఇనాము భూములకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎదుర్కొనే కష్టాలు, కావలసిన నివారణోపాయం మొదలైన వివరాలు తెల్పుతూ ఆయా ప్రాంతాలకు చెందిన అసిస్టెంట్ సెటిల్మెంట్ ఆఫీసర్లకు వ్యక్తిగతంగా దరఖాస్తులు పంపుకోవాలని ప్రభుత్వం గత సంవత్సరం ప్రకటించింది.

అటువంటి దరఖాస్తులపై అసిస్టెంటు సెటిల్మెంటు అధికారులు ఇచ్చిన తీర్పుపై అపీలు చేసుకునే అవకాశం ఇవ్వాలా అనే ప్రశ్న తలెత్తింది. అసిస్టెంటు సెటిల్మెంటు ఆఫీసర్ల పని సాధారణంగా సెటిల్మెంటు ఆఫీసరు రివిజినల్ అధికారానికి లోబడి ఉంటుంది. కాబట్టి అసిస్టెంట్ సెటిల్మెంటు ఆఫీసర్ ఇచ్చిన తీర్పుపై అసంతృప్తిచెందిన వ్యక్తులందరూ, ఆ తీర్పు ఉత్తర్వు అందిన

తేదీనుంచి 30 రోజులలోపుగా సెటిల్మెంటు ఆఫీసరుకు రివిజనల్ పిటీషన్ పెట్టుకోవచ్చు. అపీలుపై చేసిన సెటిల్మెంటు ఆఫీసరు ఉత్తరువులు తుదివిగా ఉంటాయి. ఆ ఉత్తరువులకు కట్టుబడి ఉండాల్సిఉంటుంది.

పుస్తకాల అలవెన్సు

సైనికుల పిల్లలకు దిగువ తెల్పినవిధంగా అలవెన్సులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంజూరు చేసింది: I నుంచి V తరగతుల వరకు: సంవత్సరానికి రు. 7/- లు; VI నుంచి VIII తరగతులవరకు :సంవత్సరానికి రు. 15/- లు; IX నుంచి XII తరగతుల వరకు: సంవత్సరానికి రు. 20/-లు. ఉచిత వస్త్రాలను సరఫరాచేసే విషయాన్ని రాష్ట్రంలోని సాంఘిక సంస్థలకు వదలాలని ప్రభుత్వం భావించింది.

సలహా సంఘం పునర్నిర్మాణం

1961 అక్టోబరు 23 తేదీతో గడువు పూర్తి అయిన ఆంధ్రప్రదేశ్ చేనేత సలహా బోర్డును దిగువ సభ్యులతో పునర్నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తరువులు జారీచేసింది. పునర్నిర్మించబడిన యీ బోర్డు గడువు 1963 ఫిబ్రవరి 27 వ తేదీనుంచి రెండు సంవత్సరాలు ఉంటుంది.

చిన్నతరహా పరిశ్రమల మంత్రి అధ్యక్షులుగా ఉంటారు. చేనేతశాఖా డైరెక్టరు ఎక్స్ అఫిషియో మెంబరు - సెక్రటరీగా ఉంటారు. సహకార సంఘాల రిజిస్ట్రార్, ఆర్థికశాఖ డిప్యూటీ కార్యదర్శి (పరిశ్రమల ఆర్థిక సలహాదారు) పరిశ్రమలశాఖ డిప్యూటీ కార్యదర్శి (చేనేత పరిశ్రమల ఇన్చార్జి) యక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారు.

దిగువవారు బోర్డు అనధికార సభ్యులుగ వ్యవహరిస్తారు. శ్రీ యం. సోమప్ప ఎమ్మిగనూరు. శ్రీ కాశిన బసవరాజు, విజయవాడ; శ్రీ పావరు విఠల్‌రావు, హైద్రాబాదు; శ్రీ ప్రగడకోటయ్య, నిడుబ్రోలు; శ్రీ డి. రమాకాంతరావు, మంగళగిరి; శ్రీ ఐ. వీరభద్రరావు, రాజమండ్రి; శ్రీ సందానారాయణప్ప, ఉరవకొండ; శ్రీ బి. యన్. రాజారాం, చిక్కడపల్లి; శ్రీ అక్కల కోటయ్య, చీరాల; శ్రీ వి.కె. శ్రీనివాసన్, నగరి; శ్రీ యం. యన్. వెంకటయ్య, ఉప్పరపల్లి; శ్రీ కె. భద్రయ్య ఇల్లెందు; శ్రీ కె. నరసయ్య, ఆర్మూరు; శ్రీ కర్నాటి రామచంద్రయ్య దేవరకొండ తాలూకా; శ్రీ కోదం వెంకటేశం, సిరిసిల్ల, శ్రీ టి. గోపాలకృష్ణయ్య, నెల్లూరుజిల్లా. ★

(76 వ పేజీ తరువాయి)

శాతవాహన మంత్రి గుణాఢ్యుడు వ్రాసిన బృహత్కథ ప్రాకృత సాహిత్యంలో అమూల్యమైన రత్నాలు. ఆంధ్రపండితులైన విష్ణుకుండిన రాజు, మాధవవర్మన్ విరచిత జాన ఛందస్సు, కాకతీయ ప్రతాపరుద్రదేవ ఆస్థానంలో కవిగా వుండిన విద్యానాథుడు వ్రాసిన ప్రతాపరుద్రయణ భూషణం, అన్నంభట్టు వ్రాసిన తర్కసంగ్రహం, జగన్నాథ పండితారాధ్యుడు వ్రాసిన రసార్ణవసుధాకరం సంస్కృత భాషలో వెలసిన కొన్ని ప్రఖ్యాత గ్రంథాలు. ఇదే విధంగా కాళిదాసు వ్రాసిన మూడు నాటకాలపైన కాటయవేమ రచించిన వ్యాఖ్యానం, పెదకోమటివేమ రచించిన సాహిత్య రత్నాకరం, సంగీత రత్నాకరం, సర్వజ్ఞసింగ భూపాలుడు వ్రాసిన రసార్ణవసుధాకరం పట్ల సాహిత్య విద్యార్థులకు యెనలేని గౌరవము వుంది.

దక్షిణ భారతంలో

ఆంధ్ర ప్రజలు స్వరాష్ట్ర చరిత్రలోనేగాక పొరుగు ప్రాంతాల చరిత్రలో కూడా ప్రముఖ పాత్ర వహించారు. హరిహరబుక్కరాయలు అను తెలుగు సోదరులు కర్నాటక ప్రాంతంలో విజయనగర పట్టణాన్నీ, రాజ్యాన్నీ స్థాపించారు. ఈ రాజ్యం నాలుగు శతాబ్దాలవరకు వర్ధిల్లింది. దక్షిణ భారతదేశ చరిత్రలో ఈ కాలం బహుముఖాలుగా ప్రసిద్ధి చెందినది. ఈ కాలంలో అనేకమంది ఆంధ్ర కవులు, పండితులు, సేనానాయకులు తమిళ ప్రాంతానికి వలసపోయి అక్కడ స్థిరపడిపోయారు. విజయనగర సామ్రాజ్య కీర్తి ప్రతిష్ఠలు అత్యున్నత స్థాయిలోవున్నప్పుడు తెలుగు నాయకులు అనేక దక్షిణ రాష్ట్రాలలో గవర్నర్లుగా వుండినారు. ఈ రాజ్యం పతనావస్థలోవున్నప్పుడు, రక్కాస్తగడ్డియుద్ధం తరువాత ఈ గవర్నర్లు ఆయా రాష్ట్రాలలో స్వతంత్ర రాజులైనారు. ఈ విధంగా తంజావూరు, మధుర, పుదుక్కోట, గింజా మున్నగు రాజ్యాలు క్రొత్తగా తలెత్తినాయి. వీటిని అన్నిటినీ తెలుగు రాజులే పరిపాలించారు. వీరు విజయనగర సామ్రాజ్య సంప్రదాయాలను అనుసరించి విద్యనూ లలిత కళలనూ పోషించారు. తంజావూరు రాజులైన రఘునాథ నాయకులు, విజయరాఘవులు, మధురరాజైన విజయరంగ చొక్కనాథుడు, పుదుక్కోటరాజైన రాజరఘునాథుడు ప్రసిద్ధ రచయితలుగా ఖ్యాతిగాంచినారు. త్యాగరాజు, పల్లవిగోపాలయ్య, దేవుడయ్య, దక్షిణామూర్తి శాస్త్రి ఇక్కడ స్థిరపడిపోయిన గొప్ప సంగీత విద్వాంసులు.

విశాల భారతావని

అనేక శతాబ్దాలవరకు భారత దేశం సువిశాల సాంస్కృతిక సామ్రాజ్య కేంద్రంగా విలసిల్లింది. అనేక మంది భారతీయ వణిక ప్రముఖులు, పండితులు సముద్రాంతర ఖండాలకు వలస వెళ్ళి అక్కడ స్థిరపడి పోయారు. అక్కడ అనేక హిందూ రాజ్యములు స్థాపించబడ్డాయి. హైందవ సంస్కృతి అక్కడికి కొనిపోబడింది. ఖండాంతర దేశాలలో హైందవ సంస్కృతి వ్యాప్తికి ఆంధ్రులు ముఖ్యపాత్ర వహించారు. ఆగ్నేయ ఆసియా దేశాలలో, అమరావతి, విజయపురి, సింహపురం, కళింగవంటి స్థలాల పేర్లు ఆంధ్ర దేశంలోని అనేక ప్రాంతాలను స్ఫురింప చేస్తాయి. ఈ దేశాలలో క్రీ. శ. ఆరంభ కాలంలో తెలుగు లిపిలో శకనామ సంవత్సర తేదీలు గల శాసనాలు కనుగొన బడ్డాయి. అమరావతి సాంప్రదాయంలో శిల్పకళా ఖండాలు, ఆంధ్ర తీరప్రాంతంలోని విగ్రహాలను పోలినట్టి కంచు విగ్రహాలు కూడా ఈ దేశాలలో అనేక చోట్లనుంచి లభించాయి.

(ఆంగ్ల వ్యాసానికి అనువాదం)

బాగా చదువుకుంటే...?

—వాసిరాజు ప్రకాశం

బాలానందం

[ఆంధ్రప్రదేశ్ పాఠక లోకానికి నూతనంగా పరిచయం చేయబడుతున్న శీర్షికలలో ఈ "బాలానందం" ఒకటి. విద్యార్థులు, తదితరులైన బాలబాలికల అభ్యుదయ విషయాలతోకూడిన చిన్నచిన్న వ్యాసాలకు విజ్ఞాన వినోదాత్మకాలైన కథలకు, పాటలకు, పద్యాలకు, దీనిలో స్థానం లభిస్తుంది — ఎడిటర్]


తమ్ముళ్ళూ! చెల్లాయిలూ!

మనలో చాలా మందికి పరీక్షలయిపోయాయి. కొంత మందికి చిన్నక్లాసుల వాళ్ళకు ఇంకా జరుగుతున్నాయి. పరీక్షలు వ్రాసినవాళ్లు, వ్రాస్తున్నవాళ్లు మనమందరమూ యీ సంవత్సరం అంతా బళ్లోకివెళ్లాం.మనలో కొందరు ఎంతో బాగా చదివారు. కొందరు ఒక మోస్తరుగా చదివారు. కొందరసలు చదవనేలేదు. అసలు చదవనివాళ్ళు వట్టి బడుద్ధాయిలని మన పెద్ద వాళ్ళు అంటూవుంటారని మీకూ తెలుసుగదూ! ఏమయినా, పరీక్షలు అయిపోయాక ఫలితాలకోసం మనం ఎదురు చూస్తుంటాం. మనకంటె ఎక్కువ ఆత్రుతగా ఎదురు చూచేవారున్నారు. ఎవరో తెలుసా?...మన అమ్మా, నాన్నా, అన్నలు, అక్కలు, ఇంకా మన క్షేమాన్ని, అభివృద్ధిని కోరేవారు.

"నేను తప్పకుండా ప్యాసవుతాను," అని గట్టిగా గుండెనిబ్బరంతో ధైర్యంగా కొందరుంటే. "తప్పానన్నవార్త ఎప్పుడు చెవిన పడుతుందా?- అమ్మా, నాన్నాఏమంటారా" అన్నభయంతో బిక్కుబిక్కు మంటూ వుంటారు కొందరు. పరీక్ష తప్పడంఅంటే అది మామూలు నష్టం మాత్రమేకాదు. నలుగురిలోను, ఇంటా-బయటా, చుట్టాల్లోను, స్నేహితుల్లోను ఒకవిధమైన చిన్నతనాన్ని కలిగిస్తుంది. బాగా చదువుకోకపోతే 'మావాడు బాగా చదువుకోలేదన్న' బాధ తల్లిదండ్రులకూ వుంటుంది. 'ఫలానా వాళ్ళబ్బాయి బాగాచదవడన్న' మాటా వస్తుంది. నలుగురు ప్యాసయిన కుర్రాళ్ళలో ఒక తప్పిన కుర్రాడువుండాలంటే ఎంతో సిగ్గుగానూ, బాధగానూ వుంటుంది. అంతవరకూ కళకళలాడుతూవుండే మొహం పరీక్ష తప్పామన్న వార్త తెలియగానే 'ఏదో తప్పు చేసినట్లుగా' తేలుకుట్టిన దొంగలాగా మొహం ముడుచుకపోతుంది. వీటన్నింటికిమించి మనకు కలిగే పెద్దనష్టం ఒక సంవత్సరం వృథా కావటం. చదివిన తరగతే, మళ్ళీచదవాలీ అంటే ఒక సంవత్సరంలో పూర్తికావలసినపనికి రెండు సంవత్సరాలు 'టైం' తీసికొంటున్నామన్న మాట. ఎంతో ఉన్నత విద్యావంతులమై, భావిభారత భాగ్యవిధాతలంగా తేజరిల్లటానికి ఎంతో శ్రమ పడాలి; కాలమూ పడుతుంది. శ్రద్ధగాచదవకుండా, సంవత్సరాలు గడుపుతూపోతే మనం అభివృద్ధికి రావటానికి పట్టవలసిన దాని కంటే రెట్టింపు కాలం పడుతుంది. అమూల్యమైన యీ కాలాన్ని మనం వినియోగించుకొని ఏ రోజు పాఠాలు ఆరోజే చదువుకొంటూ పరీక్షలలో ప్యాసయి 'శభాష్' అనిపించుకోవాలి. అమ్మా నాన్నలను ఆనందపరచాలి.

బాగా చదువుకునేపిల్లలకు నలుగురిలోనూ కోరకుండా ఒక గౌరవం ఏర్పడుతుంది. "ఫలానా"వారబ్బాయి ఇంత తెలివిగలవాడటమ్మా, "శ్రద్ధగా చదువుకొంటాడట," అని నలుగురి నోటా మంచి మాట వినబడుతుంది. పైకి అన్నా, అనకపోయినాలోలోపల తల్లిదండ్రులు ఎంతో మురిసిపోతారు. ఉపాధ్యాయులు కన్న బిడ్డల కంటే ఎక్కువగా ప్రేమిస్తారు. "మా స్కూలుకే పేరుతెస్తాడని" ఆశపడతారు.

మనలో అందరికీ కావలసినంత డబ్బు వుండదు. అందరితోపాటు పేద బాలలుకూడా చదువుకోవలసిన అవసరం వుంటుంది. అలాంటి నిరుపేదలైన పిల్లలు, బాగా తెలివిగలవారై- పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకుంటుంటే వారివిద్య కుంటుపడకుండా ప్రభుత్వం వారికి ఆర్థికంగా సహాయం చేస్తూంటుంది. దీనినే స్కాలర్‌షిప్పు



అంటారు. మనరాష్ట్రప్రభుత్వమూ, ఢిల్లీలో వుండి అన్ని రాష్ట్రాల మీద అధికారం చలాయించే కేంద్ర ప్రభుత్వమూ యీ స్కాలర్‌షిప్పులను ఇస్తుంది.

మనలో ధనవంతుల పిల్లలయితే ఎలాగూ చదువుకొంటారు. ఇక ఇబ్బంది పడేదల్లా పేదపిల్లలే. పగలల్లా ఏకూలీ పని చేసుకొనే వారో, రిక్షా లాక్కొని బతికేవారో సామాన్య పేదకుటుంబీకులు వారి వారి పిల్లలను చదివించుకొనడం కష్టం. డబ్బులేని కారణంగా ప్రతిభా వంతులైన విద్యార్థులు చదువు మానుకోరాదనే వుద్దేశ్యంతో ప్రభుత్వంవీరికి **సహాయంచేస్తున్నది.**

అయితే యీ స్కాలర్‌షిప్పులు పొందే వారు ఎలాంటివారైతే పొందుతారు? పాఠాలు సక్రమంగా చదువుకొని క్లాసులో అందరి కన్నా ఎక్కువమార్కులు తెచ్చుకుంటూ **వుండాలి.** క్లాసులో అల్లరిచెయ్యడం గిల్లి కజ్జాలు పెట్టుకోవటం, బడి ఎగవెయ్యడం ఇలాంటి వేవీ చెయ్యకూడదు.

"స్కాలర్‌షిప్పులు" కావలసినవారు బడిలో హెడ్‌మాష్టరు గారు చెప్పిన తేదీ లోగా దరఖాస్తులు పంపుకోవాలి. ఆ దరఖాస్తులతోబాటే మనకు పరీక్షలలోవచ్చిన మార్కులపట్టికను కూడా జతచేసి పంపాలి. అదేచాలదు. మన నాన్నగారికో సంరక్షకునికో వచ్చే ఆదాయంకూడా ఆ దరఖాస్తులో వ్రాయాలి. మనంవ్రాసిన వివరం నిజమేనవి ప్రభుత్వానికి తెలిపేందుకు, ఒక పెద్ద ఉద్యోగి అంటే తహసీల్దారు లాంటి వారు ఇచ్చిన ఒక సర్టిఫికేటుపంపాలి.

మనకు డబ్బు మంజూరు చేసేటప్పుడు ప్రభుత్వం ప్రధానంగా మనంతెలివిగలవారం ఔనా?- కాదా?- అని పరిశీలిస్తుంది. ఈవిషయాన్ని తెలిపేందుకు మనకు పరీక్షల్లో వచ్చేమార్కులే ప్రత్యక్ష నిదర్శనం. అందువల్ల అందరికంటె ఎక్కువ మార్కులు వచ్చినవారికే యీ "స్కాలర్ షిప్పు"లు ఇస్తారు.

దీనికితోడు ఆర్థికంగా వెనుకబడిన వారికి-అంటే డబ్బు కావలసినంతలేనివారికి-కూడా ప్రభుత్వం సహాయం చేస్తుంది. మన దరఖాస్తులలో మన ఆదాయం కూడా వ్రాస్తాం కాబట్టి దానిని కూడా ప్రభుత్వంపరిశీలిస్తుంది. తెలివిగలవారై వుండి, చదువుకోటానికిడబ్బు లేనివారికే వీటిని ఇస్తారు.

ఆదివారమొస్తే!

ఆదివారమొస్తే; నాకు
ఆట విడుపుగదా బడికి!

ఆదివారమొస్తే; నాన్న
కాఫీసుకు సెలవు గదా!

ఆదివారమొస్తే; జాబు
లందజేయ బోరుగదా!

ఆదివారమొస్తే; వీధి
అంగడులే బందు గదా!

ఆదివారమొస్తే; సెలవు
అమ్మకేల లేక పోయె?

— అలపర్తి వెంకటసుబ్బారావు

భారత ప్రభుత్వం కూడా మరికొన్ని స్కాలర్‌షిప్పులనుఇస్తుంది. వాటిని కూడా హైదరాబాదులోవుండే విద్యాశాఖాడైరెక్టరు గారే పంపిణీచేస్తారు. ఎందుకంటే ఎవరి రాష్ట్రంలోని బాలలగురించి ఆ రాష్ట్రం అధికారికే తెలుస్తుందిగనుక.

ఈ ఉపకారవేతనాలు ఒక్క ప్రాథమిక మాధ్యమిక, సెకండరీ పాఠశాలల్లోనే కాదు, కళాశాలల్లోను చదివేవారికి ఇస్తుంటారు. ఎందుకంటే మనలో వుండే ప్రతిభకు మన వయస్సుతోనూ, మనం చదివేచదువుతోనూ సంబంధంవుండదుగా.

మరోవిషయం. మనలో చాలా మంది పబ్లిక్‌స్కూలు పేరు వినేవుంటారు. ముఖ్యంగా హైదరాబాదు, సికింద్రాబాదులో వుండేవారికయితే యీ పాఠశాలను గురించి బాగాతెలిసేవుంటుంది. దేశం మొత్తంలో ఇలాంటివిచాలా తక్కువగా వుంటాయి. అక్కడి విద్యావిధానం, క్రమ శిక్షణ చాలా గొప్పగావుంటాయి. అందువల్ల అక్కడ చదువుకునే ప్రతిభావంతులైన బాలలకోసం కొన్ని స్కాలర్‌షిప్పులు, ప్రత్యేకించబడ్డాయి. ప్రతిభ చురుకుదనంలేనిదే యీ స్కాలర్‌షిప్పును పొందడం సాధ్యంకాదు. మనలో ఎంతవరకు యీ యోగ్యతలు వున్నాయో తెలిసికొనేందుకు అధికారులు పరీక్షలుపెట్టి, ఆ తరువాతనే అర్హులను అనర్హులను నిర్ణయిస్తారు.

1962-63 విద్యా సంవత్సరంనుంచి యీ స్కాలర్‌షిప్పులసంఖ్యను అధికం చేయవలసిందని రాష్ట్రప్రభుత్వ విద్యాశాఖ డైరెక్టరు ప్రభుత్వానికి సూచించారు. ప్రతిభా వంతులైన విద్యార్థులు, ఉన్నతవిద్యల నభ్యసించే అవకాశం కోల్పోరాదన్న భావంతోనే యీ సూచనచేయబడింది. 1962 సెప్టెంబరు 12న ప్రభుత్వం యీ సిఫారసులను ఆమోదించిందికూడా. 1962-63 సంవత్సరానికిగాను రు. 85,755 లను మంజూరుచేయటంకూడా జరిగింది.

వీటిలో: ప్రీయూనివర్సిటీ తరగతివారికి 85; డిగ్రీతరగతులు మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం, మూడవ సంవత్సరం చదివేవారికి నలభైయ్యేసి వంతున; పోస్టు గ్రాడ్యేటు, ఆనర్సు తరగతులు చివరి సంవత్సరం 30 మంది విద్యార్థులకు ఆంధ్ర ప్రాంతంలో మంజూరు చేస్తున్నారు.

ఇక తెలంగాణా ప్రాంతంలో: 'ఆర్ట్' అంశాలతో ప్రీయూనివర్సిటీ చదువుతున్న ఇరవైమందికి, డిగ్రీ తరగతులు, మొదటి, రెండు, మూడు సంవత్సరాలలో చదువుతున్న పదిహేనేసి మందికి, పోస్టు గ్రాడ్యేటు తరగతుల్లో చదువుతున్న మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం విద్యార్థులకు మూడు, మూడు వంతున ఉపకారవేతనాలను యిస్తున్నారు.

తెలంగాణా ప్రాంతంలోనే వృత్తికి సంబంధించిన అంశాలు-అంటే వైద్యం, ఇంజనీరింగ్ మొదలైనవి చదివే వారికి:- ప్రీ ప్రొఫెషనల్ విద్యార్థులకు పది, ప్రొఫెషనల్, మొదటి, రెండవ, మూడవ సంవత్సరాలు చదివేవారికి పది, పదివంతున, నాలుగవ సంవత్సరం అభ్యసించే వారికి అయిదు, ఐదవ సంవత్సరంలో వైద్య విద్య నభ్యసించే వారికి అయిదు కేటాయించటం జరిగింది. ఇవిగాక డిప్లొమా కోర్సులలో చదివే మరోపదిహేను మందికి యీఉపకార వేతనాలను యిస్తున్నారు.

ఇక హైస్కూలులో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనాలను గురించి చెప్పుకొందాం. ఆంధ్ర ప్రాంతంలో 1962-63 విద్యా సంవత్సరంలో 246 ఉపకారవేతనాలు బాలురకు, 62 బాలికలకు ఇచ్చారు. ఉన్నత పాఠశాల, బహుళార్థ సాధకపాఠశాల, హయ్యర్ సెకండరీపాఠశాల-వీటిల్లో దేనిలో చదువుతున్నా యీ స్కాలర్‌షిప్పులకు అర్హులే. ఎనిమిదో తరగతివరకూ ఉచిత విద్యావిధానం అమలులో వున్నదిగనుక, ఆ తరగతి లోపు వారికి ఇవి వర్తించవు. 9, 10, 11 తరగతులలో చదువుతూ యీ సౌకర్యంపొందిన బాలలకు నెలకు ఎనిమిది రూపాయలవంతునతొమ్మిది నెలల (జులై నుంచి మార్చి వరకు) పాటు యిచ్చారు.

మగపిల్లలకు ఇచ్చే ఉపకార వేతనాలను యీక్రిందివిధంగా విభజించారు. శ్రీకాకుళం విద్యాప్రాంతానికి 12, విజయనగరం 10, విశాఖపట్టణం 12, రాజమండ్రి 19, కాకినాడ 19, ఏలూరు (పశ్చిమ గోదావరి) 12, తణుకు 12, కృష్ణా (తూర్పు) 13,



కృష్ణా (పశ్చిమ) 13, గుంటూరు 13, బాపట్ల 12, నరసరావుపేట 12, నెల్లూరు 12, కనిగిరి 12, చిత్తూరు 13, కర్నూలు 13, ఆదోని 13, కడప 12, అనంతపురం 12.

బాలికలకు ఇస్తున్న 62 ఉపకార వేతనాల్లో రాజమండ్రిప్రాంతానికి 17, గుంటూరు ప్రాంతానికి 26. నెల్లూరు ప్రాంతానికి 19 కేటాయించారు.

బాలురకు జిల్లా విద్యాశాఖాధికారి, బాలికలకు పాఠశాలలను పర్యవేక్షణ చేసే అధికారిణి యీ ఉపకార వేతనాలనిస్తారు. హైస్కూలు తరగతుల్లో చదువుతూ, వీటి కోసం దరఖాస్తులు పంపేవారి వయస్సు 1[illegible] మించివుండరాదు. వెనుకబడిన కులాల వారైతే 16 లోపునే వుండాలి. ఒరియా, ముస్లింతెగలకుచెందినవారు 17 సంవత్సరాల వయస్సుకలిగివుండవచ్చు. బాలికల విషయంలో కూడా ఎలాంటి స్థితిలోనూ 1[illegible] సంవత్సరాలకు మించివుండరాదు. ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులద్వారా యీ దరఖాస్తులను పంపుకోవాలి.

కళాశాలల్లో చదువుతూ యీ ఉపకార వేతనాలకు దరఖాస్తు పెట్టుకొనేవారికి సహజంగా, 18 సంవత్సరాల లోపు వుండాలి. వెనుకబడినకులాలవారైతే 19 సంవత్సరాల వయస్సుకలిగి వుండవచ్చు. ఒరియా వారు, బాలికలకు 20 సంవత్సరాలవరకు అవకాశం వుంది.

ఇవిగాక ప్రాథమిక, సెకండరీ పాఠశాలలో 6,7,8 తరగతుల్లో చదివే బాలికలకు ప్రత్యేకంగా యీ స్కాలర్ షిప్పుల నిస్తున్నారు. నెలకు ఆరవ తరగతి వారికి రెండు రూపాయలు, ఏడవతరగతివారికి రెండున్నర, ఎనిమిదవతరగతి బాలికలకు మూడు రూపాయలవంతున ఇస్తారు. ఇవే తరగతుల్లో సెకండరీస్కూళ్లలో చదివేబాలికలకునెలకు నాలుగు రూపాయల వంతున ఇస్తారు.

విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాలలో నివసించే బాలలకోసం మరి కొన్ని స్కాలర్ షిప్పులను ప్రభుత్వం కేటాయించింది. సెకండరీ, ఎలిమెంటరీ పాఠశాలల్లో చదివే వారికై ఇవి ఉద్దేశింపబడ్డాయి. ఈ వివరాలు క్రమేణా చెప్పుకొందాం.

విద్యార్థుల అపూర్వ దేశభక్తి

మన దేశానికి స్వాతంత్ర్యం సంపాదించడానికి మనపెద్ద లెంతమంది యెన్నెన్ని విధాల కష్టాలుపడి త్యాగం చేశారో మనం పుస్తకాల్లోచదువుకున్నాం. చైనా కారణంగా మన సరిహద్దులు దురాక్రమణకు లోనై ప్రస్తుతం యేర్పడిఉన్న యీ అత్యవసర పరిస్థితిలో ఆ స్వాతంత్ర్యోద్యమ దినాలను గుర్తుకుతెస్తూ భారతదేశంలోని విద్యార్థిలోకం జాతి పిలుపు అందుకొని దృఢసంకల్పంతో సవాలును ఎదుర్కొనడానికి సన్నిద్ధమైంది. దేశంలో అన్ని ప్రాంతాలలోను విద్యార్థులు మాతృదేశ సంరక్షణకై విరాళాలు ఇచ్చారు. రక్తదానం చేశారు. రక్షణ కృషికి ఎంతో దోహదం చేశారు.

జాతీయవిద్యార్థి సైనికదళాలలో చేరవలసిందిగా భారత ప్రధాన మంత్రి విజ్ఞప్తిని పురస్కరించుకొని విద్యార్థులు ఉత్సాహంగా అధిక సంఖ్యలో చేరారు. ఈ రంగంలో జాదవ్‌పూర్ విశ్వ విద్యాలయం విద్యార్థులు ఒక ఉన్నతాదర్శం నెలకొల్పారు. ఇక్కడ మూడువేలమంది విద్యార్థులు సైనిక శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణ తరగతులకు దాదాపు అందరూ హాజరవుతున్నారు.

కేరళలో జాతీయవిద్యార్థి సైనికదళాలలో సభ్యులసంఖ్య నూరు శాతం పెంచడానికి చర్యలుతీసుకొన్నారు. ఇందుకుఅనుగుణంగా ఆవసరమైన సౌకర్యాలు కల్పించారు. కేరళ విశ్వవిద్యాలయం జాతీయ విద్యార్థి సైనిక శిక్షణను మగపిల్లలకు నిర్బంధం చేసింది. జాతీయ రక్షణకృషికి దోహదం చేయడానికి విద్యార్థినులకు కూడా జాతీయవిద్యార్థి సైనిక శిక్షణ, లేదా అటువంటి మరొక విధమైన శిక్షణఇవ్వడానికి నిశ్చయించారు.

ప్రత్యేక సదుపాయాలు

విద్యార్థులు మిలిటరీసర్వీసులో చేరడానికి వరసగా అనేక సదుపాయాలు కల్పించడంలో పంజాబ్ విశ్వవిద్యాలయం మార్గదర్శకత్వం వహించింది. సర్వీసులో చేరినందువల్ల చదువుకు ఆటంకం కలిగినవిద్యార్థులకు వారు పరీక్షలకు హాజరు కాకుండానే ఒక ప్రత్యేకసంఘం సిఫార్సుపై డిగ్రీలు ఇవ్వబడతాయి.

ప్రయివేటుగా పరీక్షకు హాజరు కావలసి ఉండి సర్వీసులో చేరినందువలన పరీక్షకు రాని పీ్రియూనివర్సిటీ తరగతి విద్యార్థులకు పరీక్షరుసుము వాపసుఇవ్వబడుతుంది.

బహుమతిసొమ్ము జాతీయ రక్షణనిధికి విరాళం

జాతీయ రక్షణనిధికి విరాళాలు ఇవ్వడంలో విద్యార్థులు ఎవరికీ వెనుకబడలేదు. వక్రమ్ విశ్వ విద్యాలయాకి చెందిన 5,600 మంది విద్యార్థులు డిగ్రీలు పుచ్చుకోడానికి స్నాతకోత్సవానికి హాజరు కాకుండా ఉండి అలా ఆదాచేసిన సొమ్ము రక్షణనిధికి విరాళంగా ఇచ్చారు.

ఢిల్లీకి చెందిన మోడరన్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ రక్షణ నిధికి రూ. 30,000లు విరాళం పోగుచేశారు. ఈ సంవత్సరంలో ఈ పాఠశాలలో బహుమతులు గెలుచుకొన్న విద్యార్థులందరూ ఆ బహుమతి సొమ్ము రక్షణనిధికి విరాళంగా ఇచ్చారు. ఈ పాఠశాల నుంచి అత్యవసర పరిస్థితి అంతమయ్యేదాకా రక్షణనిధికి ప్రతి నెలా వెయ్యిరూపాయలు విరాళంఇవ్వడానికి నిర్ణయించ బడింది.

కేరళలో కన్ననుర్‌లోని ఒక పాఠశాలకు చెందిన పిల్లలు సొంత ఖర్చుకోసం తమకిచ్చిన డబ్బులోనుంచి రక్షణనిధికోసం రోజుకు ఒక్కనయాపైస ఆదా చెయ్యాలనే ఉద్యమం క్రమంగా మంచివ్యాప్తిలోకి వస్తున్నది.

మధ్య ప్రదేశ్‌లో ఘట్కా గ్రామంలో ఒక ప్రాథమిక పాఠశాలకు చెందిన పిల్లలు ఒక ఆదివారంనాడు వరి పొలాలలో పనిచేసి సంపాదించిన రూ. 27 ల మొత్తం జవాన్ల సంక్షేమం నిమిత్తం సరాసరి "నెహ్రూ తాతకు" పంపారు.

అహమ్మదాబాదులోని ఆంధ్రుల కేంద్రంలోని విద్యార్థులు ఒకపూట భోజనం మానేసి తన్మూలంగా ఆదా అయిన సొమ్ము రక్షణ నిధికి ఇవ్వాలని నిర్ణయించారు. అంధ విద్యార్థులు రక్తదానం చేయడానికి కూడా నిర్ణయించారు.

బాలుని విరాళం

మనేశ్వర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న 12 సంవత్సరాల భాగ్‌మల్ అనే బాలుడు ఒక రోజల్లా ఒక కంట్రాక్టరు క్రింద కూలీగా రాళ్ళుపగలగొట్టి ఒకరూపాయి కూలిసంపాదించి ఆసొమ్ము జాతీయరక్షణనిధికి విరాళం ఇచ్చాడు. అక్కడికీ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాతీయ రక్షణనిధికి విరాళాలు కేవలం స్వచ్ఛంద పద్ధతిలో సేకరించడం జరుగుతున్నదని ఇందులో నిర్బంధ మేమీ లేదని భాగ్‌మల్‌కు తెలియచెప్పారు. అయినప్పటికీ కూడా భాగ్మల్ విరాళం ఇవ్వడంలో తానెవరికీ వెనకబడ కూడదని నిశ్చయించుకున్నాడు. అందువల్లనే అతను ఒక

రోజు అంతాకూడా రాళ్ళుపగులగొట్టి కూలి సంపాదించి అది జాతీయ రక్షణనిధికి విరాళం ఇచ్చాడు.

న్యూఢిల్లీలోని 15 కళాశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు ఇప్పుడు యమున బల్లకట్టు వంతెన నిర్మాణంలో కూలీలుగా పనిచేశారు.

దేశంలో వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు సభ్యులుగావున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు రక్షణ కృషికి విద్యార్థులమద్దతు సమీకరించడానికిగల అవకాశాలనుగురించి పరిశీలించడానికి ఢిల్లీలో రెండు రోజుల పాటు ఒక సమావేశం జరిపింది.

భాగల్‌పూర్‌లోని డి. ఎన్. జె. కళాశాల సిబ్బంది, విద్యార్థులు జాతీయ రక్షణ నిధికి 1962 అక్టోబర్‌నుంచే విరాళాలిస్తూ వచ్చారు. 1962 సంవత్సరం ఆఖరుకు ఈ విరాళాలమొత్తం 11,356 రూపాయల 17 న. పై. వరకు ఉన్నది. ఇందులో 2909 రూపాయల 17 న.పై.లు కళాశాలసిబ్బంది మిగతా 8448 రూపాయలు విద్యార్థులు విరాళంగా ఇచ్చారు.

కిరోఢీమార్ కళాశాలకుచెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ రక్షణ నిధికి 10,000 రూపాయలు విరాళం సేకరించారు. ఉపరాష్ట్రపతి డాక్టర్ జాకిర్ హుస్సేన్ ఈ కళాశాలను దర్శింపవచ్చినప్పుడు ఈసొమ్ము మొత్తం ఆయనకు అందజేయబడింది.

వారానికి ఒకపూట ఉపవాసం

కురుక్షేత్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఉపాధ్యాయినులు, విద్యార్థినులు జవాన్ల కొరకు ఉన్నిదుస్తులు కుట్టడానికి ముందుకు వచ్చారు. ఇప్పటికే తయారైన ఉన్నిదుస్తులు మొదటిదఫాగా జవాన్లకు పంపబడినాయి.

రక్షణనిధికి విరాళం నిమిత్తం వారానికి ఒకపూట ఉపవాసం చేయాలని కురుక్షేత్ర విశ్వవిద్యాలయంహాస్టళ్ళలోఉండేవిద్యార్థులు ప్రారంభించిన ఒక ఉద్యమంలో విద్యార్థినులు మార్గదర్శకత్వం వహించారు. ఈ విధంగా రూ. 268 ల మొత్తం జాతీయ రక్షణనిధికి విరాళంగా అందజేయబడింది.

మధ్యప్రదేశ్‌కుచెందిన "ఇందూ" అనే ఒక 19 సంవత్సరాల బాలిక బూట్లకు పాలిష్‌చేసి రూ. 12 లు సంపాదించి ఆ సొమ్ము రక్షణనిధికి విరాళంఇచ్చింది.

దేశంలోఅన్ని ప్రాంతాలలోను విద్యార్థినులు నర్సింగ్‌పని,కుట్టుపనిప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో వారు సైనిక కేంద్రాలలో కాంటీన్ల మేనేజిమెంటు భారం నిర్వహిస్తున్నారు.

జాతికిఏర్పడిన ప్రమాదాన్నిగుర్తించి ఈనాడు యావత్తు విద్యార్థిలోకం ఈ తమ విద్యుక్తధర్మాలను, బాధ్యతలను బాగాతెలుసుకొని దేశ రక్షణ కృషిలో ముందంజ వేస్తున్నది. మరి యీ వేసవి సెలవుల్లో మీరంతా కూడా కాలం వృధాపుచ్చక యేదో ఒక విధంగా దేశరక్షణకై క్రమశిక్షణతోకృషిచేసి భరతమాత అల్లారు ముద్దుబిడ్డలనిపించుకో వద్దూ! మాతృదేవి ఋణం కొంతైనా తీర్చుకొని, నలుగురిలోనూ సెహబాష్ అనిపించుకుంటారుగదూ! ★

రచయితలు

డా॥ నీలం సంజీవరెడ్డి, ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైద్రాబాద్.

శ్రీ దీపక్ గంగోపాధ్యాయ, ఒక భారత సైనికాధికారి.

శ్రీమతి డి. మంజులత, నారాయణగూడా, హైద్రాబాద్.

శ్రీ ఆవుల సాంబశివరావు,అడ్వకేట్,హిమాయత్‌నగర్,హైద్రాబాద్

శ్రీ కె. వి. యన్. అప్పారావు (ఆత్మారామ్), యం. ఏ. కొవ్వూరు ; పశ్చిమ గోదావరి జిల్లా.

"అమరేంద్ర" శ్రీ సి. నరసింహశాస్త్రి, గుంటూరు.

శ్రీ పి. వి. నరసింహారావు, న్యాయ, సమాచార శాఖలమంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైద్రాబాద్.

శ్రీ ఆలపాటి వెంకటరామయ్య, మునిసిపల్ పరిపాలనాశాఖామంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైద్రాబాద్.

శ్రీ కె. వి. భాస్కరరావు, పి. ఆర్. ఒ. సమాచార పౌర సంబంధాలశాఖ, హైద్రాబాద్.

శ్రీ యామిజాల పద్మనాభస్వామి, టి. నగర్, మద్రాసు-17

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు, C/o చందమామ, మద్రాసు-26.

శ్రీ బలివాడ కాంతారావు, అసిస్టెంట్ ఆర్మమెంట్ ఆఫీసర్, నావల్ ఆర్మమెంట్ డిపోట్, బొంబాయి-73

శ్రీ సోమసుందర్, సామర్లకోట.

శ్రీ పాతకోట రాధాకృష్ణమూర్తి, తెలుగు పండిట్, విజయవాడ.

శ్రీ సి. సుబ్రహ్మణ్యం, కేంద్ర భారీ పరిశ్రమలమంత్రి, న్యూఢిల్లీ.

శ్రీ ఇక్రాం జావీద్, హరీబౌలీ, హైదరాబాద్.

శ్రీ దాశరథి, ఆల్‌యిండియా రేడియో, హైద్రాబాద్, ఆం. ప్ర.

శ్రీ జూలూరి హనుమంతరావు, 518/SRT, సనత్‌నగర్, హైద్రాబాద్-18.

శ్రీ తూమాటి దొణప్ప, ఆంధ్ర యూనివర్సిటీ-వాల్తేరు.

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్, 14.అశోకారోడ్, న్యూఢిల్లీ.

శ్రీమతి ఆవుల జయప్రదాదేవి. C/o శ్రీ ఆవుల సాంబశివరావు, అడ్వకేట్, హిమాయత్ నగర్, హైద్రాబాద్.

శ్రీ మారేమండ రామారావు, హిస్టరీ ప్రొఫెసర్, యస్. వి. యూనివర్సిటీ, తిరుపతి, చిత్తూరు జిల్లా.

శ్రీ వాసిరాజు ప్రకాశం, చిక్కడపల్లి, హైద్రాబాద్.

శ్రీ అలపర్తి వెంకట సుబ్బారావు, అంగలకుదురు (పోస్టు) తెనాలి తాలూకా, గుంటూరు జిల్లా.

★

అత్యావసర బడ్జెటు

1963 ఫిబ్రవరి 28వ తేదీన లోకసభకు కేంద్ర బడ్జెటును సమర్పిస్తూ ఆర్థిక మంత్రి ప్రకటించినట్టుగా 1963-64 వ ఆర్థిక సంవత్సరం బడ్జెటులోని దాదాపు సగం మొత్తాన్ని-రు. 867 కోట్లు రక్షణకై కేటాయించడం జరిగింది.

ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయం దాదాపు రు. 1585.73 కోట్లు ఉండగా ఖర్చు రు. 1852.40 కోట్లు.

ప్రస్తుతం ఉన్న పన్నుల స్థాయిలో యీ సంవత్సరం మొత్తంబడ్జెటు పరిస్థితిలో రు. 266.67 కోట్ల రెవిన్యూలోటుఉంటుంది. కేవలం రక్షణఖర్చు ఎక్కువయిన ఫలితంగా బడ్జెటుమొత్తంలో రు. 454. కోట్లబడ్జెటు లోటుఉంటుంది. "ఆర్థికలోటును సరిపుచ్చని కారణంగా ఏర్పడే ఆర్థిక మాంద్యానికి దేశం లోనుకాకుండా ఉండాలంటే'' యీ లోటును భర్తీచేయకుండా ఉండలేము.

అభివృద్ధికీ, రక్షణకై యీ సంవత్సరం రు. 305.90 కోట్ల ఎక్కువ మొత్తాన్ని రాబట్టాల్సిఉందని కేంద్ర మంత్రి అన్నారు. కస్టమ్సుపన్నులద్వారా రు. 87.39 కోట్లు, నిర్బంధపొదుపుతోసహా ప్రత్యక్షపన్నులవల్ల రు. 110.40 కోట్లు, అంతర్రాష్ట్రీయ అమ్మకం పన్నుల ద్వారా రు. 108.11 కోట్లు రాబట్టవచ్చునని ఆయన ఆశిస్తున్నారు. ట్రెజరీబిల్లుల విస్తరణద్వారామిగతాలోటును భర్తీచేయవచ్చు.

అనేక నిత్యావసరవస్తువులపైన పన్నులు వేయడం జరిగింది. తంతి తపాలారేట్లు పెరిగాయి. క్రొత్త పన్నుల ప్రతిపాదనతో పాటు వ్యక్తులు, కంపెనీలు నిర్బంధంగా పొదుపుచేయాల్సినపథకాన్ని ప్రవేశపెట్టారు.

పన్నుల ప్రతిపాదనలోని అంశాలను దిగువఇవ్వడం జరిగింది.

ఖనిజతైలం, యంత్రాలు, ఉక్కు, ఇనుముఉత్పత్తులు, ముడి ప్రత్తి, రబ్బరు ఇతర ఉపకరణాలు, మోటారు బండ్ల విడి భాగాలు మొదలైన అనేకవస్తువులపై దిగుమతి సుంకాలనుపెంచడం జరుగుతుంది.

పెట్రోలియం ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీని తదనుగుణంగా దిగుమతి సుంకాన్ని పెంచుతారు.

అతి చవుకసిగరెట్లపై వేయికి రు. 0-70 న. పైసలచొప్పున, విలువైన రకాలపై వేయికి రు. 8.70 చొప్పున వివిధ మొత్తాలలో గ్రేడెడ్ స్కేల్‌పై సిగరెట్లపై సుంకాలను అధికంచేస్తారు.

వ్యక్తుల అసోసియేషన్స్, రిజిస్టరు కాని ఫర్మలు, హిందూ అవిభక్త కుటుంబాలు, వ్యక్తులపై ఆదాయంపన్ను తర్వాత ఉండే ఆదాయాలపై 4 శాతం నుంచి 10 శాతం వరకు అదనపు సర్చార్జీలను వేయడంజరుగుతుంది.

ఆదాయంపన్ను చెల్లించే రిజిస్టరయిన ఫర్మలపై 20 శాతం సర్చార్జీ వేయడం జరుగుతుంది.

ప్రస్తుతంఉన్న ఆదాయం పన్ను సర్చార్జి ప్రత్యేకసర్చార్జీల విషయంలో కొన్ని హిందూ అవిభక్త కుటుంబాలకు ఉన్న రు. 15000 పరిమతి మినహాయింపు వ్యక్తులు, రిజిస్టరు కాని ఫర్మలు, మొదలైన వాటికి ఉన్న రు. 7,500 ల పరిమితి మినహాయింపులను రద్దుచేయడం జరుగుతుంది.

ఆదాయంపన్ను, సూపర్ పన్నులను చెల్లించినతర్వాత కూడా కంపెనీలఆదాయం మొత్తం పెట్టుబడి, రిజర్వులకన్నా 6 శాతం మించి ఎక్కువగా ఉంటే వాటిపై సూపర్ ప్రాఫిట్‌పన్ను విధించడం జరుగుతుంది. అయితే ఆదాయం పన్ను లెక్కవేయడంలో మొత్తం ఆదాయంనుంచి మినహాయించడానికి అనుమతించిన రిజర్వుల మొత్తాలను ఇందులో గణించడం జరగదు. అటువంటిఆదాయం 6 శాతానికి ఎక్కువగాను, పెట్టుబడికన్నా 10 శాతానికి తక్కువగానూఉంటే 50శాతం పన్నురేటు, 10 శాతానికి ఎక్కువగా ఉంటే 60 శాతం పన్నురేటు ఉంటుంది. అధిక లాభార్జనను యీ పన్ను నిరుత్సాహపర్చి, ధరలను అదుపులో ఉంచుతుందని ఆశించబడుతున్నది.

ప్రస్తుతం 0-5 న.పై.ఉన్న సింగిల్ పోస్టు కార్డు ధరను 0-6 న.పై.లకూ 0-10 న.పై. రిప్లయికార్డు ధరను 0-12 న. పై.లకూ పెంచడం జరుగుతుంది.

లోకల్ పోస్టు కార్డులను రద్దుచేస్తారు. శ్యాంపిల్ ప్యాకెట్లు, పార్శిళ్ళ రేట్లనూ, రిజిస్ట్రేషన్, ఎక్నాలెడ్జ్ మొదలైన వాటి రుసుములను ఎక్కువచేస్తారు. ఇండియన్ టెలిగ్రామ్‌రేట్లనూ, గ్రీటింగ్స్ టెలిగ్రామ్ చార్జీలనూ, ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ రేట్లనూ పెంచడం జరిగింది. ★

(16 వ పేజీ తరువాయి)
రుణంగానూ, 25 శాతం సబ్సిడీగాను కేంద్రం తోడ్పడుతోంది.

రాష్ట్రంలో ఉన్న వేలాది కార్మికులకు గృహవసతిని కలిగించడానికి ప్రస్తుతం కేటాయించిన నిధులు ఎంతమాత్రం చాలవు. మున్ముందు, కేంద్ర ప్రభుత్వం యీ పథకాల క్రింద ఎక్కువ మొత్తాలను కేటాయించ గలదనే నేను ఆశిస్తున్నాను.

ఇంతవరకూ, ఈ కార్యక్రమం క్రింద నిర్మించబడిన ఇండ్ల వివరాలివి:— ఈ పథకం ప్రారంభంనుండి రెండవ ప్రణాళికా కాలం చివరివరకూ ఇందుకోసం కేటాయించబడిన డబ్బు 244.00 లక్షల రూపాయలు.

ప్రణాళికాంతం నాటికి ఖర్చుచేయబడిన సొమ్ము ... 180.00 లక్షల రూపాయలు. మూడవ ప్రణాళికలో కేటాయించిన సొమ్ము...81.00 లక్షల రూపాయలు. 1961–62 వ సంవత్సరంలో కేటాయించి నది ... 14.82 లక్షల రూపాయలు. ఈ సంవత్సరంలో ఖర్చు చేయబడినది...14.67 లక్షల రూపాయలు. 1962–63 వ సంవత్సరానికి కేటాయించిన సొమ్ము...12.18 లక్షల రూపాయలు.

మురికివాడల నిర్మూలన

ఏ నగర చరిత్రలోనైనా మాయని మచ్చల వంటివి మురికి వాడలు. పట్టణాల, నగరాల అందచందాలను మురికివాడలు మురికి చేస్తాయి. గ్రామ సీమలలో తగినన్ని పని పాటలు లేనివారు నగరాలకు గంపెడంత ఆశలతో వచ్చి, ఈ వాడల్లో నిలిచిపో తున్నారు. చాల తక్కువ ఆదాయం తెచ్చు కునే వారూ, బిచ్చగాళ్లూ, వీధిప్రక్కన చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుని అస్తుబిస్తుగా పొట్ట పోసుకునే వారూ, లాగుడు బండ్ల కార్మికులూ, రిక్షాకార్మికులూ, గుర్రపుబండ్ల డ్రైవర్లూ, ఫ్యాక్టరీ కూలీలు, వీధుల్లో పని చేసే మునిసిపల్ సిబ్బంది, మొదలయిన వారు—సాధారణంగా యీ మురికి వాడలలో నివసిస్తూ ఉంటారు. దురదృష్టవంతులయిన, ఈ నిర్భాగ్యుల మొర ఆలకించడానికి, పరాయి ప్రభుత్వానికి తీరుబాటు బొత్తిగా లేక పోయింది.

మహా భయంకరమైన యీ వాడల్లో వేలాది నిర్భాగ్యులు పురుగుల్లా లుకలుక లాడుతూ జీవిస్తున్నారు. వీరి జీవితాలు బాగుచేయవలసిన బాధ్యత అందరిమీదా ఉంది.

పట్టణాల మధ్యభాగాల్లోనూ, పరిసరాల లోనూ, ఈ మురికి వాడలు వెలుస్తుంటాయి. వీటిని తొలగించి, ఇందులోని వారికి, ఆరోగ్యకరమైన, కనీస వసతులున్న ఇండ్లు నిర్మించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పథకం క్రింద మురికి వాడలను నిర్మూలించి, ఆ యా ప్రాంతాలను అభివృద్ధి పరచడం జరుగు తున్నది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలద్వారా నిర్వహించే ఈ కార్యక్రమం, ఇలా ఉంటుంది.

పథకం అమలు చేయడానికి అయ్యే మొత్తం వ్యయంలో 37½ శాతం కేంద్ర ప్రభుత్వం అప్పుగా ఇస్తుంది. ఈ రుణాన్ని తగిన వడ్డీతో సహా 30 సంవత్సరాల వాయిదాలలో తిరిగి చెల్లించాలి.

ఇదిగాక మరో 37½ శాతం కేంద్ర ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుంది. మిగిలిన 25 శాతం ఖర్చునూ రాష్ట్రప్రభుత్వం గానీ, లేదా స్థానిక సంస్థలు గానీ, సబ్సిడీగా మంజూరు చేయాలి.

మూడవ పంచవర్ష ప్రణాళికలో, మన రాష్ట్రంలోని మురికివాడలను తొలగించి, అక్కడ అభివృద్ధి కార్యక్రమాలను అమలు జరపడం కోసం 92,00,000 రూపాయలు ప్రత్యేకింపబడ్డాయి. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు యీ పథకాన్ని అమలు జరుపు తున్నాయి.

అభివృద్ధి పరచబడిన బహిరంగ స్థలాలు, కట్టిన ఇండ్లు, ఏ ఖరీదులలో ఉండవలసిందీ, ఆ నిర్ణయాలమేరకు వాటి ఖరీదు లిలా ఉంటాయి.

1957 అక్టోబరు నుండి

1. అభివృద్ధి పరచబడిన బహిరంగ స్థలం : ఒక్కొక్క ప్లాటు. రు. 900 ల నుండి రు. 1,250 వరకూ.

2. ఒకే అంతస్థుగల ఒంటి గది ఖరీదు : రు. 3,300 లు.

3. ఒంటి గది ఇల్లు రెండంతస్థులు : రు. 3.500 లు.

1961 ఏప్రిల్ నుండి వీటి ఖరీదులు ఇలా మారాయి :

1. ప్లాటు ఖరీదు...రు. 1,400 లు.
2. ఒంటిగది ఖరీదు...రు. 3,650.
3. రెండంతస్థులున్న ఒంటి గది ఖరీదు. రు. 3,850 లు.

మురికి వాడల నిర్మూలనాకార్యక్రమం ప్రారంభించి నప్పటినుండి రెండవ ప్రణాళి కాంతం నాటికి ప్రత్యేకించబడిన సొమ్ము 102 లక్షల రూపాయలు. ఐతే రెండవ ప్రణాళికాంతం నాటికి 14.55 లక్షల రూపాయలు మాత్రమే వ్యయపరచడం అయింది.

మూడవ ప్రణాళికలో ఇందునిమిత్తం కేటాయించిన సొమ్ము 92లక్షల రూపాయలు. 1961–62 వ సంవత్సరానికి 3.80 లక్షల రూపాయలు కేటాయించగా, 2.41 లక్షలు వినియోగపరచడమయింది. ఇక 1962–63 వ సంవత్సరానికి 7.89 లక్షల రూపాయలు కేటాయించబడినవి. మురికివాడల నిర్మూలన కోసం రెండవ ప్రణాళిక ఆఖరుదాకా కేటా యించిన సొమ్ము 102 లక్షల రూపాయలన్నీ, ఇందులో ప్రణాళికాంతం నాటికి 14.55 లక్షల రూపాయలు మాత్రమే ఖర్చు చేయడం జరిగిందనీ, ఇంతకుముందు నేను మనవిచేశాను.

ఖర్చుకాగా మిగిపోయిన డబ్బు, మురిగి పోకుండా ఉండడంకోసం, శ్రీ సంజీవరెడ్డి

గారి నాయకత్వాన ఏర్పడిన నూతనప్రభుత్వం తగిన చర్యలు తీసుకున్నది. ఆ వివరాలను సంగ్రహంగా ఇక్కడ పొందుపరుస్తున్నాను.

బాగుచేయబడిన ఇండ్లస్థలాలను, వ్యక్తులకు మంజూరుచేయడం కన్నా అదే ఖరీదుతో ఒంటిగది ఇంటిని నిర్మించి ఇవ్వడంవల్ల ఎక్కువ ఉపయోగం ఉంటుందని కొత్త ప్రభుత్వం భావించింది. ఆ ఖరీదులో ఇల్లుకట్టటం సాధ్యపడదని కొందరు సందేహాలను వెలిబుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఇంజనీర్లు యీ పనిని సుసాధ్యం చేశారు. రు. 1,400 లతో ఇటుకగోడలతో, గచ్చుచేయబడిన నేలతో, సిమెంటు కప్పుతో ఒంటిగది ఇంటిని నిర్మాణం చేశాము. 1962 అక్టోబరులో వివిధ రాష్ట్రాల గృహనిర్మాణ శాఖామంత్రుల సమావేశం న్యూఢిల్లీలో జరిగినప్పుడు, రాష్ట్రప్రభుత్వం తరపున, మనం రూపొందించిన ఈ పథకాన్ని నేను, ఆ సమావేశానికి సమర్పించాను. రాష్ట్రాల గృహనిర్మాణ శాఖామాత్యులు, కేంద్ర ప్రభుత్వమూ ఆంధ్ర ప్రదేశ ప్రభుత్వం రూపొందించిన పద్ధతిని బహుధా శ్లాఘించారు. కొన్ని రాష్ట్రాలు మన పథకం యొక్క వివరాలను అడిగి పుచ్చుకొన్నాయి. మురికివాడలను బాగుచేసే కార్యక్రమం, అఖిలభారత స్థాయిలో అమలుపరచే సందర్భంలో ఆంధ్ర ప్రదేశ్ రూపొందించిన మార్గాన్నే, వివిధ రాష్ట్రాలు అనుసరించగలవని నేను ఆశిస్తున్నాను.

తక్కువరాబడి వర్గాల గృహ నిర్మాణ పథకం

దిగువ మధ్య తరగతి వర్గాలవారికోసం ప్రధానంగా యీ పథకం అమలుచేయడం జరుగుతోంది. ఒకమాదిరి ఆదాయం తెచ్చుకొంటున్న గుమాస్తాలు, ఉపాధ్యాయులు, చిన్న చిన్న వ్యాపారస్తులు, ఇతర ఉద్యోగస్తులు, ఉద్యోగేతరులు, సామాన్యరైతులు, ఈ పథకం క్రిందికి వస్తారు. సంవత్సరానికి ఆరువేల రూపాయల ఆదాయానికి తక్కువగా తెచ్చుకొన్నవారందరూ, యీ పథకం ద్వారా సహాయం పొందవచ్చును.

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వానికి, యీ కార్యక్రమాలను నిర్వహించడంకోసం దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేసింది. ఈ అప్పులను సమానమయిన 30 సాంవత్సరిక వాయిదాలలో రాష్ట్రం, కేంద్రానికి తిరిగి చెల్లిస్తుంది. ఈ అప్పుల మీద సంవత్సరానికి నాలుగున్నర శాతం వడ్డీని కేంద్రానికి చెల్లించాలి. ఈ పథకం మూడు విధాలుగా మన రాష్ట్రంలో అమలు జరుగుతోంది.

1. ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ సంస్థద్వారా,
2. మునిసిపాలిటీ రంగం ద్వారా,
3. సహకార రంగం ద్వారాను,

ప్రతి సంవత్సరమూ, ఇప్పుడు మనం చెప్పుకొన్న సంస్థలకు రాష్ట్రం నిధులను మంజూరు చేస్తూ ఉంది. మూడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో దిగువ రాబడి వర్గాలవారికి, ఇండ్లను నిర్మించడం కోసం కేటాయించబడిన మొత్తం 336.00 లక్షల రూపాయలు. ఇందులో—

1. హౌసింగ్ బోర్డుకు 1961–1966 కు 71.50 లక్షల రూపాయలు.
2. నగర పాలక సంస్థలకు 1961–66 కు 52.50 లక్షల రూపాయలు.
3. సహకారరంగానికి 1961–66 కు 212.00 లక్షల రూపాయలూ.

హౌసింగ్ బోర్డు వారు గృహాలను నిర్మించి అద్దె కొనుగోలు పద్ధతి మీద విక్రయిస్తున్నారు.

వివిధ నగరపాలక సంస్థలకు గృహనిర్మాణాల నిమిత్తం ఏటేటా రాష్ట్ర ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తూ ఉంది. తక్కువ జీతం తెచ్చుకుంటున్న మునిసిపల్ ఉద్యోగుల కోసమూ, ఆయా పట్టణాలలోని పౌరుల నిమిత్తమూ, మునిసిపాలిటీలు యీ కార్యక్రమాన్ని అమలు జరుపుతున్నాయి.

ఇందుకోసం అయ్యే మొత్తం వ్యయంలో 80 శాతం వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆయా మునిసిపాలిటీలకు అప్పుగా ఇస్తుంది. మిగిలిన 20 శాతం వ్యయాన్ని మునిసిపాలిటీలు సమకూర్చుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 80 శాతం అప్పును, సమానమయిన 25 సాంవత్సరిక వాయిదాలలో మునిసిపాలిటీ చెల్లించాలి. ఇందుకుగాను సంవత్సరానికి, ఐదు శాతం చొప్పున వడ్డీని రాష్ట్రం తీసుకుంటుంది.

సహకార రంగంలో నిర్మించబడుతున్న ఇండ్లకు, ఆయా సహకార సంఘాలు అప్పులు ఇస్తున్నాయి. ఈ సహకార సంఘాలు తమకు కావలసిన రుణాలను, సహకార సంఘాలు రిజిస్ట్రారు ద్వారా పొందుతున్నాయి.

ఈ పథకం ప్రారంభించబడినప్పనుండి రెండవ ప్రణాళిక ఆఖరుదాకా ప్రత్యేకించబడిన మొత్తం 357.91 లక్షల రూపాయలు.

రెండవ ప్రణాళిక ఆఖరు నాటికి వినియోగించబడిన మొత్తం ... 348.24 లక్షల రూపాయలు.

మూడవ ప్రణాళికా కాలానికిగాను కేటాయించబడిన మొత్తం ... 336.00 లక్షల రూపాయలు.

1961–62 సంవత్సరానికి కేటాయించబడిన మొత్తం ...... 42.50 లక్షల రూపాయలు.

1962–63 వ సంవత్సరానికి కేటాయించబడిన మొత్తం ...... 38.48 లక్షల రూపాయలు.

రాజధానీ నగరంలోనైతే నేం, వివిధ పట్టణాలలో నైతే నేం ఇండ్లసమస్య చాలా తీవ్రంగా ఉంది. ముఖ్యంగా తక్కువ రాబడి వర్గాలవారు, ఇండ్లకొరతవల్ల ఎన్నో ఇబ్బందులకు గురికావలసివస్తున్నది. ఈ సమస్యను పరిష్కరించడంకోసం, తన కార్యక్రమాలను విస్తృత పరచుకొనవలసిందిగా ప్రభుత్వం, హౌసింగ్ బోర్డును కోరింది. లోగడ, హైదరాబాదు, సికిందరాబాదు నగరాలలో మాత్రమే గృహనిర్మాణంచేస్తున్న యీ సంస్థ, ప్రస్తుతం, రాష్ట్రంలోని ఇతర పట్టణాలలోకూడా గృహనిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించింది.

మధ్యతరహా ఆదాయవర్గాలవారి గృహనిర్మాణ పథకం

సంవత్సరానికి రు. 6,000 లకు పైబడి. రు. 15,000 లకు మించని ఆదాయంగల వారందరూ యీ కోవలోనికి వస్తారు.

వీరు స్వంతంగా ఇండ్లు కట్టుకోవడానికి ఈ పథకం క్రింద అప్పులు మంజూరు చేయబడుతున్నాయి. ఇందుకోసం ఇంకా వలసిన నిధులను జీవితభీమాసంస్థ సమకూరుస్తూ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, జీవితభీమా సంస్థ నుండి ప్రతి సంవత్సరం తీసుకుంటున్న ఈ రుణాలకుగాను, సంవత్సరానికి ఐదు శాతం వడ్డీని చెల్లించవలసి ఉంది. 25 వాయిదాలు దాటకుండా, తిరిగి యీ అప్పును ప్రభుత్వం జీవితభీమా సంస్థకు చెల్లుగట్టాలి.

1959_60 సంవత్సరానికీ, 1960_61 వ సంవత్సరానికీగాను, జీవితభీమా సంస్థ వారు, 178.64 లక్షల రూపాయలను అప్పుగా ఇచ్చారు.

ఒక్కొక్క వ్యక్తికి, గృహనిర్మాణ వ్యయంలో 80 శాతందాకా, ఈ పథకంక్రింద అప్పును మంజూరుచేయవచ్చు. ఐతే ఇల్లు కట్టడానికి అయ్యే ఖర్చు రు. 30,000 లకు మించి ఉండకూడదు. ఇందుకుగాను వారు సంవత్సరానికి ఐదున్నర శాతం వడ్డీని చెల్లించాలి.

రాష్ట్ర ప్రభుత్వం వివిధ గృహనిర్మాణ సంస్థలకు, ఈపథకంక్రింద ఇండ్లను నిర్మించేందుకు అప్పులను మంజూరుచేస్తూ ఉంది. ఈ సంస్థలు అర్హులయిన వారికి రుణాలను ఇవ్వడం ద్వారానూ, లేదా గృహాలు నిర్మించి కేటాయించడం ద్వారాను ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి.

అద్దె ఇండ్ల నిర్మాణ పథకం

ఈ పథకం, ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉద్దేశించబడింది. దీన్ని అమలు పరచడానికి అయ్యే వ్యయాన్ని జీవిత భీమాసంస్థవారు, రాష్ట్ర ప్రభుత్వానికి అప్పుగా ఇస్తున్నారు. ఈ రుణాన్ని సమానమైన 20 సాంవత్సరిక వాయిదాలలో తీర్చాలి. సంవత్సరానికి ఐదుశాతం వడ్డీ ఇవ్వవలసి ఉంటుంది. 1959_60 వ సంవత్సరానికీ, 1960_61 వ సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం, జీవిత భీమా సంస్థనుండి 102.57 లక్షల రూపాయలను అప్పు తీసుకొంది.

వివిధ పథకాల క్రింద ఇంతవరకూ సాధించబడిన అభివృద్ధిని ఇక్కడ పొందుపరుస్తున్నాను.

వరుస సంఖ్య	వివరణ	పథకం యొక్క పేరు	ప్రారంభించబడిన సంవత్సరం	ప్రారంభం నుండి జరిగిన మంజూర్లు	పూర్తిచేయబడినవి	నిర్మాణంలో ఉన్నవి	ప్రారంభం కాని ఇళ్ళు	1962 మార్చి ఆఖరుకు ఖర్చు (లక్షలలో)	కైఫీయత్తు
1	2	3	4	5	6	7	8	9	10
1.		తక్కువ రాబడి వర్గాలవారి గృహనిర్మాణ పథకం							
	A	సహకార రంగం	1955_56	4680	2499	588	1593	234.79	
	B	మునిసిపల్ రంగం	1955_56	1778	815	305	528	75.225	
	C	హౌసింగ్ బోర్డు	1955_56	1099	1066	33	—	72.694	
2.		గ్రామీణ గృహనిర్మాణ పథకం	1958	3936	1170	1876	884	28.45	
3.		మధ్యాదాయ వర్గాలవారి గృహ నిర్మాణ పథకం	1959	—					
	A	సహకార రంగం	—	308	57	211	40	27.00	
	B	వ్యక్తిగత రంగం	1959	504	115	269	120	54.61	
	C	హౌసింగ్ బోర్డు	1959	172	—	156	16	15.52	
4.		అద్దె ఇళ్ళ నిర్మాణ పథకం	1959	—	—				
	A	హౌసింగ్ బోర్డు	1959	184	—	184	—	9.76	
	B	ప్రభుత్వ రంగం	1959	802	120	205	477	19.48	

మనకున్న అవసరాలనుబట్టి చూస్తే, గృహనిర్మాణకార్యక్రమాలు మరింత వేగంగాఅమలు చేయవలసి ఉంటుంది. అలా చెయ్యాలనే ప్రభుత్వ సంకల్పంకూడాను. కానీ అనుకోని విధంగా చైనాతో సరిహద్దు తగాదా వచ్చింది. ఇప్పటి మన ప్రధాన కర్తవ్యం, దేశరక్షణ. దేశ పరిస్థితులు ప్రశాంతంగా ఉన్నప్పుడే అభివృద్ధి కార్య క్రమాలను, అమలు జరుపు కొనగలుగుతాము. దేశంలో, ప్రశాంత వాతావరణం, ఏర్పడడానికీ, మనరక్షణ శక్తి ఇతోధికంగా పెంపొందడానికీ, ప్రతివారూ, శక్త్యానుసారం తోడ్పడవలసిందిగా నేను అభ్యర్థిస్తున్నాను. ఈ నూతన సంవత్సరం మన రాష్ట్రానికీ మన దేశానికీ, శోభస్కరం కావాలని భగవానుని ప్రార్థిస్తున్నాను. ★

ముఖ్యవార్తలు

రాష్ట్రంలో

19 ఫిబ్రవరి:– ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ బడ్జెటుసమావేశం ప్రారంభమైంది.

20 ఫిబ్రవరి:– ఆర్థిక మంత్రి రు. 10లక్షల మిగులు బడ్జెటును శాసనసభకు సమర్పించారు.

21 ఫిబ్రవరి:– అడవులు, వైద్యం, ఇంజనీరింగ్ విద్యాశాఖలలో అఖిల భారత సర్వీసులను నెలకొల్పడానికి ప్రభుత్వం అంగీకరించింది.

23 ఫిబ్రవరి:– సింగరేణి కాలరీల వారు జాతీయ రక్షణ నిధికి విరాళంగా 5 రు. లక్షల రూపాయిలను ముఖ్య మంత్రికి సమర్పించారు.

25ఫిబ్రవరి:– క్రొత్తగూడెంలో కార్బన్‌డైఆక్సైడ్‌ప్లాంటుకు ముఖ్యమంత్రి పునాదిరాయి వేశారు.

4 మార్చి:– రెవిన్యూ మంత్రి శాసనసభలో బడ్జెటు డిమాండులను ప్రవేశ పెట్టారు.

శాసనసభలో 4 రోజులపాటు బడ్జెటుపై జరిగినచర్చలకు ఆర్థిక మంత్రి సమాధానమిచ్చారు.

7 మార్చి:–ప్రణాళిక, పంచాయతీరాజ్‌శాఖల మంత్రి, శాసనసభలో బడ్జెటు డిమాండులను ప్రవేశ పెట్టారు.

భారత ట్రావెల్ ఏజంట్ల సంఘం 12 వ సమావేశానికి హైద్రాబాదులో కేంద్ర రవాణా మంత్రి ప్రారంభోత్సవంచేశారు.

8 మార్చి:– భారత ట్రావెల్ ఏజంట్ల సంఘం కార్యవర్గసమావేశంలో కేంద్ర షిప్పింగ్ మంత్రి ప్రసంగించారు.

13 మార్చి:– ఆంధ్రప్రదేశ్‌లో రెండు అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు జరపాలని ఎన్నికల కమీషన్ ఉత్తర్వులు చేసింది.

18 మార్చి:– పరిశ్రమల మంత్రి శాసనసభలో బడ్జెటు డిమాండులను ప్రవేశపెట్టారు.

భారత దేశంలో

18 ఫిబ్రవరి:– లోకసభ బడ్జెటుసమావేశాన్ని అధ్యక్షులు ప్రారంభించారు.

19 ఫిబ్రవరి:– 1963–64 వ సం॥ రైల్వే బడ్జెటును లోకసభకు సమర్పించడం జరిగింది.

28 ఫిబ్రవరి:– కేంద్ర ఆర్థిక మంత్రి క్రొత్త బడ్జెటును లోకసభకు సమర్పించారు.

28 ఫిబ్రవరి:– భారత మాజీ ప్రెసిడెంటు డాక్టర్ ప్రసాద్ పాట్నాలో స్వర్గస్థులయ్యారు.

2 మార్చి:– చైనా– పాకిస్తాన్ సరిహద్దు ఒప్పందంపై కరాచీలో సంతకాలు జరిగాయి.

విదేశాల్లో

22 ఫిబ్రవరి:– చైనా సవాల్‌ను ఎదుర్కొనడానికి వీలుగా భారత దేశానికి సత్వర సహాయం అందజేయడానికై పశ్చిమ జర్మనీ ఒప్పందంపై సంతకంచేసింది.

8 మార్చి:– ఇరాక్‌లో జరిగిన నాసర్ అనుయాయుల విప్లవం తర్వాత నెలరోజులకు సిరియాలో రక్తపాత రహితమైన విప్లవం సంభవించింది.

16 మార్చి:– సమాన ప్రాతిపదికపై అరబ్ ఫెడరేషన్‌లో చేరడానికి జోర్డాన్ సిద్ధంగా ఉందని రాజు హుస్సేన్ ప్రకటించారు. ★

స్వీకారం :

పంచాయత్

పంచాయతీరాజ్ పథకాన్ని ప్రపథమంగా అమలు పరచిన ఘనత ఆంధ్ర ప్రదేశ్‌కు దక్కింది. గ్రామాలను స్వయం సమృద్ధం చేయడమే పంచాయతీరాజ్ పథకం ముఖ్యోద్దేశం.

రాష్ట్ర పంచాయత్ పరిషత్తు అధికారిక మాసపత్రిక "పంచాయత్" ఉగాది తొలి సంచిక మా కార్యాలయానికి చేరింది. రైతులకు ఉపయోగపడే ఎన్నో విషయాలను ఇందులో వివరించారు. రాష్ట్ర ప్రణాళిక పంచాయత్ శాఖల మంత్రి ప్రతి మాసం యీ పత్రికలో లేఖ వ్రాయడం యీ పత్రికలో ఒక ప్రత్యేకత.

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల సందేశాలతో, శోభకృతు పంచాంగంతో పత్రిక శోభాయమానంగా ఉంది.

సంవత్సరం చందా : రు. 5.00 లు. పోస్టేజితో సహా : విడిప్రతి... 50 న. పై. పోస్టేజితో సహా.

వలయువారు: రాష్ట్ర పంచాయత్ భవనం 5–6–32/3 బషీర్‌బాగ్, హైద్రాబాదుకు వ్రాయ వచ్చు.

అఖిలభారత తెలుగు రచయితల ద్వితీయ మహాసభ ప్రత్యేక సంచిక

కేంద్ర మంత్రులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, రాష్ట్ర మంత్రులు శ్రీ ఎం.ఆర్. అప్పారావు, శ్రీ పి. వి. నరసింహారావు, డాక్టర్ గిడుగు వేంకటసీతాపతి, శ్రీ వసంతరావు వేంకటరావు, దాశరథి శ్రీ వాత్సవ మొదలైన ప్రముఖుల వ్యాసాలతో యీ ప్రత్యేక సంచిక సుందరంగా ఉంది.

1963 జనవరిలో రాజమండ్రిలో జరిగిన అఖిలభారత తెలుగు రచయితల ద్వితీయ మహాసభ సందర్భంగా ఈ ప్రత్యేక సంచికను వెలువరించారు. వెల రు. 4/– ప్రతులకు : సావనీర్ కమిటీ, అఖిల భారత తెలుగు రచయితల ద్వితీయ మహాసభ, రాజమండ్రి.

గ్రంథ సమీక్ష

దేశం పిలుపునందుకొని ప్రజలకు మార్గదర్శకులయ్యే రచయితలు ప్రజలను ఉత్తేజపర్చే అనేకరచనలను ఇటీవలవెలువరింపజేయడం హర్షించదగిన విషయం.

ప్రియతమ నాయకులు శ్రీ నెహ్రూజీ పిలుపుతో ప్రజలు ఒకమనిషిగా నిలబడి ప్రపంచరాజ్యాలను ఆశ్చర్య చకితులజేశారు. బహుశా స్వాతంత్ర్య ఉద్యమకాలంలోకూడా ఇంతటి ఐక్యమత్యం, చైతన్యం భారత దేశంలో కలిగిఉండదు. అశేష ప్రజానీకం అవధుల్లేని ఉద్వేగంతో ఉరకలు వేశారు. తమ సర్వస్వాన్నీ ఎట్టి ప్రబోధంలేకుండానే స్వాతంత్ర్య సంరక్షణకు దారపోయ సిద్ధపడ్డారు. వాటి ఉదాహరణలే "విముక్తి" నవల కథాగమనం.

[విముక్తి; (నవల) రచయిత: 'మాధురి'; పేజీలు: 210; వెల: రు. 2—00; ప్రాప్తిస్థానం: అకాడమి పబ్లికేషన్స్, ప్రజాశక్తి నగర్-విజయవాడ-2.]

చైనా-ఇండియా సరిహద్దుపోరాటం ఇతివృత్తంగాగలనవలఇది. నవలలోని పాత్రల సంభాషణ సహజంగానడిచింది.

ఇండియా అలీన విధానాలను గూర్చి తటస్థ అలీనవిధానాలలోని తారతమ్యాల గూర్చి రచయిత విపులంగా చర్చించారు.

అలీనవిధానమే అనుసరణీయమని రచయిత తమ పాత్రల ద్వారా అభివ్యక్తం చేశారు.

ఇతరుల ఆపదలను తమ స్వప్రయోజనానికి, స్వంత లాభానికి వినియోగించుకో చూచే ప్రబుద్ధులు ప్రతిదేశంలోనూ ఉంటూనే ఉంటారు, అటువంటివారిలో వ్యాపారస్తులు ప్రప్రథమంగా ప్రజల దృష్టిలోకి వస్తారు. అంతమాత్రాన వ్యాపారస్థులు అందరూ అటువంటి వక్రభావాలతో ఉంటారనుకోవడం పొరపాటే అవుతుంది. యీ నవలలోని వరదరాజులు, జైన్‌లవంటి స్వార్థపరులు మన సమాజంలో లేరని మాత్రం ఎవరు ధైర్యంగా చెప్పగలరు? అటువంటి వారికి కొనకువరదరాజులు, జైన్‌లకుపట్టిన గతే పడుతుందనడంలో సందేహ మేమీలేదు.

యువకులు యుద్ధరంగంలోకి ఉరకడమే ప్రధానంకాదు. పొలాల్లో పరిశ్రమల్లో కష్టించి ఉత్పత్తిని ఎక్కువచేయడం, ప్రజలు పొదుపును అలవర్చుకోవడం, రక్షణకు అవసరమైన ఆయుధాలను కొనుగోలు చేయడానికై నిధులు సేకరించడం, సంఘంలోని దుష్టశక్తులను అదుపులోపెట్టడం, ప్రజానీకంలో ఉత్తేజాన్ని ఉత్సాహాన్ని కల్గింపజేయడం వంటి అనేక కార్యక్రమాలలో యుద్ధ రంగంలోకి పోయేఅవకాశంలేని యువకులు పాల్గొనవచ్చు. ప్రపంచంలో ఎన్నడూ కనీవిని యెరుగనట్టి అత్యున్నత పర్వతశిఖరాలపై యీ పోరాటం యేర్పడింది. అక్కడి చలిని సామాన్యులు భరించడం సాధ్యంకాదు.

నవలలోని రాజ్యలక్ష్మి వంటి ఆదర్శప్రాయులైన స్త్రీలు దేశానికి ఈ తరుణంలో ఎంతోఅవసరం. రాజ్యలక్ష్మిపాత్ర ఆదర్శనీయమైంది.

లధక్ సమర రంగంలో చైనా ముష్కరులతో తలపడి ధైర్యసాహసాలతో వీరోచితంగా పోరాడి ప్రపంచ మన్ననల బడసిన మన సైనికుల సాహసగాథలను చిత్రిస్తూ ఉత్తేజాన్ని, కలిగించే బుర్రకథ 'లధక్ వీరులు'

[లధక్ వీరులు; రచన: నదీరా; వెల: రు. 50.00 న.పై. ప్రతులకు: రచయిత పేర C/o శ్రీ గోపాలకృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు, పెదఅవుటపల్లి, గన్నవరం తాలూకా, (కృష్ణా జిల్లా)]

రచన ఝరీవేగంతోనడచి శరీరాన్ని జలదరింపజేస్తుంది. భారత దేశంలో పామరు లత్యధికులు, జనాభా ఎక్కువ భాగం పల్లెల్లో నివసిస్తుంది. వారికి మన సరిహద్దు వివాదం, చైనా కపట నాటకం, ప్రపంచదేశాల దృక్పథం మొదలైనవాటిని తెలియజేయడానికి బుర్రకథలు మంచిసాధనంగా ఉపయోగపడుతాయి. ఎక్కువలో ఎక్కువ బుర్రకథలను రచియింపజేసి ప్రజా బాహుళ్యంలో యీ విషయాన్ని ఎక్కువగా ప్రచారంలోకి తేవడం ఎంతోముఖ్యం.

'లధక్‌వీరులు' బుర్రకథలోని రచన ఉద్వేగంగా నడిచింది. లధక్ రంగంలోని సైనికుని వీరగాధను చిత్రిస్తూ, ప్రజలు ఏం చేయాలో ప్రబోధిస్తూ చెప్పబడిందీ బుర్రకథ.

ఇదే కోవకుచెందిన మరో బుర్రకథ 'తల్లి ఋణం' (చైనా దురాక్రమణగాథ)

[రచన: వారణాశి వెంకటనారాయణశాస్త్రి, బి. ఒ. ఎల్. తెలుగు పండితులు, జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల, మిర్యాలగూడెం, నల్లగొండజిల్లా; వెల రు. 50 న.పై.]

దీనిని పాఠశాల ఉపాధ్యాయ బృందంవారు ప్రచురింపజేశారు. ★

జాతీయ రక్షణ కృషికి మీ పొదుపు ధనం అవసరం

మీరు ఎంత పొదుపు చేయగలిగితే అంత చేయండి. ఆ విధంగా పొదుపుచేసిన మొత్తాలను దిగువ సెక్యూరిటీలలో దేనికైనా పెట్టుబడి పెట్టండి.

12 సంవత్సరాల జాతీయ రక్షణ సర్టిఫికెట్లు :

సంవత్సరానికి $6\frac{1}{4}$ శాతం సాధారణ వడ్డీ లేక $4\frac{3}{4}$ శాతం చక్రవడ్డీ. రూ. 5 మొదలు రూ. 25,000 ల వరకు వివిధ డినామినేషన్లలో లభ్యమవుతాయి. విడిగా ఒక వ్యక్తి అయితే రూ. 35,000 ల వరకూ, ఇద్దరు వ్యక్తులు కలిసి అయితే రూ. 70,000 ల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. (పోస్టల్ సేవింగ్స్ సర్టిఫికెట్లకు లోగడ ఏమైనా పెట్టుబడి పెట్టివుంటే దానితో కలుపుకొని).

10 సంవత్సరాల రక్షణ డిపాజిటు సర్టిఫికెట్లు :

ఏటా $4\frac{1}{2}$ శాతం వడ్డీ చెల్లించబడుతుంది. రూ. 50 ల గుణిజములలో లభ్యమవుతాయి. విడిగా ఒక వ్యక్తి అయితే రూ. 35,000 ల వరకూ, ఇద్దరు వ్యక్తులు కలిసి అయితే రూ. 70,000 ల వరకూ ఎక్కువలో ఎక్కువ పెట్టుబడి పెట్టవచ్చు. ($3\frac{1}{2}$ శాతం. 4 శాతం ట్రెజరీ సేవింగ్స్ డిపాజిటు సర్టిఫికెట్లకు లోగడ ఏమైనా పెట్టుబడి పెట్టివుంటే దానితో కలుపుకొని).

క్యుమ్యులేటివ్ టైమ్ డిపాజిటు పథకం :

5, 10 లేక 15 సంవత్సరాలవరకు ప్రతినెలా రూ. 5, 10, 20, 50, 100, 200 లేక 300 చొప్పున డిపాజిటు చేసినట్లయితే తరువాత చక్రవడ్డీతోసహా పెట్టుబడి అధిక మొత్తంగా తిరిగి చెల్లించబడుతుంది.

పోస్టాఫీసు సేవింగ్సు బ్యాంకు అక్కౌంట్లు :

రూ. 25 లు మొదలు రూ. 20,000 ల వరకు నిలువవుంచే మొత్తాలకు 3 శాతం చొప్పునా, రూ. 20,000 లకు మించి నిలువవుంచే మొత్తాలకు $2\frac{1}{2}$ శాతం చొప్పునా వడ్డీ చెల్లించబడుతుంది. ఒక వ్యక్తి రూ. 15,000 ల వరకూ నిలువ చేయవచ్చు.

15 సంవత్సరాల అన్యూటీ సర్టిఫికెటు :

జారీచేసే ధర : రూ. 1,330, రూ. 3,325, రూ. 6,650, రూ. 13,300, రూ. 26,600. సంవత్సరానికి 4.25 శాతం చక్రవడ్డీ చొప్పున, 15 సంవత్సరాలలో నెలవారీ చెల్లింపుల రూపంలో డబ్బు తిరిగి ఇవ్వబడుతుంది. ఒక వ్యక్తి రూ. 26,600 ల వరకు పెట్టుబడి పెట్టవచ్చు.

చిన్న మొత్తాల పొదుపు పత్రాలకు పెట్టిన పెట్టుబడులపై లభించే వడ్డీకి ఆదాయపు పన్ను, సూపర్ టాక్సులు వుండవు.

"మీరు చేసే పొదుపుమీదనే మీ భద్రత, మీ పిల్లల శ్రేయస్సు ఆధారపడి వుంది."

ఇతర వివరాలకొరకు, హైద్రాబాదు 10—2—2, ఏ. సి. గార్డ్స్ రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ నేషనల్ సేవింగ్స్ ప్రాంతీయ డైరెక్టరు (భారత ప్రభుత్వం)ను కానీ లేక మీ కలెక్టరేటులోని జిల్లా ఆర్గనైజరును కానీ లేదా మీ సమీపంలోని తపాలా కార్యాలయాన్ని కానీ దయచేసి సంప్రదించండి.

'ఆంధ్రప్రదేశ్'

తెలుగు, ఉర్దు, హిందీ, ఇంగ్లీషు మాస పత్రిక ప్రకటన రేట్లు

దిగువ రేట్ల ననుసరించి 'ఆంధ్ర ప్రదేశ్' మాస పత్రికలో ప్రకటనలు స్వీకరించబడగలవు.

వివరాలు	నాలుగు సంచికలలో			ఒక సంచికలో మాత్రమే		
	పూర్తి పేజీ	సగం పేజీ	పావు పేజీ	పూర్తి పేజీ	సగం పేజీ	పావు పేజీ
	రూ.	రూ.	రూ	రూ.	రూ.	రూ.
లోపలి పేజీ	300	150	100	100	55	30
వెనుక అట్ట పేజీ (4)	400	—	—	150	—	—
అట్ట 2, 3 పేజీలు	350	—	—	125	—	—

ఒక సంవత్సరం కంట్రాక్టు ప్రకటనలకు 20 శాతం రిబేటు ఇవ్వబడును

నిబంధనలు

1. మెకానికల్ వివరాలు 10¾" × 8¼" డెమ్మీ
2. ముందు అట్ట టైటిల్ పేజీపై ప్రకటనలు స్వీకరించబడవు.
3. పావు పేజీకి తక్కువగా ఉన్న ప్రకటనలు స్వీకరించబడవు
4. వచ్చే సంచికలో ప్రచురించడానికి వీలుగా స్థలం వివరాలు, డబ్బుతోసహా ప్రకటన సమాచారాన్ని ప్రతినెల 8వ తేదీలోపుగా యీ కార్యాలయానికి పంపాలి క్రాస్ చేయని డిమాండ్ డ్రాఫ్ట్‌ద్వారా గానీ, మనియార్డరు ద్వారా గానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, ప్రజా సంబంధముల శాఖ డైరెక్టరు, హైదరాబాదు పేర డబ్బును పంపాలి.
5. బ్లాకుల విషయంలో అన్నివిధాలా శ్రద్ధ తీసుకోబడుతుంది. అయితే మిషనుపై బ్లాకులు పగిలిన యెడల యీ శాఖ బాధ్యత వహించదు
6. ప్రకటన విధం, స్థలం వివరాలను ఒక సంచికలో ప్రకటించాలో (భాషను తెల్పాలి) లేక 4 సంచికలలో ప్రకటించాలో స్పష్టంగా పేర్కొనాలి
7. డబ్బు చెల్లింపు, యితర ప్రత్యుత్తరాలను దిగువ వారితో జరుపాలి —

డైరెక్టర్,
సమాచార ప్రజా సంబంధాల శాఖ,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
హైదరాబాద్ - 1.

Edited & Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad-1.
Printed at Yuva Press, Public Garden Road, Hyderabad - 1.

ఆంధ్రప్రదేశ్

విస్తీర్ణం	1,05,858 చదరపు మైళ్లు
జిల్లాలు	20
తాలూకాలు	189
20 వేలు, అంతకుమించిన జనాభాగల పట్టణాలు, నగరాలు	223
గ్రామాలు	28,997
పూర్తి జనాభా (1961)	359 78 లక్షలు
జన సాంద్రత	ఒక చదరపుమైలుకు 339
అక్షరాస్యులు (1961)	74.90 లక్షలు
నికర సాగుభూమి (1959-60)	10,883,000 హెక్టర్లు
పశువులు (1961)	327 లక్షలు
నమోదైన ఫ్యాక్టరీలు (1959)	4083
విద్యుదుత్పాదన (1961)	1,026.072 మిలియన్ కె. డబ్ల్యు. హెచ్.
విద్యుత్ సౌకర్యాలుగల పట్టణాలు, గ్రామాలు (1961-62)	4084
విశ్వవిద్యాలయాలు	3
కళాశాలలు (1960-61)	119
ఉన్నత పాఠశాలలు (1960-61)	1224
వృత్తివిద్యా పాఠశాలలు	431
పంచాయతీలు (1959-60)	14,552
అభివృద్ధి మండలాలు (1-4-1962 నాటికి)	378
1960-61 లో అప్పటి ధరలనుబట్టి రాష్ట్రాదాయం అంచనా	రూ. 1007.51 కోట్లు
పార్లమెంటు సభ్యులు	61
శాసన సభ సభ్యులు	301
శాసన మండలి సభ్యులు	90

